# మనిషీ!

# నీ సృష్టికర్తను తెలుసుకో



**Khaliq-e-Kayenaat ka Haqeeqat**
**Pasandana Tasavvur** (Telugu)

# మనిషీ!
# నీ సృష్టికర్తను తెలుసుకో

మూలం
**డాక్టర్ ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**
M.B.B.S., D.Ch.,

తెలుగు అనువాదం
**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ప్రకాశకులు
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశ భవనం, లక్కడ్‌కోట్,
ఛత్తాబజార్, హైదరాబాద్ – 500 002
ఫోన్ : 040–24576237, 24564583
e-mail : geeturaiweekly@gmail.com

**Manishee! Nee Srushtikartanu Telusuko (**Telugu**)**

**Khaliq-e-Kayenaat ka Haqeeqat**
**Pasandana Tasavvur** (Urdu)

Writer : Dr.Mohammed Moazzam Ali
M.B.B.S., D.Ch.

Telugu Rendering : Mohammad Azeez-ur-Rahman

*All Rights Reserved with Publishers*

First Edition : November, 2017

Copies : 1000

**Price : Rs.100/-**

ISBN : 978-93-81111- 00 - 0

Publishers : **Telugu Islamic Publications Trust**
Sandesha Bhavanam, Lakkadkote,
Chatta Bazar, Hyderabad- 500 002
Ph.040-24576237, 24564583
e-mail : geeturaiweekly@gmail.com

Printed at : **Cosmic Printers**
Sandesha Bhavanam, Lakkadkote,
Chatta Bazar, Hyderabad- 500 002

# విషయ సూచిక

ముందుమాట 04

1. **మొదటి** అధ్యాయం : జగతికి, జీవనానికి సృష్టికర్త అనేవాడున్నాడా?... ఒక చూపులో! 09
2. **2వ అధ్యాయం :** సృష్టికర్తను చేసినదెవరు? ...ఒక చూపులో! 29
3. **3వ అధ్యాయం :** సృష్టికర్త–మానవుని మధ్య సంబంధం ఎలా ఉండాలి? ... ఒక చూపులో! 38
4. **4వ అధ్యాయం :** సృష్టికర్త – మనిషి పరస్పర సంబంధం ఎలా ఉండాలి? .... ఒక చూపులో! 60
5. **5వ అధ్యాయం :** సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి?...ఒక చూపులో! 81
6. **6వ అధ్యాయం :** సృష్టికర్త న్యాయశీలం .... ఒక చూపులో! 125
7. **7వ అధ్యాయం :** సిఫారసు, న్యాయం .... ఒక చూపులో! 142
8. **8వ అధ్యాయం :** సృష్టికర్త భావనకు సంబంధించిన మరింత విశదీకరణ .... ఒక చూపులో! 157
9. **9వ అధ్యాయం :** నిజ ఆరాధ్యదైవం వాస్తవిక దృక్పథం... ఒక చూపులో! 191
10. **10వ అధ్యాయం :** తస్మాత్ జాగ్రత్త! 206
11. **11వ అధ్యాయం :** బహుపరాక్ 222

# ముందుమాట

మానవుడు తనను పుట్టించిన వానినే తెలుసుకోకపోవటంకన్నా ఘోర మయిన విషాదం (Tragedy) మానవ విషాదాల్లో మరొకటి లేదన్న విషయం మనిషికి తెలుసా?

చాలామంది ఊహలపై, అంచనాలపై తమ జీవిత పునాదులు వేసుకున్నారు. వాస్తవానికి అంచనాలు విజ్ఞానానికి ప్రత్యామ్నాయం కాజాలవు. జ్ఞానం ఆధారంగా ఎదిగిన మానవతకు, ఊహలపై జరిగిన ఉత్థానానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. సహేతుకమైన (Logic) ఆధారాలు, తార్కికమయిన (Reasoning) ఫలితాల ద్వారా – జగతిని, మనిషిని చేసిన వాడొకడు ఉన్నాడా? లేడా? అనే మౌలిక ప్రశ్నకు సమాధానం కనుగొని, ఇదమిత్థంగా ఒక నిర్ణయానికి రావలసిన ఆవశ్యకత ఉంది. పిదప దానిపైన మన జీవిత పునాదిని నిర్మించుకోవాలి.

జనులు తమ ఆలోచనలు పరిశీలనలను (సృష్టికర్త అనేవాడు అసలున్నాడా? లేడా? అనే) పునాది నుండి మొదలెట్టే బదులు పరిసరాల (Periphery) నుండి, అంటే అవశేషాల (Fossils) నుండి మొదలెడుతుంటారు. అందుకే వారు కచ్చితంగా ఒక నిర్ధారణకు రాలేకపోతారు. తమ జీవితానికి నైతికంగా మార్గదర్శకత్వం వహించగలిగే, తమ జీవిత లక్ష్యాన్ని తెలిపే, ఈ జగతిలో తమ స్థానమేదో విశదపరిచే నిర్దిష్టమైన సంవిధానాన్ని కూడా వారు పొందలేకపోతారు.

ప్రపంచమంతటా విస్తరించివున్న మానవ సమాజంపై ఓసారి దృష్టిని సారిస్తే ప్రజల మనోమస్తిష్కాల్లో సృష్టికర్తకు సంబంధించి ఏర్పడివున్న భావన ఎంతో నిరాశపరిచేదిగా ఉందనిపిస్తుంది. సృష్టికర్తను తిరస్కరించేవారు లోకంలో

బహు కొద్దిమందే ఉన్నారన్నది నిజమే. కాని చాలామంది సంశయాలు, సందేహాలలో ఊగిసలాడుతూ జీవితం గడుపుతున్నారు. ఇక సృష్టికర్తను నమ్మి నడుచుకుంటున్న వారి సంఖ్య ఈ సందేహాల స్వాములకన్నా అధికమే. అయితే సృష్టికర్తకు సంబంధించిన వారి 'భావన' మరీ పేలవమైనది. తెలిసో తెలియకో వారు సృష్టికర్తకు ఎన్నో దౌర్బల్యాలను అంటగడుతుంటారు. సృష్టికర్త గురించి స్వచ్ఛమయిన, పవిత్రమైన భావన కలిగి ఉన్న వారి సంఖ్య చాలా తక్కువ. కాని దురదృష్టవశాత్తు ప్రాపంచిక తళుకుబెళుకులకు, పటాటోపాలకు లోనైన కారణంగా వారి నమ్మకం కూడా బలహీనపడిపోతోంది. తత్ఫలితంగా ఈ అన్ని కోవలకు చెందినవారు ఒకే రకమయిన ఫలితాన్ని చవిచూస్తున్నారు. వారి జీవన ప్రమాణం దిగజారిపోయింది. మానవ జీవితపు సిసలైన ప్రమాణం ఏది? అంటే మానవీయ విలువలతో మానవ సముదాయం జ్యోతిర్మయమై ఉండాలి, జనుల నీతీ నడవడికలలో సౌందర్యం జాలువారుతుండాలి, వారి వ్యక్తిత్వంలో ఔన్నత్యం తొణికిసలాడాలి, వారి పరస్పర సంబంధాలలో సౌమనస్యం, మృదుత్వం, మార్దవం ఉట్టిపడుతూ ఉండాలి. వారి వ్యవహారాలలో స్పష్టత ఉండాలి. వారి చర్యలలో విజ్ఞతా వివేచనలు అంతర్లీనమై ఉండాలి. అపకార బుద్ధి, కీడు వంటివి ఉండకూడదు. ఇదీ మానవ ప్రగతి అంటే. ఇదే జీవితానికి సంబంధించిన ఉన్నత ప్రమాణం (High Standard Living). భౌతిక ప్రగతి మానవతా ప్రమాణానికి అసలు గీటురాయి కాదు.

మన జీవిత లక్ష్యం ఏమిటో, ఈ జగతిలోనూ, ఇతర జీవరాశుల మధ్యనా మన స్థానమేమిటో, జీవితం గడిపే ఉత్తమ పద్ధతి ఏదో స్పష్టంగా తెలిసి రానంతవరకూ మన జీవితం సరైన దిశలో ముందుకు సాగదు. మనల్ని పుట్టించిన వాని ఎదుట మనం చేసుకున్న ప్రతి ఆచరణకు సమాధానం ఇచ్చుకోవలసి ఉందా? ఇది వాస్తవమా? అనేది కూడా మనకు విశదమవ్వాలి. జీవితాన్ని ప్రసాదించినవాడే జీవితానికి సంబంధించిన ఈ ప్రశ్నల గురించి మనకు చెప్పగలుగుతాడు. అప్పుడే మనిషి లక్ష్యబద్ధమయిన జీవితం గడిపి శాంతిని, సౌఖ్యాన్ని పొందగలుగుతాడు. అందుకే సృష్టికర్తకు సంబంధించిన వాస్తవిక దృక్పథం మనిషికి చాలా అవసరం. ఇది అతని జీవితపు అత్యంత సున్నితమయిన, అతి ముఖ్యమైన నిర్ణయం కూడా. సమయాన్ని వృధా చేయకుండా ఈ సమస్యకు సమాధానం కనుగొనాల్సిన ఆవశ్యకత ఉందని

అతని నైజం కోరుతుంది. సమస్యకు పరిష్కారం కనుగొనటంలో పొరపాటు జరిగినా లేక తాత్సారం జరిగినా అతను జీవితంలోని ప్రతి కీలకమయిన మలుపులో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. పునరాలోచన చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడవచ్చు. అందుకే తొలుత ఈ సమస్యకు సమాధానం కనుగొనాలి. ఇదేదో సామూహిక సమస్యో లేక జాతీయ సమస్యో కాదు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య. కాబట్టి ప్రతి వ్యక్తీ వ్యక్తిగత స్థాయిలో ఈ సమస్యను పరిష్కరించుకోవాలి. ఒక వ్యక్తి మరొకరి కోసంగానీ, సామూహిక నిర్ణయం కోసంగానీ నిరీక్షించకూడదు.

సృష్టికర్తను ఆయన యొక్క సిసలయిన స్థాయిలో తెలుసుకోవటం మనిషికి చాలా అవసరం. దీని అసాధారణ ప్రభావం అతని ఆలోచనలపై, ఆచరణలపై, అతని సిద్ధాంతాలపై, అతని వ్యవహార సరళిపై, అతని త్యాగశీలతపై, అతని ప్రజాసంబంధాలపై పడుతుంది.

సృష్టికర్తను తెలుసుకుని, ఆయన గురించి వాస్తవిక దృక్పథాన్ని కలిగి ఉండటం వల్ల మనిషి ఆరాధనల్లో, వ్యవహారాల్లో సమతౌల్యం, సంతులనం (Balance) వస్తుంది. అతని జీవితంలో పవిత్రత (Purity), పారదర్శకత జనిస్తుంది. సమస్త మానవత యెడల ప్రేమ, సానుభూతి, శ్రేయోభిలాష, సేవాభావం జనిస్తుంది. అన్ని రకాల సంకుచిత భావాల నుండి విముక్తుడై, ప్రతి స్థాయి (Level) లో దురభిమానానికి దూరంగా ఉంటూ మనిషి మనిషిగా బ్రతకాలన్న ఆలోచన మొగ్గ తొడుగుతుంది. ఈ భావనే మనిషిని మానవత్వపు ఉన్నతికి చేర్చుతుంది.

సృష్టికర్త గురించిన భావన (Concept) మదిలో ఎంత స్వచ్ఛంగా, స్పష్టంగా, ఎంత సమతూకంతో కూడుకుని ఉంటుందో అంతగానే మనిషి జీవితంలో విశాల దృక్పథం ఉంటుంది. అతని నడవడిలో సమతౌల్యం ఉంటుంది. తత్ఫలితంగా జీవితంలో సత్ఫలితాలు వెలువడతాయి. జీవితానికి పటిష్టత, స్థిరత్వం (Stability) లభిస్తుంది. అతని జీవితంలో శాశ్వత చలనం ఉంటుంది. అతను ఏకాగ్రచిత్తంతో, ప్రశాంత మనస్సుతో సరైన దిశలో సాగిపోతాడు.

ఈ విశ్వమండలంలో అతి స్పష్టంగా – కొట్టొచ్చినట్టుగా – కానవచ్చే విషయం ఏమిటంటే పరస్పర విరుద్ధమైన శక్తుల నడుమ సమత్వం, సమతౌల్యం

ఉంది. తత్ఫలితంగా ప్రతి వస్తువు ఆశయబద్ధంగానూ, ఫలవంతమైనదిగానూ (Productive and Purposeful) గోచరిస్తోంది.

అందుకే మనం కూడా మన జీవితంలో (అంతర్గతంగానూ, బాహ్యాపరంగానూ) ఉద్భవించే పరస్పర విరుద్ధ భావాల, శక్తుల మధ్య సంతులనం ఉండేలా జాగ్రత్త పడినట్లయితే మన జీవితం శ్రేయోదాయకం అవుతుంది. ఫలవంతంగానూ మారుతుంది. అయితే సృష్టికర్త యొక్క స్పష్టమయిన, సమతూకంతో కూడుకున్న భావన అతనిలో లేనంతవరకూ మనిషికి ఈ 'మధ్యేమార్గం' లభ్యమవదు.

అయితే సృష్టికర్తకు సంబంధించి అశేష జనవాహినిలో పరస్పర విరుద్ధ భావాలు ఏర్పడి, వాతావరణమంతా గజిబిజిగా, గంద్రగోళంగా మారినప్పుడు మనిషి ఏం చేయాలి? సృష్టికర్త గురించి తన మదిలో రేకెత్తిన ఆలోచనలకు, ప్రశ్నలకు సమాధానం పొందడానికి ఏ మార్గదర్శక సూత్రాలను అవలంబించాలి? అన్నదానికి జవాబే మీ ముందున్న ఈ పుస్తకం.

ఈనాడు మనుజ జాతి సంకుచిత భావాల మధ్య ఊపిరి పీలుస్తోంది. వర్గ దురభిమానం, ప్రాంతీయ దురభిమానం, భాషా దురభిమానం, కులతత్వం, వర్ణ వివక్ష, సంకుచిత భావాలు మానవాళిని పట్టి పీడిస్తున్నాయి. ఈ సంకుచిత స్వభావాలన్నింటి నుండి పైకి వచ్చి అవలోకన చేసే విశాల దృష్టి అరుదుగానే కనిపిస్తోంది. ..... ఈ దురభిమానాల నుండి, సంకుచిత భావాలు, బంధనాల నుండి బయటపడేందుకు ఒక ఆలోచనాత్మకమైన (Thought Provoking) ప్రశ్న సంధించబడుతోంది – ఆలోచించండి – ఒకవేళ మనం వేరొక మతంలో పుట్టి ఉంటే, నేడు మనం 'తప్పు' అనుకుంటున్న దానిని 'ఒప్పు' అనుకుని అవలంబించేవాళ్ళం. ప్రస్తుతం మనం ఏ మతంలో పుట్టి ఉన్నామో, (దాని ప్రకారం) దానిని తప్పుగా భావిస్తాము లేదా దానిని స్వీకరించబోము. దాని పట్ల మన మనస్సులో ప్రేమాభిమానం కూడా ఏర్పడదు. ఇదే అంధ విశ్వాసం (Blind Faith) అంటే. ఈ రకమయిన అవలంబన లేక తిరస్కృతి (Adoption or Rejection) అసంబద్ధమైనది, వినాశకరమైనదీను. ఏ వస్తువు అయినా కేవలం పుట్టుక రీత్యా 'తప్పు' లేక 'ఒప్పు' అవుతుందా? స్వతహాగా అది సత్యబద్ధమైనదేనా? కాదా? అనేది తరచి చూడాలి. దాని ఆధారంగానే స్వీకరించడమో, త్రోసిపుచ్చడమో చేయాలి.

సంకుచిత స్వభావం, దురభిమానం, పక్షపాతం మానవ బలహీనత. తత్కారణంగా అతను ఎన్నో విలువైన, ముఖ్యమైన వస్తువులను ఆస్వాదించే భాగ్యానికి దూరమైపోతాడు. అంతేకాదు, ఆ విలువైన వస్తువుల పట్ల దురభిప్రాయాలు కూడా ఏర్పరచుకుంటాడు.

ఈ కృతిలో విశ్వ సృష్టికర్త – మానవుని ఉనికి గురించి సంక్షిప్తంగా చర్చించటం జరిగింది. తరువాత ప్రతి మనిషితో సృష్టికర్తకు గల సమీప సంబంధం గురించి విశ్లేషించటం జరిగింది. పిదప వివిధ శీర్షికల క్రింద సృష్టికర్త గురించిన ఒక స్పష్టమయిన, సమతౌల్యంతో కూడిన భావనను సమర్పించే ప్రయత్నం చేశాము – దానిని మానవ నైజం సముచితమైనదిగా తలపోస్తుంది. దానిని స్వీకరించడానికీ ముందుకు వస్తుంది. ఆ తరువాత ఈ పుస్తకంలో ఆరాధనకు, దాస్యానికి అర్హుడైనవాడు ఎవడు? ఆయన విశిష్ఠత ఏమిటి? నిజ ఆరాధ్యదైవం కావడానికి గల ప్రమాణ నికషం (Criteria) ఏది? లాంటి అశాలపై చర్చించటం జరిగింది.

మానవత (Humanity) కోసం ఇంతకన్నా గొప్ప సేవ మరొకటి ఏముంటుంది? నేను గనక జనులను వారిని సృష్టించిన వానితో కలిపి, ఆయన గురించి పరిచయం చేసి, ఆయన కారుణ్యంలో వారిని చేర్చగలిగితే అది నా పాలిట మహా భాగ్యంగా భావిస్తాను. ఎందుకంటే ఏదో ఒకనాడు అందరూ ఆయన వద్దకు మరలిపోవలసి ఉంది. వాస్తవానికి ప్రతి మనిషీ తనను పుట్టించిన వానిని తెలుసుకోగలిగినప్పుడే తనను తాను తెలుసుకోగలుగుతాడు.

**– డా॥ ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**
M.B.B.S., D.Ch.

**మొదటి అధ్యాయం :**

# జగతికి, జీవనానికి సృష్టికర్త అనేవాడున్నాడా?... ఒక చూపులో!

**1.** పరిసరాలలో విస్తరించివున్న సాక్ష్యాలు, జ్యోతిర్మయమైన వాస్తవం

**2.** ఒక ప్రశ్నకు సమాధానం - వాస్తవం వెల్లడి

**3.** మానవ నైజం ఇచ్చే పిలుపు యదార్థాన్ని ధ్రువీకరిస్తుంది

**4.** జీవితపు మౌలిక ప్రశ్నలు ... ఈ దాహం తీరనిది

**5.** ఈ జగతి బహు చక్కగా నడవటం దేనికి నిదర్శనం?

**6.** రెండు సహజత్వాల మధ్య సానుకూలత ... ఇది దేనికి నిదర్శనం?

**7.** సిఫారసు, న్యాయం .... ఒక చూపులో

**8.** బిగ్ బాంగ్ సిద్ధాంతమే (Big Bang Theory) గనక నిజమైనదైతే, అది సృష్టికర్త ఆజ్ఞ తప్ప మరేమీ కాదు

**9.** మన శక్తి సామర్థ్యాల పరిమితుల్లో ప్రాప్తించిన దానిని స్వీకరించటం విజ్ఞత

# జగతికి, జీవనికి సృష్టికర్త అనే వాడున్నాడా?

ఈ జగతిని, మానవుణ్ణి సృష్టించినవాడు అసలున్నాడా? లేడా? అనే ప్రశ్న అన్నిటికన్నా ముందు ఎదురవుతుంది. అతన్ని అంగీకరించాలా? వద్దా? ఆయన్ని ఆరాధించాలా? వద్దా? అనేది తరువాతి అంశం.

## జగతిని, జీవనాన్ని సృష్టించినవాని ఉనికి (ఉన్నాడా? లేడా?), దాన్ని గురించిన సహేతుకమైన చర్చ

సృష్టికర్త ఉనికికి సంబంధించి మనిషి మదిలో ఆలోచన మెదలకుండా ఉండదు. పుట్టించిన వాడొకడున్నాడా? లేడా? అనే ప్రశ్నలు అతని మెదడును తొలచివేస్తాయి.  దీని గురించి అతని మస్తిష్కంలో ఖచ్చితంగా ఒక భావన ఉంటుంది. ఇది అనివార్యం. ఎందుకంటే దీని ప్రాతిపదికపైన్నే అతని ఆలోచనలు, ఆచరణలు క్రమ వికాసమొందుతాయి. దీని ఆధారంగానే అతని జీవనరథం ముందుకు సాగుతుంది.

కాబట్టి ఈ శూన్యాన్ని (Vaccum) పూరించడానికి చిత్తశుద్ధితో, బౌద్ధిక మయిన ఆధారాలపై యోచన చేస్తూ క్రింద పేర్కొనబడిన రెండు సమాధానాలలో ఏదో ఒకదానిని ఎంపిక చేసుకోవటం అవశ్యం.

ఒకటి : సృష్టికర్త ఉనికిని త్రోసిపుచ్చటం

రెండు : సృష్టికర్త ఉనికిని ఒప్పుకోవటం

సృష్టికర్త అనేవాడు ఉండి ఉంటే తప్పకుండా మన ముందుకు

ప్రత్యక్షమయ్యేవాడే. ప్రత్యక్షమవలేదంటే అతడు లేడన్నమాటేనని కొంతమంది అనుకుంటారు.

సృష్టికర్త అనేవాడుంటే, ఆయన తనంతట తానుగా తేజరిల్లితే, అందరి ముందుకు వచ్చేస్తే అందరి తలలు వాటంతటవే వంగిపోతాయి. ఈ చర్చకు తావే ఉండదు. అంగీకరించటం, అంగీకరించకపోవటం (Test & Choice) అనే ప్రసక్తే ఉండదు. అందరూ శిరసావహించవలసిందే కదా! అన్న ఆలోచనలు కూడా ఒక్కోసారి మనుషుల మస్తిష్కాలను ముసురుకుంటూ ఉంటాయి.

కనిపించని దానిని ప్రయాసపడి, వెతకటంలోనే జీవితంలో ఆనందం ఉంది. అగోచరమైన దానిని అన్వేషించటం అసలు పరీక్ష. సృష్టికర్తే గనక ఉంటే చూడకుండానే ఆయన్ని తెలుసుకోవటం, గుర్తించటం, అంగీకరించటం, ఆయనకు భయపడటం, ఆయన్ని ప్రేమించటం అవసరం. ఇది మనిషిలోని దాస్య గుణానికి సమగ్ర స్వరూపం. ఇదే అతని సాఫల్యం. ... ఒకవేళ సృష్టికర్త అనేవాడు లేనట్లయితే ఆయన్ని తిరస్కరించటమనేది కూడా మనస్ఫూర్తిగా జరగాలి. ఎందుకంటే ఈ విషయంలో మీమాంస, సందిగ్ధం మంచిది కాదు. మన దైనందిన జీవితంలో, నిర్ణయాలలో, గైకొనే చర్యలలో మానసికమైన అవరోధాలు ఏర్పడకుండా ఉండటానికి ఈ స్పష్టత అవసరం.

కనుక ఈ చిక్కు ముడిని విప్పడానికి రెండు ప్రశ్నలను మన ముందుంచుకుని, వాటి సమాధానాలను సహేతుకంగా, మానవ నైజం వాంఛించే విధంగా వెతకటానికి ప్రయత్నిద్దాం.

ఈ సందర్భంగా ముందుకు వచ్చే మొదటి ప్రశ్న ఈ జగతికి సంబంధించినది (అంటే అది ఏ విధంగా ఉనికిలోనికి వచ్చిందనేది).

రెండవ ప్రశ్న ; ఈ జగతిని ఉనికిలోనికి తెచ్చినవాని ఉనికి గురించి (అంటే ఆయన ఉనికిని అంగీకరించేటట్లయితే, ఆయన ఉనికి ఎలా సంభవించింది? అనేది).

తొలుత ఈ నిఖిల జగతి ఎలా ఉనికిలోనికి వచ్చింది, దానిని నిర్మించిన వాడెవడు? అనే దాని గురించి ఆలోచిద్దాం ... ఈ జగతిని నిర్మించిన వానిని ఎవరు నిర్మించారు? అనే దాని గురించి ఆ తరువాత యోచన చేద్దాం.

ఆలోచనకు ఉపక్రమించే ముందే ఒక విషయం మస్తిష్కంలో ఉండి తీరాలి. అదేమంటే

సృష్టికర్తను తెలుసుకునే కృషి పూర్తి స్థాయిలో జరగాలి. దాని అంతుకు చేరుకోవాలి.

ఈ విశ్వమండలం గురించి, అందులోని జీవనానికి సంబంధించి వివిధ కోణాల (Angles) నుంచి, ఈ క్రింది శీర్షికల (Headings) ననుసరించి పరిశీలిద్దాం.

(1) నలువైపులా వ్యాపించి ఉన్న సాక్ష్యాలు మరియు జ్యోతిర్మయమైన వాస్తవం.

(2) ఒక ప్రశ్నకు సమాధానం – వాస్తవ వెల్లడి.

(3) మానవ నైజం ఇచ్చే పిలుపు వాస్తవానికి ధ్రువీకరణగా ఉంది.

(4) జీవితపు మౌలిక ప్రశ్నలు ..... తీవ్రమైన దాహం.

(5) ఈ విశ్వవ్యవస్థ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా నడవటం దేనికి తార్కాణం?

(6) రెండు స్వభావాలు : వాటి మధ్య సామరస్యం – ఇది దేనికి నిదర్శనం?

(7) మనిషిలోని కృతజ్ఞతాభావం ఎలా నెమ్మదిస్తుంది? ... సృష్టికర్త ద్వారానా? లేక ప్రకృతి (Nature) అనే పదం ద్వారానా?

(8) బిగ్ బాంగ్ థియరీ (Big Bang Theory) గనక నిజమైనదైతే, అది సృష్టికర్త ఆదేశం తప్ప మరొకటి కాదు.

(9) మన ప్రతిభ పరిమితులకు లోబడి ప్రాప్తించినదానిని స్వీకరించటం వివేచనకు తార్కాణం.

## (1) నలువైపులా వ్యాపించి ఉన్న సాక్ష్యాలు ... జ్యోతిర్మయమైన వాస్తవం (సృష్టి, సృష్టికర్త, సృష్టితాలు)

సృష్టికర్తను నిరాకరించే వారి వద్ద ఉన్న ఆధారం ఏమిటయ్యా అంటే, సృష్టికర్త కంటికి కానరావటం లేదని వారంటారు. ఆయన ఉనికి లేదని నిశ్చితం (Certainty) గా చెప్పటానికి ఈ ఒక్క ఆధారం చాలని వారంటారు. కానరాకపోయినంత మాత్రాన సృష్టికర్త అసలు లేనేలేడని భావం ఎంతమాత్రం కాదు. మార్కెట్‌లోని వస్తువుల (Commodities) తో పాటు వాటిని తయారుచేసినవాడు అక్కడ నిలబడి ఉండడు. అక్కడ వాటి నిర్మాత మన కంటికి కానరాడు. అంతమాత్రాన వాటి నిర్మాతే అసలు లేడని మనం

అనుకోము. అలాగే ఈ సృష్టికి కర్త లేడని భావించడం అవివేకానికి నిదర్శనం. తిరస్కారానికి సంబంధించిన ఈ నిదర్శనాన్ని హత్యోదంతం సందర్భంగా ఉదాహరించరు. హంతకుడు కూడా హత్య చేసిన స్థలం (Spot) లో ఉండడు. హంతకుడు ఆ సంఘటనా స్థలంలో కంటికి కనిపించడు. కాని హత్య జరిగిన సాక్ష్యాధారాలు (Evidences) ఉంటాయి. హతుడు అక్కడ పడి ఉంటాడు. హతుణ్ణి చూడగానే అది హత్యే అనుకుంటారు. ఆత్మహత్య అన్న ఆలోచన రాదు. హంతకుని గాలింపు చర్యలు మొదలవుతాయి. ఏ అవకాశాన్నీ వదలకుండా (Leaving no stone unturned) గాలింపు ముమ్మరం చేయబడుతుంది. అయినప్పటికీ హంతకుని ఆచూకీ లభించకపోవటంతో మన సాధనాల, పరికరాల (Instruments) కొరతవల్లనే హంతకుణ్ణి పట్టుకోలేక పోయామని అంటారు. అంటే తమ పరిమితుల (Limitations) వల్లనే, తమ అశక్తత మూలంగానే విఫలమయ్యామని చెప్పుకుంటారు. హంతకుడు ఎక్కడో దాగి ఉన్నాడనీ, తమ ప్రయత్నాల (Efforts) ని కొనసాగించాలని తీర్మానించు కుంటారు. అంతేగాని హతుడు ఆత్మహత్యకు ఒడిగట్టాడని మాత్రం అనరు. హత్యకు గల సాక్ష్యాధారాలు (Evidences) చాలా తక్కువనీ, ఆత్మహత్య అని నిర్ధారించే ఆధారాలే అధికమని తేలేవరకు, తమ గాలింపు చర్యలను మానుకోరు. పైగా హంతకుని రంధ్రాన్వేషణలో సర్వశక్తులూ ధారబోస్తారు. ఏదో ఒకనాడు హంతకుడు దొరక్కపోడన్న నమ్మకంతో గట్టి బందోబస్తు చేయిస్తారు. మరైతే సృష్టికర్తను తెలుసుకునే ప్రయత్నంలో ఈ అన్వేషణ ఎందుకు జరగదు? ఈ సృష్టి ఒక చర్య (Action) అయినప్పుడు, మరి ఆ చర్య (Action) గైకొన్న వానిని కనుగొనడానికి పరిసరాలలో విస్తరించివున్న నిదర్శనాల (Environ- mental Evidences) ద్వారా తెలుసుకునే ప్రయత్నం ఖచ్చితంగా ఎందుకు చేయటం లేదు? ఈ జగతిని, ఈ మానవుణ్ణి చేసినవాడు ఎవడూ లేడన్న నిర్ధారణ (Conclude) కు అంత తొందరగా ఎలా రాగలుగుతారు? అతను కనిపించటం లేదన్న కారణం ఆధారంగానా? అంతమాత్రాన ప్రతి వస్తువు దానంతట అదే ఉనికిలోనికి వచ్చిందని భావిస్తారా?

సృష్టితాలు ఉన్నప్పుడు సృష్టికర్త కూడా ఉండి తీరాలి. హత్య జరిగింది. అంటే చర్య (Action) గైకొనబడింది. హతుడు పడి ఉన్నాడంటే హంతకుడు కూడా, అంటే చర్య గైకొన్నవాడు కూడా ఉండి ఉంటాడు. ఆత్మహత్య కూడా జరిగి ఉండవచ్చు కదా, ఆత్మహత్య జరిగి ఉంటే హంతకుడు అనేవాడు

ఉండడు కదా! అన్న వాదన (Argue) కూడా చేయవచ్చు. అయితే ఆత్మహత్య ముందుగా వేసుకున్న పథకం ప్రకారం (Well planned) జరగదు. అది ఆవేశం వల్లనో, అనాలోచితం(Haphazard)గానో జరిగిపోతుంది. అందువల్ల ఆత్మ హత్యకు సంబంధించిన సాక్ష్యాధారాలు (Evidences) చాలా తొందరగా, సులువుగా లభిస్తాయి.

ఒకవేళ ఈ జగతి దానంతట అదే – అనాలోచితంగా, హటాత్తుగా (Haphazard) సంభవించివుంటే, అందలి ప్రతి వస్తువూ చిందరవందరగా, లక్ష్యరహితంగా పడి ఉండేది. వాటి మధ్య ఎలాంటి క్రమబద్ధత ఉండేది కాదు. అట్టి పరిస్థితిలో జీవనం నెలకొని (Life sustained) ఉండేది కాదు. అది దానంతటదే ఉనికిలోనికి వచ్చిందన్న విషయం సందేహాస్పదం కూడా అయ్యేది కాదు. కాని ప్రస్తుతం అన్ని రకాల జీవుల ప్రకృతి జగతి నైజంతో చాలావరకు సమరసం చెందుతూ, పరిఢవిల్లుతూ ఉంది. దాని మనుగడ, పురోభివృద్ధికి కావలసిన వస్తు సామగ్రి ఈ జగతిలో పుష్కలంగా ఉంది. ఈ జగతిగానీ, ఈ జీవనిగాని దానంతట అదే నిర్మితమవలేదు, అది నిర్మించబడింది అన్న దానికి ఇది రుజువుగా ఉంది. జగతికి – జీవనికి మధ్య అవినాభావ సంబంధం ఉండటం వల్ల ఆ రెండింటినీ సృష్టించిన సృష్టికర్త (Creator) కూడా ఒక్కడే అయి ఉండాలి.

సృష్టికర్త కళ్లముందర లేడు, మిగిలిన వస్తువులన్నీ ఉన్నాయి. హత్యాస్థలి (Spot) లో హంతకుడు లేడు గాని హత్యోదంతానికి సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ (Evidences) హత్య జరిగిందని చాటి చెబుతున్నాయి.

## (2) ఒక ప్రశ్నకు సమాధానం ... వాస్తవాల వెల్లడి

ఇన్ని మిశ్రమ పనులను చేసే అంతుబట్టని యంత్రం దానంతటదే ఉనికిలోనికి వచ్చేసిందా? లేక దానిని నిర్మించిన వాడంటూ ఒకడుండాలా? ఈ ప్రశ్నకు మీరిచ్చే బదులేమిటి? మీ మనోమస్తిష్కాల లోతుల్లో మీరు ఈ ప్రశ్నకు పొందే జవాబేమిటి? మీ ఆంతర్యంలో నుండి రేకెత్తే భావాలు మీతో ఏమంటున్నాయి? ఈ ప్రశ్నకు మీ ఆంతర్యంలో పెల్లుబికే భావాలు భావనలలో లభించే సమాధానమే నిశ్చయంగా ఈ జగతి జీవనం, ఉనికికి సంబంధించినదై ఉంటుంది.

## (3) మానవ నైజం ఇచ్చే పిలుపు ...వాస్తవాలకు ధ్రువీకరణగా ఉంది

హృదయాంతరాళాలలో నుండి, మానవ నైజం లోతుల్లో నుండి ప్రతిధ్వనించే ధ్వని సత్యమైనదై ఉంటుంది. అందులో ఎలాంటి కల్పన ఉండదు. కృత్రిమత ఉండదు. అది పూర్తిగా మానవ నైజం కాంక్షించే పిలుపు అయి ఉంటుంది. నైజం ఇచ్చే పిలుపునకు లభించే సమాధానం లేక అది కోరే విషయం (Demand) తిరుగులేని నిజం అయి ఉంటుంది. ఆ డిమాండుకు సమాధానం తప్పక ఉంటుంది.

అందుకే – మానవుడు ఏదయినా (తుఫాను లేదా) సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు, ఎటువైపు నుండి కూడా అతనికి సహాయం అందనప్పుడు అతను (తనకు జీవితం ప్రసాదించిన) సృష్టికర్త వైపునకు దృఢ నమ్మకంతో మరలుతాడు. ఆ సృష్టికర్త ఉన్నాడనే విషయంలో అతనికెలాంటి సందేహం ఉండదు (చూడబోతే కొన్ని గంటల ముందు వరకూ అతను ఆ సృష్టికర్త ఉనికి గురించే ప్రశ్నించాడు. ఆయన అసలు లేనే లేడని వాదించాడు). కాని అవసరం ఏర్పడగానే, గత్యంతరంలేని పరిస్థితి ఎదురవగానే మనోవాక్కాయ కర్మలచేత ఆ సృష్టికర్త ఉనికిని అంగీకరించాడు. అంగీకరించటమే కాదు, ఆ సృష్టికర్త తన మొరను ఆలకించి, ఆమోదిస్తాడన్న దృఢ విశ్వాసంతో, తన పిలుపునకు ప్రతిస్పందించి చర్యకు (Response) ఉపక్రమిస్తాడన్న గట్టి నమ్మకంతో ఆయన వైపునకు మరలుతాడు. ఈ గండం నుంచి తనను గట్టెక్కించే శక్తియుక్తులు ఆయనకు మాత్రమే ఉన్నాయని భావిస్తాడు. ఆ దేవుడు తన దాసులైన మానవులను అమితంగా ప్రేమించేవాడని, పరమ దయాళువు అని తలపోస్తాడు. ఇది ఏ ఒత్తిడీ (Pressure) లేని మనస్సాక్షి! అంతరాత్మ ప్రబోధం!! సృష్టికర్త ఉనికి గురించి, ఆయన గుణగణాల గురించి కూడా ఇందులో ప్రబల సాక్ష్యం ఉంది. సృష్టికర్త అనేవాడే లేనట్లయితే మానవ నైజం అవలంబించే వైఖరి ఇలా ఉండేది కాదు. ఆపదలో చిక్కుకున్న మొదటి గడియలోనే అతను నిరాశకు గురై, కళ్లు మూసుకుని తన అంతానికి సిద్ధమయ్యేవాడు. ఆ ప్రమాదం అతన్ని ఇట్టే కబళించేది.

ఆ విపత్తు నుండి అతను రక్షించబడగానే – అప్రయత్నంగా – కృతజ్ఞతాభావంతో వంగిపోతాడు. ప్రణమిల్లుతాడు. ఎవరికి ప్రణమిల్లుతాడు?

అతని ఎదుట ఎవరయినా కనిపిస్తున్నాడా? 'రక్షించబడటం' అనేది సృష్టికర్త ఉన్నాడన్న నమ్మకాన్ని దృఢతరం చేస్తోంది. సృష్టికర్త సర్వత్రా ఉన్నాడు. ఆయన సర్వాధికుడు. తిరుగులేనివాడు. దయాసాగరుడు. ప్రేమమయుడు. ఆదరణీయుడు, కృతజ్ఞతలు చెప్పుకోదగినవాడు. సాష్టాంగ ప్రణామం చేయదగినవాడు.

మానవ నైజం ఇచ్చే ఈ సాక్ష్యమే అతని మనస్సాక్షి. ఈ జగతిని, మనిషిని సృష్టించిన సృష్టికర్త లేడని, ఆయన కంటికి కానరావటం లేదని, ప్రతిదీ కాకతాళీయంగానే ఉనికిలోనికి వస్తోందని బుద్ధి చెబుతున్నప్పటికీ అతని మనస్సాక్షి మాత్రం 'ఉన్నాడ'నే అంటుంది. మానవుని హృదయాంతరాళాల్లో నుండి ఉద్భవించే భావాలు భావనలే యదార్థానికి ప్రతిబింబం. కాబట్టి పైన పేర్కొనబడిన భావాలు భావనలు సృష్టికర్త ఉన్నాడనే యదార్థాన్ని చాటిచెబుతున్నాయి.

ఆంతర్యం నుండి, మానవ నైజం లోతుల్లో నుండి ప్రతిధ్వనించే ధ్వనే అసలు సత్యం. అది బుద్ధి మాదిరిగా తికమక పడదు. బుద్ధి మాదిరిగా టక్కరితనం ప్రదర్శించదు.

మానవ నైజం వాంఛించే విషయాలను పరిగణనలోకి తీసుకోవటం జరిగింది. అలాగే మానవ నైజం సృష్టికర్తను కూడా వాంఛిస్తుంది. సృష్టికర్త కావాలని డిమాండ్ (Demand) చేస్తుంది. అందుకే సృష్టికర్త అనేవాడున్నాడు. జగతిలో లేని వస్తువును మానవ నైజం వాంఛించదు.

## (4) జీవితపు మౌలిక ప్రశ్నలు ... అదొక తీవ్రమైన దాహం

జీవితపు మౌలిక ప్రశ్నలను ముందుంచుకుని వాటికి సంతృప్తికరమయిన జవాబులు ఎవరిస్తారో చూద్దాం –

### (1) మనిషి ఉనికి లక్ష్యమేమిటి?

పుట్టుక పరమార్థం గురించి తెలుసుకోవటం ప్రతి మనిషికీ చాలా అవసరం. అన్యధా అతను తన పుట్టుక ఉద్దేశాన్ని నెరవేర్చటంలో విఫలుడవుతాడు. దుష్ఫలితాలను చవిచూసే ప్రమాదం కూడా ఉంటుంది.

ఆది మానవుని మొదలుకుని ఆఖరి మనిషి వరకూ మనుషులందరి పుట్టుక లక్ష్యం ఒక్కటే ... ఈ విషయం సామంజస్యతతో ముడివడి ఉంది. ఆది మానవుని నుండే మనిషికి అతని పుట్టుక లక్ష్యం తెలియపరచబడి ఉంటుంది! లేని పక్షంలో అతను తన పుట్టుక ఉద్దేశ్యాన్ని నెరవేర్చి ఉండడు.

**(2) జగతిలో మనిషి స్థానం ఏమిటి?**

మానవులందరి స్థానం ఒక్కటే అయి ఉండాలి. తన నిజస్థానంలో ఆసీనుడైనప్పుడే అతను తన ఉనికికి సార్ధకతను చేకూర్చగలుగుతాడు. ఒక న్యాయమూర్తి న్యాయస్థానంలో తనకు కేటాయించబడిన పొజిషన్‌లో కూర్చునే న్యాయం వాంఛించే వాటిని పూర్తిచేస్తాడు.

**(3) మానవుల మధ్య గల వివిధ స్థాయి, సంబంధాలను బట్టి**

సత్ఫలితాలు వచ్చేలా తగు రీతిలో వ్యవహారం (Interaction) చేయటం ... మొదటి నుండి చివరి వరకూ మనుషులందరికీ ఈ విషయం బోధించబడే ఉంటుంది.

**(4) మానవుని సాఫల్య వైఫల్యాలు వేటిపై ఆధారపడి ఉన్నాయి?**

మనుషులందరికీ ఒకే ప్రమాణం (Standard) ఉండాలి. మనిషి ముందు సరైన 'ప్రమాణం' లేకపోతే అతను తన స్వయానికి నష్టం చేకూర్చుకుంటాడు.

**(5) మరణానంతరం ఏమవుతుంది?**

మాతృ గర్భపు జీవితం (Close Uterine Life) తరువాత ఈ జీవితం ఉన్నట్లే ఏదయినా జీవితం ఉందా? లేదా? ఒకవేళ ఉంటే అదెలా ఉంటుంది? లేకుంటే ఎందుకు లేనట్లు? మంచికి, చెడుకి అంతిమ పర్యవసానం (End Result) ఒకేవిధంగా ఉంటుందా? అందరూ మట్టిలో కలసి పోవలసిందేనా? లేక దాని పరిణామం విభిన్నంగా ఉండబోతుందా? ఒకవేళ అది ఉండేమాటైతే ఆ జీవితాన్ని విజయవంతమైనదిగా, ఆహ్లాదకరమైనదిగా చేసుకోవడానికి ఏం చేయాలి? ఎలా చేయాలి?

**పైన ప్రస్తావించబడిన ప్రశ్నలకు రెండు సమాధానాలున్నాయి. వాటిని 'బుద్ధి' అనే గీటురాయిపై పరికించవచ్చు**

ఈ జగతి, జీవనం మన ముందు ఉన్నాయి. తమ సంపూర్ణ సుగుణాలతో, విస్తృతులతో, చిక్కులతో, క్రమబద్ధతతో అవి అలరారుతున్నాయి. వాటిపై మనం

నివసిస్తున్నాము, ఉపయోగించుకుంటున్నాము. అత్యుత్తమమయిన దాని వ్యవస్థను వీక్షిస్తున్నాము. మానవ మనుగడలో అవి పోషిస్తున్న పాత్రను చూస్తున్నాము. వాటి ద్వారా లబ్ది పొందుతున్నాము. దానికి సంబంధించిన రెండు సమాధానాలను లేదా సంజాయిషీల (Explanations) ను యోచించేటందుకు మన ముందుంచుకుని, వాటిలో ఏది సామంజస్యతకు అత్యంత సమీపంలో ఉందో, వాటిలో బుద్ధి దేనికి ఎక్కువ శాతం (Percentage) మార్కులు ఇస్తూ స్వీకరిస్తుందో చూద్దాం. రెండింటికి పంచేంద్రియాల (Senses) సాక్ష్యం అవసరం లేకపోయినప్పటికీ, కేవలం తర్కం (Logic) ఆధారంగా ఇదమిత్థంగా తుది అభిప్రాయానికి (Conclude) రావలసి ఉన్నప్పటికీ –

**మొదటి సమాధానం** (Explanation) : ఈ జగతి, మానవ జీవితం స్వయంగా వాటంతటవే ఉనికిలోనికి వచ్చేశాయి. వాటిని చేసిన వాడంటూ ఎవడూ లేడు. ఎందుకంటే అతను కానరావటం లేదు గనక.

**రెండవ సమాధానం** (Explanation) : జగతిని, జీవనాన్ని సృష్టించిన వాడంటూ ఒకడున్నాడు. పిదప ఆయన ఈ విశ్వ వ్యవస్థను బహు చక్కగా నడుపుతున్నాడు. అద్భుతమైన రీతిలో ఆయన దీనిని స్థిరంగా ఉంచాడు.

పైన పేర్కొనబడిన రెండు సమాధానాలపై చర్చకు, తర్జన భర్జనకు తావు ఏర్పడింది. (Discussion over the two Answers)

మొదటి సమాధానం : దీనిని చేసినవాడు సృష్టితాలలోని ఏదేని వస్తువుతో పాటు కంటికి కానరావటం లేదు. కాబట్టి సృష్టికర్త లేడు.

ఈ సమాధానం సమంజసమైనదని అనడానికి రెండు కారణాల వల్ల బుద్ధి తడబడుతుంది.

ఒకటి : దైనందిన జీవితంలో మనిషి నిర్మించిన ఎన్నో వస్తువులు మనకు కనిపిస్తాయి. అయితే ఆ వస్తువుల (Commodities) తో పాటు వాటి నిర్మాత మనకు కానరాడు. అయినప్పటికీ వాటిని నిర్మించిన వాడంటూ ఒకడున్నాడని మనం అనుకుంటాము. ఆ నిర్మాత కంటికి కనిపించకపోయినప్పటికీ అతని ఉనికిని బుద్ధిగా అంగీకరిస్తున్నాం. ఆ వస్తువులు వాటంతటవే నిర్మితమయ్యాయని మనం అనుకోవటం లేదు.

అలాంటి ఆలోచనకు తావు ఎందుకు ఇవ్వటం లేదంటే అది మన బుద్ధి అంగీకరించదు కాబట్టి.

రెండు : ఈ జగతిని, ఈ మానవ జీవితాన్ని చేసినవాడు ఎవడూ లేడని, వాటంతట అవే ఉనికిలోనికి వచ్చేశాయని కాస్సేపటికి ఒప్పుకున్నప్పటికీ మనిషి సంతృప్తి చెందుతాడా? అంటే సంతృప్తి చెందడు. అలాగైతే తనలో రేకెత్తిన ఈ ముఖ్యమయిన ప్రశ్నలకు సమాధానం ఎక్కడ లభిస్తుంది? అని వ్యాకులతకు లోనవుతాడు. ఎందుకంటే అవి మానవ జీవితంతో అవినాభావ సంబంధం కలిగి ఉన్న ప్రశ్నలు. వాటికి సరైన, శాస్త్రీయమైన సమాధానం అతనికి అవసరం (కేవలం అంచనాల ఆధారంగా కాదు). ఈ సమాధానం లేకుండా జీవన రథం సరైన దిశలో ముందుకు సాగదు.

ఈ ప్రశ్నలకు సమాధానాలు మనిషికి తక్షణం (Immediate) కావాలి. అవి నమ్మదగ్గ (Authentic) పద్ధతిలో ప్రాప్తమవాలి. ఇవి కేవలం ఊహల (Imagination), అంచనాల (Guess - work) ఆధారంగా లభ్యమయ్యే సమాధానాలు కారాదు. సందేహాస్పదంగా ఉండరాదు. ఏది సరైనది, ఏది కాదు అనే సందేహం గనక మనోమస్తిష్కాలలో భ్రమిస్తూ (Haunt) ఉంటే మనిషి ప్రశాంతంగా జీవించలేడు.

జీవితానికి సంబంధించిన పైన వేయబడిన ప్రశ్నలకు సమాధానాలు లభించలేదంటే దాని మతలబు ఏమిటి? మొదటి సమాధానం తప్పనే కదా! ఎందుకంటే ఈ జవాబులో మానవ జీవితానికి సంబంధించిన అత్యంత ముఖ్యమయిన, ప్రాథమికమయిన అక్కరలు తీరటం లేదు.

రెండవ సమాధానం : అంటే జగతిని, జీవనాన్ని సృష్టించి వాటిని అత్యుత్తమరీతిలో నిర్వహించేవాడు, వాటిని మిగిల్చి ఉంచినవాడు ఒకడున్నాడు అనే సమాధానం ఎంతో సమంజసంగా, సంతృప్తికరంగా ఉంది. ఎందుకంటే ఏ వస్తువయినా దానంతటదే నిర్మించబడదు. మరలాంటప్పుడు బ్రహ్మాండమయిన జగతి, సర్వశ్రేష్ఠుడయిన మానవుడు స్వయంగా ఎలా ఉనికిలోకి వస్తారు?

ఇంకొక విషయం ; జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన ప్రశ్నలకు గల సంతృప్తికరమయిన జవాబులు సృష్టికర్త తరఫున లభించే జవాబులై ఉంటాయి. ఆయనే ఈ జగతిని నిర్మించాడు. ఆయనే జీవితాన్ని ప్రసాదించాడు.

జీవిత లక్ష్యం కూడా ఆయనే తెలియజేయగలుగుతాడు. వివిధ స్థానాలు, సంబంధాలు ఏర్పరచుకునే పద్ధతులు, లాభనష్టాలు మరియు జీవితం ఆఖరి హద్దు గురించి విశదీకరిస్తాడు. మరణానంతర జీవిత ఆవశ్యకతను, దాని వైనాన్ని వివరించగలుగుతాడు. దాని స్వరూపాన్ని ఆయనే చిత్రీకరించ (Picturize) గలుగుతాడు. ఒక విధంగా చెప్పాలంటే సృష్టికర్తే స్వయంగా మనిషి ప్రాథమిక అవసరం. సృష్టికర్త ఉన్నాడన్న దానికి ఈ 'అవసరమే' ప్రబల తార్కాణం. మనిషి జీవికకు అవసరమయిన వాటినన్నింటినీ సృష్టికర్తే సమకూరుస్తున్నాడన్న భరోసా కూడా ఇది ఇస్తుంది. కనుక మనిషి ఈ ప్రశ్నలకు తగిన సమాధానాల కోసం నిక్షేపంగా తన సృష్టికర్త వైపునకు మరలవచ్చు. ఈ సమాధానాల కోసం అతను వేరొకరి వైపునకు పరుగులు తీయాల్సిన అవసరం లేదు.

## (5) ఈ జగతి సజావుగా నడవటం దేన్ని సూచిస్తోంది?

ఏదయినా ఒక యంత్రాన్ని తయారు చేసేవాడు ఆచితూచి లెక్క ప్రకారం దాని నియమ నిబంధనలను, నడిపే పద్ధతులను నిర్మిస్తాడు. యంత్రం సుతారంగా పనిచేయడానికి (Smoothly Function), తన నిర్మాణం వెనుక గల ఉద్దేశాన్ని నెరవేర్చడానికి ఇది చాలా అవసరం. అందుకే యంత్రం భాగాలను (Parts) ప్రత్యేక రీతిలో పనిచేసే విధంగా నిర్మిస్తాడు. ఇప్పుడు ఆ యంత్రం చక్కగా నడుస్తోంది. కాని దానిని నిర్మించినవాడు కనబడటం లేదు. అంతమాత్రాన ఆ యంత్రం దానంతట అదే తయారై చక్కని సమతూకంతో కూడిన సూత్రాల (Well Balanced Laws) తో నడుస్తుందని దాని భావం ఎంతమాత్రం కాదు.

ఇదేవిధంగా ఈ జగతిని, జగతిలోని అన్ని వస్తువులను, అన్ని రకాల జీవితాలను – సంపూర్ణ జ్ఞానంతో, శక్తితో – ఒక లెక్క ప్రకారం, సమత్వంతో కూడిన సూత్రాల (Well Balanced Laws) ప్రాతిపదికపై నిర్మించటం జరిగింది. వాటిని స్థాపించటం జరిగింది. అవి తమకై నిర్ధారించబడిన శాసనాలకు కట్టుబడి పనిచేస్తూ ఉండేలా, తమ ఉనికి పరమార్థాన్ని నెరవేరుస్తూ ఉండేలా చేయటం జరిగింది. ఆ శాసనాలను నేడు మానవుడు ఏండ్ల తరబడి చేసిన ప్రయత్నాల తర్వాత ఒక్కొక్కటే తెలుసుకోగలుగుతున్నాడు. ఇవన్నీ కళ్ల ముందర ఉన్న

యదార్థాలు. ఈ శక్తియుక్తుల వెనుక ఉన్న స్వామి కంటికి కానరావటం లేదన్నది వేరే విషయం. మొత్తానికి అవగతమయ్యేదేమిటంటే, ఒకానొక గొప్ప శక్తి దీని వెనుక ఉన్నాడు. ఆయన గొప్ప వివేక సంపన్నుడు, మహా జ్ఞాని. తాను తలచుకున్న దానిని తిరుగులేని విధంగా ప్రవేశపెట్టగల స్వామి ఆయన. ఈ తిరుగులేని ఉనికే ఈ జగతికి కర్త, మన సృష్టికర్త (Creator) కాగలడు.

## (6) రెండు స్వభావాల మధ్య గల సమన్వయం ... దేన్ని సూచిస్తోంది?

జగతిలోని చిన్న కణం (Cell) మొదలుకుని బ్రహ్మాండమయిన నక్షత్ర వీధుల (Galaxies) వరకూ ఎంతో సమతూకం (Well Balanced) తో కూడిన, చక్కని సమగ్రత (Well Integrated), లక్ష్యబద్ధమయిన విధానం (Purposeful System) కానవస్తోంది – మరి ఇదంతా సృష్టికర్త అనేవాడు లేకుండానే ఉనికి లోనికి వచ్చేసిందంటే అది బుర్రకెక్కే విషయం కాదు. స్వీకార యోగ్యమూ కాదు.

జగతికి – మానవ స్వభావానికి మధ్య అపురూపమయిన సమన్వయ సారూప్యం ఉంది (Exact Fitting of natures into each other). అంటే మానవ జీవితానికి కావలసినవన్నీ ఈ జగతి పూర్తిగా సమకూరుస్తూ ఉండటం దేనికి నిదర్శనం? ఈ రెండింటినీ సృష్టించినవాడు ఉన్నప్పుడే, ఆయన ఒకే ఒక్కడు అయి ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది.

కాబట్టి ఒక యంత్రంలోని లక్ష్యబద్ధమయిన సిస్టమ్ (Purposeful System), దాని నిర్మాత ఉనికి గురించి సాక్ష్యమివ్వటమే గాక, అతని పరిజ్ఞానాన్ని, యుక్తినీ, విజ్ఞతను, సృష్టి పరమార్థాన్ని గురించి కూడా సూచిస్తుంది.

## (7) మనిషిలోని కృతజ్ఞతా భావం దేంతో శాంతిస్తుంది? ... సృష్టికర్త వల్లనా? లేక నైజం వల్లనా?

సృష్టికర్తను – 'నైజం' అనే పదంలోని భావాన్ని దృష్టియందుంచుకుని మానవునిలోని కృతజ్ఞతా భావానికి ఏ పదం వల్ల సంతృప్తి, నెమ్మది లభిస్తుందో ఆలోచిద్దాం –

సృష్టికర్తను, జీవనాన్ని త్రోసిపుచ్చిన తరువాత ఈ శూన్యాన్ని (Vaccum) ప్రకృతి లేక స్వభావం (Nature) ద్వారా పూరించే ప్రయత్నం జరిగింది.

తత్ఫలితంగా "ఒకానొక శక్తి ఉంది ... ఊహాత్మకమయిన శక్తి ఉంది" అనే భావం జనించింది. ఊహాత్మకమయిన శక్తి తనకంటూ ఒక ఉనికిని ఎలా కలిగి ఉంటుంది? అది ఏదయినా వ్యక్తిత్వం (Personality) లోనయినా ఉండాలి లేదా ఏవయినా కొన్ని శాసనాల (Laws) కు లోబడి అయినా అదొక శక్తిగా రూపొందగలదు. ఉదాహరణకు : తుఫాను గాలులు ... ఒక ఊహాత్మకమయిన శక్తి. అయితే తుఫాను గాలులు ఏ శాసనాలకు కట్టుబడి వీస్తున్నాయో ఆ శాసనాలను రూపొందించిన వాడంటూ ఒకడుండాలి కదా!

బోధపడిందేమిటంటే – 'ప్రకృతి' (Nature) గా వ్యవహరించబడే ఈ శక్తి కొన్ని నియమాల (Laws) కు కట్టుబడి నడుస్తూ (Operate) ఉంది. అంతేగాని అది స్వయం ప్రతిపత్తి గల శక్తి కాజాలదు. ఆ నియమాలను రూపొందించిన మహాజ్ఞాని, వివేక సంపన్నుడు ఒకడున్నాడు. ఆయన తిరుగులేని శక్తిమంతుడు.

ఈ చర్చవల్ల ముందుకు వచ్చిన విషయమేమిటంటే 'ప్రకృతి' (Nature) అనే పదం ఒక వ్యక్తిత్వాన్ని గాకుండా కేవలం ఒక ఊహాత్మకమయిన (Abstract) వస్తువును సూచిస్తుంది. అందులో 'గుణం' లేదు. ఎందుకంటే గుణగణాలు ఏదైనా వ్యక్తిత్వంలో మాత్రమే ఉంటాయి. వాటికి సంబంధించిన పరిజ్ఞానం, నమ్మకం ఆధారంగా ఆ వ్యక్తిత్వం పట్ల ప్రేమాదరణలు జనిస్తాయి. పవిత్ర భావన ఏర్పడుతుంది. దానికి విధేయత చూపాలన్న ఆలోచన జనిస్తుంది. దాని ఆజ్ఞలను ఎదిరించడానికి మనిషి భీతి చెందుతాడు. మొత్తానికి ఆ వ్యక్తిత్వం (Personality) లోని గుణగణాలు, విశేషాలు, అద్భుతాలు మనిషి జీవితంపై అవసరమైన ప్రభావం చూపుతాయి. ఇది మనిషికి ముఖ్యావసరం కూడా.

మానవ అవసరాలను తీర్చే శక్తి సామర్థ్యాలు ఏదేని ఒక వ్యక్తిత్వంలోనే ఉంటాయిగాని ఊహాత్మకమయిన (Abstract) వస్తువులో మాత్రం కాదు. వ్యక్తిత్వం ఉంది అనే నమ్మకం ఆధారంగా ఆ వ్యక్తిత్వంతో సంబంధం (Attachment) ఏర్పడుతుంది. దానిపై విశ్వాసం జనిస్తుంది. ఒక విధమయిన సంతృప్తి, శాంతి ప్రాప్తమవుతుంది. ఈ భావాలు, భావనలు మనిషికి ప్రకృతి (Nature) అనే ఊహాత్మకమయిన పదం వల్ల ప్రాప్తించవు. దైనందిన క్రియాత్మకమయిన జీవిత వ్యవహారాలలో 'ప్రకృతి' (Nature) వల్ల మనిషికి ఏమీ లభించదు. జీవితంలో దాని ప్రత్యేక పాత్రాభినయం అంటూ ఏమీ లేదు.

పాత్రే లేనప్పుడు దానిని నమ్మి నడుచుకోవటం నిరర్థకం. ఇది పనికిమాలిన ఆలోచనలో పడి మోసపోవటం తప్ప మరేమీ కాదు.

ఈ రకంగా 'ప్రకృతి' (Nature) అనే ఊహ వల్ల ప్రాప్తమయ్యే నెమ్మది ఏమీ ఉండదు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే 'Nature' అనే దానికి వ్యక్తిత్వ ఉనికి అనేది ఏదీ లేదు. ఫలితం దృష్ట్యా అదేదో ప్రభావవంతమైన వస్తువు కాదు. మానవ జీవితంలోని దైనందిన వ్యవహారాలలో, నిత్యావసరాలలో అది పోషించగల పాత్ర (Role) అంటూ ఏదీ లేదు.

ఈ జగతిని, ఇందలి జీవనాన్ని గమనించినప్పుడు కలిగే భావన ఒక్కటే – ఒకానొక వ్యక్తిత్వం ఉంది. అది సకల సుగుణాల సమాహారం. అది లోప రహితమైనది. పరిపూర్ణ (Perfect) మైనది. అదే సృష్టికర్త కాగలదు. గుణగణాల రీత్యా అందులో గొప్ప సంతులనం ఉంది. (అంటే 50 శాతానికి 50 శాతం అని కాకుండా ఏ గుణానికి ఎంత సంతులనం అవసరమో అంతగానూ అందులో పూర్ణపరిణతి ఉంది. సమత్వం సమతూకం ఉంది). మనకు ప్రసాదితమై ఉన్న ఏ వరమైనా ఆయన ప్రసాదించినదే. ఆయన యెడల కృతజ్ఞులై మెలగినప్పుడు ఆ వ్యక్తిత్వం ప్రసన్నమవుతుంది. ఆయన ప్రసన్నుడయ్యాడన్న ఆలోచనతో మనిషి మనసు కుదుటపడుతుంది. (కాగా; ప్రకృతి – Nature – అనే దానివల్ల ఈ భావన కలగదు). కాబట్టి తేలిందేమిటంటే ప్రకృతి (Nature) అనే పదం ఒక భ్రమ తప్ప మరేమీ కాదు.

## (8) బిగ్ బ్యాంగ్ థియరీ నిజమైతే ... అది సృష్టికర్త ఆజ్ఞ తప్ప మరేమీ కాదు

పేలుడు (Bang) అనేది ఏమిటి? అది సృష్టికర్త యొక్క ఒక పురమాయింపు, గద్దింపు (Command) తప్ప మరేమీ కాదు.

క్రింద పేర్కొనబడిన ఉదాహరణల ద్వారా ఈ విషయాన్ని గ్రహించవచ్చు లేక ఊహించవచ్చు.

❖ మీరు చాలా అందమైనవారు. చలాకీగా ఉంటారు ... ఈ మాట వినగానే మీ మోము సంతోషంతో విచ్చుకుంటుంది.

❖ నీలాంటి సోమరిని నేనింతవరకు చూడలేదు ... ఇది వినగానే కోపంతో మీ ముఖం కందిపోతుంది.

❖ మీరు ఆదర్శప్రాయులు. మిమ్మల్ని అనుసరించటం నా భాగ్యంగా భావిస్తాను ... ఈ మాట మీలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది. దీంతో మీ మోముపై విజయహాసం తొణికిసలాడుతుంది.

❖ ఎట్టి పరిస్థితిలోనూ నువ్వు ఈ పని చేయలేవు. నువ్వొక పిరికిపందవి ... ఈ మాట వినగానే మీరు నిరాశచెందుతారు. నీరుగారిపోతారు.

నేను మిమ్మల్ని తాకకుండానే, కేవలం కొన్ని మాటల ద్వారానే మీలో ఇంత మార్పును తేగలుగుతున్నాను. మీపై నాకు ఎలాంటి అదుపు అజమాయిషీ లేకపోయినప్పటికీ నా మాటల గారడికే క్షణాల్లో మీరింతగా ప్రభావితులైపోయి నప్పుడు సృష్టికర్త 'ఆజ్ఞ' పై సృష్టితాలు ఎలా కదిలిపోతాయో ఊహించవచ్చు.

అలాగే ఒక రాజుగారి తరఫున ఆయన చిన్న ఆజ్ఞ అతని సేవకునికి సరిపోతుంది. వెంటనే అతను రాజాజ్ఞను శిరసావహిస్తాడు. అంటే ఒక మనిషి జారీచేసిన ఆదేశానికి సాటి మనిషి ఇంతగా ప్రభావితుడైనప్పుడు, సృష్టికర్త ఆజ్ఞకు సృష్టితాలు ప్రభావితం కాకుండా ఎలా ఉంటాయి? ఎలా మారమని ఆజ్ఞాపిస్తే అవి అలాగే మారిపోతాయి. ఆజ్ఞలో గల శక్తిని, భయోత్పాతాన్ని బట్టి దాని ప్రభావం కూడా ఉంటుంది. తత్ఫలితంగా ఆజ్ఞాపాలన జరుగుతుంది.

పైన ఉదాహరించబడిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలోచించండి ..... సృష్టికర్త ఏదేని ఒక విషయం గురించి సంకల్పించుకుని నువ్వు 'అయిపో' అని ఆజ్ఞాపిస్తే చాలు అది అయిపోతుంది. అలా అవటం తప్ప దానికి మార్గాంతరం లేదు. ఈ జగతిలోని ప్రతిదీ ఆయనచే సృష్టించబడినదే. ఆయన ఆజ్ఞకు లోబడినదే. కాబట్టి అది ఆజ్ఞలను విధిలేక శిరసావహిస్తుంది. ఏదయినా వస్తువు సజీవమైనదా లేక నిర్జీవమైనదా? అనే వ్యత్యాసం మన కోసమే. కాని సృష్టికర్త దృష్టిలో ప్రాణమున్నదైనా, ప్రాణం లేనిదయినా – మొత్తానికి అది 'సృజించబడినదే' ..... వాటిలో ప్రతిదీ ఆయన ఆజ్ఞను తు.చ. తప్పకుండా పాలిస్తుంది. పాలించక తప్పదు మరి.

బిగ్ బ్యాంగ్ థియరీ (Big Bang Theory) అయినా లేక మరేదయినా దానిని మనం నిజమైనదని భావించినా (If taken for granted to be true) అది ఈ జగతి దానంతట అదే మొదలైంది కాదని, అది సృష్టికర్త ఆజ్ఞపైనే

మొదలయిందని సంకేతప్రాయంగా తెలియజేస్తోంది. ఉనికిలోనికి రావటానికి ఆరంభం (Starting) లో ఏ రూపం (Shape) ఉండాలి? దాని ప్రక్రియ (Process) ఎలా ఉండాలి? అనేది సృష్టికర్తకే బాగా తెలుసు. ఎందుకంటే సృష్టికర్త తరఫున అయ్యే ఒక్కగా నొక్క ఆజ్ఞ లేక గద్దింపు (Order and Command) పై ఈ జగతి ఉనికిలోనికి వచ్చే ప్రక్రియ (Process) మొదలయి ఉంటుంది. కనుక ఈ జగతిని చేసినవాడు ఆయనే అని అనవలసి ఉంటుంది. ఆయన 'ఆజ్ఞ' ఎంత శక్తిమంతమైనది, తిరుగులేనిది, ప్రభావవంతమైనది (Strong and Effective) అంటే అది శూన్యం నుండి వస్తువుకు అస్థిత్వం ప్రసాదిస్తుంది. ఎవరయినా ఏదయినా పని చేయాలంటే ఒక పథకం ప్రకారం కష్టపడాల్సి ఉంటుంది. కాని సృష్టికర్త విషయం అలా కాదు. ఆయనకు ఒక 'సంకల్పం', ఒక 'ఆజ్ఞ' సరిపోతుంది. అంతే అది అయిపోతుంది. (సంకల్పంలోనే పథకం కూడా ఉంటుంది).

కార్యనిర్వహణ విషయంలో సృష్టికర్తకి – సృష్టితాలకి మధ్య ఏ విధంగానూ పోలికే లేదు.

సృష్టితాలు (మనుషులు) ఏదైనా ఒక కార్యాన్ని నిర్వర్తించడానికి అనేక వస్తువులపై ఆధారపడతాయి – ఉత్పత్తి కారకాలపైన, పర్యావరణంపైన, మానవ శ్రమపైన, సలహాలపైన!

అయితే సృష్టికర్త తాను అనుకున్న పనిని చేయడానికి వీటిలో ఏ ఒక్క దానిపైన కూడా ఆధారపడడు. ఎందుకంటే ఉత్పత్తి కారకాలను, వస్తువులను సృష్టించేవాడు స్వయంగా ఆయనే కాబట్టి.

మనం దేని గురించి ఆలోచించినా మన పరిమిత శక్తికి, అధికారాలకు లోబడి ఆలోచిస్తాము. అదే సమయంలో సృష్టికర్త చేసే పనులను అసాధారణ మైన, ఘనమైన కార్యాలుగా కనుగొంటాము. కాబట్టి కేవలం సంకల్పించు కున్నంత మాత్రానికే, లేదా ఒక్కగా నొక్క ఆజ్ఞకే గొప్ప కార్యాలు జరిగిపోతా యంటే అది మనకు ఆశ్చర్యకరంగా తోస్తుంది. వాస్తవానికి మన దృష్టిలో అసాధారణమైన ఒక పని సృష్టికర్తకు అతి సాధారణమైనది.

మన ఉనికి లేక మన జీవితం సృష్టికర్త సంకల్పానికి లేక ఆజ్ఞకు సాక్షీభూతంగా ఉంది. మనకంటూ ఒక ఉనికి ఉండేది కాదు. ఆయన ఆజ్ఞవల్ల

మనం ఉనికిలోనికి వచ్చాం. దాని కోసం ఆయన ఒక సహజమయిన ప్రక్రియ (Process)ని ఉంచాడు.

మనం జీవించి ఉన్నామంటే అర్థం మనకు జీవికను ప్రసాదించేవాడు కూడా జీవించి ఉన్నాడు. ఖచ్చితంగా అసాధారణమైన జీవి మాత్రమే ఇతరులకు జీవం పోయగలుగుతుంది.

నా జీవితం ఒకరి జీవనానికి సాక్షిగా ఉంది. అసాధారణమైన జీవితమే వేరొక జీవికి జీవితం ప్రసాదించగలదు. ఈ అసాధారణమైన జీవియే మనకు, ఈ జగతికి సృష్టికర్త. ఏదయినా ఒక వస్తువు ఆరంభానికి ఏదేని ఒక జీవని ముందు నుంచే ఉండటం అవశ్యం. నిర్జీవమైనదేదీ వేరొక దానికి జీవనం వొసగజాలదు. ప్రాణమున్న వస్తువు ప్రాణం లేని దానిని తయారు చేయగలదు; ఆవిష్కరించగలదు, ప్రాణం పోయగలదు. కనుక ఈ జగతి మరియు మానవుని సృష్టి ఒకానొక జీవనం ద్వారా ఆరంభమయింది.

## (9) మన పరిమితుల పరిధిలో ప్రాప్తమైన దానిని పరిగ్రహించటం విజ్ఞత :

ప్రాప్తమైన దానిని త్రోసిపుచ్చటం అవివేకం.

మన దృష్టికి, వినికిడికి పరిమితులు ఉన్నట్లే మన ఆలోచనలకు కూడా పరిమితులు, హద్దులు ఉన్నాయి. మనం మన ముందున్న గోడను మాత్రమే చూడగలుగుతాము. గోడకు అవతల ఉన్న దానిని చూడలేము. వినికిడి కూడా అంతే. ఒక పరిమిత దూరం వరకే మనం శబ్దాన్ని వినగలుగుతాము. పరిమితిని దాటి వినలేము. ఆలోచనలకు కూడా ఒక హద్దు ఉంటుంది. హద్దు దాటి ఆలోచించలేము. హద్దు మీరగానే మన అశక్తత తెలిసివస్తుంది. దిమ్మతిరుగు తుంది – ఇవీ మన వద్ద ఉన్న శక్తియుక్తుల పరిమితులు (Limitations).

మనం చూడగలిగినంత మేరకే చూడాలి. నమ్మాలి. దైనందిన జీవితంలో మనం చేసేది కూడా యిదే. మనం వినగలిగినంత మేరకు వినాలి. దానిని నమ్మాలి. అంతకు మించి మనం చేయగలిగింది కూడా ఏమీ లేదు. హేతుబద్ధం (Logic) గా ఎంతవరకు ఆలోచించగలమో అంతవరకే ఆలోచించాలి.

పరిమితులు, హద్దులు (Limitations) వాస్తవికత ముందర ఉండటం వల్ల హద్దుల లోపల లభించిన దానిని మనిషి పుచ్చుకుంటాడు. దాంతోనే సంతృప్తి చెందుతాడు. మరింతగా ప్రాప్తించలేదే! అని ఆరోపించడు. మరింతగా లభించలేదన్న సాకుతో ప్రాప్తమైన దాన్ని కాలదన్నడు. తన పరిమితులను, అశక్తతను తిరస్కృతికి సాకుగా చేసుకోడు. పైగా తన పరిమితులకు కట్టుబడి ఉంటూ తనకు లభించిన దాంతో సర్దుకుపోతాడు. దాని పరిధిలో నిర్ణయాలు తీసుకుంటూ, చర్యలు గైకొంటూ ఉంటాడు.

ఈ విధంగా మనం – హేతుబద్ధంగా – మనిషిని, ఈ జగతిని సృష్టించినవాడు ఒకానొకడు ఉన్నాడనే విషయం వరకూ వచ్చాము. నా జీవితం, నా గొప్పతనం ఏమీ కాదు, నిత్య సజీవుడైనవాడే జీవికను ప్రసాదించగలడు. ఆయన జగతిని ఉనికిలోనికి తీసుకురాక ముందూ ఉన్నాడు. అంతమొందించిన మీదట కూడా ఉంటాడు – ఇక్కడి వరకూ మనం సృష్టికర్త అనేవాడున్నాడన్న దానిని ఒప్పుకోవాలి. ఇక ముందు ఉత్పన్నమవబోయే ప్రశ్నలకు గల జవాబులపై మనం ఇంకా ఆలోచించలేదు. అంటే సృష్టికర్తను సృష్టించినదెవరు? ఆయన ఏ విధంగా ఉనికిలోనికి వచ్చాడు? ఆయన రూపురేఖలు ఎలా ఉంటాయి? లాంటి ప్రశ్నలు (ఈ అంశంపై ముమ్ముందు చర్చించబోతున్నాం).

పై చర్చ వల్ల అవగతమయిందేమిటంటే మానవుని కనే, వినే, ఆలోచించే ప్రస్తుత శక్తి సామర్థ్యాలు యదార్థాన్ని చేరుకోవటానికి సరిపోవు.

మనిషి చేయగలిగిన మేరకే చేయాలి. చేయననటం సరికాదు. దాని మీదట ఏదీ చేయలేను గనక ఇది కూడా ఎందుకు చేయాలి? అని అనటం భావ్యం కాదు. పైగా ఇది మనిషి ఆలోచనా మాంద్యానికి నిదర్శనం. ఇది యదార్థాల నుండి కళ్లు మూసుకుని తనను తాను మోసపుచ్చుకోవటం వంటిది.

ఒకవేళ ఏ వ్యక్తిలోనయినా మేధాశక్తి బలహీనంగా ఉంటే లేదా అతను మేధాపరంగా సంకుచిత మనస్కుడై ఉంటే ప్రాథమికంగా అది అతని మానసిక దౌర్బల్యం. తత్కారణంగా అతను మానసికంగా ఉన్నత స్థాయికి ఎదగలేడు. రెండో ముఖ్య విషయం ఏమిటంటే సంకుచిత స్వభావం, దురభిమానం కల వ్యక్తి ఖుద్దుగా విలువైన వస్తువులకు నోచుకోకుండాపోతాడు. తత్ఫలితంగా అతను తనకు తానే నష్టం చేకూర్చుకుంటాడు.

జీవనానికి, జగతికి సృష్టికర్త అనే వాడొకడున్నాడా? లేడా? అనే అంశంపై మనం చర్చిస్తూ క్రింది సారాంశానికి చేరుకున్నాము –

"జీవనాన్ని, జగతిని నిర్మించినవాడు ఉన్నాడు"

సృష్టికర్త ఉన్నాడు.

ఇప్పుడు మనం రెండవ అధ్యాయంలో సృష్టికర్త గురించి చర్చిద్దాం, యోచన చేద్దాం.

**రెండవ అధ్యాయం :**

# సృష్టికర్తను చేసినదెవరు? ... ఒక చూపులో!

(1) సృష్టికర్త సృష్టితాలలోనివాడు కాడు

(2) యదార్ధ జీవితం – ప్రసాదిత జీవితం : రెండింటి స్థాయి

(3) క్రియాత్మక జీవితానికి కావలసిన జ్ఞానంతో సంతృప్తి చెందటం

# సృష్టికర్తను ఎవరు చేశారు?

జగతిని నిర్మించినవాడు ఉన్నాడా? లేడా? – ఈ పజిల్‌పై మనం యోచన చేస్తూ ఒక నిర్ధారణకు వచ్చాము – ఈ జగతిని సృష్టించినవాడు ఒకడున్నాడనీ, జగతిలో ఉన్న జీవనం (జీవరాశులు) వాటంతట అవే ఉనికిలోకి రాలేదనీని. ఇప్పుడు సృష్టికర్త ఉనికికి సంబంధించిన ప్రశ్న ఉత్పన్నమవుతుంది – ఆయన ఎలా ఉనికిలోనికి వచ్చాడు? ఆయన నైజం ఎట్టిది? ఆయన గుణగణాలేమిటి? లాంటి ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈ విషయాన్ని మనం క్రింద పేర్కొనబడిన శీర్షికల్లో విస్తృత భావంలో అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిద్దాం.

(1) సృష్టికర్త సృష్టితాలలోనివాడు కాడు.

(2) యదార్ధ జీవితం, ప్రసాదిత జీవితాల స్థాయి.

(3) క్రియాత్మక జీవితానికి అవసరమయిన 'జ్ఞానం'తో సంతృప్తి చెందటం.

## (1) సృష్టికర్త సృష్టించబడినవాడు కాడు

సృష్టికర్త అంటేనే సృష్టించేవాడని, సృష్టించబడినవాడు కాడని అర్థం వస్తుంది. ఆయన నిర్మాతేగాని నిర్మించబడినవాడు కాడు. సృష్టికర్త సృష్టికర్తే ; సృష్టితాలలోని వాడు కానేకాడు. ఒకవేళ ఆయన కూడా పుట్టించబడిన వాడయ్యేటట్లయితే పుట్టించబడిన వాటిలో ఒకటిగా పరిగణించబడేవాడు. సృష్టికర్త స్థానం ఆయనకు దక్కదు. మొదటి అధ్యాయంలో మనం; ఈ జగతిని సృష్టించినవాడు ఒకడున్నాడనే నిర్ధారణకు వచ్చాము. మరలాంటప్పుడు సృష్టికర్తను ఎవరు సృష్టించారని ప్రశ్నిస్తే; సృష్టికర్తను సృష్టితంగా భావించినట్లే కదా! ఒకవేళ అదేగనక అయినట్లయితే, ఆయన్ని మిగిల్చి ఉంచితేనే సృష్టికర్త

మిగిలి ఉంటాడని, ఆయన్ని సజీవంగా ఉంచితేనే సృష్టికర్త జీవించి ఉంటాడన్న భావం వస్తుంది. అంటే – సృష్టితాలలోని సకల బలహీనతలు, దౌర్బల్యాలు సృష్టికర్తకు ఆపాదించబడుతున్నాయన్నమాట! మరలాంటప్పుడు ఆయన 'సృష్టికర్త' ఎలా అనిపించుకుంటాడు?

పుట్టడం, పుట్టించబడటం కూడా ఒక దౌర్బల్యమే.

మరణించటం కూడా ఒక దౌర్బల్యమే, ఒక దీనావస్థే.

పుట్టడం, మరణించటం అంటే జీవితం పరిమితం (Limited) అని భావం.

సృష్టికర్త ఎలా ఉంటాడు? ఆయన ఎవరి చేతా నిర్మించబడి ఉండడు. ఆయన ఎవరికీ పుట్టినవాడై ఉండడు. ఎవరినీ పోలినవాడై ఉండడు. ఆయన అద్వితీయుడై ఉంటాడు. ఆయనకు సాటి, సమ ఉజ్జీ ఎవడూ ఉండడు.

సృష్టికర్త అనేవాడు అన్ని రకాల బలహీనతలకు అతీతుడు, పవిత్రుడై ఉండాలి. సంకల్పం, కార్యం, జీవితానికి సంబంధించిన పరిమితులు (Limitations) ఆయనకు వర్తించరాదు.

వేరొకరు ఎవరో సృష్టికర్తను గనక సృష్టించి ఉంటే, మరి ఆయన ఎంతో బలహీనుడన్నమాట! ఆయన వేరొకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నాడు. ఆ పుట్టించినవాడు సృష్టికర్తను ఎంతకాలం బ్రతికి ఉండనిస్తాడో అంతకాలమే సృష్టికర్త బ్రతికి ఉంటాడు. ఇలా భావించటమంటే ఒక పెద్ద దౌర్బల్యాన్ని సృష్టికర్తకు అంటగట్టడమే. దీంతోపాటు సృష్టికర్త యొక్క మరో బలహీనత కూడా ముందుకు వస్తుంది – అదేమిటంటే సృష్టికర్తకు మరణం అనేది కూడా ఉన్నది! దాని మీదట సృష్టికర్త ఉనికిలోనికి తెచ్చిన జగతిగానీ, జగతిలోని జీవరాశులుగాని ఎలా మిగిలి ఉంటాయి? కనుక హేతువు (Logic) చెప్పేదేమిటంటే సృష్టికర్త అనేవాడు నిత్య సజీవుడై ఉండాలి. అంటే సృష్టికర్త అనంత కాలం (Infinite) నుండి ఉండి ఉండాలి. ఈ జగతి, జీవరాశుల కంటే ముందు నుండే ఆయన ఉనికి ఉండి ఉండాలి. ఉండబట్టే సృష్టికర్త (Creator) ఈ జగతిని నిర్మించాడు. జీవికను ప్రసాదించాడు. సృష్టికర్త ఎంతకాలం నుంచి ఉండి ఉంటాడు? ఊహామాత్రంగానయినా ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి మీ పుట్టుకకు పూర్వ స్థితి గురించి ఊహించండి! మీకొక జీవనం లభించక

ముందు ఎంతకాలం మీరు జీవనం పొందకుండా ఉన్నారో ఊహించండి! (Beyond Imagination) అలాగే సృష్టికర్త జీవన కాలం కూడా అనంతమైనది (Infinite). ఆయన ఎప్పటి నుండి ఉన్నాడో ఎవరికీ అంతుబట్టదు.

సృష్టికర్తను ఎవరో సృష్టించారనే మాట సృష్టికర్త జీవన వ్యవధిని పరిమితం చేసేస్తుంది. అంటే ఆయనకు పూర్వం ఎవరున్నారు? ఆయన తదనంతరం ఎవరుంటారు? అనే ప్రశ్నలకు తావు ఏర్పడుతుంది. అంటే ఇది ఒక విధంగా సృష్టికర్త సంతతిని ముందుకు నడిపించే విషయమే! అంటే సృష్టికర్త శూన్యం నుండి వచ్చి మళ్ళీ శూన్యమైపోయాడు (అంటే ఒకప్పుడు ఆయనంటూ ఉండేవాడు కాడు. కొంతకాలం తర్వాత ఉండబోడు అన్నమాట!)

బ్రహ్మాండమైన ఈ విశ్వ కర్మాగారాన్ని సమర్ధవంతంగా నడపటం ఆషామాషీ వ్యవహారం కాదు. రెప్పపాటు సమయం అలసత్వం వహించినా ఈ వ్యవస్థ అంతా సర్వనాశనమై పోతుంది. మరలాంటప్పుడు పరిమితులతో కూడిన శక్తి అధికారాలతో బ్రహ్మాండమైన ఈ జగతిని నడపటం ఎలా సాధ్యమవుతుంది?

సృష్టికర్తను పుట్టించినవాడు కూడా ఒకడు ఉండేమాటైతే 'సృష్టికర్త' కూడా సృష్టిరాశులలో చేరిపోతాడు. ఈ పరంపర ఏదో ఒక చోటికి పోయి ఆగిపోతుంది. మనందరి సృష్టికర్త ఒక్కడే. ఒక్కడై ఉండటమే కరెక్ట్ అనే బిందువు వద్దకు చేరి ఆగిపోవటంలోనే మనందరి ప్రశ్నలకు సమాధానం ఉంది. మన జీవిత లక్ష్యానికి ఈ సమాధానం చాలా అవసరం. మానవులమైన మనకు ప్రస్తుతం ప్రాప్తమై ఉన్న ప్రతిభా సామర్థ్యాలు మన సృష్టికర్తను తెలుసుకోవటానికి, మన పుట్టుక పరమార్థాన్ని గ్రహించటానికి సరిపోతాయి.

**ఇంటి ఉపమానం** ... ఈ ఉపమానం ద్వారా కూడా సృష్టికర్త ఉనికిని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

సృష్టికర్త ఉనికి ఎప్పటి నుంచి ఉంది? ఆయన ఉనికి ఎలా జరిగింది? – ఇది మానవుని ఊహకు అందనిది. అయితే క్రింది ఉపమానం ద్వారా దీనికి సంబంధించిన ఎంతో కొంత స్పృహ కలుగుతుంది.

ఆ ఉపమానం ఇది : ... ఒక వ్యక్తి ఒక కట్టడం నిర్మిస్తాడు. అందులో కొన్ని వస్తువులను, బొమ్మలను కూడా అమర్చుతాడు. తరువాత వాటిని టి.వి. కెమెరా, రిమోట్ సిస్టమ్ ద్వారా కంట్రోల్ చేస్తాడు.

ఆ బొమ్మలకు ఆలోచించే, అర్థం చేసుకునే శక్తి సామర్థ్యం కూడా కొద్దో గొప్పో ఇవ్వబడిందని కాస్సేపటికి అనుకోండి – ఇప్పుడు ఆ మట్టి బొమ్మలు ఆలోచించటం మొదలెడతాయి – అందమైన ఆ కట్టడం సమస్త హంగులతో దానంతట అదే తయారైందని భావిస్తాయి. ఒకానొక ప్రేలుడు మూలంగా ఈ కట్టడానికి ఒక షేప్ వచ్చిందని అనుకుంటాయి.

మరికొన్ని బొమ్మల ఆలోచనా సరళి మాత్రం తద్భిన్నంగా ఉంది – అందమైన ఈ కట్టడాన్ని, ఇందులోని బొమ్మలను నిర్మించినవాడు ఒకడున్నాడు. ఆయన ఎంతో విజ్ఞుడు, గొప్ప శక్తిమంతుడై ఉంటాడు. ఆయనలో మంచి నిర్వహణా సామర్థ్యంతో పాటు దయ, ప్రేమ, ఉదార గుణాలు కూడా మెండుగా ఉంటాయి. మనం ఆయన్ని చూడలేకపోతున్నాం గాని ఆయన ఉనికిని మాత్రం కాదనలేము. ఇంతకీ ఆయన ఎవరు? ఎప్పటి నుంచి ఉంటున్నాడు? ఆయన ఎప్పుడు ఈ కట్టడాన్ని నిర్మించాడు? ఎప్పటి వరకు దీనిని కూల్చకుండా ఉంచుతాడు? అనేది మాత్రం మాకు తెలీదు. కాని దీని నిర్మాత మాత్రం ఒకడున్నాడు. ఈ కట్టడం దానంతట అదే నిర్మితమయిందనేది అసంభవం. ఈ కట్టడాన్ని నిర్మించక ముందు నుండే ఆ నిర్మాత ఉన్నాడు అని నిర్ధారణకు వస్తాయి.

ఈ రకమయిన ఆలోచనా సరళిని కట్టడ నిర్మాత మెచ్చుకుంటాడు. పై రెండు ఆలోచనా వర్గాలలో ఒకటి తిరస్కార భావంతో కూడినదైతే, రెండవది స్వీకృత భావంతో కూడుకున్నది. ఈ రెండింటిలో ఏది మంచిది? ఏది సఫలీకృతమైనది? ఆ కట్టడ నిర్మాత ఏ వర్గానికి బహుమానం ఇస్తాడు?

ఈ రెండు రకాల ఆలోచనలను ముందుంచుకుని మనం స్వయంగా ఏం నిర్ణయం తీసుకుంటాము? ఎవరిని సరైనవారుగా, మరెవరిని పెడత్రోవ పట్టినవారుగా నిర్ధారిస్తాము. .... కట్టడం, బొమ్మలు వాటంతట అవే తయార య్యాయా? లేక వాటిని చేసినవాడు ఒకడున్నాడా? వారిలో మనం ఎవరిని విజేతలుగా నిర్ణయించి బహుమతి ప్రదానం చేయాలి?

ఈ ఉపమానాన్ని మనం ఈ జగతికి కూడా అన్వయింపజేసి ఆలోచించినప్పుడు వెలువడే ఫలితం ఏమిటి? ఈ జగతి ఒకానొక ప్రేలుడు వల్ల దానంతట అదే ఏర్పడినదా? లేక దానిని నిర్మించిన వాడొకడున్నాడా? మనం ఆ నిర్మాతను ప్రత్యక్షంగా చూడలేకపోవచ్చు. కాని సువిశాలమైన ఈ

విశ్వమండలం, దాని అందం, మనిషికి కావలసిన వాటన్నింటినీ అది సమకూర్చటం – ఇవన్నీ ఆ నిర్మాత (సృష్టికర్త) అపారశక్తిని చాటి చెప్పటమేగాక, ఆయన గొప్ప వివేచనాపరుడు, ప్రేమమయుడు, దయాకరుడు అన్న విషయాన్ని అది చెప్పకనే చెబుతోంది.

ఈ ఉపమానాన్ని దృష్టిలో పెట్టుకుని చింతన చేసినప్పుడు మరిన్ని వాస్తవాలు స్పష్టంగా ముందుకు వస్తాయి. ... ఒకప్పుడు ఈ జగతిగానీ, ఈ జీవరాశులుగానీ ఉండేవి కావు. కాని సృష్టికర్త అనేవాడు మాత్రం ఉండేవాడు. తరువాత ఆయన ఈ జగతిని, ఇందలి సమస్త వస్తువులను చేశాడు. మనిషిని నిర్మించాడు. అసంఖ్యాకమైన ప్రాణులను పుట్టించాడు. మరి ఆయన అన్ని రకాల వస్తువులను అంతమొందిస్తాడు. కాని ఆయన మాత్రం మిగిలి ఉంటాడు – అంటే వస్తువులను పుట్టించక ముందు కూడా ఆయన ఉన్నాడు. అంతమొందించిన తరువాత కూడా ఉంటాడు. ఆయనే ఆది. ఆయన ఆదిని అంచనా వేయటం ఎవరి తరమూ కాదు. అలాగే ఆయన జీవన వ్యవధి గురించి కూడా ఎవరూ ఊహించలేరు. ఆయన ఆది మధ్యాంతరహితుడు. ఈ విషయంలో మన ఆలోచనా శక్తి పరిమితమైనది. ఖచ్చితంగా మనం అంచనా (Definite Calculations) వేయలేము. ఉదాహరణకు : ఆకాశంలోని నక్షత్రాలు, తలలోని వెంట్రుకలను మనం ఖచ్చితంగా గణించలేము. ఎందుకంటే అవి అసంఖ్యాకమైనవి.

## (2) వాస్తవిక జీవితం – ప్రసాదిత జీవితం

పై చర్చవల్ల బోధపడినదేమిటంటే సిసలయిన జీవితం, తొట్ట తొలి జీవితం కేవలం సృష్టికర్తదే; మరెవరిదీ కాదు. మిగిలిన జీవితాలన్నీ సృష్టికర్త సృష్టించినవే. ప్రసాదించినవే. దానం చేసినవే. అవన్నీ ఆయన ఇష్టాయిష్టాలపై, దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నాయి. కనుక ఆయన ఇచ్ఛ, ఆజ్ఞ తప్ప మరేవీ లేవు. ఉన్నా అవి ఎలాంటి ప్రభావం చూపలేవు. ఆయన ఇచ్ఛ అన్ని రకాల ఇష్టాయిష్టాలపై ఆధిక్యత వహించి ఉంది.

సృష్టికర్త యొక్క ఈ అసలు సిసలు జీవితమే ఈ జగతిలో మనిషికి జీవన దానం చేసింది. అదే ఈ జగతికి కూడా ఉనికిని ప్రసాదించింది.

ప్రదానం (Gifted) చేయబడిన జీవితంలో ఆ వాస్తవిక (Original) జీవిత మూలాన్ని (Origin), దాని వ్యవధిని అర్థం చేసుకునేంత శక్తి సామర్థ్యం

ఉండదు. అయితే తనకు అస్థిత్వాన్ని ప్రసాదించిన వాడొకడున్నాడనీ, ఆయన దయాదాక్షిణ్యాలపైనే తాను ఒక నియమిత కాలం వరకు జీవించి ఉంటానన్న విషయాన్ని మాత్రం అతను ఊహించగలడు. ఆ మాత్రం సామర్థ్యం అతనికి ఉంది.

ఈ ప్రసాదిత జీవిత వ్యవధి ఎంత పరిమితమైనదో అంచనా వేయడానికి మనం సైన్సు (Science) ను చూద్దాం. సైన్సు ప్రకారం ఈ విశ్వమండలం (Universe) నిర్మితమై కొన్ని మిలియన్ల (Million) సంవత్సరాలయ్యాయి. ఈ మిలియన్ల సంవత్సరాలతో పోల్చుకున్నప్పుడు మన జీవన వ్యవధి (Period of Life) లెక్కలోనికే రాదు. ఈ విశ్వం యొక్క సుదీర్ఘ జీవన వ్యవధి మానవుని ఊహకు అందనిది. ఇది అతనిని ఆశ్చర్యచకితుణ్ణి చేస్తుంది. సృష్టికర్త జీవితం కూడా అంతే. అది మనిషి ఆలోచనా పరిధిలోనికి రానేరాదు. ఆయన ఎంత కాలంగా ఉన్నాడు? ఇంకా ఎంతకాలం ఉంటాడు? అనే విషయం అతన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. ఒకవేళ పోల్చుకుని చూస్తే అతని పరిమిత జీవితం కొన్ని సెకన్ల జీవితం లాగా తోస్తుంది. దాంతో అతనికి దిమ్మతిరిగినంత పనవుతుంది. ఫలితంగా అతను దీనిని తిరస్కరిస్తాడు. తన తిరస్కార వైఖరిపై పాతుకుపోతాడు. ఈ తిరస్కారం అతని నిస్సహాయ స్థితికి, అశక్తతకు సాక్షిగా ఉందిగాని అతని బుద్ధి కుశలతకు కాదు. ఆశ్చర్యకరమయిన ఈ విషయాల ముందు అతను తన పరిమిత సామర్థ్యాన్ని (Limited Capacity) ఒప్పుకుని, ఆత్మ సమర్పణ చేసుకునే బదులు అతను మంకుతనంతో వితండవాదనకు దిగుతాడు.

ఈ సందర్భంగా మనం విస్మరించరాని యదార్థం ఒకటుంది – అదేమిటంటే మానవుని చూచే శక్తికి ఒక హద్దు (Limit) ఉంది. వినికిడికి హద్దు ఉంది. అలాగే ఆలోచించే శక్తికి కూడా ఒక హద్దు ఉంది. ఈ యదార్థం గనక దృష్టిలో ఉంటే మానవుడు తన పరిమితులకు లోబడి ఉంటూ ఆ పరిధిలో తనకు ప్రాప్తమైన దానిని సంతోషంగా స్వీకరిస్తాడు. దాంతో సంతృప్తి చెందుతాడు. ఇంకా ఇంకా లభించలేదే! అని నిందించడు. మరింతగా లభించలేదన్న కారణంపై ప్రాప్తించిన దానిని కాలదన్నడు. పరిమితమైన తన శక్తి యుక్తులను తిరస్కార వైఖరికి సాకుగా చేయడు. ... ఎందుకంటే క్రియాత్మక జీవితంలో మనిషి తనకున్న ఈ పరిజ్ఞానంతోనే సరిపుచ్చుకుంటాడు. తన జీవిక కోసం అది చాలనుకుంటాడు. అంతకన్నా ఎక్కువ పరిజ్ఞానం ఒకవేళ

తనకుంటే మంచిదే. ఒకవేళ లేకుంటే దానికోసం తన విలువైన సమయాన్ని, శక్తిని ధారబోయడు. ఉదాహరణకు : తన రోగాన్ని నయం చేయడానికి మందు ఎలా వాడాలి, ఎంత మోతాదులో మాత్రలు తీసుకోవాలి, ఎన్నిసార్లు (Frequency) తీసుకోవాలి, ఎంతకాలం మందు వాడాలి, ఏ తీరు (Route) లో వాడాలి – లాంటి విషయాలపై వైద్యునితో వాదులాటకు దిగడు. ఈ మందు శరీరంలో ఏ భాగంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అని ప్రశ్నించడు. లేదా T.V. ఎలా తయారయింది? ఏ విధంగా అది ప్రసారమవుతుంది? లాంటి ప్రశ్నలు షోరూంలో వేయడు. దాని నాణ్యత గురించి అడుగుతాడు. దానిని ఎలా వేయాలి? ఎలా బంద్ చేయాలి? వంటి ప్రశ్నలు మాత్రమే వేస్తాడు. దానిని ఎలా ఆపరేట్ (Operate) చేయాలి? ఎలా అడ్జస్ట్ (Adjust) చేయాలి? ఏ పద్ధతిలో వాడితే దాని సౌండు, బొమ్మ సముచితమైన (Optimum) తీరులో ఉంటుంది? అని మాత్రమే అడుగుతాడు.

అలాగే మనిషి క్రియాత్మక జీవితంలో మనిషిని, జగతిని సృష్టించిన దెవరు? ఆయన ఎలా ఉంటాడు? అనే దానిని తెలుసుకోగోరుతాడు. అయితే ఆయన ఎక్కడి నుండి వచ్చాడు? ఎప్పటి నుండి ఉన్నాడు? ఆయన్ని చేసిన వారెవరు? అన్న ప్రశ్నలు అతనికి అనవసరం.

సృష్టికర్త ఉనికిని అంగీకరించినప్పుడే జీవితంలోని సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుంది .... అంటే మానవుడు, ఈ జగతి ఉనికి, వాటి లక్ష్యం, వాటి సంబంధం, వాటి ఆది, అంతం, సాఫల్యం వైఫల్యం, జీవిత పరమార్థం, దాని మార్గదర్శకత్వం లాంటి ఎన్నో సందేహాలకు సమాధానం లభిస్తుంది. ... దానిమీదట సృష్టికర్త మూలా (Origin) నికి సంబంధించి తెలుసుకోవటం వల్ల ఒరిగేది ఏమీ ఉండదు. దానిని కనుగొనేంత సామర్థ్యం (Capacity) మన బుద్ధిలో లేదు. లక్ష్యబద్ధమైన జీవితం గడపటానికి అది ఏమంత అవసరం కూడా కాదు. అవసరం లేని దాని వెనుక పడటమంటే విలువైన సమయాన్ని, శక్తియుక్తులను వృథా చేసుకోవటమే.

## (3) క్రియాత్మక జీవితానికి అవసరమైన విజ్ఞానంతో సంతృప్తి చెందటం

మనం లక్ష్యబద్ధమయిన జీవితం గడపటానికి – అంటే మనిషి తన

ఉనికికి న్యాయం చేకూర్చుకోవడానికి – మనం తెలుసుకోవలసిందల్లా యిదే – మనల్ని పుట్టించినవాడెవడు? ఆయన గుణాలు, ప్రత్యేకతలేమిటి? ఇంతకీ ఆయన మనల్ని ఎందుకు పుట్టించాడు? మన జీవిత లక్ష్యం ఏమై ఉండాలని సృష్టికర్త చెబుతున్నాడు? దానిని నెరవేర్చటమెలా? మరణానంతరం ఏమవు తుంది? సాటి మనుషులతో మన సంబంధ బాంధవ్యాలు సజావుగా ఉండా లంటే మనం ఏం చేయాలి? మనకు ఏ వస్తువు లాభదాయకం? మరేది హానికరం? లాంటి వాటిని మనం తెలుసుకుని, వాటికి క్రియారూపం ఇస్తే చాలు. దీంతో మన దైనందిన జీవితంలో విప్లవాత్మక మయిన మార్పు వస్తుంది.

ఇక రెండవ రకమయిన ప్రశ్నలు – అంటే సృష్టికర్త ఎక్కడి నుంచి వచ్చాడు? ఆయన్ని ఎవరు చేశారు? ఎప్పటి నుంచి ఉన్నాడు? ఎప్పటి వరకు ఉంటాడు? మొదలగునవి. యదార్థ జీవితంతో, ఆచరణాత్మక జీవితంతో వీటికి గల ప్రత్యేక సంబంధం ఏమీ లేదు. ఇవి మానవ జీవితంపై చూపే ప్రభావం కూడా ఉండదు. కనుక వీటికి గల స్థాయి, విలువ కూడా ఏమీ లేదు. ఇలాంటి ప్రశ్నలు జీవిత లక్ష్యాన్ని నెరవేర్చటంలో గానీ, జీవితానికి మార్గదర్శకత్వం వహించడంలో గానీ దోహదకారి కాలేవు. అంటే మనకు వాటి అవసరం లేదన్నమాట. అందుచేత ఆ ప్రశ్నలకు సమాధానం కూడా ఈ లోకంలో లేదు. అవసరం లేని వాటి వెనుక పడటం, లేనివాటి గురించి వెంపర్లాడటం అవివేకం.

మనం ఒక వస్తువును కొనడానికి మార్కెట్‌కి వెళతాం. ఉదాహరణకు – ఒక కంప్యూటర్. దానిని కొనుగోలు చేస్తున్నప్పుడు, ఆ కంప్యూటర్‌ని నిర్మించిన వ్యక్తికి తెలివితేటలు ఎక్కడి నుండి వచ్చాయి? ఎవరిచ్చారు? అని మనం షాపువానిని ప్రశ్నించం. మహాఅయితే ఆ కంప్యూటర్‌ను నిర్మించిన కంపెనీ పేరు అడుగుతాం. దాని సామర్థ్యం గురించి అడుగుతాము. సృష్టికర్త వ్యవహారంలో కూడా మనం ఈ వైఖరిని ఎందుకు అవలంబించటం లేదు? ఈ జగతిని నిర్మించిన వానిని ఎవరు పుట్టించారని ఎందుకు ప్రశ్నిస్తున్నాము? ఈ జగతిని, మనల్ని ఎవరు పుట్టించారు? ఆయన పేరేమిటి? ఆయన ప్రత్యేకతలేమిటి? గుణగణాలేమిటి? అని మాత్రమే ప్రశ్నించాల్సింది.

**మూడవ అధ్యాయం :**

# సృష్టికర్తకీ - మనిషికి మధ్య పరస్పర సంబంధం ఎలా ఉండాలి? ... ఒక చూపులో!

## ఆరంభ చర్చ

సాధారణ సంభాషణ

**(1)** సృష్టికర్తకు మానవ వ్యవహారాల పట్ల ఆసక్తి ఉండాలి.

**(2)** దైవిక సూచనలు, మార్గదర్శకత్వం అవసరాన్ని సృష్టికర్త తీర్చాలి.

**(3)** మానవుని ప్రాథమిక జీవితావసరాలను సృష్టికర్త సర్వోత్తమ రీతిలో తీర్చాలి.

**(4)** ఆదం సంతతి ముఖ్యావసరాల పట్ల సృష్టికర్త ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

**(5)** సృష్టికర్త తన దాసులలోని సద్గుణాలను ఇష్టపడాలి. దుర్గుణాల నుండి వారించాలి.

**(6)** సృష్టికర్తను అంగీకరించిన మీదట క్రియాత్మక జీవితం కొరకు ఆయనకు సంబంధించిన నిజ భావనను కూడా కలిగి ఉండటం అవసరం.

**(7)** సృష్టికర్తను అంగీకరించిన మీదట క్రియాత్మక జీవితం కొరకు ఆయనకు సంబంధించిన నిజ భావన అవసరం (రెండవ కోణం).

**(8)** దైనందిన జీవితంలో మనతో సృష్టికర్త సంబంధం ఎలా ఉండాలి?

**(9)** సృష్టికర్త మనిషికి అత్యంత సమీపంలో ఉండాలి.

**(10)** సృష్టికర్త తన దాసునికి అత్యంత చేరువలో ఉండాలి.

**(11)** సృష్టికర్త తన దాసుని ప్రార్థనను ఆమోదించాలి.

**(12)** సృష్టికర్త కారుణ్యం.

**(13)** పశ్చాత్తాపం.

**(14)** మనం ఎవరిని ఆశ్రయించాలో సృష్టికర్త తెలుపాలి.

**(15)** పరస్పరం ప్రేమించటం గురించి, ఒక సంగఠిత సమాజ రూపకల్పన గురించి సృష్టికర్త తన దాసులకు ఉపదేశించాలి.

**(16)** బలహీనులైన మనుషులకు సాయపడటంలోనే తన ప్రసన్నత దాగి ఉందని సృష్టికర్త చెప్పాలి. ఆ విధంగా బలహీనుల మంచీ చెబ్బరలను చూసే ఏర్పాటు జరగాలి.

**(17)** మానవుల పరస్పర సహాయ సహకారాలను సృష్టికర్త తన ప్రసన్నతతో ముడిపెట్టి ఒక సత్సమాజాన్ని రూపొందించాలి.

**(18)** హక్కులను నెరవేర్చడాన్ని సృష్టికర్త తన సంతోషంతో, ప్రతిఫలంతో పెనవేసి సమాజాన్ని శక్తిమంతం చేయాలి.

**(19)** పటిష్టమయిన కుటుంబ వ్యవస్థ.

**(20)** నిర్ణయాత్మకమయిన వాక్కు.

**(21)** జీవనోపాధిని స్వయంగా సముపార్జించటం గురించి నొక్కి వక్కాణించి, తన దాసుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలి. తద్వారా వారిపై దయజూపాలి.

**(22)** తన ప్రబోధనల ద్వారా ఉపాధి సముపార్జనను సులభతరం గావించాలి.

**(23)** ఉపాధి సముపార్జనలో అవరోధాలు కల్పించేవారిని శిక్షించాలి.

**(24)** సృష్టికర్త సంస్మరణ.

**(25)** శిక్షించే, క్షమించే అధికారం సృష్టికర్తకే ఉండాలి.

**(26)** సృష్టికర్త అనేవాడు (దాసుల సేవలకు) విలువ ఇచ్చేవాడు, ఆదరించేవాడై ఉండాలి.

**(27)** సంకల్పం, ఆచరణ.

**(28)** సృష్టికర్త వరప్రసాదాలకు హద్దు, పరిమితి ఉండకూడదు.

**(29)** సృష్టికర్త చేసే ఏ పని కూడా అర్ధరహితమై ఉండకూడదు.

**(30)** సృష్టికర్త తన దాసులను అకారణంగా ఎందుకు బాధిస్తాడు?

**(31)** మనుషుల మధ్య విచక్షణ పాటించటం సృష్టికర్తకు శోభాయమానమా?

**మూడవ అధ్యాయం :**

**మొదటి భాగం**

# సృష్టికర్త - మానవుని మధ్య సంబంధం ఎలా ఉండాలి? ... ఒక చూపులో!

**ఆరంభ చర్చ**

సృష్టికర్తకి - మానవునికి మధ్య పరస్పర సంబంధం ఎలాంటిదై ఉండాలి? దీని గురించి మానవ నైజం వాంఛించేదేమిటో ఆలోచిద్దాం.

**ఒక సాధారణ చర్చ**

సృష్టికర్త అనేవాడు ఉన్నాడు. ఆయన అద్వితీయుడు అని అంగీకరించిన పిదప, ఆయనకు - మనకు మధ్య సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

సృష్టికర్త అనేవాడు 'ఒకడున్నాడు' అని కేవలం ఒప్పుకుంటే సరిపోతుందా? లేక మన మనుగడ కోసం ఆయనకి - మనకి మధ్య అవినాభావ సంబంధం ఉండి తీరాలా?

సృష్టికర్త ఈ జగతిని, మనిషిని సృష్టించాడు. ఈ యదార్థంపై వెనుకటి పుటల్లో చర్చించుకున్నాం. ఈ చర్చ వల్ల బోధపడినదేమిటంటే సృష్టికర్తకి - మానవునికి మధ్య గల సంబంధం సృష్టికర్తకి - సృష్టికి మధ్య గల సంబంధం వంటిది. ... ఇది జన్మతః సంబంధమూ, శాశ్వతమయిన సంబంధం కూడాను.

కాబట్టి సృష్టికర్తకు తాను సృష్టించిన వస్తువుపై సహజంగానే ...

- ప్రేమ ఉంటుంది.
- దానిపై అతని కారుణ్యం కురుస్తుంది.
- దాని జీవిక కోసం అతను ఉపాధిని సమకూరుస్తాడు. ప్రాథమిక జీవనావసరాలను ఏర్పాటు చేస్తాడు.

- ❖ దాని జీవనానికి మార్గదర్శకత్వం వహిస్తాడు.
- ❖ సృష్టికర్త ప్రేమానురాగాలు, దయాదాక్షిణ్యాలు కాంక్షించేదేమిటంటే, మానవుడు తన తప్పిదాలపై క్షమాపణ కోరినప్పుడు అతనిని క్షమించాలి.

ఇకపోతే సృష్టించబడినవాడు చేయాల్సిందేమిటి? అతను తన సృష్టికర్తకు సహజంగానే ...

- ❖ కృతజ్ఞతలు తెలుపాలి – అంటే మానవుడు తన సృష్టికర్త దాస్యం చేయాలి.
- ❖ విధేయుడై ఉండాలి – ఆయన సేవకునిగా జీవించాలి.
- ❖ ఆయన్ని ఆరాధించాలి – అంతేకాదు, ఎల్లకాలం 'దాసుడు' గానే ఉండాలి.
- ❖ ఆయన్ని సంతోషపెట్టడానికి, ఆయన ప్రసన్నతను చూరగొనడానికి కృషి చేయాలి.
- ❖ ఆయన ఆగ్రహానికి భయపడాలి.

వారిద్దరి మధ్య గల మరిన్ని సంబంధాలను తెలుసుకోవడానికి సృష్టికర్త గుణగణాలను, స్వభావాన్ని, ఇష్టాయిష్టాలను గురించి కూడా తెలుసుకుని వాటి ప్రకారం మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. ఈ మూడు విషయాలపై మేము యోచన చేస్తూ, రానున్న పంక్తులలో – దైనందిన జీవితాన్ని దృష్టియందుంచు కుని, సృష్టికర్త గుణగణాలు, స్వభావం, ఇచ్ఛ ఏమై ఉంటుందో నిశిత దృష్టితో తరచి చూద్దాం. ఈ మూడు విషయాలు సృష్టికర్త నుండి కోరేదేమిటో, తన దాసుల యెడల ఆయన వ్యవహారం ఎలా ఉండాలో కూడా చూద్దాం – మరి ఈ మూడు విషయాల పరిజ్ఞానం దృష్ట్యానే (మానవులమైన) మనం సృష్టికర్త యెడల ఎలా ఉండాలో, ఎలా అణకువను ప్రదర్శించాలో కూడా పరిశీలిద్దాం. రండి ... చింతన, పరిశీలనల ద్వారా యదార్థాన్ని కనుగొనేందుకు ప్రయత్నిద్దాం – సృష్టికర్త గుణాలను, స్వభావాన్ని, ఇచ్ఛను తెలుసుకునేందుకు కృషి చేద్దాం – మరోమాటలో (చెప్పాలంటే) సృష్టికర్తను గురించి తెలుసుకుందాం.

## 1. సృష్టికర్తకు మానవ వ్యవహారాల పట్ల ఆసక్తి ఉండాలి

మానవుని దైనందిన జీవిత సమస్యలతో, వ్యవహారాలతో సృష్టికర్త సంబంధం త్రెంచుకోరాదు. అశ్రద్ధ వహించరాదు. సంబంధం త్రెంచుకున్నాడంటే అర్థం ఆయన లక్ష్యరహితంగా పనిచేస్తున్నట్లే. మానవుడు లాంటి చైతన్యవంతుణ్ణి

సృష్టించి అతన్ని దిక్కులేనివాడి (Un-attended) గా, మార్గం కానని (Unguided) వాడుగా వదిలేశాడన్నమాట! ఇలాంటి వ్యర్థమయిన పనేదీ పరిపూర్ణ (Perfect) అస్థిత్వం కలవాని ద్వారా ఎన్నటికీ జరగదు.

జగతినీ, జగతిలోని జీవరాశులను నిలిపి ఉంచడానికి గాను అనుక్షణం సృష్టికర్త అప్రమత్తుడై ఉండాలి. వాటి జీవికకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ ఉండాలి. అప్పుడే – మానవ జీవితానికి కావలసిన వాటినన్నింటినీ సృష్టికర్త సమకూరుస్తున్నాడన్న మన నమ్మకానికి సార్థకత చేకూరుతుంది.

నన్ను సృష్టించినవాడు నా జీవితం పట్ల శ్రద్ధాసక్తులు కనబరచాలి. నా సృష్టికర్తకు నా మార్గదర్శనం పట్ల ఆసక్తి లేకపోతే, నా సమస్యల పట్ల శ్రద్ధ లేకపోతే, నా బాగోగుల పట్ల శ్రద్ధ లేకపోతే, మరి నేను ఆయనను సేవించి ప్రయోజనం ఏమిటి? పుట్టించాడు. అందుకు కృతజ్ఞతలు ... కాని ఆయన నా జీవితం విషయంలో పట్టించుకోకపోతే, నా బ్రతుకు దుర్భరం అవుతుంది. అర్థరహితమైపోతుంది. సృష్టికర్త తరఫున వ్యవహారం అసంపూర్ణంగా మిగిలిపోతుంది – అంటే ఆయన పుట్టించి నన్ను నా మానాన వదలిపెట్టేశాడు. ఇలా జరగరాదు. జరగదు కూడా.

నా జీవితావసరాలన్నీ ఆయన హస్తగతపై ఉన్నాయి. నా 'మార్గదర్శకత్వం' కూడా అత్యంత ముఖ్యావసరం. అంటే నా పుట్టుక, జీవనానికి సంబంధించిన విషయాలు నాకు తెలియాలి .... జీవిత లక్ష్యం ఏమిటి? లాభనష్టాలు దేనిలో ఉన్నాయి? ఏది తప్పు? ఏది ఒప్పు? ఇతరులతో నా సంబంధాలెలా ఉండాలి? లాంటి విషయాలకు సంబంధించిన వివరాలు నా జీవితానికి ఎంతో అవసరం. వాటిని సమకూర్చటం సృష్టికర్త బాధ్యత. ఎందుకంటే ఆయనకు ప్రతిదీ తెలుసు. సృష్టికర్త అయినవాడు ఈ అవసరాలన్నింటినీ అత్యుత్తమ రీతిలో తీర్చాలి. నా జీవితం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి, నా మనసు కుదుటపడటానికి ఇదెంతో అవసరం.

తాను సృష్టించిన వారిని ప్రేమించేవాడు, మానవ జీవనావసరాలను తీర్చేవాడు, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ కలవాడు, దారి చూపేవాడు మాత్రమే సిసలైన సృష్టికర్త. ఒకవేళ అతను ఇవన్నీ చేయలేకపోతే నిజమైన సృష్టికర్త కానేకాడు. ఆరాధ్య దైవం అయ్యే అర్హత కూడా అతనికి లేదు. అలాంటి వానిని నమ్మి నడుచుకోవటం వల్ల ప్రయోజనం ఏమీ లేదు.

## (2) మార్గదర్శనావశ్యకతను సృష్టికర్త నెరవేర్చాలి

మంచి విషయంలో, మంచి ప్రబోధనల విషయంలో, జీవితానికి సంబంధించిన అసలైన నియమాలలో, జీవితం విషయంలో, మరణం విషయంలో, మరణానంతరం సంభవించబోయే వాస్తవాల విషయంలో గనక సృష్టికర్త మార్గదర్శకత్వం (Guide) వహించకపోతే మనుషులు ప్రాపంచిక ప్రయోజనాల వెనుకబడి పరస్పరం రక్తపాతం సృష్టించి సర్వనాశనమైపోతారు. కాబట్టి సృష్టికర్త తన తరఫు నుంచి మార్గదర్శకత్వ (Guidance) ఏర్పాటు చేయాలి.

సమాజాన్ని నైతికంగా పవిత్రంగా, పరిశుభ్రంగా ఉంచడానికి, పరస్పర నమ్మకాల వాతావరణాన్ని నెలకొల్పడానికి మనిషికి ఖచ్చితమైన సూచనలు ఇవ్వాలి.

సృష్టికర్త, తాను మెచ్చే సుగుణాలను తెలియపరచాలి.

జీవితంలో సౌందర్యాన్ని, సమతూకాన్ని తీసుకురావటానికి అవసర మయిన ఉపదేశాలు చేయాలి.

నైతికతను గురించి, దాతృత్వం గురించి నొక్కి వక్కాణించాలి. తన శిక్షా బహుమానాల వాగ్దానం ఆధారంగా, దాతృ స్వభావం, నైతిక నడవడి ఆధారంగా పేదలను ప్రేమించటం, వారి అవసరాలను తీర్చటం నేర్పాలి.

సృష్టికర్త, తాను ప్రసాదించే మంచి ప్రతిఫల వాగ్దానం ఆధారంగా మానవ శ్రేయోసాఫల్యాలకు సంబంధించిన పనులు చేసేందుకు ప్రేరేపించాలి. ప్రతి ఒక్కరినీ ప్రేమించటం, వారిపై దయచూపటం అవసరమని చెప్పాలి.

సృష్టికర్త అనేవాడు మనిషికి మార్గం చూపాలి. ఆయనే మనిషికి మార్గదర్శనం చేయగలడు. ఎందుకంటే ఆయన సృష్టించినవాడు. మనిషి గురించి అతను బాగా ఎరిగినవాడు. అతని స్వభావం గురించి బాగా తెలిసినవాడు. మనిషి బాగోగులు దేనిలో ఉన్నాయో ఆయనకు తెలుసు. ఎందుకంటే ప్రతి విషయాన్ని ఆయన ఎరిగినవాడు. మనిషి లాభం ఎందులో ఉందో, నష్టం ఎందులో ఉందో ఆయనకు తెలుసు. మనుషుల మధ్య పరస్పర సంబంధాలు ఎలా ఉండాలో, పరస్పర వ్యవహారం (Dealing) ఎలా ఉండాలో ఆయనకు తెలుసు.

మనిషికి తన స్వయం గురించి పూర్తిగా తెలీదు. అందుచేత అతను తనకు తానుగా మార్గదర్శకత్వం వహించుకోలేడు. ఇతరులకూ మార్గం

చూపలేడు. కేవలం ప్రయోగాలు చేస్తూ ఉంటాడు. నష్టాలు చవిచూస్తూ ఉంటాడు. ఈలోగా అతని జీవన గడువు ముగిసిపోతుంది.

నిశ్చయంగా సృష్టికర్త అన్యాయాన్ని, అక్రమాన్ని ఇష్టపడడు. ఆయన తన దాసుల మధ్యన కూడా దౌర్జన్యం, జులుం జరగడాన్ని సహించడు. ఆయన న్యాయాన్ని, ధర్మాన్ని మాత్రమే ఇష్టపడతాడు.

### (3) సృష్టికర్త అనేవాడు మానవుని జీవనావసరాలను అత్యుత్తమ రీతిలో తీర్చాలి :

సృష్టికర్తకు తాను సృష్టించిన వస్తువుపై సహజంగానే ప్రేమ ఉంటుంది. ఉండాలి. ముఖ్యంగా మానవుని బాగోగుల గురించి ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉండాలి. మనుషుల జీవితాలు సజావుగా గడవటానికి ఈ శ్రద్ధ (Concern) అవసరం. ఇందు నిమిత్తం అత్యుత్తమ ఉపదేశాలు చేయాలి. శాసనాలు ప్రదానం చేయాలి. వాటి ప్రకారం ఆచరించి మానవులు పరస్పరం ప్రేమైక భావాలతో మసలుకోగలగాలి. ప్రశాంతంగా జీవితం గడపాలి. సృష్టికర్త ప్రసాదించే శాసనాలు కేవలం మెచ్చుకునే విధంగానే ఉండకూడదు. పైగా అవి ఆచరణీయంగా, అనుసరణీయంగా ఉండాలి. వాటిలో స్వయం విధిత శక్తి (Self - Implementing Force) కూడా ఉండాలి. అందుకే ఆయన తన చట్టాలను, ఉపదేశాలను తన ప్రసన్నతతో, బహుమానంతో ముడివేయాలి. వాటికి కట్టుబడిన వారికి ఆయన బహుమానం ఇవ్వాలి. వాటికి కట్టుబడని వారిని, వాటి ద్వారా అధర్మంగా లబ్ధిపొందే (Exploit) వారి పట్ల ఆయన అప్రసన్నుడవ్వాలి. వారిని శిక్షించాలి. ఈ శిక్ష బహుమానాలు, ఆగ్రహానుగ్రహాలే సృష్టికర్త యొక్క అత్యుత్తమ ఉపదేశాల అమలుకు ప్రేరణగా నిలుస్తాయి. తత్ఫలితంగా వ్యక్తి జీవితం సాఫీగా నడుస్తుంది. ఉత్తమ సమాజం రూపొందుతుంది. మానవుడు ప్రశాంతంగా జీవిస్తాడు. ప్రేమామృతాన్ని ఆస్వాదిస్తాడు – ఇదీ తన దాసుల యెడల సృష్టికర్తకు గల ప్రేమ, దయ. సృష్టికర్త అనేవాడు ఇలాగే ఉండాలి.

ఘనాఘనుడైన సృష్టికర్త తన సృష్టితాలను ఉన్నత దృష్టితో చూడాలి. ముఖ్యంగా ఆయన మనిషిని ప్రత్యేకంగా గమనించాలి. మానవులందరి కోసం ఒకే విధమైన మార్గదర్శక సూత్రాలు ప్రసాదించాలి. అత్యుత్తమ ఉపదేశాలు ఇవ్వాలి. మనుషుల మధ్య ఎలాంటి భేదభావం కనబరచకూడదు. నిశ్చయంగా

మానవులంతా ఆయనచే పుట్టించబడినవారే. కాబట్టి ఆయన అందరినీ ప్రేమించాలి. అందరి పట్ల సమభావం కలిగి ఉండాలి. ఏ విధంగానయితే ఆయన మనుషులందరికీ ఎలాంటి విచక్షణ చూపకుండా గాలి, నీరు, ఆహారం ప్రసాదిస్తున్నాడో అదేవిధంగా అందరి కొరకు మార్గదర్శక సూత్రాలు ప్రసాదించాలి. సరైన మార్గదర్శకత్వం కూడా మానవుని ప్రాథమిక జీవితావసరాల లోనిదే.

## (4) సృష్టికర్తే ఆదం సంతతి ముఖ్యావసరాలు తీర్చాలి

సత్యాసత్యాల, మంచీ చెడుల మధ్య గల వ్యత్యాసం మనిషికి చాలా స్పష్టం (Clearly) గా తెలిసివస్తే అతను సత్యంపై స్థిరంగా ఉంటూ జీవితం గడుపుతాడు. ఈ సత్యాసత్యాలను, నిజానిజాలను నిర్ధారించే బాధ్యతను మనిషిపైనే మోపితే అతను తన ప్రయత్నంలో సఫలీకృతుడు కాలేకపోవచ్చు. అతని జీవితమంతా ప్రయోగాలలోనే కరిగిపోవచ్చు. ఏమీ తెలియని ఒక మనిషిని కూడలి ప్రదేశంలో నిలబెట్టి, నీవు నీ గమ్యం చేరుకో, సుఖపడతావు అనటం వంటిదే యిదీను. కాని ఏ దిశలో పోతే గమ్యం చేరుకుంటాడో చెప్పకపోతే ఎలా? ఈ వ్యవహారం అతని ఇంగిత జ్ఞానానికే వదలిపెడితే, అతను పెడదారి పడతాడు. ఆ దారి చివరి అంచుకు (Dead End) చేరిన మీదట అతను వెనుతిరగవలసి ఉంటుంది. ప్రతి దారిలోనూ అతను మోసపోయే ప్రమాదముంది. అయితే – నీవు ఈ మార్గం గుండా వెళితే నీవు తప్పక గమ్యం చేరుకుంటావు అని చెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ మార్గదర్శకత్వం (Guidance), మార్గదర్శనం యొక్క వాస్తవికత (Certainity of Guidance) పై నమ్మకమే మనిషికి ప్రశాంతత నిస్తుంది. దాంతోనే అతని మనసు కుదుటపడుతుంది. అతని మానసిక ఉద్రిక్తత (Tension) దూరమవుతుంది. అతనికి చూపబడిన మార్గంపై అతను హాయిగా సాగిపోతాడు, గమ్యం చేరుకుంటాడు. అలాగే మనిషి ధర్మాధర్మాలు, సత్యాసత్యాలు కూడా మనిషికి విడమరచి చెప్పాలి. స్వర్గానికి గొనిపోయే రాచబాట ఏదో కూడా తెలియ పరచాలి. అప్పుడే అతను ఆ బాటపై శీఘ్రంగా నడచిపోతాడు. దీనినిబట్టి ఈ మార్గదర్శకత్వం (Guidance), సత్యాసత్యాల విచక్షణా (Discrimination) జ్ఞానం ఎంత అవసరమో విదితమవుతోంది. దీనిమూలంగా మనిషి టెన్షన్ ఫ్రీ (Tension Free) అయిపోతాడు. కాబట్టి ఇది మనిషికి ముఖ్యావసరం, సత్వర అవసరం

కూడా. దాసుల యెడల సృష్టికర్తకు గల ప్రేమ కాంక్షించేది కూడా యిదే. ఆయన తొలి మానవుని నుంచే ఈ అవసరాన్ని తీర్చి ఉంటాడు. అంటే అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాలలోనూ మనిషికి మార్గదర్శకత్వం లభించి ఉంటుంది. అంధకారంలో తచ్చాడుతూ ఉండేలా అతన్ని అతని మానాన వదలిపెట్టడం అనేది జరిగి ఉండదు. సృష్టికర్తకు తన సృష్టితాలపై గల ప్రేమ అలా జరగనివ్వదు. ఆయనలోని దయాగుణం దీనికి సమ్మతించదు. ఆయన మనిషికి సత్యాసత్యాల గీటురాయిని ప్రసాదించి జీవితం గడిపే సరైన పద్ధతిని చూపి ఉండాలి.

### (5) సృష్టికర్త తన దాసులలోని సద్గుణాలను ఇష్టపడాలి, దుర్గుణాల నుండి వారించాలి :

న్యాయం, ఉపకారం, బంధుత్వ సంబంధాలను కలపటం లాంటి సుగుణాలు మనుషుల మధ్య సత్సంబంధాలకు దోహదపడతాయి. ఇవి ఒక పటిష్టమైన కుటుంబ వ్యవస్థకు, మంచి సమాజ నిర్మాణానికి ప్రాతిపదిక అవుతాయి. ఈ గుణాలను తమలో పెంపొందించుకున్న వారికి బహుమానం ఇస్తానని వాగ్దానం చేయాలి. చెడు నుండి, నీతిబాహ్యత నుండి, దౌర్జన్యం, పాపం నుండి ఆయన వారించాలి. ఎందుకంటే ఇవి మనిషిని సర్వనాశనం చేసివేస్తాయి. కుటుంబాన్ని, సమాజాన్ని అల్లకల్లోలం చేసేస్తాయి. కాబట్టి ఈ చెడు చేష్టలకు ఒడిగట్టే వారిని కఠినంగా శిక్షిస్తానని హెచ్చరించాలి.

### (6) సృష్టికర్తను నమ్మిన మీదట క్రియాత్మక జీవితం కొరకు దాని సరైన భావన అవసరం

సృష్టికర్తను నమ్మినపుడు కేవలం 'సృష్టి'కి సంబంధించినంత వరకు నమ్మితే సరిపోదు. ఆయన సృష్టించాడంతే, అంతకు మించి ఆయనతో లావాదేవీలేమీ లేవు. పుట్టించి వదలిపెట్టేశాడు, ఇప్పుడు దాసులతో ఆయనకు ఎట్టి సంబంధం (Concern) లేదు. ఈ విధమైన దృక్పథానికి – సృష్టికర్తను తిరస్కరించే దృక్పథానికి మధ్య పెద్దగా తేడా ఏమీ లేదు. సృష్టికర్తను తిరస్కరించటం బుద్ధికి తలవంపు అయినట్లే, సృష్టికర్తను ఒక వైపు నమ్ముతూనే మరోవైపున ఆయనలో లోపాలున్నాయని తలపోయటం కూడా బుద్ధికి అవమానకరమే. ఈ జగతి నిర్వహణతో, మానవుల మార్గబోధనతో సృష్టికర్తకు ఎలాంటి సంబంధం లేదని భావించటానికి బుద్ధి అంగీకరించదు. ఈ రకంగా సృష్టికర్తను విశ్వసించటం

అంటే ఒక విధంగా సృష్టికర్తను కూడా అవమానించటమే. సృష్టికర్తలో ఏదో లోపముందని భావిస్తూ మనిషి ఆయనపై నమ్మకం ఉంచాడంటే మనిషి విచార ధారలోనూ, అతని ఆచరణలోనూ బలహీనత చోటు చేసుకుంటుంది. తత్ఫలితంగా సృష్టికర్తతో అతని సంబంధం కూడా పేలవంగా ఉంటుంది. అతని ఆలోచనల్లోనూ, భావాలు భావనల్లోనూ వైకల్యం పొడసూపుతుంది. నన్ను పుట్టించిన వానిలోనే లోపాలున్నప్పుడు, ఆయనే పవిత్రుడు కానప్పుడు నేను మాత్రం దోషరహితంగా ఎలా ఉండగలను? అనే నిర్లక్ష్య భావన అతనిలో తొంగిచూస్తుంది. అందుకే సృష్టికర్త తన దాసునికి అనునిత్యం తనతో ఎలా వ్యవహరించాలో, ఎటువంటి సంబంధం ఏర్పరచుకుని ఉండాలో ఎరుక పరచాలి. ఎరుకపరిచే ఏర్పాటు చేయాలి. అనుక్షణం సృష్టికర్త అతని వెంట ఉన్నాడని, అతన్ని చూస్తూ ఉన్నాడని, వింటూ ఉన్నాడని, ప్రేమిస్తూ ఉన్నాడని, మార్గబోధన చేస్తూ ఉన్నాడని, తోడ్పాటునందిస్తూ ఉన్నాడని, ప్రసన్నుడవటంతో పాటు అప్రసన్నుడవుతున్నాడని, ఆగ్రహం చెందటంతో పాటు క్షమాభిక్ష కూడా పెడుతున్నాడని దాసునికి అవగతపరచాలి.

### (7) సృష్టికర్తను విశ్వసించిన తరువాత క్రియాత్మక జీవితం కొరకు సరైన దృక్పథం అవసరం (రెండవ కోణం) :

సృష్టికర్త పరిచయం ఎలా జరగాలి? ఆయన గుణగణాలన్నింటితో సహా జరగాలి. ఆయన న్యాయశీలమైన, ఉదాత్తమైన ఉపదేశాలతో, శాసనాలతో సహా జరగాలి. ఆయన చేసిన వాగ్దానాలతో, ఆయనలోని గొప్పతనంతో సహా జరగాలి. మానవుని దైనందిన జీవితానికి వీటితో విడదీయరాని సంబంధం ఉంది. ఇది లేకుండా గడిచే జీవితం నిరర్థకం. అలాంటి జీవితం వ్యక్తిగతం గానూ, సామాజికంగానూ సంఘర్షణకు, ప్రమాదానికి గురవుతుంది. మనిషి చింతాగ్రస్తుడవుతాడు. మానసిక ఉద్రిక్తత (Tension) కి లోనవుతాడు. నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయి ఆత్మహత్యకు పూనుకుంటాడు. అంతేకాదు, సామాజిక జీవితం (Social Life) లో పరస్పర సంబంధాలు దెబ్బతింటాయి. నిందలు నిష్ఠూరాలు పెరిగిపోతాయి. గొడవలు మొదలై హత్యల వరకూ వెళతాయి.

ఒకవేళ పైన పేర్కొనబడిన అతని అవసరం తీరితే – అంటే సృష్టికర్త సమగ్ర పరిచయం జరిగినట్లయితే – అది మానవ జీవితంలో ఊపిరిపోస్తుంది. అతను సమధికోత్సాహంతో, ఆశావహ దృక్పథంతో అపార శక్తిమంతుడైన

వానిపై భారం మోపి, ఆయన దయాదాక్షిణ్యాలపై, ప్రేమపై నమ్మకముంచి నిక్షేపంగా తన జీవన యాత్రలో మునిగిపోతాడు. ఎలాంటి వ్యాకులతను దరి చేరనీయకుండా తన కార్యసాధనలో లీనమై పోతాడు. సృష్టికర్తపై అతనికి గల దృఢ విశ్వాసం అతని జీవితంలో నిత్యం సకారాత్మక ఫలితాన్ని (Positive Result) ఇస్తూ ఉంటుంది. దాంతో అతనికి మరింత ప్రేరణ, ఉత్తేజం (Inspiration) లభిస్తుంది. అతను తన జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటూ, తన జీవితాన్ని తన పాలిట, ఇతరుల పాలిట కూడా ఉపయోగకరంగా మలచుకుంటాడు. తద్వారా అతను సృష్టికర్త ప్రసన్నతను చూరగొంటాడు. సృష్టికర్త ప్రసన్నత కేవలం పారితోషికం, రివార్డు (Reward) స్థాయి కలిగి ఉంటే సరిపోదు, అది పురస్కారం, అవార్డు (Award) స్థాయిని కలిగి ఉండాలి.

## (8) దైనందిన జీవితంలో సృష్టికర్తతో మన సంబంధం ఎలా ఉండాలి?

దైనందిన జీవితంలో మనం సృష్టికర్తను మన వెంట ఉన్నవానిగా పొందాలి. అనుక్షణం మనకు ఆయన అవసరం ఉంది. ప్రతిక్షణం సృష్టికర్త మనకు తోడుగా ఉన్నాడన్న అనుభూతిని ఆయన మనకు కలుగజేయాలి. ఆయన మనల్ని చూస్తున్నాడనీ, మన మాట వింటున్నాడని, తన వాగ్దానాల ద్వారా మనకు సహాయపడుతున్నట్లు భరోసా ఇస్తున్నాడన్న అభయం మనకు కలగాలి. ఆయన మనపై దయదలుస్తాడు, మనకు మార్గం చూపుతాడు, మనల్ని ఏకాకిగా వదలిపెట్టడు, మన మొరలను ఆయన ఆలకిస్తాడు, మనల్ని తప్పులు, పొరపాట్ల నుండి కాపాడుతాడు, మన విన్నపాలకు వెంటనే స్పందిస్తాడు, సమాధానమిస్తాడు, చర్యకు ఉపక్రమిస్తాడు అన్న నమ్మకం ఆయన మనలో కలిగించాలి.

## (9) సృష్టికర్త మనిషికి అతి సమీపంలో ఉండాలి

సృష్టికర్త తన దాసులకు చాలా సమీపంలో నుంచి ప్రత్యక్షం (Direct) గా ఊసులాడే అవకాశం కల్పించాలి. అంతేకాదు, అలా సంభాషించే వారిని ఆయన అమితంగా ప్రేమించాలి. ..... ఆరాధనల ద్వారానూ, వేడుకోళ్ళ ద్వారానూ దాసుడు తన సృష్టికర్తతో కబుర్లు చెప్పేవిధంగా అవకాశమివ్వాలి. అంతేకాదు, అతను నడుస్తూ, పనిచేస్తూ, విశ్రమిస్తూ కూడా తన సృష్టికర్తతో మాట్లాడగలగాలి. అతనికీ – సృష్టికర్తకు మధ్య ఎలాంటి అవరోధం ఉండకూడదు. విన్నపాలు చేసుకునే విషయంలో వారిద్దరికీ మధ్య వేరొకరి

ప్రమేయం ఉండకూడదు. సృష్టికర్తకు తన దాసునితో సంబంధం (Attachment) ఎంత పటిష్టంగా ఉండాలంటే, కలత చెందినవాడు మొరపెట్టుకున్నప్పుడు ఆయన అతని మొరను ఆలకించి ఆమోదించాలి. ఇది ఒక దాసుని ముఖ్యావసరం. ఇదే అతనిని నిరాశ నుండి, హృదయం భగ్నం కావటం (Nervous Break Down) నుండి కాపాడుతుంది. తద్వారానే అతని మనసు శాంతిస్తుంది. అతని హృదయానికి నెమ్మది ప్రాప్తమవుతుంది.

సృష్టికర్త అనేవాడు తనకు ఇష్టమయిన ఆచరణలేవో, ఇష్టం లేని ఆచరణలేవో తెలియపరచాలి.

తాను ఎటువంటి మనుషులను ఇష్టపడతాడో, ఎలాంటి వారిని ఇష్టపడడో కూడా సృష్టికర్త తెలియపరచాలి. అప్పుడే మనుషులు ఆయన ఇష్టపడే కోవలో (Category) లో చేరడానికి ప్రయత్నిస్తారు.

### (10) సృష్టికర్త దాసునికి బహు చేరువలో ఉండాలి

సృష్టికర్త తన ప్రేమ, సాన్నిహిత్యం గురించి తన దాసులకు స్పష్టంగా తెలియపరచాలి. సృష్టికర్తే గనక తన దాసులకు తాను ప్రేమిస్తున్న సంగతిని తెలియపరిస్తే, దాసులు కూడా మరింత వేగిరంగా తమ సృష్టికర్త వైపునకు మరలివస్తారు. ఆయన ఆగ్రహం నుండి తప్పించుకుంటారు. ఆయన ప్రసన్నతను చూరగొనేందుకు శ్రద్ధతో సాధన చేస్తారు. ఆయన ఆరాధనలో, విధేయతలో లీనమవుతారు. ఇలాంటి మనుషుల జీవితాలలో ఆనందం నిండుతుంది. వారిలో ఉత్సాహం వెల్లివిరుస్తుంది. వారికి అనిర్వచనీయమైన శక్తి ప్రాప్తమవుతుంది.

### (11) సృష్టికర్త దాసుని ప్రార్థనను ఆమోదించాలి

సృష్టికర్త అనేవాడు తన కారుణ్యం పట్ల తన దాసుణ్ణి నిరాశపరచరాదు ..... ఆయన అతని మొరను ఆలకించి ఆమోదించాలి. అతనిని మన్నించాలి, అతనికి సహాయపడాలి, అతనికి మార్గనిర్దేశన చేయాలి.

### (12) సృష్టికర్త కారుణ్యం

సృష్టికర్త అనుగ్రహం ఆయన ఆగ్రహంపై, ఆయన కారుణ్యం ఆయన క్రోధంపై ఆధిక్యత (Dominent) వహించేదై ఉండాలి. అప్పుడే ఈ లోకం నడుస్తుంది. అన్యథా ఎప్పుడో ఇది నాశనమైపోయేది. మానవుడు తప్పులు చేసిన మీదట దైవకారుణ్యంపై ఆశతో ఆయన వైపునకు మరలివస్తాడు.

సృష్టికర్త తనకు భయపడే వారిని ప్రేమించాలి (భయపడటమంటే భావం ఆయన విధించే శిక్షకు భయపడటం, ఆయన ఇవ్వబోయే తీర్పు గురించి భయపడుతూ ఉండటం). ఈ భయమే వారిని పశ్చాత్తాపం వైపునకు మరల్చు తుంది. ఇలా భయపడేవారి పొరపాట్లను సృష్టికర్త క్షమించాలి. మరుపువల్ల, అజాగ్రత్త వల్ల జరిగిన వారి తప్పుల పట్ల సడలింపుల వైఖరిని అవలంబించాలి.

## (13) పశ్చాత్తాపం

మానవుడు తన సంకల్పం, ప్రతిజ్ఞ విషయంలో బలహీనుడు. అందుకే ఈ ప్రాపంచిక తళుకు బెళుకులు అతన్ని ఆకర్షిస్తూ ఉంటాయి. మానవుడు పదే పదే జారిపోతూ ఉంటాడు. మోసపోతుంటాడు. తప్పులు చేస్తుంటాడు. ఇది మానవుని బలహీనత. దాసుడు తన తప్పులపై, పాపాలపై మధనపడతాడు. మాటిమాటికీ క్షమాపణ కోరుకుంటూ ఉంటాడు. తనను సంస్కరించుకునే ప్రయత్నం చేస్తుంటాడు. కాబట్టి సృష్టికర్త అనేవాడు దయాశీలి, క్షమాశీలి అయి ఉండాలి. అతను మాటిమాటికీ తన దాసుణ్ణి క్షమించాలి. తప్పు చేశానన్న ధ్యాస లేని మనిషి, క్షమాపణకై అర్థించని వ్యక్తి, తనను సంస్కరించుకోనివాడు శిక్షార్హుడు.

పశ్చాత్తాపం చెందటం, పశ్చాత్తాప స్వీకారం – ఇవి మానవుని నిత్య జీవితంలోని ముఖ్యావసరాలు. కాబట్టి సృష్టికర్త అనేవాడు పశ్చాత్తాపపడే పద్ధతిని మనకు తెలియపర్చాలి. క్షమిస్తానని వాగ్దానం చేయాలి.

మన వల్ల జరిగిపోయిన పాపాల ప్రక్షాళనా పద్ధతులను కూడా సృష్టికర్త మనకు తెలియపరచాలి. పాప ప్రక్షాళన నిమిత్తం మనల్ని మరో మనిషి పరం చేయకూడదు. పాపాలు చేశామన్న సంగతి సృష్టికర్తకు తెలియాలి. క్షమాభిక్ష వ్యవహారం సృష్టికర్తకి – దాసునికి మధ్యనే ఉండాలి.

## (14) మనం ఎవరి శరణు వేడాలో సృష్టికర్త తెలియజేయాలి

మానవుడు చాలా బలహీనుడు. అతను తనకు చెందిన ఏ వస్తువునూ కాపాడుకోలేడు. ..... తన సొమ్మునుగానీ, ప్రాణాన్నిగానీ, మాన మర్యాదలనుగానీ తాను స్వయంగా రక్షించుకోలేడు. ఈ విషయంలో మనం ఏం చేయాలో సృష్టికర్త తెలియపరచాలి. వీటి రక్షణ విషయంలో మనం అనుక్షణం ఆ ప్రభువుపైనే ఆధారపడి ఉన్నామా? లేక మనం శరణు వేడుకోగల

మరో శక్తిమంతుడెవడయినా ఉన్నాడా? మరొకరెవరయినా ఉన్నారో లేదో సృష్టికర్త మనకు ఎరుకపరచాలి.

## (15) పరస్పరం ప్రేమభావంతో ఉంటూ ఒక పటిష్టమైన సమాజాన్ని నిర్మించాలని సృష్టికర్త తన దాసులకు ఉపదేశించాలి

సృష్టికర్తకు తన దాసుల యెడల ప్రేమ ఉంది. కాబట్టి దాసులు కూడా పరస్పరం ప్రేమభావంతో జీవించాలనీ, ఒండొకరికి చేదోడు వాదోడుగా ఉండాలని ప్రబోధించాలి. .... రోగులను పరామర్శించాలనీ, ఆకలిగొన్న వారికి అన్నం పెట్టాలని, అభాగ్య జీవులను ఆదుకోవాలని చెప్పాలి. పరస్పరం సద్వ్యవహారం చేసుకుంటూ మెలగాలని ఉద్బోధించాలి. ఒకరింకొకరికి సహాయం చేయాలని, ఈ విధంగా సహాయ సహకారాలతో మెలిగేవారికి బహుమానం ఉంటుందని ప్రేరేపించాలి. సృష్టికర్తకు తన దాసుల యెడల ప్రేమాభిమానాలకు ఇది కూడా దర్పణమే.

సృష్టికర్త తన ప్రేమను దాసుల మధ్యన గట్టి సంబంధాలకు సాధనం (Binding Force) గా చేయాలి – తాము పరస్పరం ప్రేమైక భావంతో, సహకార భావంతో మెలిగినట్లయితే తమ సృష్టికర్త ప్రసన్నుడవుతాడన్న నమ్మకం వారిలో పాదుకొల్పాలి. సృష్టికర్త అనేవాడు తన దాసులలోని స్త్రీ పురుషులందరి మధ్య – ప్రతి దశలోనూ – ఎవరి స్థానం ఏమిటో, ఎవరి బాధ్యతలేమిటో విడమరచి చెప్పాలి. దాసులు తమ కార్యపరిధిలో ఉంటూ తమ బాధ్యతలను సజావుగా నిర్వర్తించటం వల్ల సమాజంలో సోదరభావం వెల్లివిరుస్తుందని, న్యాయం, శాంతి, సామరస్యం నెలకొంటాయని విశదీకరించాలి. ఈ బాధ్యతా నిర్వహణను తన ప్రసన్నతతో, బహుమానంతో పెనవేసి ముడివేయాలి. అన్యథా ప్రతి మనిషీ తన సృష్టికర్త ఆగ్రహానికి గురై, శిక్షను అనుభవించాల్సి ఉంటుందని కూడా వారికి అవగతం చేయాలి.

## (16) దీనులను ఆదుకోవటాన్ని సృష్టికర్త తన మెప్పుతో ముడివేసి, మనుషులు వారికి సహాయపడేలా ప్రోత్సహించాలి

సమాజంలో నిరుపేదలు, అభాగ్య జీవులుంటారు. వారి పట్ల వారి బంధువుల బాధ్యతలేమిటో సృష్టికర్త ఎత్తిచూపుతూ వారిపై ఒత్తిడి తీసుకు రావాలి. ఆ తరువాత సమాజంలోని సంపన్నుల నుద్దేశించి, సాటి పేద ప్రజల అవసరాలను తీర్చుమని ప్రేరేపించాలి. అగత్యపరులను ఆదుకోవటంలోనే తన

ప్రసన్నత ఉందని బోధపరచాలి. ఆ విధంగా ధనికులు సమాజంలోని నిరాధార జీవులకు, నిర్వాసితులకు ఆవాసం కల్పించేలా చేయాలి.

సృష్టికర్త సమాజంలోని బలహీనుల (స్త్రీ, భార్య, వితంతువు, విడాకులు ఇవ్వబడిన స్త్రీ, అవివాహిత, రోగి, నిరాధారజీవి, అనాథ, ఆకలిగొన్నవాడు) పై ఔదార్యం వర్షింపజేసేలా సమాజంలోని స్థితిమంతుల (Well off) ను, పలుకుబడిగల వారిని (Influential) ప్రేరేపించాలి. వారు కేవలం తమ సృష్టికర్తను సంతోషపెట్టడానికి ప్రోత్సహించాలి (Encourage చేయాలి). సాటి బలహీనులపై మనస్ఫూర్తిగా ధనం వెచ్చించేలా, వారికి సహాయం చేసేలా చేయాలి. సృష్టికర్త తన ఆజ్ఞను, ఉపదేశాన్ని తన బహుమానంతో ముడిపెట్టాలి. దాసులు తన ప్రసన్నత బడయటానికి చేసిన సత్కార్యాలనే ఆయన స్వీకరించాలి. ఇతరత్రా ఉద్దేశాలు, ప్రయోజనాలు అందులో ఉండకూడదు. మనిషి సాటి బలహీన సోదరునికి ఉపకారం చేసిన మీదట దెప్పిపొడవకూడదు. గ్రహీత మనస్సును నొప్పించకూడదు. అతనే మంచి పనిచేసినా సృష్టికర్త మెప్పుకోసమే చేయాలి. ఈ విధంగా తన అత్యుత్తమ ఆదేశాల ద్వారా సృష్టికర్త తన దాసులపై దయదలచాలి. మానవుని వ్యక్తిగత సమస్యలు, సామాజిక సమస్యలు కూడా ఈ మార్గదర్శక సూత్రాల ఆధారంగా పరిష్కారమవ్వాలి.

### (17) మనుషుల పరస్పర సహాయ సహకారాలను సృష్టికర్త తన సంతోషంతో పెనవేసి సమాజానికి పటిష్టతనివ్వాలి

సమాజంలోని వ్యక్తుల .... బంధుమిత్రులు, పొరుగువారు, బాటసారులు, అనాథలు, వితంతువులు తదితరుల స్థితిగతులను, వారి శ్రేణులను, వారి హక్కులను విశదపరచి, వాటిని నిర్వర్తించేలా నొక్కి చెప్పాలి. ఈ బాధ్యతలను నిర్వర్తించనివారు కఠిన శిక్షకోసం వేచి ఉండాలని హెచ్చరిస్తూ సృష్టికర్త తన శాసనాలను విధితమయ్యేలా చేయాలి. ఈ విధంగా సృష్టికర్త మానవ సమాజానికి గట్టి పునాదులను ఏర్పరచే దిశగా శిక్షణ ఇవ్వాలి.

(సద్గుణాలు – దుర్గుణాల ప్రస్తావన మరోచోట రానున్నది)

### (18) హక్కులు ఇవ్వటాన్ని సృష్టికర్త తన ప్రసన్నతతో ముడివేసి సమాజానికి బలం చేకూర్చాలి

దాసుల హక్కుల పరిరక్షణ ద్వారా కూడా సృష్టికర్త తన కారుణ్యం కురిపించాలి. ఆ విధంగా ప్రతి క్షణం, ప్రతి స్థాయిలో, ప్రతి వ్యక్తి హక్కులు

సురక్షితమై ఉండాలి. మనిషి – అతను పేదవాడైనా, బలహీనుడైనా, బాలుడైనా, తల్లిదండ్రులైనా, స్త్రీ అయినా, పొరుగువాడైనా – ప్రతి ఒక్కరి హక్కులను నెరవేర్చటంపై మంచి ప్రతిఫలం ప్రసాదించబడుతుందన్న వాగ్దానం చేయబడాలి. ఈ విధంగా భరోసా ఇచ్చేవాడే సృష్టికర్త. హక్కులను కాజేసే వారిని, దౌర్జన్యం చేసేవారిని కఠినంగా శిక్షిస్తానని కూడా సృష్టికర్త హెచ్చరించాలి. ఈ విధంగా సమాజానికి పటిష్టతను చేకూర్చాలి.

### (19) పటిష్టమయిన కుటుంబం

సృష్టికర్త ప్రతి మనిషినీ దృష్టిలో పెట్టుకోవాలి. పాలనా ఏర్పాట్లు చేయాలి. ఆ వృద్ధుల సంతానం ఎంతో శ్రద్ధతో, అణకువతో వారి సేవకు ఉపక్రమించేలా తన ఆదేశాలను, ఉపదేశాలను జారీ చేయాలి.

సృష్టికర్త జారీ చేసిన ఆదేశాలు, ఉపదేశాలు కుటుంబాన్ని అశాంతి, అలజడుల నుండి రక్షించి శాంతినిచ్చేవిగా ఉండాలి.

సృష్టికర్త జారీచేసిన ఆదేశాలు తల్లిదండ్రులు తమ పిల్లల బాధ్యతలను గుర్తించేవిగా ఉండాలి. వారు తమ సంతానానికి మంచి శిక్షణ ఇచ్చేందుకు, మంచి విద్యాబుద్ధులు నేర్పేందుకు సమాయత్తమవ్వాలి. సృష్టికర్త జారీచేసిన ఈ ఆజ్ఞల పట్ల గల గౌరవ భావంతో దాసులలో ఆయన యెడల భక్తిభావన, పవిత్ర భావన జనిస్తుంది. తత్ఫలితంగా సృష్టికర్త ఆదేశాలను పాలించాలన్న స్పృహ కూడా వారిలో పెంపొందుతుంది. ఎందుకంటే ఈ ఆదేశాలు సర్వోన్నతుడు (Supreme) అయిన వాని తరఫున ఉన్నాయి. అందుకే మనిషి ఈ ఆదేశపాలన చేసి సంతృప్తినొందుతాడు.

కుటుంబంలోని వివిధ వ్యక్తుల (తల్లి, తండ్రి, సంతానం, భర్త, భార్య) స్థాయి విభిన్నంగా ఉంటుంది. వారి అంతస్తును, వారి యెడల హక్కులు – బాధ్యతలను వివరించి, వాటిని నెరవేర్చినందుకు లభించే బహుమానం ఏమిటో తెలియపరచాలి. నెరవేర్చకపోవటం వల్ల విధించబడే శిక్ష ఏమిటో ఎరుకపరచాలి. ఈ విధంగా సృష్టికర్త ఒక మంచి కుటుంబాన్ని నిర్మించే శిక్షణ ఇవ్వాలి. తద్వారా మనుషులు తమ బాధ్యతలకు మించి మేలుచేసేవారుగా, ప్రేమైక భావంతో పనిచేసేవారుగా రాణించాలి. అదీ ఎందుకు? కేవలం సృష్టికర్త ప్రసన్నతను చూరగొనేందుకు.

రక్త సంబంధాలను త్రెంచడాన్ని సృష్టికర్త కఠినంగా వారించాలి. అలాంటివారు తన పురస్కారానికి దూరమవుతారని హెచ్చరించాలి. బంధుత్వ

సంబంధాలను కలపటం గురించి నొక్కి వక్కాణించాలి. బంధుత్వ హక్కులను ఇచ్చేవారికి తన బహుమానాల వాగ్దానం చేయాలి. ఈ విధంగా సృష్టికర్త తన అత్యుత్తమ ఉపదేశాల ద్వారా బంధుత్వ సంబంధాల పటిష్టతకు ప్రాతిపదికను వొసగాలి. ఆత్మీయుల పట్ల నిజమైన ప్రేమానురాగాలను సృజించాలి. ఈ విధంగా సర్వవిధాలా, ఎల్లవేళలా సృష్టికర్త తన దాసుల పట్ల దయామయునిగా, ప్రేమమయునిగా ఉండాలి.

## (20) నిర్ణయాత్మకమైన మాట

సృష్టికర్త, యజమాని, పాలకుడు అయిన వానికి తన దాసుల యెడల గల ప్రేమ కోరేదేమిటి? అంటే ఆయన తన ఆజ్ఞల ద్వారా వారి మధ్య ప్రేమానురాగాలను సృజించాలి – వారు ఒండొకరిని ప్రేమించాలి. ఒకరింకొకరి సేవ చేయాలి. ఒండొకరి సుఖ దుఃఖాలలో పాలుపంచుకోవాలి. ఒకరికొకరు సహాయకులుగా ఉండాలి. ఒకరింకొకరిని గౌరవించాలి. ఒకరింకొకరికి న్యాయం చేయాలి. అన్యాయం, దౌర్జన్యం నుండి తమను కాపాడుకోవాలి. కలహాలకు, కక్షలు కార్పణ్యాలకు, రక్తపాతానికి దూరంగా ఉండాలి. .... ఈ ఆదేశాలకు కట్టుబడి ఉండేవారికి సృష్టికర్త తన బహుమానంతో సత్కరించాలి. ఈ ఆదేశాలను ఖాతరు చేయని వారిని శిక్షించాలి. ఈ శిక్షాబహుమానాలు దాసులలో అంతఃప్రేరణగా ఉండి, వారు సతతం ఆ సర్వశక్తిమంతునికి భయపడుతూ జీవించాలి. వారి మనసుల్లో ఎలాంటి కల్మషం ఉండకూడదు. అంటే మనిషి కేవలం మంచిపనులు చేస్తే సరిపోదు, అతని సంకల్పం కూడా పరిశుద్ధంగా ఉండాలి. అతను ఏ సదాచరణ చేసినా చిత్తశుద్ధితో చేయాలి.

## (21) దాసులు తమ స్వహస్తాలతో జీవనోపాధిని ఆర్జించి ఆత్మ గౌరవంతో జీవించేలా వారిని ప్రోత్సహించాలి

అంటే తమ రెక్కలతో శ్రమించి, నిజాయితీగా జీవనోపాధిని సముపార్జించే వారిని సృష్టికర్త మెచ్చుకుంటాడన్న విషయాన్ని మనుషులలో గట్టిగా నాటి, వారిని స్వాభిమానులుగా మలచాలి. ఇది కూడా సృష్టికర్త కటాక్షమే. దీని మూలంగా మనుషుల ఆత్మ గౌరవం ఇనుమడిస్తుంది. వారు సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపగలుగుతారు.

## (22) తన ఉపదేశాల ద్వారా ఉపాధి సముపార్జనను సులభతరం చేయాలి

అంటే, సృష్టికర్త ఉపదేశాలు మనిషి దైనందిన జీవితంలో శుభదాయకం

గానూ, సులభంగా ఆచరించే విధంగానూ ఉండాలి. అవి అతని నిత్యావసరాలను తీర్చగలిగేవిగా ఉండాలి (ఉదాహరణకు : నికాహ్).

## (23) ఉపాధి సముపార్జనలో అవరోధం సృష్టించేవారిని శిక్షించాలి

జీవనోపాధి సముపార్జనలో ఇతరులకు అవరోధం సృష్టించేవారిని సృష్టికర్త కఠినంగా శిక్షించాలి. వస్తువులను నిల్వ (Hoarding) చేసి ఉంచేవారిని దండిస్తానని కూడా హెచ్చరించాలి. ఈ విధంగా సృష్టికర్త అమాయకులైన దాసులను ఇతరుల జులుం నుండి రక్షించాలి.

## (24) సృష్టికర్త సంస్మరణ

సృష్టికర్తను సదా స్మరించే విధానం, సులభమైన పద్ధతి ఏదో స్వయంగా సృష్టికర్తే తెలుపాలి. సృష్టికర్త నిత్యం మదిలో మెదులుతూ ఉంటే ఆయన ఇష్టపడిన విధంగా మన జీవితం గడుస్తుంది.

ఆ సంస్మరణా విధానాన్ని ఆయన మనకు వివరించాలి. అది ప్రతి నిత్యం మన మనోమస్తిష్కాలపై ఆవరించి ఉండాలి. అది సునాయాసంగా మన అధరాల మీద ఆడుతూ ఉండాలి. తద్వారా మన దైనందిన కార్యక్రమాలు ఆయన ఆజ్ఞానుసారం పూర్తవుతాయి, కేవలం ఆయన ప్రసన్నతను చూరగొనేవిగా ఉంటాయి.

సృష్టికర్త నేర్పిన ఆ సంస్మరణా విధానం ద్వారా దాసుని మనసు కుదుటపడాలి. సృష్టికర్త కూడా అటువంటి దాసుని శ్రద్ధాభక్తులను చూసి సంతసించాలి. అతన్ని ప్రేమించాలి. సృష్టికర్త స్మరణ జీవితానికి ఎంతో అవసరం. తద్వారా మనిషి మనోమస్తిష్కాలకు, అతని భావోద్రేకాలకు శాంతి, నెమ్మది ప్రాప్తిస్తాయి.

## (25) క్షమించే, శిక్షించే అధికారం సృష్టికర్తకు మాత్రమే ఉండాలి

శిక్షించే అధికారం ఎవరికి ఉంటుందో క్షమాభిక్ష పెట్టే అధికారం కూడా అతనికే ఉండాలి.

అంటే – శిక్ష విధించే అధికారం సృష్టికర్తకు మాత్రమే ఉండాలి. ఈ వ్యవహారంలో వేరొకరి ప్రమేయం ఉండకూడదు. అలాగే క్షమించే, కరుణించే అధికారం కూడా పూర్తిగా ఆయనకే ఉండాలి. సృష్టికర్త శిక్షించటం కన్నా క్షమాభిక్ష వైపునకు మొగ్గుచూపేవాడై ఉండాలి. దాసుడు క్షమాపణకై తన వైపునకు

మరలినప్పుడు సృష్టికర్త అతన్ని క్షమించి సంతోషిస్తాడు. అంతేగాని శిక్షించి సంతోషించడు. (క్షమాభిక్ష తనకు ప్రాప్తించాలన్న ఆకాంక్ష మనిషిలోనూ ఉంటుంది).

**(26) సృష్టికర్త విలువ ఇచ్చేవాడై ఉండాలి**

సృష్టికర్త అనేవాడు తన దాసుని ప్రతి చిన్న, పెద్ద సత్కార్యాన్ని స్వీకరించి, దానికి తగిన విలువ ఇచ్చేవాడై ఉండాలి. ఆ సత్కార్యానికి మంచి బహుమానం ఇచ్చేవాడై ఉండాలి.

**(27) సంకల్పం – ఆచరణ**

సృష్టికర్త తన దాసుని ప్రతి సత్కార్యాన్ని మెచ్చుకోవటంతో పాటు, దానిని అభివ్యక్తం చేసేవాడు, దానికి తగిన బహుమతి ఇచ్చేవాడై ఉండాలి. తన పురస్కారాన్ని ఆశించి, తన శిక్షకు భయపడుతూ చేసే ప్రతి పనిని సృష్టికర్త మెచ్చుకోవాలి. కేవలం దైవ ప్రసన్నతను ఆశించి మనిషి చేసిన సత్కార్యం అతన్ని ఉన్నత స్థానానికి చేర్చుతుంది. కాగా; ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించి చేసిన సదాచరణ కూడా మనిషి వ్యక్తిత్వానికి వ్యాఘాతంగా పరిణమిస్తుంది. అది అతన్ని పడగొట్టేస్తుంది. మనిషి పడిపోయినప్పుడు అతనికి చెందిన ప్రతి వస్తువు దుర్వినియోగమవుతుంది. అతను ఎత్తుకు ఎదిగినప్పుడు అతని ప్రతి వస్తువు అతని స్వయానికి, ఇతరులకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది.

ప్రతి మంచి పని సృష్టికర్త సూచనానుసారం జరగాలి. సృష్టికర్త సంతోషం కోసమే జరగాలి. అంతేగాని అది అతని ప్రాపంచిక స్వలాభాల కోసం జరగరాదు. అది అతని ఇష్టానుసారం జరగరాదు. తన మనసు మెచ్చిన విధానాల ప్రకారం జరగరాదు.

సృష్టికర్త ఆదేశాలు ఉపదేశాలను తన ప్రాపంచిక స్వార్ధ ప్రయోజనాలను దుర్వినియోగపరచినవాడు, పరుల మెప్పుకోసం దైవోపదేశాలను అమలుపరచిన వాడు అత్యంత నికృష్ట జీవి. అలాంటి వ్యక్తి కర్మలను సృష్టికర్త త్రోసిపుచ్చాలి (Reject చేయాలి). ఇది పూర్తిగా సృష్టికర్త ఆదేశాలు, ఉపదేశాలను అధర్మమైన పద్ధతిలో దోచుకోవటం (Exploitation) వంటిదని అతనికి తెలిసి వచ్చేలా చేయాలి.

**(28) సృష్టికర్త వరప్రసాదాలకు హద్దు ఉండరాదు**

సృష్టికర్త దాతృగుణానికి ఒక పరిమితి అంటూ ఉండకూడదు. ఆయన ఔదార్యం పుష్కలంగా వర్షించాలి. ఎవరయినా ఒక వ్యక్తి తన కోసం

అర్థించటంతో పాటు ఇతరుల యోగక్షేమాల కోసం, వారి బాగోగుల కోసం అర్థించినాసరే ఆయన ఆ విన్నపాలన్నింటినీ స్వీకరించి, ఆమోదించాలి. కేవలం ఒక్క దాసునిపై కాదు, మరెంతోమందిపై కూడా ఆయన కారుణ్యం కురవాలి.

సృష్టికర్త ప్రతి వస్తువులో మేలుతో పాటు కీడును కూడా ఉంచాడు. ఆయన ఒకే వస్తువుతో ఎన్నో పనులు తీసుకుంటాడు. అందువల్ల కీడు నుండి ఆయన రక్షణకై వేడుకోవాలి. మేలు ద్వారా లబ్ధి పొందాలి. కాబట్టి సృష్టికర్త తన దాసుల విన్నపాన్ని ఆలకించి వారిని కీడు నుండి కాపాడాలి. ఆ వస్తువులోని మేలును వారికి ఇతోధికంగా ప్రసాదించాలి. దాసుడు సృష్టికర్తలోని పెద్దరికాన్ని, ఘనత్వాన్ని దయాగుణాన్ని కొనియాడుతూ, తనలోని అశక్తతను, నిస్సహాయస్థితిని వ్యక్తపరచినప్పుడు సృష్టికర్త అమితానందం చెందాలి. దాసునిలో ఈ వినమ్రత జనించినప్పుడు సృష్టికర్త అతన్ని చేరదీస్తాడు. అతని చేత సమతూకంతో కూడిన తన ఉపదేశాలను పాటించేలా చేస్తాడు.

## (29) సృష్టికర్త ఏది చేసినా అందులో లోపం ఉండకూడదు

ఒకవేళ ఎవరయినా ఒక దాసునికి ఏదయినా కారణంగా బాధ కలిగితే అందులో కూడా సృష్టికర్త దాసునికి ఏదో ఒక రూపంలో మేలును పొందుపరచి ఉంచాలి. .... అతనికి భౌతికంగానో, నైతికంగానో, విశ్వాసపరంగానో లేక పుణ్యఫలం ప్రసాదించటం ద్వారానో లేక పాపాలను పరిహరించటం ద్వారానో ప్రయోజనం కలిగించాలి. దాసునితో సృష్టికర్తకు గల ప్రగాఢ సంబంధమిది. ఒకవేళ ఆయన దాసుణ్ణి ప్రాపంచికంగా ఏదన్నా బాధకు గురిచేసినా అందులో కూడా ఆ దాసుని లాభం ఏదో ఉండాలి. దాసుణ్ణి బాధించటం కాకుండా అతనికి లబ్ధి చేకూర్చటం, అతన్ని తన కారుణ్యంలో చేర్చటం ప్రధాన ఉద్దేశమై ఉండాలి.

## (30) సృష్టికర్త తన దాసుణ్ణి ఎందుకు కష్టానికి లోను చేస్తాడు?

ఈ విషయం దాసునికి తెలియపరచాలి. తద్వారానే దాసుడు బాధను ఓపికతో సహిస్తాడు లేదా ఆ విపత్తును సులభంగా అధిగమిస్తాడు.

ముఖ్యంగా సృష్టికర్త సదాచారులైన తన దాసులనే ఎందుకు పరీక్షలకు లోనుచేస్తుంటాడో, అందులో దాగివున్న మర్మం ఏమిటో తెలియపరచాలి.

దుర్వర్తనులైన తన దాసులను ఎందుకు పట్టుకుంటాడో, సత్యం నుండి వైదొలగిపోతున్న తన దాసులను పట్టుకోవటంలో ఎందుకు శీఘ్రత కనబరుస్తాడో కూడా సృష్టికర్త ఎరుకపరచాలి.

## (31) మనుషుల మధ్య భేదభావం చూపటం సృష్టికర్తకు శోభాయమానమా?

సృష్టికర్త అనేవాడు మనుషులందరినీ సమభావంతో చూడాలి. వారందరితో ఒకేవిధంగా వ్యవహరించాలి. అందరినీ ఒకేలా అభిమానించాలి. ఆస్తీ అంతస్తు రీత్యాగానీ, వంశం వర్ణం దృష్ట్యాగానీ, ధనిక – పేద తారతమ్యాల దృష్ట్యాగానీ, అంగవైకల్యం ఆధారంగాగానీ, సౌందర్యం ప్రాతిపదికగాగానీ దాసుల మధ్య విచక్షణ పాటించకూడదు. కేవలం ఒకే ఒక్క ప్రాతిపదికపై వ్యత్యాసం పాటించాలి. అదేమిటంటే – ఎవరు తన బుద్ధివివేకాలను ఉపయోగించి తన సృష్టికర్తను తెలుసుకున్నాడు, తెలుసుకున్న మీదట ఎవరు తన ముందు విధేయత కనబరుస్తున్నాడు, విధేయత కనబరచిన మీదట ఎవరు తన ముందు తలవంచుతున్నాడు, ఎవడు సంపూర్ణ సమర్పణా భావంతో మెలగుతున్నాడో చూసి అలాంటివారినే ఆయన ఆదరించాలి. వారికే విలువ ఇవ్వాలి. దాసుల మధ్య ఈ రకమయిన 'విచక్షణ' సమంజసమే. దీనిని బుద్ధి కూడా ఒప్పుకుంటుంది. తన మహోపకారి అయిన సృష్టికర్తను గుర్తించి, ఆయన సన్నిధిలో లొంగిపోయిన వారిని సృష్టికర్త ఆదరించటం, వారికి అమితంగా తోడ్పాటు నందించటం, వారి మొరలను ఆలకించటం, తన దగ్గర ఉన్న విలువైన వస్తువును వారికి ప్రదానం చేయటం ఎంతైనా ముదావహం అని మనస్సాక్షి కూడా సాక్ష్యమిస్తుంది. కంటికి కానరాని సృష్టికర్తను విశ్వసించి, ఆయన ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించిన వారికి గొప్ప పురస్కారంతో సన్మానించటం సహేతుకమేనని బుద్ధి చెబుతుంది.

సృష్టికర్త ఒకానొక పరమార్థం కారణంగా, మనిషికి ఇచ్చిన ఎంపిక స్వేచ్ఛ (Choice) కారణంగా, మనుషుల మధ్య విచక్షణ పాటించినప్పటికీ అవిధేయులను వెంటనే పట్టుకుని నిలదీయకూడదు. జనులు తమ సృష్టికర్త ముందు తలవంచక పోయినప్పటికీ వారికి నిరంతరం గడువు ఇస్తూ పోతుండాలి. ఒక సుదీర్ఘ కాలం వరకు, ఒక్కోసారి జీవితాంతం వరకు వారికి అవకాశం ఇస్తూ ఉండాలి. ఎందుకంటే గుండెలోని ప్రాణం గొంతు దాటక ముందు అయినా వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారేమో! ఇలాంటి అవకాశం సృష్టికర్త ఉదాత్త గుణానికి, అపార కరుణకు దర్పణంగా ఉంటుంది. దాసుల దోషాలను మరుగుపరుస్తూ, వారిని మన్నించే ఆయన గొప్ప సుగుణం ఆయన ఘనత్వానికి ప్రతీకగా ఉంటుంది.

**నాల్గవ అధ్యాయం :**

**రెండవ భాగం**

# సృష్టికర్త - మనిషి పరస్పర సంబంధం ఎలా ఉండాలి? .... ఒక చూపులో!

## సాధారణ విషయం

**(1)** సృష్టికర్తతో సంబంధం ఏర్పరచే రెండు ముఖ్యాంశాలు.

**(2)** సృష్టికర్త స్వయంగా దాసులకు తన పరిచయం చేసుకోవాలి.

**(3)** దాసునితో సృష్టికర్త సంబంధం .... సృష్టికర్త స్వయంగా తానెవరో చెప్పాలి.

**(4)** సమస్త మానవులతో సృష్టికర్త సంబంధం.

**(5)** ఏకత్వం.

**(6)** మనిషిలోని సహజ భావన.

**(7)** సృష్టికర్తకి, ఉపకారికి విధేయత చూపాలన్న సహజ భావన.

**(8)** సృష్టికర్త సన్నిధిలో తలవంచి, కృతజ్ఞతాంజలి ఘటించాలన్న సహజ భావన.

**(9)** మానవ నైజం వాంఛించేదేమిటి?

**(10)** దాసుడు సన్మార్గం చూపమని, వెలుగును ప్రసాదించమని తనను ప్రార్థించినప్పుడు అతనిని కటిక చీకట్ల నుండి వెలికితీసి, కాంతి రేఖలోకి తీసుకువచ్చేవాడే సృష్టికర్త.

**(11)** తాను చేసే ప్రతిదానినీ సృష్టికర్త గమనిస్తూ ఉండాలనీ, దానికి పూర్తి ప్రతిఫలం తనకు ప్రసాదించాలని మనిషి కోరుకుంటాడు.

**(12)** దాసునితో ప్రేమైక సంబంధం.

**(13)** బలహీనులతో సృష్టికర్త సంబంధం.

**(14)** తన దాసులకు రక్షణ కల్పించేవాడై ఉండాలి.

**(15)** ప్రార్థనలను ఆలకించి ఆమోదించేవాడై ఉండాలి.

**(16)** దాసుని మొరలాలకించేవాడే సృష్టికర్త.

**(17)** ప్రార్థనలను ఆమోదించి సృష్టికర్త దాసులతో తన సంబంధం ఎటువంటిదో చెప్పకనే చెప్పాలి.

**(18)** దాసులతో సృష్టికర్త సంబంధం క్షమ మన్నింపులతో కూడుకున్నదై ఉండాలి.

**(19)** సృష్టికర్త తన దాసులను రక్షించేవాడు, సడలింపుల వైఖరిని అవలంబించేవాడై ఉండాలి.

**(20)** సృష్టికర్త తన దాసుల తప్పులపై తక్షణం నిలదీసేవాడై ఉండకూడదు.

**(21)** సృష్టికర్త మంచిని పెంపొందించేవారికి బహుమానం వొసగాలి. చెడులను వ్యాపింపజేసే వారిని శిక్షించాలి.

**(22)** దాసులతో సృష్టికర్తకు చాలా సమీప సంబంధం, ప్రత్యక్ష సంబంధం ఉండాలి.

**(23)** సృష్టికర్త ప్రతి మనిషికీ తనతో ప్రత్యక్షంగా సంభాషించే అవకాశం ఇవ్వాలి.

**(24)** సృష్టికర్త తన దాసులకు సదా మేలు చేసేవాడై ఉండాలి.

**(25)** సృష్టికర్త దృష్టిలో మనిషి ప్రాణానికి విలువ, ప్రాముఖ్యత ఉండాలి. తాను మనిషిని ప్రేమిస్తున్నానన్న విషయం స్పష్టపరచాలి.

**(26)** సృష్టికర్త మనుషుల జీవన అవసరాలను తీర్చగలిగినప్పుడే, ఆయనకు మనుషులపై ప్రేమ ఉందన్న విషయం తెలిసివస్తుంది.

**(27)** సృష్టికర్త మనిషి ఆచరణకు విలువ ఇవ్వాలి.

**(28)** సృష్టికర్త గొప్ప ఉదార స్వభావి, సహన శీలి అయి ఉండాలి.

**(29)** సృష్టికర్తకు తన దాసునితో ఎంత దృఢమైన సంబంధం ఉండాలంటే, అతని ప్రతి చిన్నదైన మంచి పనిని గురించి, ప్రతి చిన్న చెడును గురించి లెక్క తీసుకోవాలి.

**(30)** సృష్టికర్తకు దాసులతో సన్నిహిత సంబంధం ఉండాలి. దాసుల ఆంతర్యాలలోని ఉద్దేశ్యాలను సయితం ఆయన ఎరిగినవాడై ఉండాలి.

**(31)** సృష్టికర్తకు ప్రతి మనిషితో సంబంధం ఒకేవిధంగా ఉండాలి.

**(32)** సృష్టికర్తకు మానవులందరిపై గల ప్రేమ వాంఛించేదేమిటంటే, ఆయన మానవులందరి పట్ల సమభావంతో వ్యవహరించాలి.

**(33)** దాసునికీ – సృష్టికర్తకీ మధ్య ప్రత్యక్ష సంబంధం, శాశ్వత సంబంధం ఉండాలి.

**(34)** సృష్టికర్తకి – మనిషికి మధ్య గల సంబంధం సహజ సంబంధం.

# సృష్టికర్తకి - మనిషికి మధ్య సంబంధం ఎలాంటిదై ఉండాలి?

**సాధారణ విషయం :**

సృష్టికర్త యొక్క మంచిగుణాల, ఆదేశాల మూలంగా సృష్టికర్తతో మనిషికి దానంతట అదే సంబంధం ఏర్పడుతుంది. మానవీయ గుణాలను ప్రేరేపించటం వల్ల .... సృష్టికర్త పట్ల ప్రేమ, గౌరవం, ఆయన ప్రసన్నతను చూరగొనాలన్న కాంక్ష, కృతజ్ఞతాభావం, విధేయతా భావం మొదలైనవి అంతర్యంలో జనిస్తాయి. పరిచయం ఎంత స్పష్టంగా, ఎక్కువగా ఉంటుందో సృష్టికర్తతో సంబంధం కూడా అంతే దృఢంగా ఉంటుంది. అందుకే సృష్టికర్త అనేవాడు తన అత్యుత్తమ గుణాల, ఉపదేశాలను గురించి మనిషికి పరిచయం చేయాలి. ప్రస్తుతం మనం నిత్య జీవితంలోని అనుభవాలను, భావనలను గురించి మానవ నైజం వాంఛించే వాటి వెలుగులో యోచిస్తున్నాము. అంటే సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి? సృష్టికర్తకి – మనిషికి మధ్య సంబంధాలెలా ఉండాలి? అని ఆలోచిస్తున్నాము. సమతూకంతో కూడిన, ప్రామాణికమైన (Authentic) విషయమైతే ఖచ్చితంగా సృష్టికర్త తరఫు నుండి వచ్చినదే అయి ఉంటుంది. మనం దానిని అన్వేషించవలసి ఉంటుంది.

**(1) సృష్టికర్తతో సంబంధం ఏర్పరచే రెండు ముఖ్యాంశాలు**

(అ) పరస్పర ప్రాథమిక బాంధవ్యం.

(ఆ) సృష్టికర్త యొక్క అత్యుత్తమ గుణాలు.

## (అ) పరస్పర ప్రాథమిక సంబంధం ఆధారంగా ఏర్పడే బాంధవ్యం (అంటే సృష్టికర్త – సృష్టితాల సంబంధం)

నా సృష్టికర్త : ఆయన నా మహోపకారి. ఆయన నాకు చేసిన అతి పెద్ద ఉపకారం ఏమిటంటే నన్ను శూన్యంలో నుంచి ఉనికిలోకి తీసుకువచ్చాడు. కాబట్టి నేనాయనకు కృతజ్ఞుణ్ణి అయి ఉండాలి. ఆయన ఎదుట ప్రణమిల్లాలి. ఇది సృష్టికర్త హక్కు. హక్కును నెరవేర్చటం ద్వారా సంబంధం పటిష్టమవుతుంది.

నా యజమాని : పుట్టించినవాడే తాను పుట్టించిన దానికి యజమాని అవుతాడు. కాబట్టి నన్ను పుట్టించిన సృష్టికర్తే నా యజమాని, స్వామి. ఆయనే నా బాగోగులను చూస్తాడు. పోషిస్తాడు. పర్యవేక్షిస్తాడు. పరిరక్షిస్తాడు. నా అవసరాలను తీరుస్తాడు. నాకు కావలసిన వాటిని సమకూరుస్తాడు. కష్టకాలంలో తోడ్పడతాడు. కాబట్టి నేను నా యజమానికి విధేయుడనై ఉండాలి.

## సృష్టికర్తతో దాసుని ప్రాథమిక వైఖరి :

మౌలికంగా దాసునితో సృష్టికర్త సంబంధం ప్రేమపూర్వకమైనది, దయా భావంతో కూడుకున్నదై ఉంటుంది. తత్కారణంగా ఆయన తన దాసులపై దయానుగ్రహాలను కురిపిస్తూ ఉంటాడు. అందువల్ల దాసునిలో కృతజ్ఞతా భావం పెంపొందుతూ ఉంటుంది. అతను సృష్టికర్త విధేయత వైపునకు మనస్ఫూర్తిగా మరలుతాడు. అవిధేయతకు దూరంగా ఉంటాడు. చూడబోతే ఈ మౌలిక సంబంధం సృష్టికర్తకి – సృష్టితాలకీ, యజమానికీ – సేవకునికి, పాలకునికి – పాలితునికి మధ్య సంబంధమే. కాని ఈ సంబంధాల వెనుక ఉన్న అసలు ప్రేరణ ప్రేమ, దయ. ఇది సృష్టికర్తకు ఉంటుంది. అదే మనిషిలో కృతజ్ఞతా భావాన్ని, విధేయతా భావాన్ని జనింపజేస్తుంది.

## (ఆ) సృష్టికర్తకి – దాసునికి మధ్య సంబంధాన్ని పెంపొందించటంలో దోహదపడే సృష్టికర్తలోని అత్యుత్తమ గుణాలు

దాసునికీ – సృష్టికర్తకి మధ్య అన్ని దిశల నుండి సంబంధాలు ఏర్పడటానికి కారణమయ్యే అత్యుత్తమ గుణాలు సృష్టికర్తలో ఉండాలి.

కొన్ని సుగుణాల గురించి పరిశీలిద్దాము –

**దయచూపేవాడు** .... దయ చూపేవానిపై సహజంగానే మనసులో ప్రేమభావం, గౌరవ భావం ఏర్పడుతుంది.

**మన్నించేవాడై ఉండాలి** .... తప్పులను మన్నించి వదలిపెట్టే గొప్పవాని పట్ల ఆంతర్యంలో ప్రేమైక భావాలతో పాటు గౌరవాదరణల భావాలు కూడా జనిస్తాయి. అతని ముందు తలవంగిపోతుంది. సంబంధం దృఢతరం అవుతుంది.

**తోడ్పడేవాడై ఉండాలి** .... దీనివల్ల ఆశాభావం జనిస్తుంది. భరోసా ఏర్పడుతుంది. సంబంధం పటిష్టవంతమవుతుంది.

**ప్రతి వస్తువుపై అధికారం కలవాడై ఉండాలి** .... దీనివల్ల సృష్టికర్తపై నమ్మకం పెరుగుతుంది. సాన్నిహిత్యం పెంపొందుతుంది. జీవితంలో నిశ్చింత, ప్రశాంతత ప్రాప్తిస్తుంది.

**కఠినంగా శిక్షించేవాడై ఉండాలి** .... సంబంధంలో భయం కూడా జనిస్తుంది. అది ఆలోచనల్లో సమతూకానికి (Balance) దోహదపడుతుంది. కార్యాచరణ (Action) కు సమాయత్తం చేస్తుంది. తత్ఫలితంగా మనిషి ఇతరులకు అన్యాయం చేయటం, ఇతరుల హక్కులను కాజేయటం వంటి దుర్మార్గాల నుండి తనను కాపాడుకోగలుగుతాడు.

**ఆయన న్యాయశీలుడై ఉండాలి** .... ఈ సంబంధంలో భయంతో పాటు ఆశ కూడా ఉంది. ఈ రెండు అంశాలు పరస్పర సంబంధ బాంధవ్యాన్ని మరింత పటిష్టం చేస్తాయి. ఇవి రెండూ మానవ జీవితంలోని విడదీయరాని అంశాలు కూడాను. ఆశావహ దృక్పథం మనిషిని సదాచరణకు, మేలుకు ప్రేరేపిస్తుంది. మంచి ప్రతిఫలం లభిస్తుందన్న ఆశతో ఉంటాడు. కాగా; భీతి చెడు నుండి, దౌర్జన్యం నుండి మనిషిని ఆపుతుంది. ఎందుకంటే జులుంకు ఒడిగట్టిన వారిని సృష్టికర్త శిక్షిస్తాడన్న తలంపు ఉంటుంది.

సృష్టికర్త యొక్క సమత్వపు భావన మానవ భావాలు భావనల్లో, వైఖరిలో, పూర్తి జీవితంలో సమతూకం (Balance) ప్రసాదిస్తుంది. మనిషి మధ్యేమార్గం అవలంబిస్తాడు.

సృష్టికర్త శిక్షా బహుమానాల గుణం వల్ల మనిషికి సృష్టికర్తతో సమ తౌల్యంతో కూడిన సంబంధం ఏర్పడి, క్రమక్రమంగా అది బలపడుతుంది. ఈ సంబంధం ఏర్పడి క్రమంగా బలపడటం మనిషి జీవితంలో సమతూకానికి ఎంతైనా అవసరం.

ఒకవేళ సృష్టికర్తకే గనక మానవునితో, అతని జీవితావసరాలతో తనకు సంబంధం లేదని చేతులెత్తేస్తే అతని పట్ల దయామయుణ్ణి, ప్రేమమయుణ్ణి, మొరలను ఆలకించేవాణ్ణి, ఆగ్రహం చెందేవాడిని, మంచి విషయాలను ఇష్టపడేవాణ్ణి, చెడు విషయాలను అసహ్యించుకునేవాణ్ణి అన్న సృష్టికర్త మాటలకు అర్థమే లేదు. ఆయన శిక్షా బహుమానాలకు కూడా అర్థం ఉండదు.

## (2) సృష్టికర్త తానెవరో స్వయంగా దాసులకు చెప్పాలి

ఈ పరిచయం వల్ల దాసులతో సృష్టికర్తకు గల సంబంధం వ్యక్తమవుతుంది.

సృష్టికర్త తన గురించి దాసులకు పూర్తిగా చెప్పాలి. తన గుణగణాల (Attributes, Qualities) ని గురించి పూర్తిగా ఎరుకపరచాలి. దీనివల్ల మానవుని భావాలు భావనల్లో, ఆలోచనల్లో సమత్వం, సమతూకం వస్తుంది. అతనిలో విశాల దృక్పథం జనిస్తుంది. ఈ సుగుణాలు అతని క్రియాత్మక జీవితంలో ప్రస్ఫుటం (Reflect) అయి ముందుకు వస్తాయి. ఇది మనిషి జీవితపు ముఖ్యావసరం. ఇది లేకుండా అతని జీవితం సరైన దిశలో – సమతూకంతో – ముందుకు సాగదు. వ్యక్తిత్వ పరిచయం అంత ముఖ్యం కాదు. అతని రూపురేఖలు ఎలా ఉంటాయి? శరీరాకృతి ఎలా ఉంటుంది? అన్న దానికి ప్రాధాన్యం లేదు. అతని గుణగణాలు ముఖ్యం. వాటిని తెలుసుకుని, జ్ఞాపకముంచుకోవటం వల్ల జీవితంలో చలనం వస్తుంది. క్రియాశీలత జనిస్తుంది. మనిషి జీవితంలో విప్లవం రావటమే కాదు, జీవితం సరైన దిశలో ఉంటుంది. మనిషికి మానసిక స్థిరత్వం (Stability of Mind) ఒనగూడుతుంది. అది భావాలకు, ఆచరణకు సమతూకం (Balance of Passion and Action) ఇస్తుంది. అప్పుడు అతని ఆలోచనలు ఇలా ఉంటాయి :– సృష్టికర్త ప్రతి క్షణం, ప్రతి ఒక్కరినీ గమనిస్తూ ఉన్నాడు. ప్రతి ఒక్కరి గోడు వింటున్నాడు, ప్రతి ఒక్కరినీ ప్రేమిస్తున్నాడు, ప్రతి ఒక్కరిపై దయదలుస్తున్నాడు, ప్రతి ఒక్కరికీ చేరువలో ఉన్నాడు, ప్రతి ఒక్క దానినీ చేయగల సమర్థుడు. ప్రతిదానిపై పూర్తి అధికారం, పట్టు కలవాడు. ప్రతి ఒక్కరినీ శాసిస్తాడు, ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా ఏదీ జరగదు. ఆయన అనుజ్ఞ లేకుండా ఏదీ అవదు. ఆయన ప్రతి మనిషి కదలికలను – ఏక కాలంలో – చూస్తూ ఉన్నాడు. ఆయన చూపులకు ఆనకుండా ఏదీ లేదు. ఆయన నుండి ఏదీ దాగి ఉండదు. ఏ వస్తువు ఎక్కడుంది, ఏ రూపంలో ఉంది, ఏ స్థితిలో ఉంది అనేది ఆయన

జ్ఞానపరిధిలో ఉంది. ఎవరు ఏం అర్థిస్తున్నారో, ఎవరికి ఏది అవసరమో కూడా ఆయనకు తెలుసు. వాటిని సమకూర్చే శక్తి ఆయనకు ఉంది. ఆయన ఇవ్వదలిస్తే ఎవరూ ఆయన్ని అడ్డుకోలేరు. ఆయన చేసే పనిని ఎవరూ రద్దుపరచటం గానీ, ప్రభావరహితం (Nullify) చేయటం గానీ చేయలేరు. మంచి పనులు చేసేవారి గురించీ ఆయనకు తెలుసు, చెడు పనులు చేసేవారి సంగతి కూడా ఆయనకు తెలుసు. వారి గుండెల్లోని రహస్యాలు, ఉద్దేశాలు కూడా ఆయన ఎరుగు. ఆయన సూక్ష్మద్రష్ట. ఆయన మంచి వస్తువుకు విలువ నిచ్చి బహుమతి వొసగుతాడు. చెడును ఏవగించుకుంటాడు, దానిపట్ల ఆగ్రహం చెందుతాడు, శిక్షిస్తాడు. ఆయన మనిషిని పుట్టించి అతన్ని అతని మానాన వదలిపెట్టడు. పైగా అతనితో సర్వ విధాలా సంబంధం కలిగి ఉంటాడు – సృష్టికర్త అనేవాడు ఇలాగే ఉండాలి.

### (3) దాసునితో సృష్టికర్త సంబంధం .... సృష్టికర్త తన దాసులకు తన పరిచయం చేసుకోవాలి :

తన సృష్టితాలతో సర్వవిధాలా – పూర్తిగా సంపర్కం (Fully concerned) కలిగి ఉన్నవాడే అసలు సృష్టికర్త. ఆయన వారి వ్యవహారాల పట్ల పూర్తిగా శ్రద్ధ కలిగి ఉండాలి. అప్పుడే దాసుడు ఆయన వైపునకు మరలుతాడు. తన వ్యవహారాలను, మంచీ చెబ్బరలను ఆయనకు చెప్పుకుంటాడు. తానెదుర్కొం టున్న ఇబ్బందులను గురించి, తన అవసరాలను గురించి విన్నవించుకో గలుగుతాడు. ఆయన మార్గదర్శకత్వం కొరకు అభ్యర్థించి, సహాయం అర్థించగలడు. వీటన్నింటికీ అవకాశం ఉన్నప్పుడే దాసుని ఆంతర్యంలో సృష్టికర్త యెడల ఆసక్తి, భక్తిశ్రద్ధలు జనిస్తాయి. అప్పుడే అతను సృష్టికర్త ముందు ప్రణమిల్లడానికి, విధేయత చూపడానికి హృదయపూర్వకంగా మరలుతాడు. .... సృష్టికర్తతో సామీప్యం మూలంగా, ఆయన ప్రేమ, మేళ్ల ఆధారంగా మనిషి ఆంతర్యంలో పరివర్తన వస్తుంది. ఇదంతా ఎందుకంటే సృష్టికర్తకు తన దాసునిపట్ల ఆసక్తి ఉంది గనక. ఆసక్తే గనక లేకుంటే, ఆయన ఎక్కడికో పోయి నిద్రిస్తే లేక విశ్రాంతి తీసుకుంటే దాసునికి కూడా దైవం యెడల శ్రద్ధాసక్తులుండవు. అందుచేత సృష్టికర్త తన గురించిన సరియైన పరిచయం తన దాసులకు చేయాలి. అపోహలు అపార్థాల కారణంగా, తప్పుడు పరిచయం

కారణంగా దాసుడు సృష్టికర్తకు దూరమవకుండా ఉండటానికి ఈ పరిచయం, నిజభావన (Concept) చాలా అవసరం.

మానవుడు దుఃఖం నుండి, ఆవేదన నుండి, నిస్సహాయ స్థితి నుండి, వ్యాకులత నుండి బయటపడాలని కోరుకుంటాడు. తనకు అగోచర సాయం అందాలని కూడా మనిషి కోరుకుంటాడు. ఈ సహాయం సృష్టికర్త మాత్రమే చేయగలుగుతాడు. అందువల్ల అతను తనను సృష్టించిన వాని వైపునకు మరలి ప్రశాంతత పొందాలనుకుంటాడు. ఒకవేళ పుట్టించినవాని గురించి ఈ భావనే గనక లేకపోతే (ఆయనకు మానవ వ్యవహారాల పట్ల ఎలాంటి శ్రద్ధాసక్తులు లేవని భావిస్తే) అతను వ్యాకులతకు గురై ఆత్మహత్యకు పూనుకుంటాడు. అలాగాకుండా – సృష్టికర్త తన విషయంలో శ్రద్ధ వహించడమే గాకుండా తనకు సహాయం చేసే శక్తి కూడా కలిగి ఉన్నాడని నమ్మకం కుదిరితే అతను తృప్తిగా నిట్టూర్పు విడుస్తాడు. అతని ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఏకాగ్రతతో కార్యోన్ముఖుడవుతాడు. ఆ విధంగా అతనికి మళ్లీ జీవనం లభిస్తుంది. అందుచేత సృష్టికర్త గురించిన నిజ భావన అవసరం. దానిపై నమ్మకం అవసరం.

ఎంతగా ప్రయత్నించినప్పటికీ, మనిషి తనలోని దౌర్బల్యాలపై నియంత్రణ సాధించలేడు. ఈ విషయంలో సృష్టికర్త తనకు తోడ్పడాలని కోరుకుంటాడు. ఆయన దయతో తన వైపునకు మరలుతాడనే ఆశతో ఆయన వైపునకు రుజువర్తనుడవుతాడు. బద్ధకం, పిసినారితనం, పిరికితనం, దురాలోచనలు, దుశ్శంకలను దూరం చేయటం సృష్టికర్తకు కష్టమేమీ కాదు. కాబట్టి మానవుడు ప్రతి అవసరం గురించి తనకు విన్నవించుకోవాలని సృష్టికర్త చెప్పాలి. తాను మనిషి మొరలు వినేవాడిని, సహాయపడేవాడినన్న సంగతి మనిషికి చెప్పాలి. దైనందిన జీవితం (Day to Day Life)లో తాను మనిషి వెంట ఉన్నానని, సంబంధం త్రెంచుకోలేదని, నిత్యం, ప్రతిచోటా, ప్రతి వ్యవహారంలో దాసునితో సంబంధం కలిగి ఉన్నానని తెలియజెప్పాలి.

దాసునితో సృష్టికర్తకు గల సంబంధం చప్పగా ఉండకూడదు. పైగా సృష్టికర్త తన దాసుల మేలును తీవ్రంగా కాంక్షించేవాడై ఉండాలి. వారికి తన సహాయం చేయడానికి, మార్గం చూపడానికి, దయ చూపడానికి సిద్ధంగా ఉండాలి. సదా తన దాసుల బాగోగులను కోరుకునేవాడై ఉండాలి. ఏదయినా కారణం వల్ల దాసులకు బాధ కలిగినా దానికి బదులుగా వారిని కటాక్షించి సంతోషించేవాడై ఉండాలి. ఈ విధంగా వారితో తన అనుబంధం ఎటువంటిదో స్పష్టంగా విశదపరచాలి – తద్వారా దాసులు తన వైపునకు మరలిరావటానికి!

మరో వైపునకు పోకుండా ఉండటానికి!! సృష్టికర్త ఇలాగే ఉండాలి. ఇలాగే చేయాలి.

## (4) సమస్త మానవులతో సృష్టికర్త సంబంధం

సృష్టికర్త తన దాసులకు మార్గబోధన చేయాలి. ఆ మార్గబోధన సమస్త మానవాళి కోసమై ఉండాలి. అది మానవులు నిర్మించుకున్న బందీఖానాలో బందీ అయి ఉండకూడదు. కేవలం మానవాళిలోని కొద్దిమందికి పరిమితమై ఉండకూడదు. కొద్దిమందికి మాత్రమే ప్రయోజనం చేకూర్చేదై ఉండకూడదు. కేవలం కొద్దిమంది మాత్రమే దానిపై గుత్తాధిపత్యం వహించి తద్వారా మిగతా మనుషుల నుండి అధర్మంగా ప్రయోజనం పొందేదై ఉండకూడదు. ఆయన ఉపదేశం, మార్గబోధన అందరికీ చెందినదై ఉండాలి. ఎల్లరూ దాని ద్వారా లబ్ది పొందగలగాలి.

## (5) ఏకత్వం

సృష్టికర్తను కించపరిచే (Insult) మాట అనరాదు. ఆయన గౌరవ ప్రపత్తికి శోభించని నమ్మకం కూడా కలిగి ఉండరాదు. ఆయనలో ఏదయినా లోపం లేక బలహీనత ఉన్నప్పుడే కించపరచడానికి ఆస్కారం ఉంటుంది. ఆయనలో లోపం ఉందని చూచాయగా తెలియజేసే మాట అనటం కూడా తగదు. ఉదాహరణకు : ఏదయినా పని చేయడానికి సృష్టికర్తకు వేరొకరి సహాయం అవసరమని, ఆయన ఒక్కడే ఆ పని చేయలేడని అనటం. (దీని అర్థం ఆయన బలహీనుడన్నమాట! ఆయన ఖుద్దుగా ఏ పనీ చేయలేడన్నమాట! – దైవం మన్నించుగాక!) లేదా ఏదన్నా పని చేయడానికి సృష్టికర్త ఏదయినా శరీరాకృతి (Shape) దాల్చవలసిన అవసరం ఉంటుందని అనటం. వాస్తవానికి ప్రతి వస్తువు ఆయన ఆజ్ఞకు లోబడి (Under command) ఉంది. ఆజ్ఞాపించటమే ఆలస్యం, తక్షణం అది అయిపోతుంది. ఆయన శరీర రూపం దాల్చాడంటే అర్థం ఏమిటి? ఆయన స్వయంగా పనిచేస్తున్నట్లే కదా! దీనిద్వారా ఆయన బలహీనత బయటపడుతుంది. తన ఒక్క ఆజ్ఞతో ఆ పని చేయలేడన్నమాట! దానికోసం ఆయన శ్రమించవలసి ఉంటుందన్నమాట! చక్రవర్తి స్వయంగా పని చేయడు. తన క్రింద ఉన్న వారితో పని చేయించుకుంటాడు. అలాగే విశ్వ సామ్రాట్టు తన సృష్టితాల చేత పని చేయించుకుంటాడు.

**(6) మానవుని సహజ భావన**

పుట్టించిన వాని పట్లనే సహజంగా ప్రేమాదరణల భావం, విధేయతా భావం జనిస్తుంది. ఈ ప్రేమ కారణంగా ఆయనపైనే నమ్మకం, భరోసా ఏర్పడుతుంది. ఆయనే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, ఆయనే మార్గనిర్దేశన చేస్తాడు, జ్ఞానానికి దూరం చేసి అంధకారంలో తచ్చాడుతూ ఉండేలా వదలిపెట్టడన్న విశ్వాసం కుదురుతుంది.

**(7) సృష్టికర్తకు, మహోపకారికి విధేయుడై ఉండాలన్న సహజ భావన**

మానవుడు తనను పుట్టించి, తనకు మేలు చేసిన వాని ఆజ్ఞకు తలఒగ్గి ఆయన్ని సంతోషపరచాలని కోరుకుంటాడు. సృష్టికర్త చాలా స్పష్టంగా తన ఆదేశాలను విశదీకరించాలనీ, ఏదీ అస్పష్టంగా ఉంచరాదని ఆశిస్తాడు. ఎందుకంటే వాటి ప్రకారం ఆచరించి లబ్ది పొందాలనీ, తన ఉపకారి ప్రసన్నతను చూరగొనాలని మనిషి అనుకుంటాడు.

**(8) సృష్టికర్త ఎదుట తలవంచి, కృతజ్ఞతలర్పించే సహజ భావన**

మానవుడు తన సృష్టికర్త, స్వామి, పోషకుడు, మహోపకారి సమక్షంలో వంగాలని కోరుకుంటాడు – ఇది అతని నైజంలోనే అంతర్లీనమై ఉంది. అయితే ఎలా వంగితే సృష్టికర్త ఇష్టపడతాడనేది తెలియాలి. ఆ విషయం సృష్టికర్తే తెలియపరచాలి. తద్వారా మానవ నైజం కూడా నెమ్మదిస్తుంది. సృష్టికర్తకు కూడా సంతోషం కలుగుతుంది.

సృష్టికర్త సమక్షంలో వినమ్రతతో తల వంచి ఆయన చేసిన మేళ్లకు గాను కృతజ్ఞతలు తెలుపుకోవాలనీ, ఆయన కీర్తన చేయాలని మనిషి హృదయపూర్వకంగా కోరుకుంటాడు.

తాను అపార కరుణామయుణ్ణి, కృపాశీలుణ్ణి అని సృష్టికర్త దాసులకు పరిచయం చేసుకున్నప్పుడు, దాసుని ఆంతర్యంలో సహజంగానే ఆయన యెడల భక్తిభావన జనిస్తుంది. ఆయన సామీప్యం కోసం అతను ఉవ్విళ్ళూరుతాడు. ఆయనకు చేరువై తరించాలని కాంక్షిస్తాడు.

ఇప్పుడు సృష్టికర్త చేయాల్సిందేమిటి? ఆయన మనిషి కోరికను అత్యుత్తమ రీతిలో తీర్చాలి. దానిని పరాకాష్ఠ (Climax) కు చేర్చాలి. మరోవైపున ఆయన మనిషిని ఏదేని సజీవి (Living) లేక నిర్జీవి (Non-Living) ఎదుట ప్రణమిల్లే స్థితి రాకుండా చూడాలి. ప్రణమిల్లడమంటే మనిషిని కించపరచటమే. మానవుని పట్ల సృష్టికర్తకు గల ప్రేమ, దయాభావం వాంఛించేదేమిటంటే, అతను ఏవేని

సృష్టితాల ముందు ప్రణమిల్లకుండా కాపాడాలి. (సృష్టికర్త మినహా మిగిలినవన్నీ సృష్టితాల క్రింద లెక్క). ఆఖరికి ఒక మనిషిని మరో మనిషి ముందు వంచకుండా ఉంచాలి.

తన వరకు చేరడానికి, తనకు కృతజ్ఞతలు తెలుపడానికి, తనను అభ్యర్థించుకోవటానికి, తన క్షమాభిక్షను పొందడానికి సృష్టికర్త మనిషికి చూపే పద్ధతి (System) మనిషిని అవమానపరిచే విధంగా ఉండకూడదు. అతనికి సాటి మనిషి ఎదుట తనను కించపరచుకోవలసిన దుస్థితి రానీయకూడదు.

కేవలం తన సమక్షంలోనే తలవంచమని ఆజ్ఞాపించాలి. ఇందులోనే మనిషి గౌరవం, హుందాతనం (Dignity) ఇమిడి ఉంది. దీనిద్వారానే అతని మనసుకు శాంతి, తృప్తి (Satisfaction) లభిస్తుంది. పుట్టించినవాడు అన్ని రకాల లోపాలకు, దౌర్బల్యాలకు అతీతుడు, పరిశుద్ధుడు. అలాంటి వాని ముందు ప్రణమిల్లినందుకు మనిషి మనసుకు సంతోషం కలుగుతుంది. తద్వారా అతనికి గౌరవం కూడా ప్రాప్తమవుతుంది. అతని మనోమయ భావాలకు నెమ్మది కూడా ప్రాప్తమవుతుంది.

**(9) మానవ నైజం వాంఛించేదేమిటి?**

శక్తిమంతుడు, సర్వాధికారి, ప్రతిదీ వినేవాడు, తెలిసినవాడు అయిన వాని ఆసరా పొందాలని మనిషి కోరుకుంటాడు. ఆయనే గనక శక్తిమంతుడు, సర్వాధికారి కాకపోతే ఆయన్ని నమ్ముకుని లాభమేమిటి? ఆయనే గనక వినలేనివాడు, తెలియనివాడైతే, ఆయన్ని మొరపెట్టుకుని ప్రయోజనమేమిటి?

**(10) దాసుడు సన్మార్గాన్ని, వెలుగును ప్రసాదించమని అర్థించినప్పుడు, అతనిని కటిక చీకట్ల నుండి వెలుగు వైపునకు తీసుకురాగలిగేవాడే సృష్టికర్త.**

**(11) తాను ఏం చేసినా, అది సృష్టికర్త దృష్టిలో ఉండాలని, అందుకు ఆయన పూర్తి ప్రతిఫలం ఇవ్వాలని మనిషి కోరుకుంటాడు.**

**(12) దాసునితో ప్రేమైక సంబంధం :**

ఈ 'ప్రేమ' వాంఛించేదేమిటంటే; సృష్టికర్త మనిషికి రుజుమార్గం వైపునకు దర్శకత్వం వహించాలి. దానికి సంబంధించిన ఏర్పాటు చేయాలి.

ప్రేమ కాంక్షించేదేమిటంటే; సృష్టికర్త అనేవాడు ఎట్టి పరిస్థితిలోనూ

అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని సహించకూడదు. దాసులు ఒకరింకొకరిపై దౌర్జన్యానికి ఒడిగట్టడాన్ని ఆయన ఎంతమాత్రం ఇష్టపడకూడదు.

## (13) బలహీనులతో సృష్టికర్త సంబంధం

సృష్టికర్త మనుషులలో కొందరికి విస్తృత ఉపాధిని వొసగాడు, మరికొందరి ఉపాధిని కుదిస్తాడు. లేదా జన్మతః కొందరికి ఎక్కువ ప్రతిభను ఇచ్చాడు, కొందరికి ఉపాధి సముపార్జనా అవకాశాలను ఎక్కువగా సమకూర్చాడు. జీవనోపాధి ఎక్కువగా ఇవ్వబడినవారు ఇతరులపై ఖర్చు చేయాలన్నది దీని పరమార్థం. ఇలా చేయటం వల్ల సామాజిక సంబంధాలు బలపడతాయి. సమాజంలోని బలహీనవర్గాలపై ఖర్చు చేయకుండా, లేదా సంపదను వినియోగం (Rotation) లోకి తీసుకురాకుండా ప్రోగుచేసి ఉంచే వారిని సృష్టికర్త ఇష్టపడకూడదు. ఈ అయిష్టత భయం మనిషిని బలహీనవర్గాల సహాయానికి పురికొలుపుతుంది. ఈ విధంగా సృష్టికర్త బలహీనులైన మనుషులను ఆదుకోవాలి. వారి అవసరాలను తీర్చాలి. మనుషుల మధ్య ఆర్థిక అంతరాల అగాధాలను పూడ్చి, వారి మధ్య సంబంధాలను మెరుగుపరచాలి.

## (14) దాసులకు రక్షణ

సృష్టికర్తకు తన దాసుల యెడల ప్రేమ ఉన్నప్పుడు ఆయన వారిని సర్వవిధాలా రక్షించాలి. వారి కోసం తానొక్కడే సరిపోవాలి. అంటే, తనకు అండగా ఆ సృష్టికర్త ఉంటే చాలు అన్న దృఢ నమ్మకం దాసునిలో పాదుకునేలా చేయాలి. సృష్టికర్త ఈ విధంగా ఉన్నప్పుడు ఆయనకు – దాసునికి మధ్య సంబంధం దృఢతరం అవుతుంది.

## (15) మొరలను ఆలకించేవాడై ఉండాలి

సృష్టికర్త తప్పనిసరిగా దాసుని ప్రార్థనను ఆలకించి ఆమోదించాలి. ఈ విశ్వంలో సృష్టికర్త తప్ప మొరలాలకించేవాడు, ఆమోదించేవాడు, వివేక సంపన్నుడు, దయాళువు, ప్రేమమయుడు, మహా శక్తిమంతుడు ఎవడున్నాడని? కనుక ఆయన తన దాసుని ప్రార్థనలను స్వీకరించాలి. అన్యథా మనిషి నిరాశకు లోనై జీవితంపైనే విరక్తి చెందుతాడు.

## (16) దాసుని మొరను ఆలకించేవాడే సృష్టికర్త

సృష్టికర్తలోని ఈ గుణం కారణంగా వారిరువురి మధ్య సంబంధం

బలపడుతుంది. సామీప్యం పెరుగుతుంది. కృతజ్ఞతలు తెలుపుకుని, విధేయత చూపేందుకు మనసు సన్నద్ధమవుతుంది. అంతే, అతను ఆత్మసమర్పణ చేసేసుకుంటాడు. ఎందుకంటే దీనివల్ల మనిషి అవసరాలు తీరుతాయి. ధర్మసమ్మతమయిన అతని కోర్కెలు నెరవేరుతాయి. అతని వ్యాకులత, బాధ తొలగిపోతుంది.

అందుకే –

ప్రతి దాసునితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండగలిగేవాడే సిసలయిన సృష్టికర్త. ఆయన దాసుని ప్రార్ధనను ప్రత్యక్షంగా వినాలి. దాసుడు ఆయనతో నేరుగా సంపర్కం ఏర్పరచుకోగలగాలి. ఏ అవరోధమూ లేకుండా, నిస్సంకోచంగా, ఎల్లవేళలా, ఎల్లెడలా అతను సృష్టికర్తకు విన్నపం చేసుకోగలగాలి. ఆ విన్నపాన్ని ఆయన స్వీకరించాలి. సృష్టికర్త నిరపేక్షాపరుడై ఉండాలి. ఆయన ఎవరిపైనా ఆధారపడిలేడు. ఆయనే గనక వేరొకరిపై ఆధారపడి ఉండేమాటైతే, తనను అర్థించే వారికి ఏం సహాయం చేస్తాడు? చెప్పవచ్చిందేమిటంటే సృష్టికర్త ఎవరి అక్కరా లేనివాడు. ఎందుకంటే ఆయనే ప్రతి దానిని పుట్టించినవాడు. అందరూ ఆయనపై ఆధారపడి ఉన్నారు. అందరూ బలహీనులే. ఆయన ఒక్కడే తిరుగులేని సార్వభౌమాధికారి.

మనిషిని సృష్టించి, అతని దైనందిన జీవన వ్యవహారాల పట్ల ఆసక్తి కనబరచనివాడు సృష్టికర్త కాజాలడు. లేదా మంచి వారితో సంబంధం కలిగి ఉంటూ చెడ్డవారిని నిస్సహాయులుగా వదలిపెట్టేసినవాడు కూడా సృష్టికర్త కాలేడు. లేదా దుర్వర్తనుల గోడును ప్రత్యక్షం (Direct) గా వినకుండా, సజ్జనుల విన్నపాలను మాత్రమే ఆలకించేవాడు కూడా సృష్టికర్త అనిపించుకునేందుకు అర్హుడు కాడు. చెడ్డవారిని ఇతరుల దయాదాక్షిణ్యాలపై వదలిపెట్టడం భావ్యం కాదు.

## (17) మొరలను ఆలకించి సృష్టికర్త దాసులతో తన అనుబంధం ఎటువంటిదో చెప్పకనే చెప్పాలి

సృష్టికర్త అనేవాడు ప్రతి మనిషి అభ్యర్థనను, ప్రార్థనను, విన్నపాన్ని వినాలి, ఎందుకంటే మనుషుల అభ్యర్థలను ఎలా నెరవేర్చాలో ఆయనకు మాత్రమే తెలుసు.

**(18) దాసుల పట్ల సృష్టికర్త వైఖరి మన్నింపుల వైఖరి అయి ఉండాలి**

దాసునికి తన పాపాల, అపరాధాల స్పృహ కలిగినప్పుడు సిగ్గుతో కుమిలిపోతాడు. ఆ సమయంలో అతనికి సృష్టికర్తలోని క్షమ, మన్నింపుల గుణంపై గట్టి నమ్మకం ఏర్పడుతుంది. ఈ కారణంగా అతను సృష్టికర్తను ఆశ్రయిస్తాడు. క్షమాపణకై వేడుకుంటాడు. పశ్చాత్తాపం చెందుతాడు. ఇకమీదట పాపాకార్యాలు చేయనని దృఢంగా సంకల్పించుకుంటాడు. సద్వర్తనునిగా జీవితం మొదలెడతాడు. తత్ఫలితంగా అతనికి మానసిక స్థిమితం కలుగుతుంది. హృదయం నెమ్మదిస్తుంది. అతని భావోద్రేకాలకు స్థిరత్వం (Stability) ప్రాప్తమవుతుంది. సృష్టికర్తలోని ఈ గుణం మనిషికి నవ జీవనం ప్రసాదించడానికి ఎంతో అవసరం.

**(19) మన్నింపుల వైఖరికై సృష్టికర్త పురికొల్పాలి**

సృష్టికర్త తన దాసుల యెడల మన్నింపుల వైఖరిని అవలంబించడంతో పాటు, దాసులు కూడా పరస్పరం క్షమ, మన్నింపుల వైఖరిని అవలంబించమని పురమాయించాలి.

**(20) సృష్టికర్త దాసుల తప్పులపై తక్షణం నిలదీయకూడదు**

మానవుడు బలహీనుడు. తరచూ తప్పులు చేస్తుంటాడు. అవిధేయత కనబరుస్తూ ఉంటాడు. తలబిరుసుతనం ప్రదర్శిస్తూ ఉంటాడు. కాబట్టి సృష్టికర్త మానవునిలోని ఈ దౌర్బల్యాన్ని దృష్టియందుంచుకుని అతనికి రాయితీ - Consider - ఇవ్వాలి. వెంటనే అతని తప్పులపై పట్టుకోకూడదు. పైగా చూపోపు వహించాలి. సడలింపుల విధానాన్ని అవలంబించాలి. కొంతకాలం వరకు వ్యవధినిచ్చి మనిషి తన్ను తాను సంస్కరించుకునేందుకు అవకాశం ఇవ్వాలి.

సృష్టికర్తలోని ఈ మన్నింపుల గుణం గురించి దాసునికి పూర్తిగా తెలిసివచ్చినప్పుడు అతను సృష్టికర్తతో తన సంబంధాన్ని మరింత పటిష్టం చేసుకుంటాడు. తత్ఫలితంగా అతను అవిధేయతా వైఖరికి దూరంగా ఉంటాడు.

**(21) సృష్టికర్త మంచిని పెంపొందించేవారికి బహుమానం ఇవ్వాలి. చెడులను వ్యాపింపజేసేవారికి శిక్ష కూడా విధించాలి**

ఒక వ్యక్తి స్వయంగా మంచిని చెయ్యడు, చెడులను కూడా

వ్యాపింపజేయడు. కాని మంచిని పెంచమని, చెడులను అరికట్టమని ఇతరులను ప్రేరేపిస్తాడు, ప్రోత్సహిస్తాడు. ఈ వ్యవహారంలో కూడా సృష్టికర్త చాలా సెన్సెటివ్ (Sensitive)గా ఉండాలి. ఆచరణను బట్టి బహుమానం వొసగటమో, శిక్షించటమో చేయాలి.

**(22) దాసునితో సృష్టికర్త సంబంధం ప్రత్యక్ష సంబంధమై ఉండాలి. దాసునికి సమీపంలో ఉండాలి.**

సృష్టికర్త తన దాసులతో ప్రత్యక్ష సంపర్కం (Direct in touch) ఏర్పరచుకుని ఉండాలి. ఆయన ప్రతి ఒక్కరి మొరను ఆలకించేవాడు, వారి అక్కరలను తీర్చేవాడై ఉండాలి. కేవలం సజ్జనుల, విధేయుల విన్నపం మాత్రమే కాదు, దాసులందరి విజ్ఞప్తిని వినేవాడై ఉండాలి. దాసుడు ఆయన వైపునకు మరలి, ధర్మాన్ని (దీన్‌ను) ఆయనకే ప్రత్యేకించి, దీనాతిదీనంగా ఆయన్ని వేడుకున్నప్పుడు సృష్టికర్త అతని మొరను ఆలకించి, అతన్ని ఆదుకోవాలి. అతనిని గండం నుంచి గట్టెక్కించాలి.

**(23) సృష్టికర్త ప్రతి మనిషికీ తనతో నేరుగా సంభాషించే అవకాశం ఇవ్వాలి.**

దాసుడు తనను ప్రార్థించే, పశ్చాత్తాపం చెందే సులభమైన (Simple), ప్రత్యక్షమైన (Direct) పద్ధతిని నేర్పాలి. ఎందుకంటే ఈ రెండు వస్తువులను (ప్రార్థన, పశ్చాత్తాపం) దాసుడు సాధారణంగా తనకై ప్రత్యేకించుకుంటాడు. ఇతరుల ముందు ఈ విషయాన్ని ప్రస్తావించడు. తన రహస్య వ్యవహారం ఒక్క సృష్టికర్తకు మాత్రమే తెలిసి ఉండాలనుకుంటాడు. అందుకే ప్రత్యక్ష సంపర్కం (Direct Approach) ద్వారా తన మనసులోని మాట చెప్పుకోవాలనుకుంటాడు. ఈ కాంటాక్ట్ పద్ధతి చాలా సులువైనదిగా ఉండాలనీ, అది తక్షణం ఆయన్ని చేరుకునేలా (Immediately Reachable) ఉండాలని కూడా భావిస్తాడు. ఈ వ్యవహారంలో వేరొకరి ప్రమేయం ఉండకూడదని అనుకుంటాడు. ప్రత్యక్ష పద్ధతి సహజమైనది. సాధారణంగా మనిషి స్వభావం దీనినే ఇష్టపడుతుంది. గత్యంతరం లేని పరిస్థితిలో మాత్రమే అది ఇతరత్రా పద్ధతుల వైపు దృష్టి సారిస్తుంది.

ఈ ప్రత్యక్ష పద్ధతి ద్వారా తన సృష్టికర్తకు ప్రతి ఒక్కరితో కాంటాక్ట్ ఏర్పడుతుంది. ప్రేమ వ్యక్తమవుతుంది. ఆయన దృష్టిలో మానవులంతా

ఒక్కరేనన్న విషయం స్పష్టమవుతుంది. ఆయన అందరి పట్ల ఒకేవిధంగా వ్యవహరిస్తాడనీ, అందరికీ సమానంగా అవకాశాలు కల్పిస్తాడన్న విషయం కూడా రూఢీ అవుతుంది.

అలాగే –

ఆరాధనా అవకాశాలు కూడా మానవులందరికీ సమానంగా లభించాలి. అందరూ ప్రత్యక్షం (Direct)గా, సులభంగా సృష్టికర్తతో సంబంధం ఏర్పరచుకోగలగాలి. ఆయన్ని ధ్యానించగలగాలి, ఆయన సంస్మరణ ద్వారా తమ మనసులను కుదుటపరచుకోగలగాలి.

సృష్టికర్తను స్మరించడానికి, ఆయన ప్రసన్నతను చూరగొనడానికి, ఆయన్ని ఆరాధించడానికి మధ్యలో వేరొకరి 'వాస్తా' ఉండకూడదు. ఆ మధ్యవర్తి అతని లాంటి మనిషి అయినాగానీ లేక మరొక ప్రాణి ఏదయినాగాని – వారి ప్రమేయం ఉండకూడదు. ఒక్క సృష్టికర్తను మినహాయిస్తే మిగిలిన వారంతా సృష్టించబడిన వారే. మరలాంటప్పుడు వారు సృష్టికర్తకి – మనిషికి మధ్య జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంటుంది? సృష్టికర్త ప్రతి మనిషికి సమీపంలో ఉండగా, అతనితో ప్రేమపూర్వక సంబంధం కలిగి ఉండగా వేరొకరి మధ్యవర్తిత్వం అక్కర లేదుకదా! సరైన పద్ధతి ఏమిటంటే మనిషికి సృష్టికర్తతో ప్రత్యక్ష సంబంధం ఉండాలి. ఇదే సహజమైన పద్ధతి. మానవ నైజం కోరేది (Demand), ప్రశంసించేది (Appreciate) కూడా ఇదే. ఈ పద్ధతినే అది అంగీకరిస్తుంది (Accept), ఒప్పుకుంటుంది. ఈ పద్ధతి ద్వారానే మనిషికి సంతృప్తి లభిస్తుంది, సంతోషం కలుగుతుంది, మనసు మొగ్గుచూపుతుంది. దీనివల్లనే విధేయతా భావం జనిస్తుంది. సృష్టికర్త సామీప్యం లభిస్తుంది. ప్రేమ చిగురిస్తుంది. అప్పుడే దాసుడు సృష్టికర్తను సంతోషపరిచేందుకు కృషి చేస్తాడు. ఆయన అప్రసన్నత పట్ల భీతి చెందుతాడు. అలాంటి స్థితిలోనే అతను సృష్టికర్త ఉపదేశాలను, ఆజ్ఞలను హృదయపూర్వకంగా శిరసావహిస్తాడు.

## (24) సృష్టికర్త తన దాసులకు సదా మేలు చేసేవాడై ఉండాలి.

సృష్టికర్త తరఫున జారీ అయ్యే సూచనలు, నిర్దేశాలు, శాసనాలు సహజమైనవి, న్యాయబద్ధమైనవి, వివేకవంతమైనవి, కారుణ్యప్రదమైనవి, ప్రేమపూర్వకమైనవి అయి ఉండాలి. మానవుడు వాటిని ఆచరణలో పెట్టినపుడు అవి నిలువెల్లా అతని పాలిట శుభకరమైనవిగా ఉండాలి. ఒకవేళ మానవుడు వాటిని

ధిక్కరించినట్లయితే, అతడు తనంతతట తానుగా – ఏరికోరి – ఆపదలు కొనితెచ్చుకునేవాడు కావాలి.

**(25) సృష్టికర్త దృష్టిలో మనిషి ప్రాణానికి విలువ, గౌరవం ఉండాలి.**

తనచే సృష్టించబడిన మనిషి సాటి మనిషి ప్రాణం తీసే దుస్సాహసానికి ఒడిగట్టకుండా ఉండాలి. అలా చేస్తే కఠిన శిక్షను చవిచూడవలసి ఉంటుందన్న విషయం సృష్టికర్త అతనికి తెలియపర్చాలి. అయితే లోకంలో న్యాయ స్థాపనకు, సత్యధర్మ సంస్థాపనకు మనిషి దుష్టుల్ని, దుర్మార్గుల్ని దండించ వచ్చు. అంతేగాని అకారణంగా ఎవరి జోలికీ పోరాదు.

**(26) సృష్టికర్త తన దాసుల అవసరాలను తీర్చినప్పుడే వారిపట్ల ప్రేమను అభివ్యక్తం చేసినట్లవుతుంది.**

మానవుణ్ణి పుట్టించి, అతని జీవిత లక్ష్యాన్ని తెలుపకుండా అతన్ని అతని మానాన వదలిపెట్టడం బాధ్యతా రాహిత్యం అనిపించుకుంటుంది. సృష్టికర్త అనేవాడు ఇలాంటి బాధ్యతా రాహిత్య ధోరణికి అతీతంగా ఉండాలి. తన ఈ బాధ్యతను సజావుగా నెరవేర్చి, మానవుని అవసరాన్ని ఉత్తమరీతిలో పూర్తి చేసేందుకు ఆయన తప్పకుండా ఏదయినా పద్ధతి (Method) ని అవలంబించి ఉండాలి. ఇప్పుడు మానవుని పనేమిటంటే అతను దానిని అన్వేషించాలి. అతను తన బ్రతుకుతెరువు కోసం ఎలా కష్టపడతాడో అలాగే సత్యాన్వేషణ చేసి తనలోని దాహాన్ని తీర్చుకోవాలి.

**(27) సృష్టికర్త తన దాసుని కృషికి విలువ ఇవ్వాలి.**

సృష్టికర్త తన దాసుని ఆచరణకు తగిన విలువ ఇవ్వాలి. ముఖ్యంగా పెద్ద పెద్ద అపరాధాల నుండి దాసుడు తనను కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాన్ని ఆదరించాలి. అతని వల్ల జరిగిన చిన్న చిన్న తప్పులను మన్నించాలి.

**(28) సృష్టికర్త గొప్ప సహనశీలుడై ఉండాలి.**

సృష్టికర్తకు తన దాసుని ప్రతి చిన్న పెద్ద విషయం తెలుసు. అతని తప్పులను, అపరాధాలను కూడా ఆయన ఎరుగు. అయితే ఆయన తన దాసుని ప్రతి చిన్న పెద్ద సేవలకు బహుమానం ఇస్తూనే, అతని చిన్న చిన్న తప్పుల పట్ల సడలింపుల వైఖరిని అవలంబించాలి (లెక్క తీసుకోవలసిందే. అయితే

దాసుడు చేసిన గొప్ప సత్కార్యాల దృష్ట్యా అతని చిన్న చిన్న పొరపాట్ల పట్ల చూపోపు వహించాలి).

**(29) దాసుడు చేసే ప్రతి చిన్న పెద్ద పనిని గురించి సృష్టికర్త లెక్క తీసుకోవాలి.**

సృష్టికర్త సన్నిధిలో ప్రతి చిన్న పెద్ద ఆచరణ గురించి జవాబు చెప్పుకోవలసి ఉందన్న భావన ఉన్నప్పుడు మనిషి నిర్లక్ష్యంగా వ్యవహరించడు. ప్రతి చిన్న విషయంలో కూడా ఆచితూచి వ్యవహరిస్తాడు. ఆ విధంగా అతను ఒక బాధ్యతాయుతుడైన వ్యక్తిగా మసలుకుంటాడు. మరోవైపున సృష్టికర్త కూడా మనిషి మానవుడుగా మారడానికి అవసరమయిన అవకాశాలన్నింటినీ కల్పించాలి. అతనిని మంచి పనులకై ప్రేరేపిస్తూ, మంచి పనులకు గాను బహుమానమిస్తూ, శిక్ష నుండి కాపాడుతూ ఉండాలి.

**(30) సృష్టికర్త తన దాసుల ఉద్దేశాలను సయితం తెలుసుకోగలిగేంత చేరువలో ఉండాలి.**

(బహిర్గతమైన) కొన్ని పనులు పైకి ఒకేవిధంగా కానవస్తాయి. కాని వాటి వెనుక గల సంకల్పాలలో చాలా వ్యత్యాసం ఉంటుంది. సంకల్పం ఒకవేళ సరైనదే అయినప్పటికీ దాని లోతుపాతుల్లో (Intensity) లో తేడా ఉంటుంది. కాబట్టి సృష్టికర్త అనేవాడు సంకల్పాల్లోని వ్యత్యాసంతోపాటు, వాటి లోతుల్లోని వ్యత్యాసాన్ని కూడా ఎరిగినవాడై ఉండాలి. దాని ప్రకారమే ప్రజలకు ప్రతిఫలం వొసగాలి. అంతేగాని బాహ్య ఆచరణల్ని చూసి కాదు.

ప్రతి సత్కార్యంలోనూ సంకల్ప శుద్ధి చాలా అవసరం. అన్యధా దుష్ట సంకల్పం వ్యక్తినీ, కుటుంబాన్నీ, సమాజాన్నీ ఉపద్రవం వైపునకు లాక్కుపోతుంది. సృష్టికర్త గుండెల్లోని గుట్టును సయితం ఎరిగిన వాడన్న నమ్మకం మనిషిని అతని సంకల్ప శుద్ధి విషయంలో జాగ్రత్తపడేలా చేస్తుంది. ఆచరణకు సంకల్పానికీ ఆదిలోనే సరైన దిశానిర్దేశన చేయాలి. దానిని సవ్యంగా ఉంచడానికి ఇది చాలా అవసరం. అప్పుడే మనిషి వ్యక్తిత్వం వికసిస్తుంది. అతని జీవిత ఉత్థానం సరైన దిశలో జరుగుతుంది.

**(31) మనుషులతో సృష్టికర్త సంబంధం ఒకేవిధంగా ఉండాలి**

మానవులందరి పుట్టుక లక్ష్యం ఒక్కటే. కాబట్టి ఈ లక్ష్య సాధనకు అవలంబించవలసిన విధానం కూడా ఒక్కటే అయి ఉండాలి.

అన్ని కాలాలలో మానవులందరికీ సృష్టికర్త పంపిన సందేశం ఒక్కటే అయి ఉండాలి. జీవితం యొక్క నైతిక ప్రమాణం (Method) కూడా ఒక్కటే అయి ఉండాలి. ఆచరణలను పరికించే, తూకం వేసే త్రాసు కూడా ఒక్కటే అయి ఉండాలి. ఎందుకంటే ప్రతి మనిషి ఒకే సహజత్వంపై పుట్టించబడ్డాడు. తొలి మానవుని కోసం ప్రమాణబద్ధమై ఉన్న విషయమే మానవులందరికీ ప్రామాణికం కావాలి.

**(32) మానవులందరి పట్ల గల ప్రేమ కోరేదేమిటంటే సృష్టికర్త అందరి పట్ల ఒకే విధంగా వ్యవహరించాలి.**

మానవులంతా సృష్టికర్తచే సృష్టించబడినవారు. కాబట్టి ఆయన మనుషుల మధ్య ఎలాంటి భేదభావం, విచక్షణ (Discrimination) చూపించకూడదు. ఎవరయినా ఒకరు జన్మతః సృష్టికర్తకు ప్రియతములనీ, మరొకరు ప్రియతములు కారని అంటే, సృష్టికర్తపై అపనింద మోపినట్లే. ఆయన తన చేత సృష్టించబడిన తన సృష్టితాలలో అకారణంగా వివక్ష చూపుతున్నాడని ఆరోపించినట్లే. ఒకవేళ విచక్షణ చూపినా దానికి ఏదయినా బలమైన కారణముండాలి. ఒకవేళ మానవుల మధ్య వ్యత్యాసమే పాటించాలనుకుంటే దానికి ప్రాతిపదిక ఒక్కటే – ఎవరు తమ బుద్ధిని ఉపయోగించి తమ సృష్టికర్తను తెలుసుకుంటారో, ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తారో, ఆయన ముందు బేషరతుగా ఆత్మ సమర్పణ చేసుకుంటారో చూడాలి. మరెవరు ఇలా చేయరో గమనించాలి. ఇలా చేయని వాడు జన్మతా ధనికుడైనా, ప్రగతి సాధించినవాడయినా, విద్యాధికుడయినా, తెల్లవాడైనా, అందగాడైనా – ఎవరయినా సరే – సృష్టికర్త దృష్టిలో ఆదరణీయుడు అవకూడదు. అయితే మానవుడు తన స్వయం కృషితో సృష్టికర్త ప్రేమాదరణలకు పాత్రుడు కాగలడు. తనలోని మంచితనం, భయభక్తులు, సుగుణాల ఆధారంగా సృష్టికర్తను మెప్పించగలడు. తనలోని విధేయతా భావం మూలంగా సృష్టికర్త చేత మంచివాడు అనిపించుకోగలడు.

**(33) దాసునికీ – సృష్టికర్తకి మధ్య ప్రత్యక్ష, శాశ్వత సంబంధం**

సృష్టికర్త సామీప్యం కోసం 'వాస్తా' అవసరముందని భావించటం కూడా సృష్టికర్తలో ఏదో బలహీనత ఉందని అనుకోవటమే. ఎందుకంటే మనిషికీ – సృష్టికర్తకి మధ్య గల సంబంధం సహజ సంబంధం. ప్రత్యక్ష సంబంధం. అలాంటి పవిత్ర బంధంలో వేరొకరికి ప్రమేయం కల్పించాలనుకోవటం అన్యాయం. ఇది ఒక విధంగా సృష్టికర్తను అవమానించటమే. ఆ నిజ దైవాన్ని

చేరుకోవటానికి చిల్లరదేవుళ్ళ ప్రమేయంగానీ, సజ్జనుల వాస్తాగానీ అక్కరలేదు.

## (34) సృష్టికర్త – మనిషి మధ్య గల సంబంధం సహజమైనది, శాశ్వతమైనది

కొడుకు మనోభావాలను, భావనలను, అవసరాలను గురించి తండ్రికి తెలియపరచడానికి వేరొక వ్యక్తిని ఆశ్రయించటం సమంజసం కాదు. తండ్రికి సన్నిహితుడు (Close), శ్రేయోభిలాషి అనదగ్గ మరో మనిషి వద్దకు వెళ్ళి, నా సమస్యలేమిటో కాస్త నా తండ్రికి చెప్పండి అని కోరటం అసహజమైన పద్ధతి. ఎందుకంటే తండ్రీ కుమారుల అనుబంధం కన్నా బలమైన, సమీపమైన సంబంధం ఇంకేముంటుంది? వారిది రక్త సంబంధం. తన కుమారుని గురించి వేరితరులకన్నా ఎక్కువగా తండ్రికే తెలుసు. కుమారునిలోని మంచితనం గురించి, బలహీనతల గురించి, తండ్రికన్నా ఎక్కువగా తెలిసినవారెవరుంటారు? ఈ రక్త సంబంధంలో నిష్కల్మషమైన ప్రేమ, మమకారం, అనురాగం, నమ్మకం అంతర్లీనమై ఉంటుంది. ఆ బంధం సున్నితమైనది, శాశ్వత (Permanent) ప్రాతిపదిక గలది – ఇన్ని సుగుణాలున్న ఆ బంధంలో వేరొకరు జోక్యం చేసుకోవలసిన అవసరం ఎక్కడుంటుంది? వారిద్దరి వ్యవహారంలో జోక్యం చేసుకోవటం అనవసరం, అసహజం. పైగా అది వారి మధ్య అలజడి, కలత (Disturb) సృష్టించటం వంటిది. సృష్టికర్త – మనిషి సంబంధాల వ్యవహారం కూడా ఇంతే. వారిద్దరి మధ్య ఎవరయినా జోక్యం చేసుకోవాల్సిన అవసరమే ఏముంది? దాసునికీ – సృష్టికర్తకి మధ్య గల సంబంధం చాలా దగ్గరి సంబంధం. దాసుడు తన సృష్టికర్తతో ప్రత్యక్షంగా సంభాషించగలడు. తన గోడు వినిపించుకోగలడు. తన మనసులోని మాటను ఆయన ముందుంచగలడు.

ఎంతో స్వచ్ఛమయిన, నిర్మలమయిన, సుస్పష్టమయిన, నిర్నిబంధ మయిన, జన్మతః సహజమయిన సంబంధాన్ని అసహజమయిన, నిర్హేతుక మయిన, కృత్రిమమయిన పద్ధతుల ద్వారా బలహీనపరచటం లేదా ఆ సంబంధంలో చిచ్చుపెట్టడం బహు చెడ్డ కార్యం. ఇలా చేయటం సిగ్గుచేటు విషయం, అనైతికం. ఒక్క సృష్టికర్త తప్ప మిగిలిన వారంతా (మిగిలినవన్నీ) సృష్టితాలే. వారు కాల్పనిక దేవుళ్ళయినా సరే (అంటే మనుషులు, దైవదూతలు). సృష్టికర్తకు – సృష్టితాలకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండాలి. వేరొక వ్యక్తి లేక వస్తువుకు మధ్యలో ప్రమేయం ఉండకూడదు.

**అయిదవ అధ్యాయం :**

# సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి? .... ఒక చూపులో!

## ఆరంభ చర్చ :

## దైవశక్తి, దైవ కారుణ్యం, ప్రేమ, వివేకం - ఇంకా దౌర్బల్యాలన్నింటికీ అతీతం

**(1)** సృష్టికర్త శాంతి ప్రదాత, అందరికీ అభయం ఇచ్చేవాడై ఉండాలి. అందరికీ రక్షణ కల్పించేవాడై ఉండాలి.

**(2)** సృష్టికర్త సమస్త దౌర్బల్యాలకు అతీతుడు, పవిత్రుడై ఉండాలి. జీవితావసరాల పరిమితి వర్తించని విశాల సంపన్నుడై ఉండాలి.

**(3)** ఆయన సకల చరాచర సృష్టికి మూలాధారం అయి ఉండాలి.

**(4)** సృష్టికర్త నిత్య సజీవుడు, శాశ్వతంగా స్థిరంగా ఉండేవాడై ఉండాలి.

**(5)** సృష్టికర్త సర్వలోకాలకు ప్రభువు కూడా అయి ఉండాలి.

**(6)** సృష్టికర్త దయామయుడు, కృపాశీలుడై ఉండాలి.

**(7)** సృష్టికర్త తన సృష్టితాల పట్ల ఎంతో ప్రేమమయుడై ఉండాలి. వారిపై అమితమైన వాత్సల్యం కలవాడై ఉండాలి.

**(8)** సృష్టికర్త ప్రతి క్షణం, ప్రతి వస్తువుపై నిఘావేసి ఉంచాలి. ఈ జగతి నిర్వహణ కోసం ఇదెంతో అవసరం.

**(9)** జ్ఞాన సంపన్నుడు, అన్నీ ఎరిగినవాడే సార్వభౌమాధికారి కాగలడు. సృష్టికర్త అనేవాడు ఇలాగే ఉండాలి.

**(10)** సృష్టికర్త జ్ఞానపరిధి బహు విశాలమైనదై ఉండాలి. ఆయన తన జ్ఞానంతో ప్రతిదానినీ పరివేష్ఠించి ఉండాలి.

**(11)** సృష్టికర్త దృష్టికి ప్రతి వస్తువూ ఆనుతూ ఉండాలి. ఏదీ ఆయన నుండి దాగి ఉండకూడదు.

**(12)** సృష్టికర్త పరిజ్ఞానం.

**(13)** ఈ జగతి పరిపాలనా పగ్గాలు సృష్టికర్త హస్తగతమై ఉండాలి.

**(14)** సృష్టించిన వాని ఆజ్ఞే చెల్లాలి.

**(15)** సృష్టికర్త మాత్రమే సమస్త జగతికి సార్వభౌముడై ఉండాలి. ఇందు నిమిత్తం సమస్తాధికారాలు ఆయన చేతుల్లో ఉండాలి.

**(16)** సృష్టికర్త ఆజ్ఞ ఒక్కటి చాలు.

**(17)** సృష్టికర్త మాత్రమే జగతి అంతటికీ చక్రవర్తి అయి ఉండాలి.

**(18)** ఈ చక్రవర్తి సకల దౌర్బల్యాలు బలహీనతలకు అతీతుడు, పవిత్రుడై ఉండాలి.

**(19)** సృష్టికర్తే స్వామి, యజమాని కూడా అయి ఉండాలి.

**(20)** సృష్టికర్త సర్వాధికుడు, సర్వశక్తుడై ఉండాలి.

**(21)** సృష్టికర్త ప్రతి దానిపై ప్రాబల్యం వహించేవాడు, ప్రతిదీ చేయగల సమర్థుడై ఉండాలి.

**(22)** సృష్టికర్తకే జగతిలోని సమస్త వస్తువులపై అదుపు అజమాయిషీ ఉండాలి.

**(23)** సృష్టికర్త ముందు అందరూ నిస్సహాయులై ఉండాలి. అందరిపైన ఆయన ఆజ్ఞలే చెల్లాలి.

**(24)** ప్రణాళికా రచన, దానిని ప్రవేశపెట్టడం సృష్టికర్త చేతుల్లోనే ఉండాలి.

**(25)** సృష్టికర్త అనేవాడి సంకల్పానికి ఏదీ అవరోధం కారాదు. వివశుణ్ణి చేయరాదు. సంకల్పించుకున్న దానిని చేసి తీరేవాడే సృష్టికర్త కాగలడు.

**(26)** సృష్టికర్తకు అలసట ఉండకూడదు.

**(27)** సృష్టికర్త అనేవాడు తిరుగులేనివాడై ఉండాలి.

**(28)** సృష్టికర్త 'అజీజ్'తో పాటు వివేక సంపన్నుడు కూడా అయి ఉండాలి.

**(29)** సృష్టికర్త ప్రచండుడు, చండశాసనుడు అయి ఉండటంతో పాటు దయాశీలి (రహీమ్) కూడా అయి ఉండాలి. లోకంలో అన్యాయం జరగకుండా ఉండటానికి ఇలా ఉండటం అవసరం.

**(30)** సృష్టికర్త పరమపవిత్రుడై ఉండాలి.

**(31)** సృష్టికర్తకు ఒకరికి సంజాయిషీ ఇచ్చుకోవలసిన అగత్యం ఉండకూడదు. ఎందుకంటే ఆయన వల్ల ఏ పొరపాటూ జరగదు. అన్యాయం, దౌర్జన్యం వంటి వాటికి ఆయన అతీతుడు.

**(32)** సృష్టికర్త వివేకవంతుడు కూడా అయి ఉండాలి. ఎందుకంటే దైవత్వంతో పాటు శక్తి, వివేచన కూడా కూడి ఉండటం అవశ్యం.

**(33)** సృష్టికర్త – సృష్టితాలు సమానం కాజాలవు.

**(34)** సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి?

## మార్గదర్శకత్వం

**(1)** సృష్టికర్త తరఫున మార్గబోధన జరగాలి.

**(2)** సృష్టికర్త అనేవాడు మనిషి ప్రాథమిక అవసరాలన్నీ తీరేలా ఏర్పాట్లు చేయాలి.

**(3)** తన ప్రసన్నతను చూరగొనే పద్ధతిని సృష్టికర్త విశదీకరించాలి.

**(4)** సృష్టికర్త ఇష్టపడేది.

**(5)** సృష్టికర్త దయామయుడు, ప్రేమమయుడు అయిన కారణంగా ఆయన మనిషి కొరకు ప్రవేశపెట్టే శాసనాలలో మృదుత్వం ఉండాలి. కాఠిన్యం ఉండకూడదు. అవి సులభంగా ఆచరించదగినవిగా ఉండాలి. మానవ నైజానికి అనుగుణంగా ఉండాలి.

**(6)** సృష్టికర్త యొక్క కారుణ్యం కోరేది.

**(7)** మానవుని బలహీనత – సృష్టికర్తలోని దయాగుణం.

**(8)** సృష్టికర్త తన ఆజ్ఞలను శిరసావహించి, అవలంబించే వారిని ఇష్టపడాలి.

## సృష్టికర్త ప్రతిదీ తెలుసుకోవాలి

**(1)** సృష్టికర్త పరిజ్ఞానం, పట్టు ఎలా ఉండాలి?

**(2)** శిక్షా బహుమానాల కోసం సృష్టికర్త తన దాసుల ఉద్దేశ్యాలను ఎరిగినవాడై ఉండటం అవశ్యం.

**(3)** సృష్టికర్త ప్రతి దానిని గురించి తెలుసుకునేవాడై ఉండాలి.

**(4)** సృష్టికర్త సూక్ష్మగ్రాహి, సమస్తాన్ని కనిపెట్టుకుని ఉండాలి.

**(5)** సృష్టికర్త దాసుల ఆంతర్యాల్లోని సంకల్పాన్ని సయితం ఎరిగినవాడై ఉండాలి. వారి కర్మకు తగ్గ ప్రతిఫలం ఇచ్చేందుకు ఇది అవసరం.

**(6)** మనిషి చేసే ప్రతి పనీ, అతను చెప్పే మాట సృష్టికర్తకు తెలియాలి.

**(7)** సృష్టికర్త నుండి ఏదీ దాగి ఉండకూడదు.

**(8)** చెప్పిన ప్రతి మాట, చేసిన ప్రతి పనీ, చెప్పని ప్రతి మాటా, చేయని ప్రతి పనీ ఎరిగినవాడే సృష్టికర్త.

## క్షమాపణ, పశ్చాత్తాపం, ఎంపిక స్వేచ్ఛ

**(1)** సృష్టికర్త అమితంగా మన్నించేవాడు, సహనశీలుడు అయి ఉండాలి.

**(2)** పాపాత్ముల పట్ల, సద్వర్తనుల పట్ల సృష్టికర్త వైఖరి ఎలా ఉండాలి?

**(3)** ఏమరుపాటు, పాపం, దౌర్జన్యం నుండి మరలి వచ్చిన దాసుణ్ణి సృష్టికర్త క్షమించాలి.

**(4)** నిజమైన పశ్చాత్తాపం చెందినప్పుడు సృష్టికర్త దాసుని మహాపరాధాన్ని సయితం క్షమించాలి.

**(5)** సృష్టికర్త దర్బారు నుండి మాత్రమే క్షమాభిక్ష లభించాలి.

**(6)** క్షమించటం, మన్నించి వదలిపెట్టడం.

**(7)** సృష్టికర్త గుణగణాలలో సమత్వం, సమతూకం ఉండాలి. ప్రేమ, దయ, జాలి, ఆగ్రహం మిశ్రమమై ఉండాలి.

**(8)** ఏదేని విధానాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను దాసునికి ప్రసాదించగలవాడే అసలు సృష్టికర్త.

## అభయం, రక్షణ

**(1)** సృష్టికర్త దాసుణ్ణి తన రక్షణలో ఉంచాలి.

**(2)** జీవన్మరణాలు సృష్టికర్త అధీనంలోనే ఉండాలి.

**(3)** సృష్టికర్త తన దాసుల జాతకాన్ని వేరొకరి చేతుల్లోకి ఇవ్వకూడదు.

**(4)** ఎవరి చేతుల్లో చావు బ్రతుకులు ఉన్నాయో ఆయన మాత్రమే సృష్టికర్త కాగలడు.

**(5)** లాభనష్టాలు చేకూర్చగల శక్తి సృష్టికర్త, స్వామి, పోషకుడైన వాని చేతుల్లోనే ఉండాలి.

**(6)** సృష్టికర్త, స్వామి అయినవాడు మనిషి సంరక్షకుడై ఉండాలి.

**(7)** పూర్తిగా నమ్మదగ్గవాడు, ఆధారపడదగినవాడే సృష్టికర్త కాగలడు.

**(8)** సృష్టికర్తకు దాసునితో సంబంధం – తన శక్తియుక్తుల అభివ్యక్తి.

## సృష్టికర్త అన్యాయాన్ని సహించకూడదు

**(1)** అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని సహించనివాడే సృష్టికర్త.

**(2)** దౌర్జన్యపరులతో సృష్టికర్త వ్యవహారం.

**(3)** దాసులు పరస్పరం న్యాయం చేయడాన్ని ఇష్టపడేవాడే సృష్టికర్త.

**(4)** ఒకరింకొకరిపై అన్యాయానికి, దౌర్జన్యానికి ఒడిగట్టరాదని దాసులకు ఉపదేశించేవాడే సృష్టికర్త.

**(5)** ఒండొకరికి ఉపకారం చేసుకునే దాసులను ఇష్టపడేవాడే సిసలయిన సృష్టికర్త.

**(6)** సృష్టికర్త అరాచకాన్ని, కల్లోలాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఇష్టపడడు. ఇష్టపడకూడదు.

## బహుమానం – శిక్ష

**(1)** సృష్టికర్త అనేవాడు మరణానంతరం మనుషుల లెక్క తీసుకుని, మంచివారికి బహుమానం వొసగాలి. దుర్మార్గులను శిక్షించాలి.

**(2)** 'న్యాయం' కొరకు సృష్టికర్త అందరికీ ఒకే కొలమానం ఉంచాలి.

**(3)** మనిషి చేసే ప్రతి చిన్నా పెద్ద కృషికి పూర్తి ప్రతిఫలం వొసగేవాడే సృష్టికర్త.

**(4)** సృష్టికర్త ప్రతి మనిషి చేసిన ప్రతి కర్మకు ప్రతిఫలం పూర్తిగా ఇవ్వాలి.

**(5)** సృష్టికర్త చేసిన ప్రతి కార్యం లక్ష్యబద్ధమైనదై ఉంటుంది.

**(6)** సృష్టికర్త చేసిన ప్రతి పని లక్ష్యబద్ధమైనదై ఉండాలి.

**(7)** చేసిన ప్రతి పని లక్ష్యబద్ధమైనదై ఉన్నప్పుడే ఆయన సృష్టికర్త కాగలడు.

**(8)** లక్ష్యబద్ధమైన పని.

## సృష్టికర్త తనను స్మరించే పద్ధతి తెలుపాలి

**(1)** తనను ధ్యానించే, స్మరించే పద్ధతులు తెలిపేవాడే సృష్టికర్త.

**(2)** సృష్టికర్తే ఖచ్చితంగా దాస్యానికి అర్హుడు. కాబట్టి ఆయన స్మరణ నిత్యం అవసరం.

**(3)** సృష్టికర్త ఆరాధన జరగాలి. ఆయనకే విధేయత కనబరచబడాలి. ఆయనకే భయపడాలి. ఆయనే ప్రేమించబడాలి.

**(4)** మానవుడు ఎలాంటి ఆరాధనను (దాస్యాన్ని) కోరుకుంటాడు

**(5)** సృష్టికర్త తన ఆరాధనా పద్ధతులను వివరించాలి.

## వాగ్దానాలను నెరవేర్చాలి

**(1)** సృష్టికర్త తాను చేసిన వాగ్దానాలను భంగపరచకూడదు.

**(2)** సృష్టికర్త తన వాగ్దానాలను సహాయం, బహుమానం రూపంలో నెరవేర్చాలి.

## సృష్టికర్త దుర్మార్గులను శిక్షించాలి

**(1)** సృష్టికర్త అనేవాడు ఎన్నటికీ లజ్జ వ్రీడలకు వ్యతిరేకంగా ఆజ్ఞాపించ కూడదు.

(2) పరస్పర అంగీకారంతో దాసులు చెడులకు ఒడిగట్టడాన్ని కూడా సృష్టికర్త సహించకూడదు. వారిని శిక్షించాలి.

## సిసలయిన సృష్టికర్త, ఆరాధ్యుడు ఎలా ఉండాలి?

(1) సిసలయిన సృష్టికర్త ఆరాధ్యదైవం ఎలా ఉండాలి?

(2) సృష్టికర్తే ఆరాధ్యదైవమై ఉండాలి.

(3) సృష్టికర్త తన పరిచయం దాసులకు ప్రేమతో చేయాలి. అప్పుడే దాసులు ఆయనకు చేరువవుతారు.

(4) సృష్టికర్త సాంగత్య భావనను మానవ నైజం ఇష్టపడుతుంది. తద్వారా నెమ్మదిని ఆస్వాదిస్తుంది.

(5) సృష్టికర్తకి ఇష్టమయిన దానిలో సృష్టికర్త పరిచయం ఇమిడి ఉంది.

## Comprehensive Description

(1) సృష్టికర్త అనేవాడు ఎలా ఉండాలి?

(2) మానవ నైజం సృష్టికర్త నుండి కోరేదేమిటి? సిసలైన సృష్టికర్త దానిని ఖచ్చితంగా నెరవేర్చాలి.

(3) సృష్టికర్తే ఖచ్చితమయిన సమాచారం ఇస్తాడు.

# సృష్టికర్త ఎలా ఉండాలి?

### తొలి చర్చ

సృష్టికర్త అనేవాడు ఎలా ఉంటాడు? ఇది తెలుసుకోవటం జీవితం యొక్క అత్యంత ముఖ్యమయిన అవసరం. ఎందుకంటే సృష్టికర్త యొక్క అత్యుత్తమ గుణాల గొప్ప ప్రభావం (Impact) మానవ జీవితంపై పడుతుంది. కాబట్టి వాటిని గురించి తెలుసుకోవటం, వాటిపై నమ్మకముంచటం ఎంతో అవసరం. సృష్టికర్త అనేవాడు అత్యుత్తమ గుణాలతో ముస్తాబై ఉండాలి.

## దైవశక్తి, కారుణ్యం, ప్రేమ, వివేచన

### (1) సృష్టికర్త అస్థిత్వం నిలువెల్లా శాంతినిచ్చేది, ఆయన రక్షణ కల్పించేవాడు

ఆయన అస్థిత్వం సదా సురక్షితంగా, చెక్కుచెదరకుండా ఉండాలి. ఆయనకు ఎప్పుడూ ఎలాంటి నష్టం కలగకూడదు. ఎవరూ ఆయనకు కీడు తలపెట్టలేని స్థితిలో ఉండాలి. ఆయనపై ఏ ఆపదా రాకూడదు. ఏ దౌర్బల్యం, లోపం కూడా ఆయన దరి చేరకూడదు. ఇలాంటి లోపాలన్నింటి నుండి ఆయన సురక్షితంగా ఉండాలి. ఆయన సదా సురక్షితుడుగా, పరిపూర్ణుడుగా ఉండాలి. ఆయన పరిపూర్ణతలో ఎప్పుడూ ఏ లోటూ రాకూడదు. ఇలాంటి అస్థిత్వమే ఆరాధ్య దైవం కాగలదు.

ఆయన శాంత స్వభావుడై ఉండాలి. ఆయన యొక్క ప్రతి కార్యం శాంతియుతమైనది, ప్రాణుల విస్తృత ప్రయోజనాలతో కూడుకున్నదై ఉండాలి. ఆయన మానవుల కోసం చేసిన శాసనాలలో కూడా శాంతిభద్రతలు ఇమిడి ఉండాలి. వాటి ద్వారా మానసిక శాంతి, స్థిమితం ఒనగూడాలి. ఆయన

ఉపదేశాలు మనిషికి మానసిక, నైతిక, శారీరక రుగ్మతల నుండి సురక్షితంగా ఉంచేవిగా ఉండాలి.

ఆయన అస్థిత్వం, ఆయన కార్యాలు శుభదాయకమైనవై ఉండాలి.

ఆయన పనులు తన సృష్టితాల పాలిట ఎన్నో రెట్లు (Multi Fold), ఎన్నో దిశల (Multi Directionally) నుండి లాభదాయకమైనవిగా ఉండాలి.

ఆయన అస్థిత్వంలో ప్రతాపంతో పాటు ఉదాత్తత కూడా ఉండాలి.

ఈ గుణాల ద్వారానే సృష్టికర్త గైకొనే చర్యలలో, నిర్ణయాలలో సమతూకం (Balance) వ్యక్తమవుతుంది. ఆయన దాసులను నిలదీయటంతో పాటు క్షమాభిక్ష కూడా ప్రసాదిస్తాడనీ, ఆగ్రహం చెందటంతో పాటు అనుగ్రహం కురిపిస్తాడన్న విషయం బహిర్గతం అవుతుంది.

**(2) సృష్టికర్త దౌర్బల్యాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడై ఉండాలి. జీవితావసరాల పరిమితులు వర్తించని విశాల సంపన్నుడై ఉండాలి.**

మానవుడు ఎన్నో వస్తువులను తయారుచేస్తాడు. వాటిని నడపటానికి (Operate చేయుడానికి) సాధనాలను, శక్తి (Source of Energy)ని సమకూరుస్తాడు. .... కొన్ని వస్తువులు విద్యుత్తుతో (Electrically Operated) నడుస్తాయి. ఉదాహరణకు : ఎ.సి., ఫ్యాన్ (A.C., Fan). కొన్ని పెట్రోలుతో నడుస్తాయి. ఉదాహరణకు : మోటారు వాహనం (Car). మరికొన్ని బ్యాటరీతో (Battery Operated) నడుస్తాయి. ఉదాహరణకు : ఆట వస్తువులు (Toys). కాని మనం స్వయంగా పెట్రోలు, విద్యుత్తు, బ్యాటరీ ద్వారా 'శక్తి'ని పొందలేము. వేరొక వస్తువు ద్వారా (ఆహారం ద్వారా)నే మనం మన కొరకు శక్తిని పొందగలుగుతాము.

అలాగే మన సృష్టికర్త ఏ వ్యవస్థ (System) ను మన కోసం – శక్తిని పొందేందుకు – పొందుపరిచాడో దాంతో ఆయన స్వయంగా శక్తిని పొందరాదు. మనం ఆహారం ద్వారా, నిద్ర ద్వారా శక్తిని పొందుతాము. కాని సృష్టికర్త ఇలాంటి అక్కరలకు అతీతుడు, ఉన్నతుడు అయి ఉండాలి. ఆయన అన్నపానీయాలకు, నిద్రకు, అలసటకు విశ్రాంతికి అతీతుడై ఉండాలి. ఎందుకంటే ఆయన ఈ విశ్వవ్యవస్థను నిరాఘాటంగా, అవిశ్రాంతంగా నడపవలసి ఉంది. ఆయనే గనక అలసిపోతే, నిద్రపోతే, కునుకు తీస్తే ఈ జగతి నడవదు. వాస్తవానికి ఇవి మానవ బలహీనతలు. మానవ అవసరాలు.

సృష్టికర్త అనేవాడు ఇలాంటి వాటికి అతీతుడై ఉండాలి. నిరపేక్షాపరుడై ఉండాలి. మరోవిధంగా చెప్పాలంటే ఆయనే సకల శక్తులకు మూల సరోవరం. ఈ జగతిలో కనబడే శక్తులన్నీ ఆయన ద్వారా లభించినవే.

**(3) సృష్టికర్త సకల చరాచర సృష్టికి మూలాధారం అయి ఉండాలి.**

తాను శాశ్వతంగా స్థిరంగా ఉండి ఇతరులకు స్థిరత్వాన్ని, నిలకడను ప్రసాదించేవాడే వాస్తవానికి 'ఖయ్యూమ్' కాగలడు. తన ఉనికిని కాపాడుకోవటానికి వేరొకరిపై ఆధారపడి ఉన్నవారెవరూ ఇతరులకు స్థిరత్వాన్ని, నిలకడను ప్రసాదించలేరు. నిదురపోనివాడు, కునుకు తీయనివాడు మాత్రమే ఈ విశ్వంలోని వస్తువులను నిలిపి ఉంచగలడు. నిదుర, కునుకు అనేది ఒక బలహీనత. అలసట మూలంగా ఈ నిస్సహాయస్థితి దాపురిస్తుంది. నిద్ర అనేది అలసత్వం యొక్క ఒక రూపం. ఇదెలాంటి బలహీనత అంటే, నిరంతరంగా ఈ విశ్వ వ్యవస్థను నిలిపి ఉంచడానికి, ఈ విశ్వ కర్మాగారాన్ని నడపటానికి తోడ్పడదు. నిద్రాలోలుడై తనను తాను నిలబెట్టుకోలేనివాడు ఈ విశ్వ వ్యవస్థను ఎలా నిలిపి ఉంచగలడు?

'అల్ ఖయ్యూమ్' (స్థిరంగా నిలిచి ఉండేవాడు, నిలిపి ఉంచేవాడు) ఇలాంటి బలహీనతలకు, నిస్సహాయ స్థితికి అతీతుడై ఉంటాడు.

ఒక జీవనమే మరో జీవనికి ఉనికిని ప్రసాదించగలుగుతుంది. మొదటి జీవనం రెండవ జీవనిని మిగిల్చి ఉంచదలచినంత కాలమే అది నిలిచి ఉంటుంది. అందుకే మొదటి జీవనం – అంటే సృష్టికర్త – స్థిరంగా, మూలాధారంగా ఉండాలి. అప్పుడే ఈ జగతి, జగతిలో ఉన్న జీవరాశులు స్థిరంగా ఉండగలుగుతాయి.

**(4) సృష్టికర్త నిత్య సజీవుడు, స్థిరంగా నిలిచి ఉండేవాడై ఉండాలి.**

సృష్టికర్త తనంతట తానుగా సజీవి అయి ఉండాలి. సదా నిలిచి ఉండాలి. అంటే ఏమీ లేనప్పుడు కూడా ఆయన ఉన్నాడు. మానవుని ఊహకు అందని విషయం (Beyond the strech of Imagination of Time) ఇది. అప్పటి నుంచే ఆయన ఉన్నాడు. మొదట్లో ఏ వస్తువు (జగతి)కి ఉనికి ప్రాప్తించాలన్నా, దానికన్నా ముందు ఒక జీవితం ఉండి ఉండాలి. అది రెండవ జీవితానికి జీవం పోసి ఉండాలి. లేనిదానికి ఉనికిని ఇచ్చి ఉండాలి. జగతిని నిర్మించి దానిని స్థిరంగా ఉంచడానికి ఇది చాలా అవసరం. ఇదంతా చేయగలిగినవాడే

మూలాధారం అనదగిన వాడవుతాడు. ఇలాంటివాడు బలహీనతలకు, అశక్తతకు అతీతుడై, పవిత్రుడై ఉండాలి. ఉదాహరణకు : అలసిపోవటం, నిద్రపోవటం, అస్వస్థతకు గురవటం, మరణించటం వంటివి ఆయనకు ఉండకూడదు.

**(5) సృష్టికర్త సకల లోకాలకు ప్రభువై ఉండాలి.**

'రబ్' అంటే ప్రభువు, పాలకుడు, పోషకుడు, పర్యవేక్షించేవాడు, వృద్ధి నొసగేవాడు, రక్షకుడు, మార్గదర్శకుడు.

ఆయన ప్రతి లోకానికి ప్రభువై ఉండాలి. చీమల లోకం ఉంది. మానవ లోకం ఉంది. సముద్రంలో, అంతరిక్షంలో, సృష్టితాలలో ఒక్కో లోకం ఉంది. నక్షత్రాలది (Galaxies) ఒక లోకం. ఇలాంటి లోకాలన్నింటికీ ఒకే ప్రభువు, పాలకుడు ఉండాలి. ఒక్కో లోకానికి ఒక్కో సృష్టికర్త, ఒక్కో పాలకుడు వేర్వేరుగా ఉండకూడదు. అన్నింటికీ ఒకే పాలకుడు ఉండాలి. ఎందుకంటే విశ్వమండలమంతా ఒక ఏకాంకం (Unit). అది ఒక్కడి క్రిందనే ఉండాలి. ఒకే పరిపాలన (Administration)లో ఉండాలి. అప్పుడే అన్నింటి మధ్యా పరస్పర సమన్వయం, సహకారభావం ఉండగలదు. ఒక స్కూలుకు ఒకే ప్రిన్సిపాల్ ఉండటం లాంటిదే ఇదీను.

**(6) సృష్టికర్త దయామయుడు, కృపాశీలుడై ఉండాలి.**

సృష్టికర్త అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అయి ఉండాలి. ఈ లక్షణం పోషకుడైన వానికి అనివార్యం. ఈ లక్షణం లేకుండా ఆయన ప్రభువు, పోషకుడు, పాలకుడు కాజాలడు. కనుక సృష్టికర్త అయినవాడే ప్రభువు కూడా అయి ఉండాలి. దాంతోపాటు ఆయన దయాళువు, కృపాకరుడు కూడా అయి ఉండాలి. అమితంగా దయచూపేవాడు మాత్రమే ఆరాధ్య దైవం కూడా కాగలడు.

**(7) సృష్టికర్త తన సృష్టితాల పట్ల ఎంతో ప్రేమమయుడై ఉండాలి.**

ఆలోచించిన మీదట అవగతమయ్యేదేమిటంటే దైవ కారుణ్యం ప్రతి వస్తువుపై ఆవరించి ఉంది. ఆయన కారుణ్య వైశాల్యాన్ని, లోతులను అంచనా వేయటం అసంభవం. దీనిని బట్టి బోధపడేదేమిటంటే ఆయన పూర్తి కారుణ్యంతో పాటు ఈ జగతిని పరిపాలిస్తున్నాడు. ఈ (కారుణ్య) గుణం లేనివాడు తన దాసుని కొరకు సకారాత్మకమైన చర్యలు గైకొనలేడు. అలాంటి వానిపై ఎక్కువగా ఆశలు కూడా పెంచుకోలేరు. చాలా తొందరగా అతను మనిషి తప్పులపై

ఆగ్రహించి, అతనిని నిలదీస్తాడు. వినాశకరమయిన చర్యలు గైకొంటాడు. మానవ జీవితాన్ని ఎక్కువ కాలం మిగిల్చి ఉంచడు. ఈ జగతి కూడా ఎక్కువ కాలం నిలిచి ఉండదు.

**(8) సృష్టికర్త అనుక్షణం, అన్నింటిపై నిఘా వేసి ఉంచాలి. ఈ జగతి నిర్వహణకు ఇది ఎంతో అవసరం.**

సృష్టికర్త, జగతికి స్వామి అయినవాడు సర్వజ్ఞాని అయి ఉండటంతో పాటు, చాలా అప్రమత్తంగా కూడా ఉండాలి. ఏది ఎక్కడ ఉందో, ఉండాలో కనిపెట్టుకుని ఉంటూ, ఎక్కడ ఏ వస్తువును సమకూర్చవలసి ఉందో కూడా గమనిస్తూ ఉంటేనే ఈ విశ్వవ్యవస్థ సజావుగా సాగుతుంది.

**(9) అన్నీ తెలిసిన జ్ఞాన సంపన్నుడే సార్వభౌమాధికారిగా పరిపాలించ గలడు.**

జ్ఞాన సంపన్నుడు, అన్నీ తెలిసినవాడే సార్వభౌమాధికారిగా వెలుగొంద గలడు. అలాంటివాని దైవత్వం మాత్రమే జగతిలో నడుస్తుంది. సృష్టికర్తకు మాత్రమే జగతిలోని వస్తువులన్నింటి పరిజ్ఞానం ఉంది. ఏమిటి, పుట్టించిన ఆయనే ఎరుగకుండా ఉంటాడా?

**(10) సృష్టికర్త జ్ఞాన పరిధి**

సృష్టికర్త జ్ఞానపరిధి, నిఘా నుండి భూమ్యాకాశాలలోని ఏ వస్తువూ దాగి ఉండకూడదు. ప్రతి క్షణం, ప్రతి వస్తువూ ఆయన కనుసన్నలలో ఉండి తీరాలి. పుట్టించిన వానికి – తాను పుట్టించినవి సజీవమైనవిగానీ, నిర్జీవమైనవి గానీ – వాటి గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. అప్పుడే ఈ జగతి, అందలి జీవన వ్యవస్థ సాఫీగా నడుస్తుంది.

**(11) సృష్టికర్త దృష్టికి ప్రతిదీ గోచరమై ఉండాలి. ఏదీ ఆయన నుండి గుప్తమై ఉండకూడదు.**

ఆయన దృష్టిలో భూత, వర్తమాన, భవిష్యత్తులు ఏమాత్రం లెక్కలోకి రావు. సుదీర్ఘమయిన ఈ కాలం ఆయన ముందు వర్తమానం లాంటిదే అయి ఉండాలి. లక్షలాది సంవత్సరాల మాజీ కాలం (Period) లక్షలాది సంవత్సరాల భవిష్యత్కాలం సృష్టికర్త దృష్టిలో ఎల్లవేళలా ఉండాలి.

మన దృష్టి కోణం నుంచి మన పాలిట ఒక వస్తువు మన కళ్ల ముందర ఉంటుంది, లేదా మన కంటికి కానరాకుండా ఉంటుంది. కాని సృష్టికర్త దృష్టిలో ప్రతి వస్తువూ సదా వ్యక్తమై ఉండాలి. ఏదీ గుప్తమై ఉండకూడదు.

మనకు ఎన్నో వస్తువుల గురించి ఏమీ తెలీదు. సైన్సు గురించి ఎవరికీ పూర్తిగా తెలీదు. కాని సృష్టికర్తకు పూర్తిగా తెలిసి ఉంటుంది. కనుకనే ఆయన పూర్తి పరిజ్ఞానంతో పరిపాలన సాగిస్తున్నాడనీ, నిర్ణయాలు గైకొంటున్నాడన్న నమ్మకం కుదురుతుంది.

## (12) సృష్టికర్త పరిజ్ఞానం

జగతిలో ఏముందో, ఏం జరుగుతున్నదో సృష్టికర్తకే గనక తెలీకపోతే ఆయన ఇక్కడి ఏర్పాట్లు, బందోబస్తు ఎలా చేయగలడు? ఎవడేం చేస్తున్నాడో తెలీకపోతే ఆయన ఎవరికయినా పురస్కారం ఎలా ఇవ్వగలడు? శిక్ష ఎలా విధించగలడు? ఆంతర్యంలో జనించే భావాలు భావనలు, మస్తిష్కంలో మొగ్గ తొడిగే ఆలోచనల గురించి ఆయనకు తెలీకపోతే ఆయన మనకు ఎలా తోడ్పాటు అందించగలడు? నిశ్శబ్దంగా చేసే ప్రార్థనలను గనక ఆయన వినలేకపోతే ఆయన మనకు సహాయం ఎలా చేయగలడు? అవసరాలు ఎలా తీర్చగలడు?

## (13) జగతి పరిపాలనా పగ్గాలు సృష్టికర్త చేతుల్లోనే ఉండాలి.

ఎందుకంటే అందరూ ఆయనచే సృష్టించబడినవారే. ఆయన ఎదుట అందరూ అశక్తులే, నిస్సహాయులే. ఎవరికీ ఎలాంటి అధికారం లేదు. సృష్టికర్త గనక ఎవరయినా ఒక వ్యక్తి తలబిరుసుతనంపై నిలదీయగోరితే ఆయన్ని ఎవరూ అడ్డుకోజాలరు. సృష్టికర్త తాను అనుకున్నది చేసి తీరాలి. అలాంటివాడే సృష్టికర్త.

## (14) సృష్టించినవాని ఆజ్ఞే చెల్లాలి.

జగతి అంతటినీ సృష్టించినవాడు ఒక్కడే అయినప్పుడు సహజంగా ఆయన ఒక్కడే ఈ జగతి అంతటికీ స్వామి, యజమాని కాగలడు. కాబట్టి ప్రతి పనీ యజమాని సమ్మతి (Sanction) తోనే, ఆజ్ఞ (Order) తోనే జరగాలి. కాబట్టి దాసునికి లాభమైనా, నష్టమైనా చేకూర్చే అధికారం కూడా ఆయనకే స్వంతం.

**(15) సృష్టికర్త మాత్రమే విశ్వానికంతటికీ సార్వభౌముడై ఉండాలి. సార్వభౌమత్వానికి కావలసిన శక్తి (Power) కూడా ఉండాలి.**

సార్వభౌముడైన వానికే ప్రశంసలు, పొగడ్తలు శోభిస్తాయి. ప్రతిదీ చేయగల సమర్థుడే సార్వభౌముడు కాగలడు. సృష్టికర్తకు మాత్రమే ప్రతిదానిపై అదుపు అజమాయిషీ ఉంది. కనుక సమస్త జగతిలో సృష్టికర్త మాత్రమే సామ్రాట్టుగా, చక్రవర్తిగా ఉండగలడు.

**(16) సృష్టికర్త ఆజ్ఞ ఒక్కటి చాలు.**

తాను కోరిన దానిని సృష్టించగలిగేవాడు, కోరిన విధంగా సృష్టించేవాడు మాత్రమే సృష్టికర్త అవుతాడు. ఈ సృష్టించే పని కోసం ఆయనకు కారకాల అవసరం లేదు. ఆయన కారకాలపై, ఒనరులపై ఆధారపడినవాడు కానేకాడు. ఏదయినా ఒక పనిని చేయడానికి ఆయన కష్టపడవలసిన అవసరం ఉండకూడదు. జగతిలోని ప్రతిదీ ఆయనచే సృష్టించబడినదే. ఆయన పాలనలో ఉన్నదే. కాబట్టి అవన్నీ ఆయన ఆజ్ఞకు లోబడినవే (Under Command) అయి ఉండాలి. ప్రతిదీ ఆయన ఆజ్ఞ కోసం వేచి ఉండాలి. ఆయన సేవలో నిమగ్నమై ఉండాలి. ఆయన విధేయతకై సిద్ధంగా ఉండాలి. ఆయన ఒక్కసారి ఆజ్ఞాపించగానే అవి వాటిని శిరసావహించాలి (అవి ప్రాణమున్నవైనా, ప్రాణంలేనివైనా అన్నింటికీ ఆయన ఆజ్ఞ సమానంగా వర్తించాలి).

**(17) సృష్టికర్త మాత్రమే సమస్త జగతికి సామ్రాట్టు అయి ఉండాలి.**

సృష్టికర్త అనేవాడు ఏదయినా ఒక ప్రదేశానికి, ఒక వర్గానికి, లేక ఒక లోకానికి చక్రవర్తి అయి ఉంటే సరిపోదు. ఆయన సమస్త లోకాలకు, సమస్త విశ్వమండలానికి సామ్రాట్టు అయి ఉండాలి. ఎందుకంటే విశ్వంలోని వాటన్నింటినీ సృష్టించినవాడు ఆయనే. అదీగాక ఈ జగతి, అందలి వస్తువులన్నీ కలసి ఏకాంశం (Unit) అవుతాయి. అవి ఒండొకదాని వెలితిని (Compensate) పూరిస్తూ ఉంటాయి. కాబట్టి ప్రతిదీ ఆ ఒక్కడైన సృష్టికర్త, శక్తిమంతుని ఆజ్ఞకు, అధికారానికి లోబడి ఉండాలి. అలాంటి సామ్రాట్టే ఆరాధ్యుడు, పూజనీయుడు కాగలడు.

**(18) విశ్వసామ్రాట్టు దౌర్బల్యాలన్నింటికీ అతీతుడై ఉండాలి.**

ఏదయినా ఒక రాజ్యపాలకుడు వృద్ధుడై నీరసించిపోయినప్పుడు, అస్వస్థతకు లోనైనప్పుడు పరిపాలనా పగ్గాలు తన కుమారునికి అప్పగిస్తాడు. ఎందుకంటే బలహీనత – పరిపాలన ఒండొకదానితో పొసగలేవు. పరిపాలన స్తంభించిపోతుంది. పరిపాలనా వ్యవహారాలు కుంటుపడతాయి. రాజ్యంలో అరాచకం, అలజడి ప్రబలుతుంది. తిరుగుబాటు జరుగుతుంది. కాబట్టి విశ్వసామ్రాట్టు ఇలాంటి బలహీనతలన్నింటికీ అతీతుడై ఉండాలి. లేకుంటే విశ్వవ్యవస్థ కుంటుపడుతుంది. అస్తవ్యస్తత ప్రబలుతుంది. అందుకే విశ్వసామ్రాట్టుకు ఎలాంటి అలసట, అలసత్వం ఉండకూడదు. ఆయనకు నిద్ర రాకూడదు, కునుకు పట్టకూడదు, ఆయనలో వృద్ధాప్యం తొంగిచూడ కూడదు. ఆయనకు జబ్బు చేయకూడదు. ఆయన నిత్యం సామ్రాట్టుగానే వెలుగొందాలి. ఆయన ఒక్కడి ఆజ్ఞలే ఈ జగతిపై, అందలి జీవరాశులపై చెల్లుబాటు కావాలి. రాజ్యం ఆయనదే కాబట్టి రాజ్యాధికారం, పరిపాలన కూడా ఆయనకే చెందాలి.

**(19) సృష్టికర్తే యజమాని కూడా అయి ఉండాలి.**

అంటే పూర్తిస్థాయిలో (Full Fledge) స్వామి, యజమాని అన్నమాట – తాను పుట్టించిన ప్రతి వస్తువుకూ యజమాని, సర్వకాల సర్వావస్థల్లో యజమాని అయి ఉండాలి. కొంత కాలంపాటు కొన్ని పరిమిత అధికారాలతో (With limited Power and Time Bond) యజమానిగా ఉంటే సరిపోదు. ఆయన్ని ఆయన అధికారం నుండి ఎవరూ ఉద్వాసన పలికే సాహసం చేయగలిగే స్థితిలో ఉండకూడదు. ఆయన పరిపాలనలో అధికారాలు చెలాయించే విషయంలో ఎవరూ అడ్డు పడకూడదు. ఆయన కోరిన వారిని కోరిన స్థితిలో ఉంచగలగాలి. తాను కోరుకున్న వారిని కటాక్షించగలగాలి. తాను కోరుకున్న వారిని తన కటాక్షానికి నోచుకోకుండా చేయగలగాలి. తనను ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండకూడదు. తన చర్యలపై అభ్యంతరం తెలిపే సాహసం ఎవరూ చేయకూడదు.

**(21) సృష్టికర్త అందరిపై ప్రాబల్యం వహించేవాడై ఉండాలి.**

సృష్టికర్త అందరిపై ఆధిక్యత వహించినవాడై ఉండాలి. అప్పుడే విశ్వమంతటిపై ఆయన అధికారం చెల్లుబాటవుతుంది. అప్పుడే ఆయనపై

భారం మోపవచ్చు. బలహీనుడు, వేరొకరిపై ఆధారపడినవాడి (Dependent) పై భరోసా చేసి, ఆశలు పెట్టుకుంటే అవి వమ్మయిపోతాయి.

**(22) సృష్టికర్త ప్రతిదీ చేయగల సమర్థుడై ఉండాలి.**

ఏ కారకాలు, సాధనాలు లేకుండా కూడా అనూహ్యమైన రీతిలో ఏదేని కార్యం సాధించటం సంభవం కాదు. కాని సృష్టికర్త మాత్రం తన శక్తియుక్తులతో అది చేయగలగాలి. ఆయనకు కారకాల అవసరం ఉండకూడదు. అనుకున్నది ఏదయినాసరే చేయగల స్థితిలో ఉండాలి.

**(23) జగమంతా సృష్టికర్త పరిపాలనే ఉండాలి.**

ప్రతి వస్తువు విషయంలో అంతిమ నిర్ణయాధికారం (Final Authority) సృష్టికర్తకే ఉండాలి. ఆయన అనుజ్ఞ లేకుండా లేదా అభీష్టంతో నిమిత్తం లేకుండా ఏ ఘటనా జరగకూడదు. అన్యథా ఆయన అధికార నిర్వహణలో ఇతరుల ప్రమేయం ఉంటుంది. మనిషి తాను చేసే ప్రయత్నం కోసం ఒనరులను సమకూర్చుకోవటం, లేదా అవరోధం కల్పించి అతని ప్రయత్నం సఫలీకృతం కాకుండా చేయటం, లేదా మనిషి ప్రయత్నం స్వయంగా అతనికి వ్యతిరేకండా పరిణమించటం – ఇన్ని కోణాల నుండి కూడా మనిషికి తన నిస్సహాయస్థితి తెలిసివస్తుంది. చివరకు సృష్టికర్త ఆజ్ఞ మాత్రమే చెల్లుబాటవుతున్నట్లు కాన వస్తుంది.

**(24) సృష్టికర్త సమక్షంలో అందరూ అశక్తులై ఉండాలి. ఆయన మాత్రమే సర్వాధిక్యుడై ఉండాలి.**

ఒక మనిషి సాటి మనిషికి వ్యతిరేకంగా రచించిన వ్యూహాన్ని నిర్వీర్యం (Nullify) గా చేయగలిగేవాడే, బెడిసికొట్టేలా చెయ్యగలిగేవాడే సృష్టికర్త కాగలడు. ఎట్టి పరిస్థితిలోనూ తన వ్యూహ రచనను చెల్లుబాటయ్యేవిధంగా చేయగలవాడే సృష్టికర్త అవుతాడు.

**(25) ప్రణాళికా రచన చేయడం, దానిని అమలుపరచటం కూడా సృష్టికర్త చేతుల్లోనే ఉండాలి.**

సృష్టించటం, ప్రణాళికను రచించటం, దానిని ప్రవేశపెట్టడం, రూపకల్పన చేయటం .... ఇవన్నీ ఒకే పరంపరకు చెందిన పనులు. ఇందులో పరస్పర

సమన్వయం ఉంది. ఒకటి మరో దానితో పెనవేసుకుని ఉంది. ఈ పనులన్నీ కలసి ఒక లక్ష్యాన్ని పూర్తి చేస్తాయి. వీటిని వేరు పరచటం కుదరదు.

చివరి హద్దు వరకు సజావుగా పనిని పూర్తి చేయడానికి ఇవన్నీ ఒకానొక శక్తిమంతుని చేతుల్లో, ఆయన అధికార పరిధిలో ఉండాలి. అంటే సృష్టికి శ్రీకారం చుట్టినవాడే దానిని అమలులోకి తీసుకువస్తాడు. దానిని నిలిపి ఉంచుతాడు. కనుక రూపకల్పన చేసే పని కూడా సృష్టికర్తే చేయాలి.

**(26) సృష్టికర్త అనుకున్నదానిని చేయడంలో ఏదీ అశక్తుణ్ణి చేయరాదు. ఆయన ప్రతిదానిపై తిరుగులేని ఆధిపత్యం కలవాడై ఉండాలి.**

**(27) సృష్టికర్త అలసిపోకూడదు.**

అలసిపోయేవాడు సృష్టికర్త కాలేడు. అలసట ఒక బలహీనత. బలహీనుడు ఆరాధనకు, దాస్యానికి అర్హుడు కాజాలడు.

**(28) సృష్టికర్త తిరుగులేని శక్తి అయి ఉండాలి.**

సృష్టికర్తకు ఎదురు ఉండకూడదు. ఆయన నిర్ణయాలు అమలులోకి రాకుండా అడ్డుకునే శక్తి ఏదీ ఉండకూడదు. ఆ గొప్ప శక్తిమంతుని ముందు తల ఎత్తే సాహసం కూడా ఎవరూ చేయకూడదు. ఆయన తీర్పులను ఎదిరించటం ఎవరి వల్లా కాకూడదు. ఆయన ముందు అందరూ అశక్తులూ, నిస్సహాయులై ఉండాలి.

**(29) సృష్టికర్త శక్తిమంతునితో పాటు వివేకవంతుడు కూడా అయి ఉండాలి. తిరుగులేని** (Unchallengeable) **ఆయన శక్తి సద్వినియోగం కావాలి.**

సృష్టికర్త తిరుగులేనివాడు, గొప్ప శక్తిమంతుడవటంతో పాటు ఆయన వివేకవంతుడు కూడా అయి ఉండాలి. ఆయన ఏ పని చేసినా అది విజ్ఞత, వివేచనలతో నిండి ఉండాలి. అప్పుడే అది ప్రాణులకు ప్రయోజనకరం కాగలదు. ఆయన చేసే ఏ పనిలోనయినాసరే అవివేకం, అజ్ఞానం ఛాయామాత్రంగా కూడా ఉండకూడదు. అన్యథా విధ్వంసం, అన్యాయం జరుగుతుంది. ఒక వైపున తిరుగులేని శక్తిమంతుడు ఉండగా మరో వైపున ప్రతిఘటించే వాడెవడూ లేని పరిస్థితి ఏర్పడుతుంది. తనిఖీ (Check) చేసే వాడెవడూ లేని, సంజాయిషీకి ఆస్కారం లేని పరిస్థితి ఎదురవుతుంది.

**(30) సృష్టికర్త ఎదురులేనివాడై ఉండటంతో పాటు కృపాశీలి (రహీమ్) కూడా అయి ఉండాలి. అన్యాయం, దౌర్జన్యం చేయకుండా ఉండేటందుకు ఇది అవసరం.**

సృష్టికర్త అనేవాడు తిరుగులేని శక్తిమంతుడు (Unchallengeable, Powerful), నిలదీతకు అతీతం (Unquestionable) గా ఉండటంతో పాటు ఆయన కృపాకరుడు కూడా అయి ఉండాలి. లేకపోతే ఈ ప్రపంచ వ్యవస్థ తొందరగానే కుప్పకూలిపోతుంది. మానవునికి ఎక్కువ కాలం వ్యవధి లభించదు.

**(31) సృష్టికర్త పరమ పవిత్రుడు కూడా అయి ఉండాలి.**

సృష్టికర్త అనేవాడు సకల దుర్గుణాలకు అతీతుడు, పరమ పవిత్రుడు అయి ఉండాలి. ఆయనలో ఏ లోపం కూడా ఉండరాదు. మరే దుష్ట లక్షణమూ ఉండకూడదు. పైగా ఆయన ఏ దోషం లేని పునీతుడై ఉండాలి. ఇలాంటి పరిశుద్ధుడే ఆరాధనలకు అర్హుడు కాగలడు.

**(32) సృష్టికర్తకు ఎవరికీ సంజాయిషీ ఇచ్చుకోవలసిన అగత్యం ఉండకూడదు. ఎందుకంటే ఆయన వల్ల ఏ పొరపాటూ జరగదు.**

**(33) అన్యాయం, దౌర్జన్యం వంటి వాటికి ఆయన అతీతుడు.**

ఒకరికి సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరం లేనివాడే సృష్టికర్త, స్వామి, పాలకుడు, ఆరాధ్యుడు కాగలడు. అందరూ ఆయన సమక్షంలో సంజాయిషీ ఇచ్చుకోవలసినవారే. అధికారాలు, ఒనరులు తనవి కాకుండా, మరొకరి ద్వారా పొందినప్పుడే సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుంది. అనుగ్రహ భాగ్యాలు తనవి కాకుండా మరొకరి ద్వారా ప్రసాదితమై ఉన్నవాడు బలహీనుడు, అతని వల్ల తప్పులు జరిగే అవకాశముంటుంది. అతను ఆ వరప్రసాదాలను దుర్వినియోగపరిచేందుకు ఆస్కారముంటుంది. అతను అన్యాయానికి ఒడిగట్టే, హక్కులను కొల్లగొట్టే అవకాశం ఎంతయినా ఉంటుంది. అయితే సృష్టికర్త ఇలాంటి లోపాలన్నింటికీ అతీతుడు. ఆయనే తుది నిర్ణయం గైకొనే సర్వోన్నతాధికారి (Final Authority). ఈ అధికారాలన్నీ ఆయన స్వంతం. అవి వేరొకరు ప్రసాదించినవి కావు. కాబట్టి ఆయన ఒకరికి సంజాయిషీ ఇచ్చుకోవలసిన అవసరం లేదు.

**(34) సృష్టికర్త వివేక సంపన్నుడై ఉండాలి. ఎందుకంటే దైవత్వంతో వివేకం, శక్తి కూడా పెనవేసుకుని ఉండటం అవశ్యం.**

అశక్తుడు, బలహీనుడు, అవివేకి అయిన దైవాన్ని నమ్మి ప్రయోజనం ఏమిటి? మానవ వ్యవహారాలను గురించి తెలియనివాడు, మనిషి భావాలు భావనలను పసిగట్టలేనివాడు, మనిషి అక్కరలను తీర్చలేనివాడు, వస్తు సామగ్రిని సమకూర్చి వ్యవస్థను చక్కదిద్దలేనివాడు ఉన్నా లేకున్నా ఒక్కటే.

**(35) సృష్టించినవాడు – సృష్టించబడినవాడు సమానులు కాలేరు.**

సృష్టికర్తకు గల జ్ఞానం సృష్టితాలకు ఉన్న జ్ఞానం వంటిది కాదు. సృష్టికర్తకే గనక సృష్టితాల అవసరం ఏర్పడితే దాని అర్ధం ఆయన బలహీనుడు, అశక్తుడన్నమాట! అలాంటి అశక్తునికి ఆరాధ్య దైవం అయ్యే యోగ్యత ఉండదు. సృష్టికర్తను – సృష్టించబడిన వారిని జనులు ఒకే వరుసలో నిలబెట్టడం విడ్డూరం! సృష్టికర్త దైవత్వంలో సృష్టితాలకు భాగస్వామ్యం కల్పించటం విచిత్రం!! ఈ విధంగా వారు సృష్టితాలను సృష్టికర్త ఉన్నతికి చేర్చి వారిరువురినీ సమానం చేసేందుకు సృష్టికర్త ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారు. ఆయన్ని బలహీనుని క్రింద జమకడుతున్నారు. ఆ విధంగా వారు ఆయన్ని కించపరుస్తున్నారు. కడు శోచనీయం! మానవుడు చెప్పినంత మాత్రాన సృష్టితాలు యదార్థానికి సృష్టికర్త దైవత్వంలో భాగస్వాములుగా చేరలేరు. పోనీ సృష్టించబడిన వారిని సృష్టికర్త సరసన చేర్చే బలం మనలో ఉందా అంటే అదీ లేదు. అలాంటప్పుడు సృష్టికర్త ఒకే ఒక్కడు, అద్వితీయుడు. కాబట్టి ఆరాధ్య దైవం కూడా ఒక్కడే అయి ఉండాలి.

**(36) సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి?**

సృష్టికర్త అన్నింటిపై నియంత్రణ గల సర్వశక్తుడు (All Powerful) అయి ఉండాలి. ఆయన, తాను కోరుకున్నది చేయగలగాలి. ఆయనకు వేరొకరి సహాయం తీసుకోవలసిన అగత్యం ఉండకూడదు. ఆయన చేసే పనిలో జోక్యం చేసుకునే ధైర్యం కూడా ఎవరికీ ఉండకూడదు.

ఆయన సర్వజ్ఞాని అయి ఉండాలి. .... అప్పుడే ఆయనకు వేరొకరిని సంప్రతించే (Consult చేసే), సలహాలు తీసుకునే అగత్యం ఏర్పడకుండా ఉంటుంది.

ఆయన ప్రతి ఒక్కరినీ ప్రేమించేవాడై ఉండాలి. ... అప్పుడే ఆయన

చేసే తీర్పులు, గైకొనే నిర్ణయాలు ప్రేమతో కూడుకున్నవై ఉంటాయి. అప్పుడే అందులో దాసుల మేలు దాగి ఉంటుంది.

ఆయన అనంత కరుణామయుడై ఉండాలి. .... అప్పుడే ఆయన చర్యలో దయార్ద్రత, జాలి, మృదుత్వం కలగలసి ఉంటాయి.

ఈ విశిష్ఠ గుణాల కారణంగా సృష్టికర్త తీర్పు వివేచనతో కూడినదై ఉంటుంది. .... సుదీర్ఘ కాలం వరకు ఆయన నిర్ణయాలు ఒక్కగానొక్క దాసునికి కాకుండా మానవులందరికీ, జీవరాశులన్నింటికీ శుభదాయకంగా ఉంటాయి.

# మార్గదర్శకత్వం

## (1) సృష్టికర్త తరపున మార్గబోధన

తన దాసులను మార్గదర్శకత్వానికి దూరంగా ఉంచి, ప్రపంచంలో వారు అంధకారంలో తచ్చాడుతూ, బాధపడుతూ తిరిగేలా చేయటం సృష్టికర్తకు ఎంతమాత్రం శోభించదు. ఇది దాసులపై ఒక రకంగా 'జులుం' లాంటిదే. కాని సృష్టికర్త అనేవాడు తన దాసులపై అన్యాయానికి ఒడిగట్టడు.

సృష్టికర్త లోకంలో ప్రతిదానికీ మార్గబోధన చేశాడు. పుట్టుక పరమార్థం ఏమిటో తెలియపరచాడు. జీవిత లక్ష్యాన్ని సాధించే విధానం తెలియజేశాడు. తేనెటీగకు కూడా దాని పుట్టుక పరమార్థం తెలిపాడు. తేనె ఉత్పత్తికి అది అవలంబించవలసిన విధానాన్ని ఎరుకపరిచాడు. మరి ఆ సృష్టికర్తే మనిషి పుట్టుక పరమార్థం కూడా తెలియజేసి, దానిని చేరుకునే మార్గం ఏదో విశదపరిచాడు – ఇప్పుడు మానవుడు చేయవలసిందల్లా ఆ మార్గాన్వేషణలో బయలుదేరి దానిని పొందటమే.

దైనందిన జీవితం మొదలుకుని జీవితపు విస్తృత విభాగాల వరకూ జీవన విధానానికి సంబంధించిన మార్గదర్శకత్వం అవసరం. అత్యుత్తమ జీవన విధానం వైపునకు, అత్యుత్తమమయిన విషయం వైపునకు, మానవ నైజంతో అనుసంధానం చెందే పద్ధతి వైపునకు ఆ సృష్టికర్త మాత్రమే దర్శకత్వం వహించగలుగుతాడు.

## (2) సృష్టికర్త మానవుని ప్రాథమిక అవసరాలన్నీ తీర్చాలి.

సృష్టికర్తే ప్రభువవుతాడు. ప్రభువైనవాడు జీవితాన్ని నిలిపి ఉంచడానికి అవసరమయిన ప్రాథమిక ఏర్పాట్లన్నీ చేయాలి. సరైన జీవితం గడపటానికి

మార్గదర్శకత్వం కూడా మనిషి అవసరమే. లేకుంటే మనుషులు పరస్పరం అన్యాయానికి పాల్పడతారు. రక్తపాతం సృష్టిస్తారు. విధ్వంస రచన చేస్తారు. ధరణిలో కల్లోలం రేపి తమ బ్రతుకును దుర్భరం చేసుకుంటారు.

కాబట్టి జీవితపు మౌలిక అవసరమయిన 'ఆధ్యాత్మిక మార్గబోధన' అత్యుత్తమ జీవన సంవిధానం అవుతుంది. దానిని మనిషికి ప్రసాదించాలి. ఆ సంవిధానంలోని ప్రతి నిబంధన చాలా స్పష్టంగా ఉండాలి. దానిని స్వీకరించిన వారి మనోమస్తిష్కాలలో ఎలాంటి తికమక (Confusion) ఉండకూడదు. మరి ఆ సంవిధానంలోని అంశాలన్నింటినీ (ఒక సత్పురుషుని చేత) విడమరచి చెప్పే ఏర్పాటు కూడా జరగాలి.

**(3) తన ప్రసన్నతను చూరగొనే పద్ధతిని కూడా సృష్టికర్త విశదీకరించాలి.**

తాను తన సృష్టికర్త, స్వామి, పరిపోషకుడు, మహోపకారి ప్రసన్నతను చూరగొనాలన్న ఆకాంక్ష మనిషిలో తీవ్రంగా ఉంటుంది. ఇది మానవ నైజం వాంఛించే విషయం కూడాను. కాబట్టి ఆయన ప్రసన్నతను బడసే పద్ధతులేవో అతనికి తెలియాలి. అలాగే సృష్టికర్త తరఫున తనకు న్యాయబద్ధమైన, సమత్వంతో కూడిన, ఉదాత్తమైన శాసనాలు లభించాలని కూడా మనిషి కోరుకుంటాడు. వాటికి కట్టుబడి ఉంటూ నష్టాల నుండి, విపత్తుల నుండి తనను కాపాడు కోవాలని అతను అభిలషిస్తాడు.

**(4) సృష్టికర్త ఇష్టపడేది ....**

సృష్టికర్త దేనిని ఇష్టపడతాడో, దేనిని ఇష్టపడడో తెలుసుకోవటం కూడా మనిషికి అవసరమే. అప్పుడే అతను ఆ ఇష్టాయిష్టాలను దృష్టిలో పెట్టుకుని, తదనుగుణంగా తన జీవితాన్ని చక్కదిద్దుకుంటాడు. కనుక సృష్టికర్త తన ఇష్టాయిష్టాలను గురించి తన దాసులకు ఎరుకపరచాలి. తత్సంబంధితమయిన ఏర్పాట్లు చేయాలి. తద్వారానే దాసులు తమ మహోపకారి క్రోధం నుండి తప్పించుకోగలుగుతారు.

**(5) సృష్టికర్త తన ప్రేమ, దయ కారణంగా ఆయన మానవాళికి ప్రసాదించే శాసనాలలో మృదుత్వం ఉండాలి. కాఠిన్యం ఉండకూడదు. ఆ శాసనాలు ఆచరణీయంగానూ, ప్రకృతితో సమరసం చెందేవిగానూ ఉండాలి.**

**(6) సృష్టికర్త కారుణ్యం వాంఛించేది ....**

దైవకారుణ్యం కాంక్షించేదేమిటంటే; ఆయన జారీచేసే ఆదేశాలు చాలా స్పష్టంగా ఉండాలి. ఈ శాసనాలు అజ్ఞానం, మూఢనమ్మకాల (Superstitions) కారణంగా మానవుడు అవలంబిస్తున్న రీతుల (Traditions) నుండి, సంక్లిష్ట పరిస్థితుల నుండి అతన్ని వెలికి తీసి దైవకారుణ్యం వైపునకు తేగలిగేవిగా ఉండాలి.

**(7) మానవుని బలహీనత - సృష్టికర్త జాలి గుణం**

మనిషి తనంతటగా తానుగా రుజుమార్గం పొందటం అసంభవం. తన పరిమిత జ్ఞానం, సంకుచిత స్వభావం, దురభిమానం, మనోవాంఛల దాస్యం కారణంగా అతను సన్మార్గాన్ని దర్శించలేకపోతాడు. కనుక ప్రతిదీ తెలిసిన, మానవ నైజం గురించి క్షుణ్ణంగా ఎరిగిన సృష్టికర్త మాత్రమే అతనికి మార్గబోధన చేయగలడు. ఏమిటి, పుట్టించిన ఆయనే తెలుపకుండా ఉంటాడా? అదీగాక ఆయన మనిషిని మనిషిగానే చూడగలగాలి. ఈ విషయంలో ఆయన వంశాన్ని, వర్గాన్ని, ప్రాంతాన్ని ప్రాతిపదికలుగా చేసుకోకుండా మనుషులందరినీ సమ భావంతో చూడాలి. ఈ విశాల దృక్పథం సృష్టికర్తకు మాత్రమే పూర్తిగా సాధ్యం. అప్పుడే మానవులందరికీ ఆయన మార్గనిర్దేశన వల్ల ప్రయోజనం చేకూరుతుంది. అప్పుడే మానవాళికి నెమ్మది ప్రాప్తిస్తుంది.

**(8) సృష్టికర్త తన ఆజ్ఞను అనుసరించే దాసులను ఇష్టపడాలి.**

## సృష్టికర్త అన్నీ తెలిసినవాడై ఉండాలి

### (మనసుల్లోని ఉద్దేశాలను సయితం)

**(1) సృష్టికర్త పరిజ్ఞానం, శక్తి ఎలాంటిదై ఉండాలి?**

సృష్టికర్త మనుషుల గుండెల్లోని గుట్టును సయితం పసిగట్టగలిగేంత సూక్ష్మద్రష్ట అయినప్పుడే, తన దాసుల స్థితిగతులను క్షుణ్ణంగా ఎరిగి ఉన్నప్పుడే ఆయన శక్తి, విజ్ఞత, పోషకత్వానికి సార్థకత చేకూరుతుంది.

**(2) శిక్షించడానికయినా, బహుమతి ప్రదానం చేయడానికయినా సృష్టికర్త దాసుల సంకల్పాలను ఎరిగి ఉండటం అవసరం.**

సృష్టికర్త అనేవాడు ఆంతర్యాలలో జనించే ప్రేరణలను కూడా తెలిసినవాడై ఉండాలి. చాలామంది చేసే ఆచరణలు పైకి ఒక్కలాగే ఉంటాయి. కాని ఉద్దేశాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి పురస్కారం (Award), ప్రతిఫలం (Reward) ఇవ్వటం కోసం సృష్టికర్త వారి సంకల్పాలను తెలిసినవాడై ఉండటం చాలా అవసరం. దీనివల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే సృష్టికర్త తనను గమనిస్తున్నాడన్న భావన వల్ల మనిషి భావాలలో, సంకల్పంలో స్వచ్ఛత వచ్చేస్తుంది.

**(3) సృష్టికర్తకు ప్రతీదీ తెలియాలి.**

మనిషి చేసే ప్రతి పని, సంకల్పం సృష్టికర్త జ్ఞానపరిధిలో ఉంటే, ఆ నమ్మకం మనిషిలో భయాన్ని సృజిస్తుంది. సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంది, శిక్ష పడుతుంది అనే ఆలోచన మనిషిని సదాచరణకు పురికొల్పుతుంది. మొత్తమ్మీద సంకల్పశుద్ధి మనిషి ఆచరణలను, చర్య (Action) ను, అతని వ్యక్తిత్వాన్ని నిర్మించటంలో, సమాజానికి సరైన దిశానిర్దేశన చేయడంలో అసాధారణమయిన ప్రభావం (Impact) వేస్తుంది. కనుక సంకల్ప శుద్ధి చాలా అవసరం. సృష్టికర్త అయినవాడు సంకల్పశుద్ధి ఉన్న సదాచరణనే స్వీకరించాలి. తన ప్రసన్నతను బడసేందుకు చేసిన పనులను మాత్రమే ఆమోదించాలి. తన ఆచరణ స్వీకారయోగ్యమవుతుందో లేదోనన్న భయం మనిషిని సంకల్ప నిరతి, సంకల్ప శుద్ధికి ప్రేరేపిస్తుంది. ఈ విధంగా మనిషికి వ్యక్తిగతంగా కూడా ఎంతో లాభం చేకూరుతుంది. అదలా ఉంచితే సృష్టికర్త ఎంతో పవిత్రుడు. పరిశుద్ధమయిన వస్తువులను మాత్రమే ఆయన ఇష్టపడతాడు. పరిశుద్ధమయిన వస్తువులనే స్వీకరిస్తాడు. ఆయన సమక్షంలో పరిశుద్ధమయిన వస్తువులే సమర్పించబడతాయి. సంకల్ప శుద్ధితో సమర్పించబడిన ఆచరణలే ఆయన వద్ద స్వీకృతికి నోచుకుంటాయి.

**(4) సృష్టికర్త సూక్ష్మద్రష్ట, అన్నీ ఎరిగినవాడు.**

సృష్టికర్త అనేవాడు మనసులోని ఉద్దేశాలను, ఆలోచనలను సయితం ఎరిగినవాడై ఉండాలి. ఈ దృఢ నమ్మకమే మనిషి సంకల్పాన్ని నిష్కల్మషంగా ఉంచుతుంది. మనోనిగ్రహం, నియంత్రణను (Self Control) ఇస్తుంది. అన్నీ

తెలిసిన సృష్టికర్తే శిక్షాబహుమానాలను ఇస్తాడన్న ఆలోచన అతన్ని అదుపులో ఉంచుతుంది. ఈ నమ్మకం సృష్టికర్త సామీప్యానికి దోహదపడుతుంది. ఆయన పట్ల ప్రేమతో పాటు భయం కూడా కలిగేలా చేస్తుంది. ఇది మనిషి జీవితావసరం కూడా. అది అతని జీవితానికి సరైన దిశను ఇస్తుంది. అదీగాక తన సంకల్ప శుద్ధి మూలంగా స్వయంగా వ్యక్తికి ఆనందం, తృప్తి, హాయి కలుగుతుంది.

**(5) సృష్టికర్త మనిషి అంతరంగంలోని రహస్యాలను సయితం ఎరిగినవాడై ఉండాలి. అప్పుడే వారి ఆచరణకు తగ్గ ప్రతిఫలం ఇవ్వగలడు.**

మనిషి కొన్నిసార్లు మంచిపనులు చేయాలనుకుంటాడు. ఆ మేరకు దృఢ సంకల్పం కూడా చేసుకుంటాడు. కాని అనుకోకుండా వచ్చిపడిన కొన్ని అవాంతరాల వల్లనో, తీరిక చిక్కకపోవడం వల్లనో వాటికి క్రియారూపం ఇవ్వలేకపోతాడు. అయితే సృష్టికర్తకు అతని ఉద్దేశాలు, స్థితిగతుల గురించి పూర్తిగా తెలియాలి. అప్పుడే ఆయన తన దాసుని సదుద్దేశాన్ని మెచ్చుకుంటూ (Appreciate) దానికి తగిన మంచి ప్రతిఫలం ఇవ్వగలడు.

**(6) సృష్టికర్తకు మనిషి చేసే ప్రతిదీ తెలిసి ఉండాలి.**

ఒకే సమయంలో మనిషి అనేక పనులు చేస్తాడు. .... అంటాడు, వింటాడు, కంటాడు, అతని ఉద్దేశం కూడా మారుతూ ఉంటుంది. మరి అతను చేసే మంచిపనుల, చెడు పనుల ప్రభావం కూడా చాలా దూరం వరకు పడుతూ ఉంటుంది. ఇలాంటి మనిషి ఒక్కడు కాడు, ఈ సంఖ్య కోట్లలో ఉంటుంది. అయినప్పటికీ సృష్టికర్తకు ప్రతి ఒక్కరి గురించి తెలిసి ఉండాలి. వారి పనుల ప్రభావం చాలా కాలం వరకు – సంవత్సరాల తరబడి – ఉంటుంది. వేలాదిమంది ఆ పనులకు ప్రభావితులవుతుంటారు. వాటన్నింటినీ పరివేష్ఠించాలి. అందరి గురించి ఎరిగి ఉండాలి. తదనుగుణంగా బహుమతి ఇవ్వటమో, శిక్ష విధించటమో చేయాలి. అందువల్ల సృష్టికర్త అనేవాడు ఏకకాలంలో ఈ పనులన్నీ చేయగలగాలి. సృష్టికర్త న్యాయబద్ధమైన నిర్ణయాలు గైకొనడానికయినా, తన దాసుల ఆచరణకు తగిన ప్రతిఫలం వొసగటానికయినా ఈ విషయాలన్నీ ఆయనకు ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉండటం అవశ్యం.

**(7) ప్రతిదీ సృష్టికర్త దృష్టిలో ఉండాలి. ఏదీ ఆయన నుండి దాగి ఉండకూడదు.**

**(8) ప్రతి మాటను, ప్రతి పనిని గురించి సృష్టికర్త తెలిసినవాడై ఉండాలి. ఎవరేమన్నారో, ఏం చేశారో, ఎవరేం అనలేదో, ఏం చేయలేదో ఆయన జ్ఞానపరిధిలో ఉండాలి.**

ఒక వ్యక్తి ఒక పనిని చేయకుండానే చేశానని బుకాయించవచ్చు. అలా చెప్పి బహుమానానికి అర్హునిగా భావించవచ్చు. అలాగే ఒక వ్యక్తి ఏమీ అని ఉండడు. చేసి ఉండడు. కాని అతడు ఆ పని (తప్పు) చేశాడన్న ఆరోపణకు గురికావచ్చు. దానిపై అతను నిలదీతకు గురికావచ్చు. ఆ విషయం పూర్తిగా కూడా సృష్టికర్తకు తెలిసి ఉండాలి. అప్పుడే నిర్దోషికి న్యాయం జరుగుతుంది.

## క్షమ, పశ్చాత్తాపం, శిక్ష, ఎంపిక స్వేచ్ఛ

**(1) సృష్టికర్త అమితంగా మన్నించేవాడు, సహనశీలుడై ఉండాలి.**

తెలియక మనిషి ఎన్నో తప్పులు చేస్తాడు. ఒకవేళ సృష్టికర్త అతని ప్రతి పొరపాటుపై నిలదీయసాగితే మనిషి క్షేమంగా ఉండలేడు. కాబట్టి సృష్టికర్త గొప్ప సహనశీలి, క్షమాశీలి అయి ఉండాలి.

**(2) పొరబడినవారి యెడల, సజ్జనుల యెడల సృష్టికర్త వైఖరి ఎలా ఉండాలి?**

సృష్టికర్త ఒక వైపున పొరపాట్లు చేసిన వారు క్షమాపణ కోరుకున్నప్పుడు మన్నించి వదలిపెట్టడంతో పాటు, మరోవైపున సత్కార్యాలు చేసేవారికి ఇంకా ఇంకా సత్కరించాలి. సృష్టికర్తపై తిరుగుబాటు చేసినవారైనాసరే తమ దుశ్చేష్టలను మానుకుని దారికి వస్తే సృష్టికర్త వారిని క్షమించాలి.

**(3) అజాగ్రత్త, పాపం, దౌర్జన్యం నుండి మరలివచ్చిన దాసుణ్ణి సృష్టికర్త క్షమించాలి.**

తన సృష్టికర్తను, స్వామిని తెలుసుకోవటంలో మనిషికి ఆలస్యం జరగవచ్చు. వివిధ కారణాల వల్ల (అలసత్వం, తెలియకపోవటం, వాతావరణ ప్రభావం, అంధానుసరణ మూలంగా) అతను సృష్టికర్తను గుర్తించి ఉండకపోవచ్చు. ఈలోగా అతని వల్ల ఘోర కృత్యాలు, అత్యాచారాలు జరిగి ఉంటాయి. అతను తన స్వామిని తెలుసుకుని స్వీయసంస్కరణ చేసుకున్నప్పుడు అతని పాపాలను ఆయన క్షమించాలి.

**(4) నిజమైన పశ్చాత్తాపం చెందినప్పుడు సృష్టికర్త తన దాసుని మహాప రాధాన్ని కూడా క్షమించాలి.**

దాసుడు తన తప్పుపై సిగ్గుతో కుంచించుకుపోయి, క్షమాపణ కోరుకున్న ప్పుడు సృష్టికర్త అతన్ని ఉదారంగా క్షమించాలి. .... దాసుడు స్వీయ సంస్కరణ చేసుకోవాలన్నదే సృష్టికర్త అభిమతమై ఉండాలి.

**(5) సృష్టికర్త దర్బారు నుండే మన్నింపు లభించాలి.**

సృష్టికర్త (స్వామి, పాలకుడు, పోషకుడు, ఆరాధ్య దైవం)ను అప్రసన్నుణ్ణి చేసిన మీదట, ఆయన శిక్ష నుండి తప్పించుకోవటానికి ఆయన గడప వద్దకు సిగ్గుపడుతూ వచ్చిన వానికి ఆయన క్షమాభిక్ష పెట్టాలి. అతన్ని తన కారుణ్యంలో చేర్చి రక్షణ కల్పించాలి.

**(6) క్షమించటం, మన్నింపు ప్రసాదించటం.**

తిరుగులేని అధికారాలు కల విశ్వ సార్వభౌమాధికారి మాత్రమే ఇది చేయగలడు.

**(7) సృష్టికర్త కారుణ్య క్రోధ గుణాల మధ్య సమతూకం** (Balance) **ఉండాలి.**

సృష్టికర్త గుణగణాలలోని సమత్వపు భావన మనిషి మస్తిష్కంలో కదలాడుతూ ఉన్నప్పుడే అతని ఆలోచనల్లో, సిద్ధాంతాలలో, అతని వ్యక్తిత్వంలో, ఆచరణలలో సమత్వం (Balance) వస్తుంది. సత్య విషయం సుబోధకం అయిన మీదట తమ అన్యాయవర్తనం నుండి, అలసత్వం నుండి మరలి వచ్చినవారు పూర్తిగా సరైన తీరు (Pure Form) లో సృష్టికర్తను నమ్మి నడుచుకుంటారు. అలాంటి వారిని సృష్టికర్త మన్నించి చేరదీయాలి. అదే సమయంలో సత్యం స్పష్టమైన తరువాత కూడా తిరస్కార వైఖరిపై పాతుకుపోయి, యథేచ్ఛగా అత్యాచారాలకు పాల్పడుతూ ఉండేవారిని శిక్షించాలి. ఈ విధానం ద్వారా సృష్టికర్త సమతౌల్యపు వ్యక్తిత్వం (Balanced Personality) మనసుకు తట్టుతుంది.

**(8) ప్రతి మనిషికీ ఎంపిక స్వేచ్ఛను ప్రసాదించేవాడే సృష్టికర్త.**

సృష్టికర్త అనేవాడు మనిషికి తన కార్యక్షేత్రాన్ని ఎంపిక చేసుకునే ఒకింత స్వేచ్ఛను ప్రసాదించాలి. అతన్ని నిర్బంధించకూడదు. అయితే మనిషి తానెన్నుకున్న విధానం యొక్క పరిణామానికి స్వయంగా బాధ్యత వహించవలసి

ఉంటుంది. ఆ బాధ్యతను ఇతరులపై మోపకూడదు. ఆఖరికి సృష్టికర్తపై కూడా ఆ బాధ్యత ఉండకూడదు.

## తన రక్షణలో ఉంచాలి

**(1) సృష్టికర్త దాసుణ్ణి తన రక్షణలో ఉంచాలి.**

సృష్టికర్త ప్రేమగుణం, పరిపాలనాధికారం కోరేదేమిటంటే ఆయన తన దాసునికి పూర్తిగా అభయం ఇవ్వాలి. అత్యుత్తమ రీతిలో అతనికి పూర్తి రక్షణ (Full Protection) కల్పించాలి. అతనికి ఎవరూ ఎలాంటి కీడు తలపెట్టకుండా చూడాలి. దాసునికి ఏ ఆపద వచ్చినా, మరే నష్టం చేకూరినా అది సృష్టికర్త ఆనతితోనే చేకూరాలి – ఆ విధంగా దాసునికి తెలిసిరావాలి, సృష్టికర్త తనను పరీక్షిస్తున్నాడని! లేదా హెచ్చరిస్తున్నాడని!!

**(2) జీవన్మరణాలు సృష్టికర్త అధీనంలోనే ఉండాలి.**

ఏదేని జీవితాన్ని మిగిల్చి ఉంచాలా లేక అంతమొందించాలా అన్నది జీవితాన్ని ప్రసాదించిన వాని చెప్పుచేతల్లో ఉండాలి. పుట్టించిన వాని అధీనంలోనే మరణం కూడా ఉండాలి. ఆయన పుట్టించిన ప్రాణిని చంపే హక్కు ఆయన ఇచ్ఛ (Will) లేకుండా వేరొకరికి ఉండకూడదు. అలాగే దానిని రక్షించే అధికారం కూడా ఉండకూడదు. తాను సృష్టించిన ప్రాణులను అంతమొందించగోరేవాడు సర్వవిధాలా తిరుగులేని అధికారి అయి ఉండాలి.

**(3) సృష్టికర్త తన దాసుల జాతకాన్ని మరొకరి పరం చేయకూడదు.**

తన దాసులు చేసిన అన్యాయాన్ని క్షమించే లేదా శిక్షించే అధికారం కేవలం సృష్టికర్త చేతుల్లోనే ఉండాలి. వేరెవరికీ ఎలాంటి అధికారం ఉండకూడదు – అతను సృష్టికర్తకు ఎంత సన్నిహితుడైన స్నేహితుడైనాసరే. ప్రతి విషయపు అధికారాన్ని సృష్టికర్త తన అధీనంలో ఉంచుకోవాలి.

**(4) జీవన్మరణాల వ్యవస్థను తన చేతుల్లో ఉంచుకున్నవాడే సృష్టికర్త.**

జీవితాన్ని ప్రసాదించేవాడు సృష్టికర్తే. జీవితాన్ని నిలిపి ఉంచేవాడు కూడా ఆయనే. తాను సృష్టించిన జీవరాశులను అంతమొందించే అధికారం కూడా ఆయనకే ఉండాలి. ప్రాణం తీసేవాడు వేరొకరు ఎవరయినా ఉన్నారని భావిస్తే సృష్టికర్త నిస్సహాయుడని ఒప్పుకున్నట్లే. తాను సృష్టించిన వస్తువులను రక్షించే

శక్తి ఆయనకు లేదని భావించినట్లే. తాను సృష్టించిన దానిని కోరుకున్న సమయం వరకు నిలిపి ఉంచలేకపోతే సృష్టికర్త బలహీనుడన్నమాట! ఆయన చేసిన నిర్మాణంలోనే లోపం ఉందన్నమాట!! ఆయనకన్నా శక్తిమంతుడైనవాడు ఇంకొకరు ఉన్నాడన్నమాట!!! తనువు చాలించడానికి ఏదో కారణం ఉంటుం దనేది నిజమేగాని అది కూడా సృష్టికర్త ఆనతితోనే జరగాలి.

**(5) లాభనష్టాలు చేకూర్చే శక్తి సృష్టికర్త, స్వామి చేతుల్లోనే ఉండాలి.**

సృష్టికర్త తాను సృష్టించిన వస్తువుకు యజమాని కూడా అయి ఉంటాడు. ఒకవేళ ఆయన తన వస్తువును కాపాడుకోలేకపోతే, నష్టాల బారి నుండి దానిని రక్షించుకోలేకపోతే, ఇక ఆయన్ని సృష్టికర్తగా అంగీకరించి ప్రయోజనమేమిటి? ఎవరి ద్వారానయినా ఏదయినా నష్టం కలిగితే అది పైకి కనిపిస్తుంది. అది కూడా సృష్టికర్త – ఏదయినా పరమార్థం దృష్ట్యా – ఆ నష్టాన్ని అడ్డుకోకుండా ఉన్నప్పుడే అది జరగాలి.

**(6) మనిషి తన సంరక్షకునిగా చేసుకోదగినవాడే సృష్టికర్త.**

ప్రతిదానిపై పూర్తి శక్తి, అదుపు, అధికారం కలవాడే మనిషికి సంరక్షకుడుగా ఉండగలడు. అలాంటి తిరుగులేని అధికారికే మనిషి తన వ్యవహారాలను అప్పగించి నిక్షేపంగా ఉండగలడు.

**(7) కార్యభారం మోపదగినవాడే సృష్టికర్త కాగలడు.**

ఆయన నమ్మదగినవాడై ఉండాలి. శక్తిమంతుడు, మనల్ని ప్రేమించేవాడు, మనల్ని సృష్టించి మన ఆలనాపాలన చేస్తూ ఉన్నవాడు మాత్రమే మన సిసలైన సృష్టికర్త కాగలడు. మనలాంటి మిగతా వారంతా నిస్సహాయులు, వేరొకరిపై ఆధారపడిన (Dependent) వారు. వారు భారం మోపదగినవారు కాజాలరు.

**(8) దాసునితో సృష్టికర్త సంబంధం, తన శక్తి సామర్థ్యాల వెల్లడి.**

దాసుని మొరను ఆలకించినప్పుడు సృష్టికర్తకు అతనితో గల సంబంధం ఎటువంటిదో వెల్లడవుతుంది. ప్రార్థన ఆమోదం పొందినప్పుడు అది సృష్టికర్త శక్తికి, అధికారానికి, కారుణ్యానికి, వివేచనకు నిదర్శనంగా నిలుస్తుంది.

# అన్యాయాన్ని సహించనివాడే సృష్టికర్త

**(1) సృష్టికర్త అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని సుతరామూ సహించరాదు.తన దాసులపై దౌర్జన్యానికి ఒడిగట్టే మనుషులను సృష్టికర్త ఎట్టి పరిస్థితిలోనూ సహించకూడదు.**

**(2) జులుం చేసే వారి పట్ల సృష్టికర్త వ్యవహారణ.**

తన సృష్టితాలపై జులుం జరగటాన్ని సృష్టికర్త అనేవాడు సహించకూడదు. ఎవరికయినాసరే ఒక హద్దు వరకు అవకాశమిచ్చి, ఆ తరువాత వారిని నిలదీయాలి, శిక్షించాలి.

**(3) దాసులు పరస్పరం ప్రేమానురాగాలతో జీవించటాన్ని సృష్టికర్త ఇష్టపడాలి.**

**(4) ఒకరింకొకరిని వేధించడాన్ని ఆయన సుతరామూ సహించకూడదు. కడకు శత్రువుపై ప్రతీకారం తీర్చుకోవటానికి కూడా ఆనతి ఇవ్వాలి.**

**(5) ఒండొకరికి ఉపకారం చేసే దాసులను సృష్టికర్త ప్రేమించాలి. సృష్టికర్త అనేవాడు ఎట్టి పరిస్థితిలోనూ భువిలో అరాచకాన్ని, విధ్వంసాన్ని సహించకూడదు.**

# శిక్ష – బహుమానం

(జీవితం లక్ష్యబద్ధం కావటానికి ఇది చాలా అవసరం)

**(1) మరణానంతర జీవితపు లెక్క తీసుకోవాలి. బహుమానం ఇవ్వటమో, శిక్షించటమో ఉండాలి.**

సృష్టికర్త చేసే ఏ పనీ నిరర్థకం కారాదు. మానవుడు లాంటి చైతన్యవంతమైన జీవిని ఆయన పుట్టించాడు. అతనికి ఎన్నో శక్తియుక్తులు, తెలివితేటలు ఇచ్చాడు. ఎన్నో వస్తువులను, సాధనాలను అతని స్వాధీనంలో ఉంచాడు. వాటిని అతను సద్వినియోగం చేస్తున్నాడా లేక దుర్వినియోగపరుస్తున్నాడా అన్నదానిపై అతని జవాబుదారీ (Accountabiliy) ఉండాలి. ఆ శక్తియుక్తులు ప్రసాదించిన వానికి అతను సమాధానం ఇవ్వాలి. అదేగనక లేకుంటే మానవుడు వంటి శ్రేష్ఠమైన జీవి పుట్టుకకు అర్థమే ఉండదు. అతని నిలదీత గనక

జరగకపోతే బాధ్యతారహితుడుగా వ్యవహరిస్తాడు. దౌర్జన్యపూరితమైన పోకడలకు పాల్పడతాడు. అయితే ఈ నిలదీత సరైన పద్ధతిలో – పూర్తి స్థాయిలో – ఈ జీవితంలో జరగదు. ఇక్కడి జీవితం ముగిసిన తరువాత అతని కర్మల చిట్టా పూర్తిగా ముందుకు వస్తుంది. కాబట్టి ఈ నిలదీత, శిక్షా–బహుమానాల వ్యవస్థ ఈ ప్రాపంచిక జీవితం ముగిసిన మీదటే నెలకొనాలి. అతని మరణానంతరం మరో ప్రపంచం ఉండాలి, మరో జీవితం ఉండాలి. మనిషి లెక్కలు అక్కడ తేలాలి. ఎవరేం చేశారో రుజువు అవ్వాలి.

**(2) 'న్యాయం' జరగటం కోసం సృష్టికర్త వద్ద అందరికీ ఒకే ప్రమాణం ఉండాలి.**

అన్ని కాలాల మానవుల స్వభావం ఒకేవిధంగా ఉండింది. ఒకే విధంగా ఉంటుంది. కాబట్టి మనుషులందరి కోసం ఒకే కొలమానం ఉండాలి. ఒకే సూత్రం వర్తించాలి. ఒకే గీటురాయి ఉండాలి. ఎవరు బహుమతికి అర్హులో, మరెవరు శిక్షార్హులో ఆ గీటురాయిపై పరికించి చూడాలి. ఎవరు సృష్టికర్త ఆదేశాన్ని శిరసావహిస్తున్నారో, మరెవరు ఆయన ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నారో చూడాలి. ఈ స్వేచ్ఛ, ఈ అవకాశం ప్రతి ఒక్కరికీ, ప్రతి కాలంలో ఇవ్వబడాలి.

**(3) సృష్టికర్త అనేవాడు మనిషి చేసిన ప్రతి చిన్నా, పెద్ద పనికి ప్రతిఫలం ఇవ్వాలి.**

**(4) సృష్టికర్త ప్రతి మనిషి ఆచరణకు తగిన ప్రతిఫలం ఇవ్వాలి.**

సృష్టికర్త అనేవాడు దాసుడు చేసిన ఏ కర్మను కూడా చిన్న చూపు చూడకూడదు. అతను ధనికుడైనా – బీదవాడైనా, స్త్రీ అయినా – పురుషుడైనా అందరికీ తగిన ప్రతిఫలం వొసగాలి.

**(5) సృష్టికర్త చేసే ప్రతి పనీ లక్ష్యబద్ధమై ఉంటుంది.**

ఒకప్పుడు మనకంటూ ఒక ఉనికి ఉండేది కాదు. మనం ఎక్కడా, ఎవరికీ కానవచ్చే వారం కాము. సృష్టికర్త మనకు ఉనికిని ప్రసాదించాడు. మనమెవరో లోకం గుర్తించింది. మనం ప్రఖ్యాతిగాంచాము. తరువాత ఈ ఉనికి అంతమైపోతుంది. మనం ఎవరికీ కాకుండా పోతాము. మన పుట్టుకలోని పరమార్థం ఇంతే అయితే, మంచివారు – చెడ్డవారు ఒకే వరుసలో ఉండేమాటైతే జీవిత లక్ష్యం నెరవేరనట్టే. అదే గనక జరిగితే సృష్టికర్త పని అర్థరహితమే;

అన్యాయంతో కూడుకున్నదే అవుతుంది. ఈ లోపభూయిష్టత నుండి తప్పించుకోవాలంటే సృష్టికర్త మనకు మళ్లీ ఉనికిని ప్రసాదించాలి.

మొదటిసారి పుట్టుక పరమార్థం పరీక్షించబడటమైతే, మలిసారి పుట్టుక లక్ష్యం ప్రతిఫలం వొసగటమై ఉండాలి. అంటే ఎవరు ప్రాపంచిక జీవిత లక్ష్యాన్ని తెలుసుకుని సత్కర్మలాచరించారో వారు మరో ప్రపంచంలో బహుమతితో సత్కరించబడాలి. మరెవరు ప్రాపంచిక జీవిత లక్ష్యాన్ని తెలుసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారో, వారు మరో ప్రపంచంలో శిక్షించబడాలి. బహుమతి పొందినవారికి స్వర్గలోక ప్రవేశం లభించాలి. శిక్షార్హులు నరకాగ్నికి ఆహుతి అవ్వాలి.

**(6) సృష్టికర్త యొక్క ప్రతి పనీ లక్ష్యబద్ధమై ఉండాలి.**

శిక్షా బహుమానాల (తీర్పు) దినం నిర్ధారితమైనప్పుడే ఈ లక్ష్యం పూర్తిగా నెరవేరుతుంది. అన్యథా ఈ మానవ సృష్టిగాని, ఈ జగతిగాని అర్థరహితంగానే ఉండిపోతుంది. అయితే సృష్టికర్త యొక్క ఏ పని కూడా నిరర్థకమై ఉండదు.

**(7) ప్రతిదీ లక్ష్యబద్ధంగా చేసేవాడే సృష్టికర్త.**

సృష్టించిన వానిదే సార్వభౌమత్వం. పరిపోషకుడు కూడా సృష్టికర్తే అయి ఉంటాడు. దీనిని అంతమొందించే, లేక మిగిల్చి ఉంచే అధిపతి కూడా ఆయనే. అయితే సృష్టికర్త, యజమాని అయినవాడు పాలనాధికారి కూడా అయి ఉంటాడు. సమస్త లోపాలకు అతీతుడై ఉంటాడు. ఆయన దేనిని పుట్టించినా, అంతమొందించినా అది కూడా లక్ష్యబద్ధమై ఉంటుంది. అది వివేకంతో, కారుణ్యంతో కూడుకుని ఉంటుంది. అంతేగాని ఉత్తుత్తిగానే పుట్టించి అంతమొందించటమనేది జరగదు. ఆయన చేసిన ఏ పని కూడా ఆశయం లేకుండా ఉండదు. ఆశయమే గనక లేకుంటే ఆద్యంతం ప్రతి పనిలో అపసవ్యత, అన్యాయం కానవచ్చేది. అదీగాక ఈ సృష్టి అర్థరహితమవటం వల్ల అందులో అందం కూడా చిందదు. పైగా వికృతం (Awkward) గా, అస్తవ్యస్తం (Haphazard) గా తయారయ్యేది. అందులో అడుగడుగునా లోపం పొడసూపేది.

అందలి వస్తువుల మధ్య సమన్వయం ఉండేది కాదు. ప్రతిదీ చిందరవందరగా పడి ఉండేది.

లక్ష్య రహితమైన పని అపసవ్యతకు, అన్యాయానికి దర్పణంగా ఉంటుంది. ఇలాంటి వ్యర్థమైన పనులు సృష్టికర్త చేయడు.

ఒకవేళ –

ఆయన సృష్టికర్త అన్నది నిజమేగాని, లోపాలకు మాత్రం ఆయన అతీతుడు కాడనుకుంటే మరి ఆయన చేసే వాటిలో లోపాలే ఉంటాయని భావం. కాబట్టి ఆయన ఆరాధనలకు, ఆదరణకు, విధేయతకు అర్హుడు కాడు. ఆయన ద్వారా అన్యాయం తప్ప మరొకటి జరగదని భావించవలసి ఉంటుంది. దయచూపడు. ప్రేమించడు, క్షమించడు, ఔదార్యం కురిపించడు. ఇలాంటి సృష్టికర్త సృష్టితాలను అవమానంపాలు చేయటం తప్ప మరొకటి చేయడు.

ఇన్ని లోపాలున్న సృష్టికర్త ముందు తలవంచటమంటే మనిషి తనను తాను అవమానించుకోవటమే. లోపభూయిష్టమైన సృష్టికర్తకు విధేయత చూపటమంటే తనను మార్గభ్రష్టతకు లోను చేసుకోవటమే. దీనివల్ల కష్టాలు, ఉపద్రవాలు తప్ప మరొకటి ప్రాప్తించవు.

### (8) లక్ష్యబద్ధమయిన పని

ప్రతి వస్తువును ఒక లెక్క ప్రకారం, ఓ ప్రత్యేక లక్ష్యంతో, ఓ ప్రత్యేక ఆకారంలో చేసినవాడే అసలు సృష్టికర్త. అది తన లక్ష్యాన్ని ఛేదించే నిమిత్తమే, దానికి ఉనికి ప్రసాదించబడుతుంది. నిశ్చయంగా సృష్టికర్త చేసిన ఏ పని కూడా అల్లాటప్పాగా, అర్ధరహితంగా ఉండదు.

## సృష్టికర్త తన సంస్మరణా విధానం తెలుపాలి

### (1) తనను స్మరించే విధానాన్ని తెలిపేవాడే సృష్టికర్త.

కూర్చున్నప్పుడు, లేచినప్పుడు, ఉదయం సాయంత్రం పని చేస్తున్నప్పుడు, పరస్పరం కలుసుకున్నప్పుడు, సెలవు తీసుకుంటున్నప్పుడు, సృష్టికర్తను ఎలా స్మరించాలో, ఎలా జ్ఞాపకం ఉంచుకోవాలో విశదపరచేవాడే సృష్టికర్త. .... ఆ ధ్యానంలో ఆయన ప్రేమ తొణికిసలాడాలి, ఆయన క్షమిస్తాడు, కరుణిస్తాడన్న దృఢ నమ్మకం ఉండాలి. ఆయన అండగా ఉంటాడన్న విషయం ప్రస్తావించ బడాలి, ఆయన పెద్దరికం, స్తోత్రం, పవిత్రత కొనియాడబడాలి, ఆయన అధీనంలోనే జీవన్మరణాలున్నాయన్న విషయం ప్రస్తావనకు రావాలి, ఆయన వైపునకే అందరూ మరలిపోవలసి ఉందన్న యదార్థం అంగీకరించబడాలి. సమస్త జగతిపై ఆయన సార్వభౌమత్వం నడుస్తుంది, ఆయన సకల లోకాలకు పరిపోషకుడు అన్న విషయం కూడా ప్రస్తావించాలి. ఈ వాస్తవాలు సతతం

మనోమస్తిష్కాలలో తాజా అవుతూ ఉండాలి. మనిషి ధ్యాస మరో వైపునకు మళ్లరాదు. ధ్యాన సమయంలో అతను మానసిక ఏకాగ్రతను పొందాలి. సదాచరణ వైపునకు సమాయత్తమై ఉండాలి. బాధలపై ఓర్పు వహించాలి. తప్పు జరిగినప్పుడు వెంటనే పశ్చాత్తాపపడి తనను సంస్కరించుకోవాలి.

ఆయన శరణు వేడటం తప్ప మార్గాంతరం లేదు. ఎందుకంటే ఆయనే తొలివాడు, తుదివాడు కూడా. ఆయన ప్రభుత్వం సమస్త జగతిని ఆవరించి ఉంది. ప్రతి వస్తువు ఆయన అదుపు అజమాయిషీలో ఉంది. మనిషి ఆలోచన నిత్యం ఆయన్నే ఆశ్రయించేలా ఉండాలి. పైశాచిక ప్రేరణల నుండి, షైతాన్ కీడు నుండి, మనసు కవ్వింపుల నుండి, మనుషుల హాని నుండి ఆయన శరణు వేడుకుంటూ ఉండాలి. మనిషి ఆ నిజదైవాన్ని స్మరించినప్పుడు తన అశక్తత తెలిసిరావాలి. అదే సమయంలో దైవశక్తి, దైవకారుణ్యం పట్ల అతనికి గట్టి నమ్మకం ఏర్పడాలి. ఆ సమయంలో మనిషికి తన తప్పులు, పాపకార్యాల స్పృహ కలగాలి. మరోవైపున సృష్టికర్త క్షమాభిక్ష పెడతాడన్న విశ్వాసం కూడా అతని ధ్యానం వల్ల బలపడాలి. తత్ఫలితంగా అతని మనసు కుదుటపడుతుంది. అతని జీవితంలో సుఖశాంతులు కలుగుతాయి. అతని జీవితం సరైన రీతిలో సాగిపోతుంది.

మనిషి తనకు రక్షణ కోరుకుంటాడు. తన కొరకు కారుణ్యాన్ని, మన్నింపును కాంక్షిస్తాడు. ఇవన్నీ మనిషి ముఖ్యావసరాలు. ఈ అవసరాలను సృష్టికర్త మాత్రమే బహుచక్కగా తీర్చగలడు. మరి ఇవన్నీ ఎప్పుడు సాధ్యమంటే; ఆయన శక్తిమంతుడు, దయాకరుడు, క్షమాశీలుడు అయి ఉన్నప్పుడే. సృష్టికర్త ఇలాంటివాడే అయి ఉండాలి.

సృష్టికర్త అన్నీ వినేవాడు, చూసేవాడు, లెక్క తీసుకునేవాడు, బహుమతి ఇచ్చేవాడు, శిక్ష విధించేవాడు అయి ఉండాలి. సృష్టికర్త ఆదేశాల ప్రకారం మసలుకోవడానికి, సంకల్పశుద్ధితో జీవన రథాన్ని ధర్మపథంలో సాగించడానికి దేవుని పై లక్షణాలను మనిషి దృష్టిలో పెట్టుకోవాలి. తద్వారా ఆయన స్మరణ నిత్యం తాజాగా ఉండాలి.

### (2) సృష్టికర్త మాత్రమే ఆరాధనలకు అర్హుడు. కనుక నిత్యం ఆయన ధ్యానం అవశ్యం

శూన్యం నుండి అస్థిత్వాన్ని వెలికితీసి మహోపకారం చేసిన ఆయనే

ఆరాధనలకు అర్హుడు. తద్వారానే ఎన్నటికీ వీడిపోని, తెగిపోని సహజ సంబంధం సృష్టికర్తతో ఏర్పడుతుంది. అది దాసునికీ – యజమానికీ మధ్య ఉండే అపురూప బంధం. కాబట్టి ఆ ఒక్కడే ప్రేమకు, దాస్యానికి, విధేయతకు యోగ్యుడు.

వేరెవరయినా ఈ విధంగా చేశారా? మనల్ని సృష్టించటంలో వేరెవరి ప్రమేయంగానీ, పాత్రగానీ ఉందా – మనం వాళ్లను సేవించడానికి, ప్రేమించ డానికి, విధేయత చూపడానికి?

### (3) సృష్టికర్తను మాత్రమే సేవించాలి, ఆయనకే భయపడాలి, ఆయన్నే ప్రేమించాలి.

మానవుని ఉనికి అంతా ఒక ఏకాంకం (Unit). కనుక ఏకాంకం (Unit) అంతా కేవలం ఒక్కణ్ణే సేవించి, విధేయత కనబరచగలదు. కేవలం ఒక్కని పట్లనే ప్రేమకలిగి ఉండగలదు. ఆ ఒక్కనికే భయపడగలదు. కనుక మనిషి జీవితపు అన్ని విభాగాలపై ఆ ఒక్కని సంకల్పం, నిర్ణయం, ఆజ్ఞ మాత్రమే నడవాలి – వ్యక్తిగత ఆలోచనలపై, భావాలు భావనలపై, కుటుంబ జీవితంపై, సామాజిక, రాజకీయ జీవనంపై కూడా. ఒక్కగా నొక్కడి మార్గదర్శకత్వం, ఆజ్ఞ ఉన్నప్పుడే జీవితంలో శాంతి ఉంటుంది. అప్పుడే అది ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. అప్పుడే అది ఫలవంతం, సఫలీకృతం అవుతుంది. స్వతహాగా అవిభాజ్య ఏకాంకం (Unit) అయిన జీవితంలో వైరుధ్యం ఉండదు. వ్యాఘాతానికి ఆస్కారం ఏర్పడదు. కనుక సృష్టికర్త అయినవాడే పాలకుడు కూడా కావాలి. (తన సృష్టితాల గురించి) క్షుణ్ణంగా తెలిసినవాడే సరైన మార్గబోధన చేయగలడు, కచ్చితమయిన ఆదేశాలు, శాసనాలు చేయగలడు. కాబట్టి ఆయన స్మరణ చాలా అవసరం. కాగా; సృష్టికర్త తనను స్మరించే పద్ధతి నేర్పాలి.

### (4) మనిషి ఎటువంటి ఆరాధనా పద్ధతి కోరుకుంటాడు?

సృష్టికర్త తెలిపే ఆరాధనా విధానం విలక్షణమైనదిగా ఉండాలి. దాని ద్వారా మనిషి తన సృష్టికర్తతో నేరుగా సంభాషించగలగాలి. తన మొరను సృష్టికర్త ఆలకిస్తున్నాడన్న అనుభూతికి లోనవాలి. తత్ఫలితంగా అతని అంతరాళం ఆనందంతో ఉప్పొంగుతుంది. అతని మనసు నెమ్మదిస్తుంది. ఇటువంటి అనుభూతితో కూడుకున్న ఆరాధనే సహజమైనది, అత్యుత్తమమైనది.

**(5) సృష్టికర్త తన ఆరాధనా పద్ధతిని విశదపరచాలి.**

మనిషి తన సృష్టికర్తను సేవించాలనుకుంటాడు, తన స్వామికి శ్రద్ధాభక్తుల నివాళి ఘటించాలనుకుంటాడు. కాని సృష్టికర్త ఎలాంటి సేవను ఇష్టపడతాడో అతనికి తెలీదు. కాబట్టి తనను ఆరాధించే పద్ధతి ఏదో సృష్టికర్తే తెలియజేయాలి.

## వాగ్దానాలను నెరవేర్చాలి

**(1) సృష్టికర్త తన వాగ్దానాలకు విరుద్ధంగా చేయరాదు**

తన వాగ్దానాలకు విరుద్ధంగా వ్యవహరించకుండా ఉండేవాడే సిసలయిన స్వామి. అప్పుడే దాసునికి ఆయన వాగ్దానంపై నమ్మకం ఉంటుంది. అప్పుడే అతను స్వామి అభీష్టానికి, ఆదేశానికి అనుగుణంగా పనిచేస్తాడు. చేసిన వాగ్దానం ప్రకారం తనకు బహుమానం ఇస్తాడని ఆశ పెట్టుకుంటాడు.

**(2) సృష్టికర్త తన వాగ్దానాలను నిలుపుకోవాలి.**

అంటే సహాయం చేస్తానని, బహుమానం వొసగుతానని ఇచ్చిన మాటను నిలుపుకోవాలి. అప్పుడే దాసుడు పూర్తి నమ్మకంతో సృష్టికర్తను సేవించడంలో నిమగ్నుడైపోతాడు. ఈ విధంగా సృష్టికర్త చేసిన వాగ్దాన ప్రభావం మానవ జీవితంపై అసాధారణంగా పడుతుంది. నిశ్చయంగా తన ప్రభువు మాట నిలుపుకోవటంలో సాటిలేని మేటి అన్న నమ్మకం అతనిలో ఉత్తేజాన్ని నింపుతుంది.

## సృష్టికర్త దుర్మార్గులను కఠినంగా దండించాలి.

**(1) సృష్టికర్త ఎన్నడూ సిగ్గు బిడియానికి విరుద్ధంగా ఆదేశించకూడదు.**

సృష్టికర్త మనిషిలో లజ్జ, బిడియం, వ్రీడా స్వభావాన్ని పొందుపరిచాడు. ఈ సిగ్గు (లజ్జ) మూలంగా మనిషి ఎన్నో నీతిమాలిన పనుల నుండి, చెడు చేష్టల నుండి ఆగిపోతాడు. కనుక సృష్టికర్త ఎన్నడూ లజ్జా వ్రీడలకు వ్యతిరేకంగా ఆదేశించలేదు. సమాజంలో ఎక్కడ, ఎలాంటి నీతిమాలిన, అశ్లీలమైన పోకడలు పొడసూపినా – అవన్నీ మనిషి తన మనోవాంఛలకు లోబడి సృష్టించుకున్నవే. వాటిని ధర్మసమ్మతంగా ఖరారుచేసి వాటికి లైసెన్సు ఇప్పించడానికి అతను సృష్టికర్త పేరు వాడుకుంటాడు. సృష్టికర్తకు అబద్ధాన్ని అంటగడతాడు. .... ఇవన్నీ నీతిబాహ్యత కొరకు లైసెన్సు పొందడానికి అతను చేసే నేరపూరిత ప్రయత్నాలన్నమాట!

**(2) పరస్పర అంగీకారంతో పాల్పడే చెడులను కూడా సృష్టికర్త సమ్మతించకూడదు ....**

.... ఎందుకంటే చెడు ఎప్పటికీ చెడే. దాని చెడు ప్రభావం (శారీరక మయిన, నైతికమయిన దుష్ప్రభావం) ఇద్దరు వ్యక్తుల ద్వారా కుటుంబంలోని, సమాజంలోని విశాల పరిధి వరకు విస్తరిల్లుతాయి. వ్యక్తుల జీవితాలను దుర్భరం చేస్తాయి. చెడుకు మంచిమాటల ముసుగు కప్పినంత మాత్రాన సృష్టికర్త మోసపోవటంగానీ, చెడుల ప్రభావం నుండి మానవత సురక్షితంగా ఉండటం గానీ సాధ్యం కాదు. కాబట్టి సృష్టికర్త కఠిన శిక్ష గురించి హెచ్చరించి వ్యక్తులను, సమాజాన్ని కూడా చెడుల నుండి కాపాడాలి. ఈ విధంగా ఆయన మానవాళిపై దయచూపాలి.

## నిజ ఆరాధ్యుడు, సృష్టికర్త ఎలా ఉండాలి?

**(1) సిసలైన సృష్టికర్త, ఆరాధ్య దైవం ఎలా ఉండాలి?**

సిసలైన సృష్టికర్త, ఆరాధించదగిన దేవుడు ఎవడంటే – ఎవరు ఆయన్ని నమ్మినా నమ్మకపోయినా, విధేయత చూపినా చూపకపోయినా, ఆయన ఎదుట వంగినా వంగకపోయినా ఆయన దైవత్వంలో, సార్వభౌమత్వంలో ఎలాంటి తేడా రాకూడదు. ఆయన తన సృష్టితాల నిత్యావసరాలను మాత్రం తీరుస్తూనే ఉండాలి.

**(2) సృష్టికర్తే ఆరాధ్యుడై ఉండాలి.**

**(3) సృష్టికర్త ఎంతో ప్రేమతో దాసునికి తన పరిచయం చేసుకోవాలి. దాసుడు ఆయనకు చేరువ కావటానికి ఇలా పరిచయం చేసుకోవటం అవసరం.**

సృష్టికర్త తనకు చాలా సమీపంలో ఉన్నాడనీ, తన విన్నపాలను వింటున్నాడని, వాటికి సమాధానం ఇస్తున్నాడన్న భావనను సృష్టికర్త దాసునికి కలిగించాలి. ఈ విధమయిన పరిచయం జరిగినప్పుడు దాసుడు సృష్టికర్త వైపునకు ఎగబడతాడు. ఆయన సామీప్యం కొరకు తహతహలాడుతాడు. దాసుడు సదా ఏదో ఒక కష్టానికి, ఆపదకు లోనవుతూ ఉంటాడు. ఏదో ఒక అవసరం ఏర్పడుతూ ఉంటుంది. తనకు అత్యున్నత శక్తిమంతుని (Supreme and

Supernatural Power) అవసరం ఉందని భావిస్తాడు. ఇట్టి పరిస్థితిలో సృష్టికర్త గుణగణాల సరైన పరిచయం జరిగినట్లయితే, దాసుడు ఆయన వైపునకు ఆకర్షితుడవుతాడు. ఆయనతో సంబంధాన్ని పటిష్టపరచుకుంటాడు. ఆ ప్రత్యేక గుణం ఏమిటంటే సృష్టికర్త దాసునికి బహు చేరువలో ఉన్నాడు. అతని పిలుపును వింటాడు. తక్షణం సమాధానం (Response) ఇస్తాడు. సృష్టికర్త తనకు చేరువలో ఉండి, తన వ్యవహారాల పట్ల శ్రద్ధాసక్తులు కనబరుస్తున్నాడన్న భావన దాసుణ్ణి సృష్టికర్తకు దగ్గర చేస్తుంది. (ఈ గుణం కూడా క్షమాశీలి (గఫూర్), దయాశీలి (రహీమ్) గుణాల మాదిరిగానే చాలా ముఖ్యమైనది – దాసుణ్ణి సృష్టికర్తకు దగ్గర చేయటంలో ఇది దోహదకారి అవుతుంది).

### (4) సృష్టికర్త సామీప్య భావనను మానవ నైజం ఇష్టపడుతుంది.

ఈ భావన మూలంగా మనిషి సృష్టికర్తను తనకు చాలా సమీపంలో ఉన్నట్లుగా తలపోస్తాడు. ఆయన తన సమస్యల పట్ల శ్రద్ధవహిస్తున్నట్లుగా భావిస్తాడు. తత్ఫలితంగా అనుబంధం మరింత బలపడుతుంది. సృష్టికర్తకు మరింత దగ్గరవుతాడు. ఆయనపై భరోసా చేస్తాడు. ఆయనపై ఆశలు పెట్టుకుంటాడు. అలసత్వం, అవిధేయత తరువాత ఆయన వైపునకు మరలుతాడు. కష్టకాలంలో సహాయం కొరకు ఆయన్ని వేడుకుంటాడు. ఆయన కటాక్షానికి గాను కృతజ్ఞతలు తెలుపుకుని ప్రసన్నుణ్ణి చేయాలని కోరుకుంటాడు. అందుకే ఆయన్ని ఆరాధించాలని, ఆయనకు విధేయత చూపాలని అతని అంతరాత్మ ఘోషిస్తుంది. అతన్ని ఆయన ముందర వంచుతుంది. ఆయన ఉపకారాలకు గాను అంతరాళం ఆనందాతిశయంతో ఉవ్విళ్లూరి, అందులో నుంచి కృతజ్ఞతా భావం పుట్టుకువస్తుంది.

దైనందిన జీవితంలో ఈ రకమయిన సంబంధ బాంధవ్యం వల్ల మనసుకు శాంతి, తృప్తి ప్రాప్తమవుతుంది. మరోవిధంగా చెప్పాలంటే ఈ భావన మూలంగా అతని జీవితానికి 'జీవితం' లభిస్తుంది. జీవితం సరైన దిశలో ముందుకు సాగుతుంది.

### (5) సృష్టికర్త మెచ్చుకోలులో ఆయన పరిచయం

సృష్టికర్త సద్వర్తనులను ఇష్టపడతాడు, వారిపై తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. దుర్వర్తనులను ఇష్టపడడు. వారిని శిక్షిస్తాడు – ఆయన యొక్క

ఈ వైఖరి కూడా ఆయన్ని పరిచయం చేస్తోంది. అంటే, ఆయన సద్గుణ సంపన్నుడన్న విషయం అవగతమవుతోంది.

## Comprehensive Description

### (1) సృష్టికర్త ఎలాంటివాడై ఉండాలి?

(Natural Human Demand in Day to Day Life)

(మానవుని నిత్య జీవితపు సహజ అవసరాల వెలుగులో సృష్టికర్త పరిచయం)

సృష్టికర్త మానవులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నట్లు కానవస్తాడు. వారి దైనందిన జీవన వ్యవహారాల పట్ల అమిత శ్రద్ధ వహిస్తున్నట్లుగా కనిపిస్తాడు – సృష్టికర్త యొక్క ఈ భావన ఆమోదయోగ్యమైనదిగా, మనసును అలరించేదిగా, అత్యంత ప్రభావవంతమైనదిగా అనిపిస్తుంది. దీనిని అర్థం చేసుకోవటం చాలా సులభం.

ప్రాథమికంగా సృష్టికర్త తన సృష్టితాలను ప్రేమిస్తాడు. నిర్మాతకు లేక పుట్టించిన వానికి తాను నిర్మించిన లేక సృజించిన వస్తువు పట్ల మౌలికంగా ఎంతో ప్రేమానుబంధం ఉంటుంది.

సృష్టికార్యం, ప్రేమ, కారుణ్యం – ఇవి ఒక దానితో ఒకటి ముడిపడినవి. సృష్టి మొదలైనప్పటి నుండే సృష్టికర్తకు తన సృష్టితాలతో గల సంబంధ (Attachment) పరంపర ఆరంభమవుతుంది. కనుక సృష్టించినవాడే నిజమైన ప్రేమను, కారుణ్యాన్ని కురిపిస్తాడు. జీవనావసరాలను పర్యవేక్షిస్తాడు. జీవితానికి రక్షణ కల్పిస్తాడు, జీవితాన్ని అభివృద్ధిపరుస్తాడు, జీవితానికి మార్గదర్శకత్వం వహిస్తాడు.

పుట్టించనివాడు వీటన్నింటినీ అంత ఉద్దిష్టం (Intensity) గా, ఉదాత్తం (Magnitude) గా చేయలేడు. అతనికి ఈ పనులతో అంత గాఢమైన అనుబంధం, శ్రద్ధాసక్తులు ఉండవు. అందుకే సృష్టించినవాడే స్వామి, ఉపాధి ప్రదాత కూడా అయి ఉంటాడు. అందుకే మానవ నైజం ఆయన వైపునకే మొగ్గుచూపుతుంది. ఆయన పంచన చేరాలని ఉబలాటపడుతుంది. పూర్తి నమ్మకంతో, ఆశతో ఆయన వైపునకు మరలి సేదతీరాలనుకుంటుంది. ఈ కారణంగానే వేరొక శక్తి వైపునకు మొగ్గటానికి మనసు సుముఖత చూపదు.

కరుణామయుడు, ప్రేమమయుడైన సృష్టికర్త తనను సత్యం వైపునకు, సరైన విషయం వైపునకు మార్గనిర్దేశన చేస్తాడన్న నమ్మకం, భరోసా మనిషికి ఉంటుంది. తద్వారా మనిషికి హాని కలగకుండా ఉంటుంది. జగతిలోనూ, స్వయంగా మనిషి వ్యక్తిత్వంలోనూ ఉన్న చట్టబద్ధత ప్రకృతితో వ్యాఘాతం చెంది నాశనమవకూడదు. పైగా అది ప్రకృతితో సమరసం చెంది సఫలీకృతం అవాలి. అందుకే మార్గనిర్దేశన అనేది చాలా అవసరం. మార్గనిర్దేశన చేయాలనే దైవ ప్రేమ, దైవ కారుణ్యం కాంక్షిస్తాయి. కనుక సృష్టికర్త అనేవాడు మార్గనిర్దేశన చేయకుండా మనిషిని జీవన సుడిగుండంలో చిక్కుకునేలా వదలిపెట్టకూడదు.

మానవ అంతరాత్మకు పోషక పదార్థం (Nourishment) అందించి మార్గబోధన చేయడానికి, మంచీ చెడులను ఎరుకపరచడం (Enlightenment) అవసరం. సృష్టికర్త మాత్రమే ఈ ముఖ్యావసరాన్ని  ఉత్తమ రీతిలో తీర్చగలడు. ఎందుకంటే ఆయన సృష్టికర్త. సృష్టికర్త మాత్రమే సర్వజ్ఞాని. మంచీ చెడులకు సంబంధించిన స్పష్టమయిన జ్ఞానం అందించటం అవసరమని ఆయన కారుణ్యం కూడా గట్టిగా వాంఛిస్తుంది.

మంచి ఏదో – చెడు ఏదో మనిషిలోని మనస్సాక్షికి తెలియనంత వరకూ అతనికి అంతర్గత దర్శకత్వం (Internal Direction) లభించదు. కాగా, జీవితంలో అనుక్షణం ఇది అతనికి ఎంతో అవసరం.

పెద్ద పెద్ద పాపకార్యాల – ఘనమయిన సత్కార్యాల మధ్య గల వ్యత్యాసాన్ని గ్రహించే విచక్షణాజ్ఞానం అంతరాత్మకు (మనస్సాక్షికి) ఉంది. ఈ అంతరాత్మ గనక జ్యోతిర్మయమైనట్లయితే మంచీ చెడుల మధ్య తేడాను పసిగట్టే అతని దార్శనికతా పరిధి, సునిశిత దృష్టి (Field of Vision and Sensitivity) మరింతగా పెరుగుతుంది.

దైనందిన జీవితంలో మాటిమాటికీ తప్పులు, పాపాలు జరుగుతూ ఉంటాయి. తప్పు చేశానన్న భావన అతనిని వ్యాకులతకు గురిచేస్తూ ఉంటుంది. అతను తన పాపాన్ని ప్రక్షాళనం చేసుకోవాలనుకుంటాడు. కాబట్టి అతనికి ప్రక్షాళనం చేసుకునే పద్ధతి కావాలి. క్షమ ప్రాప్తమవుతుందన్న నమ్మకం కూడా. కాబట్టి సృష్టికర్త తనలోని జాలిగుణం, ప్రేమ గుణం కారణంగా ఆ రెంటినీ అతనికి ప్రసాదించాలి. లేకుంటే దాసుని జీవితం అతని పాలిట దుర్భరం

అయిపోతుంది. అతను నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యకు పూనుకోవచ్చు. లేదా తనలోని అంతరాత్మను తుంగలో తొక్కేసి మరిన్ని పాపాలకు ఒడిగట్టవచ్చు.

నేరుగా ప్రార్థన చేసుకుని, పశ్చాత్తాపం చెందటం ద్వారానే కలత చెందిన అతని మనసు కుదుటపడుతుంది. ఏ పద్ధతి ద్వారా మనిషి మనసు నెమ్మదిస్తుందో ఆ ఆచరణా పద్ధతినే సృష్టికర్త సమర్థించాలి.

మనిషి తనను సృష్టించిన వానికి కృతజ్ఞతలు తెలుపుకుని, ఆయన సన్నిధానంలో వినమ్రంగా వంగాలని కోరుకుంటాడు. రేయింబవళ్ళు ఆయన చేస్తున్న ఎన్నో మేళ్లకుగాను ధన్యవాదాలు తెలుపుకోవాలని అనుకుంటాడు. కాబట్టి తనకు ఏ రీతిలో ధన్యవాదాలు తెలుపుకోవాలో సృష్టికర్త తెలియజేయాలి. తాను ఇష్టపడే ఆరాధన ఏదో, తన సన్నిధిలో ఎలా మోకరిల్లాలో ఆయన వివరించాలి. తనకు శ్రద్ధాభక్తుల నివాళి ఎలా ఘటించాలో, ఏ రీతిలో కృతజ్ఞతాం జలి సమర్పించాలో ఆయన తన సేవకునికి విశదపరచాలి. మానవులందరికీ ఆయన ఒకే విధమైన ఆరాధనా పద్ధతిని నేర్పాలి. అది ఆయన ఎంతగానో ఇష్టపడే పద్ధతి అయి ఉండాలి. ఎందుకంటే అత్యుత్తమ (Best) పద్ధతి ఒక్కటే అయి ఉంటుంది. ఒక మనిషికి మేలైన పద్ధతి ప్రతి మనిషికీ మేలైనదై ఉంటుంది. ఎందుకంటే అందరి నైజం ఒక్కటే. మానవ నైజంతో సమరసం చెంది, మానవ అంతరాత్మను తట్టి లేపే విధానమే అత్యుత్తమమైన విధానం.

తనను స్మరించే, సదా జ్ఞాపకముంచుకునే పద్ధతి ఏదో సృష్టికర్త తెలుపాలి. మానవుడు ఆయన్ని సదా జ్ఞాపకముంచుకుని, ఆయన మెచ్చుకునే పనులు చేస్తూ ఉండటానికి, ఆయన మెచ్చని పనులకు దూరంగా ఉండటానికి ఇది చాలా అవసరం. సృష్టికర్త ధ్యాస సదా మదిలో ఉన్నప్పుడే ఇది సాధ్యం.

మనిషి ఎన్నో వస్తువుల బారి నుండి సురక్షితంగా ఉండాలని కోరుకుంటాడు. సృష్టికర్త మాత్రమే అతనికి రక్షణ కల్పిస్తాడు. తనలోని ప్రేమైక కారుణ్య గుణం మూలంగానే ఆయన రక్షిస్తాడు. సృష్టికర్త అనేవాడు ఇలాగే ఉండాలి. తన సృష్టితాలతో ఆయనకు గల అనుబంధం ఇలాగే ఉండాలి.

మనిషి తనకు తాను సాయం చేసుకోలేడు. వేరొకరు కూడా అతనికి సహాయం చేయలేరు. అసాధారణ పరిస్థితుల్లో ఒకరింకొకరిని ఆదుకునే తాహతు మనుషుల్లో లేదు. అది వారివల్ల అయ్యే పని కాదు. సృష్టికర్త మాత్రమే తన

శక్తియుక్తుల ద్వారా ఆ పని చెయ్యగలడు. సృష్టికర్తకు తన దాసులతో ఉండాల్సిన అనుబంధం అటువంటిదే.

సృష్టికర్త తన సృష్టితాలందరి పట్ల ప్రేమమయుడు, దయామయుడవటం వల్ల ఆయన అందరి యెడల న్యాయంగా వ్యవహరిస్తాడన్న నిశ్చింత దాసులకు ఉంటుంది.

సృష్టికర్త యొక్క పరిశుద్ధత, ఆయన ఘనత్వం, ఆయన పవిత్రత గురించి సృష్టికర్త మనిషికి పరిచయం చేసే తీరు అమోఘంగా ఉండాలి. తద్వారా మనిషి మనసు సదా ఆయన ముందు వంగి ఉండాలి. ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తూ ఉండాలి. ఆయనకు కృతజ్ఞతలర్పిస్తూ, విధేయత కనబరుస్తూ ఉండాలి. తన వల్ల జరిగిన తప్పులపై సిగ్గుతో కుమిలిపోతూ, క్షమాపణ కోరుకుంటూ ఉండాలి.

**(2) మానవ నైజం సృష్టికర్త నుండి కోరేదేమిటి? .... సిసలైన సృష్టికర్త మాత్రమే దానిని నెరవేరుస్తాడు.**

(అ) సృష్టికర్త మానవుని శారీరక, భౌతిక అవసరాలను తీర్చాలి .... ఆహారం, నీరు, గాలి, వస్త్రాలు ఇత్యాదివి. తద్వారా మనిషి హాయినొందుతాడు.

(ఆ) సృష్టికర్త మానవుని ఆధ్యాత్మిక, నైతిక అవసరాలను తీర్చాలి. .... తద్వారా అతని మనసుకు శాంతి, నెమ్మది ప్రాప్తిస్తుంది.

**(1)** మానవుని పుట్టుక పరమార్థం ఏమిటో విశదపరచాలి. అప్పుడే అతను ఆ లక్ష్యానికి చేరుకుంటాడు.

**(2)** ఈ జగతిలో మానవుని స్థానం ఎట్టిదో విడమరచి చెప్పాలి. అప్పుడే అతను ఆ స్థానంలో కూర్చొని తన జీవిత లక్ష్యాన్ని నెరవేరుస్తాడు.

**(3)** ఈ జగతితో మనిషికి గల సంబంధం ఎట్టిదో అతనికి విశదపరచాలి. అప్పుడే అతను ఈ జగతిలోని వస్తువులతో తగిన రీతిలో వ్యవహారం (Interaction) చేస్తాడు, వాటిని సద్వినియోగం చేసుకుంటాడు. వాటి ద్వారా లబ్ది పొందుతాడు.

**(4)** సాటి మనుషులతో అతనికి గల సంబంధం ఎట్టిదో, వారి యెడల ఎలా వ్యవహరించాలో కూడా అతనికి అవగతపరచాలి. అంటే వారి యెడల

అతని Dealing, Interaction, Behaviour ఎలా ఉండాలో బోధపరచి, వాటి సద్ఫలితం వెలువడేలా చేయాలి.

**(5)** సరైన జీవన పద్ధతి లేక సరైన జీవన వ్యవస్థ – ఇది మానవుని అత్యంత ముఖ్యావసరం. దీనిని తీర్చటం సృష్టికర్త గురుతర బాధ్యత. మానవులపై ఆయనకు గల ప్రేమ, దయ కోరినట్లుగా ఆయన ఈ బాధ్యతను నెరవేర్చాలి. అప్పుడే మానవుడు ఆ జీవన విధానాన్ని అవలంబించి ప్రశాంత జీవితం గడపగలుగుతాడు.

(ఇ) భావాలు, భావనలను దృష్టియందుంచుకోవాలి. అతని కోర్కెలను తీర్చాలి.

- ♦ అతని జతను సృష్టించి, మౌలికావసరాన్ని తీర్చాలి.
- ♦ వారి సదాచరణలపై సంతోషించాలి, విలువ ఇవ్వాలి, బహుమతి ప్రదానం చేయాలి.
- ♦ వారి దురాచరణలపై అప్రసన్నుడవ్వాలి. ఆగ్రహించాలి, శిక్షించాలి.
- ♦ సత్కార్యాల, దుష్కార్యాల ప్రమాణం, నియమం ఏదో వివరించాలి – అప్పుడే మనిషి దానికనుగుణంగా తన ఆచరణలను జడ్జ్ (Judge) చేసుకోగలడు. సత్కార్యాలు ఆచరించి, దుష్కార్యాల నుండి తనను కాపాడుకోగలడు.
- ♦ మనిషి ఉద్దేశాన్ని కూడా ఎరిగి ఉండాలి. అతని ఆంతర్యంలోని రహస్యాలను సయితం తాను ఎరిగినవాణ్ణి అన్న దృఢనమ్మకం అతనికి కలిగించాలి. ఎందుకంటే సత్కార్యాలైనా, దుష్కార్యాలైనా వాటి ఆరంభం సంకల్పం (ఉద్దేశం)తోనే మొదలవుతుంది.
- ♦ మనిషి తన సంకల్పంపై నియంత్రణ కలిగి ఉండటానికి ఈ ఎరుక అవసరం.
- ♦ దుర్వర్తనుడైన మనిషిని ఇష్టపడనివాడే సృష్టికర్త.
- ♦ మనిషికి పూర్తి ప్రతిఫలం ఇచ్చేవాడు, అన్యాయం చేయనివాడే సృష్టికర్త.
- ♦ కచ్చితమయిన ఆచరణా విధానాన్ని నేర్పేవాడే సృష్టికర్త.
- ♦ ఒక మనిషి చేసిన దురాగతాల బాధ్యతను వేరొకరి నెత్తిన వేయకుండా ఉండేవాడు, ఒకరి సదాచరణల పుణ్యఫలాన్ని వేరొకరికి ఇవ్వకుండా

ఉండేవాడు మాత్రమే సృష్టికర్త. అలా జరిగినప్పుడే అన్యాయం జరగకుండా ఉంటుంది.

- పుట్టించిన మీదట మనిషిని అతని మానాన వదలి వేయకుండా, నిరంతరం అతనితో సంబంధం ఏర్పరచుకుని, ఆఖరి క్షణం వరకూ అతనిని ఆదుకునేవాడే సృష్టికర్త.
- మనిషి చేసే ప్రార్థనలను ఆలకించేవాడు, అతని అవసరాలను తీర్చేవాడే సృష్టికర్త.
- పశ్చాత్తాపంతో మరలి వచ్చినప్పుడు పాపాలను క్షమించేవాడే సృష్టికర్త.

**(3) సృష్టికర్త మాత్రమే సరైన సమాచారం ఇవ్వగలడు.**

(అంచనాల ఆధారంగా చెప్పేదానికీ, జ్ఞానం ప్రాతిపదికపై చెప్పేదానికీ మధ్య తేడా ఉంటుంది)

సర్వం ఎరిగినవాడే కచ్చితమయిన సమాచారం ఇవ్వగలుగుతాడు. విశ్వాన్ని, మనిషిని సృష్టించినవాడు తప్ప సర్వజ్ఞాని ఎవడు కాగలడు? జగతిలో ఎవరేమిటో, ఎవరి స్థానమేదో, ఎవరి జోరెంతో, ఎవరెంత బలహీనులో ఆయనకే ఎరుక. ఎవరయినా దైవత్వంలో భాగస్వాములుగా ఉన్నారో లేదో ఆయనకే తెలిసి ఉండాలి. తాను ఎవరినయినా తన సహవర్తిగా చేసుకున్నాడో లేదో అనేది కూడా ఆయనే తెలుపగలడు.

జగతిలో ఈ ఘనకార్యాలన్నీ చేయగలవాడే, ఉపాధిని సమకూర్చేవాడే సిసలైన సార్వభౌమాధికారి కాగలడు. ఆయన తప్ప వేరెవరూ ఎలాంటి ఘనకార్యం చేయలేరు. వేరెవరికీ అటువంటి శక్తి లేదు. ఒకవేళ మానవుడు ఎవరినయినా ఈ ఏర్పాట్లలో, సార్వభౌమత్వంలో భాగస్వామిగా భావిస్తున్న ట్లయితే అతను తన పరిజ్ఞానం ఆధారంగా భావిస్తున్నాడా లేక అంచనాల ఆధారంగానా? అంచనాలు ఎన్నటికీ జ్ఞానానికి ప్రత్యామ్నాయం కాజాలవు. అనుభవాల ద్వారా తెలిసే విషయాలు కాలంతో పాటే మారుతూ ఉంటాయి. ఒక విషయం జ్ఞానం వెలుగులో అనబడుతోంది (అంటే సృష్టికర్త తరఫున). మరొక విషయం అంచనాల ఆధారంగా అనబడుతోంది (పుట్టించబడిన వాని తరఫున). రెండింటిలో వైరుధ్యం ఉంది. అంటే అంచనాల ఆధారంగా

కల్పించబడిన విషయం తప్పు. అందువల్ల అది త్రోసిపుచ్చ (Reject) దగినది. జ్ఞానంలో పండిపోయిన వాని తరపున – అంటే సృష్టికర్త తరపున – చెప్పబడిన విషయం స్వీకారయోగ్యమైనది, నమ్మదగినది. జగతిలోని ఎన్నో వస్తువుల ద్వారా మనం ఎన్నో ప్రయోజనాలను పొందుతున్నప్పుడు ఈ గొప్ప ప్రయోజనం మాత్రం ఎందుకు పొందకూడదు? జగతిలోని ఈ వస్తువులపై మనం చింతన చేసినప్పుడే కదా మన నిజ యజమాని వరకు మనం చేరుకుని, ఆయన్ని తెలుసుకుని, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకునేది, మన జీవితాలను తీర్చిదిద్దుకోగలిగేది?

**ఆరవ అధ్యాయం :**

# సృష్టికర్త న్యాయశీలం .... ఒక చూపులో!

సృష్టికర్త యొక్క న్యాయశీలం ఆవశ్యకత, ప్రాముఖ్యత

**(1)** దాసుల మధ్యన న్యాయం చేసేవాడు, వారికి వారి ప్రతిఫలం వొసగేవాడే సృష్టికర్త.

**(2)** న్యాయం జరగాలి, ప్రతిఫలం లభించే దినం రావాలన్నది మానవ నైజం కోరిక.

**(3)** మానవ నైజం, మానవ బుద్ధి .... తీర్పుదినం నెలకొనాలని, సృష్టికర్త న్యాయశీలిగా వ్యవహరించాలని కోరుకుంటుంది.

**(4)** మానవ కార్యాచరణ ద్వారా మానవ నైజం వాంఛించే దాని అభివ్యక్తి.

**(5)** రెండు పరస్పర విరుద్ధ ఆచరణల ఫలితాలు ఒకేలా ఉండవు.

**(6)** విరుద్ధ ఆచరణల విరుద్ధ ఫలితాలు.

**(7)** న్యాయం (తీర్పు) జరిగే దినం ఒకటి ఉండాలి – చేసుకున్న ఆచరణలకు ప్రతిఫలం ఇవ్వడానికి మళ్లీ జీవితం ఉండాలి.

**(8)** మనిషి ఒక బాధ్యతాయుతుడయిన ఉనికి అయినందువల్ల తన ఆచరణలకు జవాబుదారుడు.

**(9)** తీర్పుదినం సజ్జనులైన దాసులకు సంతోషకర దినమై ఉండాలి.

**(10)** సృష్టికర్త గురించి చవుకబారు భావన – దానికి సృష్టికర్త అతీతుడు, పవిత్రుడు.

**(11)** న్యాయానికి గీటురాయి.

**(12)** తీర్పుదినాన కేవలం న్యాయం జరగాలి. ఫలితం లభించాలి. అంతే గాని ఆచరణకు మరింత గడువు ఇవ్వకూడదు.

**(13)** సృష్టికర్త దృష్టిలో ఎవరూ జన్మతః ప్రియతముడై ఉండకూడదు.

**(14)** ప్రతి వ్యక్తీ తన కర్మకు బాధ్యుడై ఉండాలి.

**(15)** తిరుగులేని న్యాయనిర్ణయం.

**(16)** ప్రతి వ్యక్తి సముపార్జన అతని ఇష్టంతో, కృషితో జరిగి ఉండటం న్యాయం.

**(17)** సృష్టికర్త పక్షాన న్యాయం వాంఛించేదేమిటంటే, ప్రతి వ్యక్తీ తన బరువును స్వయంగా తానే మోయాలి.

**(18)** సృష్టికర్త మాత్రమే న్యాయాధీశుడై ఉండాలి. ఆయన చేసే న్యాయం తిరుగులేనిదై ఉండాలి. న్యాయబద్ధమైనదై ఉండాలి (అది ప్రపంచంలోని న్యాయస్థానాల మాదిరిగా ఉండకూడదు).

**(19)** తీర్పుదినాన నిజమైన న్యాయం జరగాలి. న్యాయనిర్ణయం జరిగే రోజు అన్యాయానికి గురికాకూడదు.

**(20)** తీర్పు పకడ్బందీగా జరగాలి. దానిపై ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం మిగులకూడదు.

**(21)** సాక్ష్యాధారాల ప్రాతిపదికపై న్యాయం నిర్ణయం జరగాలి.

**(22)** బహుమతి కొరకు సంకల్పాలను పసిగట్టడం సృష్టికర్తకు ఎంతో అవసరం.

**(23)** ఒక వ్యక్తి చేష్టకు మరొకరెవరయినా పరోక్షంగా కారకుడై ఉంటే అతను కూడా శిక్ష లేక బహుమానానికి బాధ్యుడే (పాత్రుడే) అవాలి.

**(24)** 'తీర్పు'కు సిసలైన ప్రాతిపదిక సృష్టికర్త తరఫున పంపబడిన సందేశం అయి ఉండాలి. అంటే ఆ సందేశం జనబాహుళ్యానికి అంది ఉండాలి.

**సృష్టికర్త తరఫున న్యాయం చేస్తానన్న వాగ్దానం : మానవ జీవితంపై దాని ప్రభావం :**

(1) దుర్మార్గానికి, చెడుకు తగిన ప్రతిఫలం ఇవ్వటం (శాస్తి జరగటం) కూడా న్యాయమే.

(2) సృష్టికర్త తను అనుగ్రహభాగ్యాల లెక్క తీసుకోవాలి.

(3) సృష్టికర్త దాసుని ప్రతి చేష్టకు లెక్క తీసుకోవాలి.

# సృష్టికర్త న్యాయగుణం

## సృష్టికర్త యొక్క న్యాయశీలత : ఆవశ్యకత, ప్రాముఖ్యత

సృష్టికర్త న్యాయగుణంపై యోచించటం ద్వారా సృష్టికర్తను తెలుసుకోవచ్చు.

మానవుడు చేసుకున్న దాని ప్రతిఫలాన్ని అతనికి తప్పక ఇస్తాడన్న కోణాన్ని మనం తెలుసుకోనంత వరకూ సృష్టికర్త గురించిన సమత్వపు (Balanced) పరిచయం పూర్తిగా జరగదు. (ఇదే గనక లేకుంటే మనిషి జీవన పోరాటంలో అర్థమే ఉండదు). అంటే సృష్టికర్త మనిషి చేసిన కృషికి పూర్తి ప్రతిఫలం ఇవ్వాలి. అందులో ఎలాంటి కొరత ఉండకూడదు. అతను చేసిన పని యొక్క ప్రతిఫలం (అది మంచిదైనా, చెడ్డదైనా) ఇతరులకు ఇవ్వకూడదు. ఆయన వైఖరి ఎంతో న్యాయనిబద్ధతతో కూడుకున్నదై ఉండాలి.

మానవుడు ఒక భౌతిక ఉనికితో పాటు నైతిక ఉనికి కూడా కలిగి ఉన్నాడు (మానవ ఉనికిలోని ఈ 'భాగాన్ని' గనక తొలగించినట్లయితే లేదా అణచివేసినట్లయితే అతను పశువుగానో, నరరూప రాక్షసుడుగానో తయారవుతాడు). అతని జీవన రహస్యంలో అంతర్లీనమై ఉన్న ఈ నైతిక కోణం విస్మరించరానిది. అతని జీవన పోరాటంతో అనుసంధానమై (Attach)ఉన్న 'నైతిక భాగానికి' కూడా ప్రతిఫలం అతనికి తప్పక లభించాలి. ప్రాపంచిక జీవితంలో మనిషికి ఈ కోణం నుండి పూర్తిగా న్యాయం జరుగుతున్నట్లు కనిపించదు. జీవన పోరాటంలోని ఈ నైతిక 'విభాగం' సులభమైనది కాదు. అది ఎంతో ఓర్పుతో, త్యాగంతో కూడుకున్నది. నీతిరాహిత్యమైన పరిస్థితుల,

వ్యవస్థల ద్వారా అది ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటుంది. పరీక్షించబడుతుంది. ఈ ప్రయత్నాలకు, ప్రయాసలకు, బాధలకు గాను తప్పక మంచి ప్రతిఫలం ప్రాప్తమవ్వాలి. .... మనశ్శాంతి, హృదయ నెమ్మది, శారీరక సుఖం రూపంలో ఓ సుదర్ఘీకాలం వరకు ఆ బహుమానాన్ని అతను ఆస్వాదించగలగాలి. మరెవరయితే నీతికి తిలోదకాలిచ్చి అవినీతిపరులుగా జీవితం గడుపుతారో, వారి అవినీతి వల్ల ఇతరులకు అన్యాయం జరుగుతుంది. వారి హక్కులు కొల్లగొట్టబడతాయి. సమాజంలో అరాచకం, అలజడి రేకెత్తుతుంది. భువిలో హత్యలు దోపిడీలు ప్రబలుతాయి. భూమండలంలోని విశాల పరిధిలో చాలామంది ఈ అరాచకానికి లోనవుతారు. ఒక్కోసారి ఈ దౌర్జన్యకాండ యొక్క చెడు ప్రభావం కొన్ని తరాల వరకు ఉంటుంది. కాని ఈ దౌర్జన్యానికి తగిన శిక్ష మూల కారకునికిగాని, అతని సంబంధీకులకు గాని ఈ ప్రపంచంలో పడినట్లు కానరాదు. ఒకవేళ శిక్ష పడినా అది అంతంత మాత్రమే.

సృష్టికర్త వ్యక్తిత్వంలో ఉన్న సమత్వం, సమతూకం, దాని సత్ప్రభావం మానవ జీవితంపై పడుతుందన్న సంగతి తెలిసివచ్చేదెప్పుడంటే; 'సృష్టికర్త మానవుల మధ్యన న్యాయం చేస్తాడు, వారికి వారు చేసుకున్న కార్యాల ప్రతిఫలం (బహుమానం లేక శిక్ష) ఇస్తాడు' అన్న భావన వారి మదిలో నాటుకున్నప్పుడే. ఈ చర్చ వల్ల తేలిందేమిటంటే న్యాయగుణం అత్యంత ముఖ్యమైన గుణం. ఈ విశిష్ఠ గుణం సృష్టికర్తలో తప్పనిసరిగా ఉండాలి. దాసుణ్ణి సృష్టికర్తకు చేరువ చేయడానికి కూడా ఇది అవసరం. లేకుంటే దాసునికి సృష్టికర్తతో సంబంధం బలపడదు. అతను ఆయన్ని గౌరవించడు. ఎందుకంటే అతనికి రావలసిన హక్కు అతనికి లభించటం లేదు గనక. తాను చేసిన దానికి ప్రతిఫలం, తన త్యాగాలకు తగిన పురస్కారం లభించనప్పుడు అతనికి తన సృష్టికర్త యెడలగానీ, ఆయన ఆరాధనల యెడల గానీ శ్రద్ధాసక్తులు ఎందుకుంటాయి? కాబట్టి తేలిందేమిటంటే న్యాయం జరగాలి, తీర్పుదినం నెలకొనాలి, ప్రతిఫలం లభించాలని మానవ నైజం ఘోషిస్తుంది. అది అత్యుత్తమ రీతిలో నెరవేరాలని కూడా మానవ నైజం కోరుకుంటుంది. అందుకే సృష్టికర్త అనేవాడు న్యాయశీలుడై ఉండాలి. న్యాయాన్ని సంస్థాపించేవాడై ఉండాలి. న్యాయం జరిగే స్థలం కూడా నిర్ధారితమవాలి. ఒక న్యాయస్థానం ఉండాలి. ఒక రోజు నిర్ధారించబడాలి. ఆనాడు న్యాయంతో ముడిపడి ఉన్న అంశాలన్నీ పరిగణనలోనికి రావాలి.

ఇక ఆ నిజమైన న్యాయాధిపతి ఎలా ఉండాలి, ఈ విషయంలో మానవ నైజం వాంఛించేదేమిటో క్షుణ్ణంగా పరిశీలిద్దాం –

**1. దాసుల మధ్యన న్యాయం (తీర్పు) చేసేవాడు, వారు చేసుకున్న దానికి 'ప్రతిఫలం' ఇచ్చేవాడే సృష్టికర్త.**

'న్యాయం' అనేది జరగకపోతే, జరిగే ఆశలు కూడా అడుగంటిపోతే జీవితంలో శాంతి ఉండదు. బ్రతుకు అశాంతికి, అలజడికి ఆలవాలమవుతుంది. మనిషి జీవితం పట్లనే విరక్తి చెందుతాడు. సరైన దిశలో కొనసాగవలసిన జీవిత కార్యకలాపాలు గాడి తప్పుతాయి. జీవితంలో అపసవ్యత పొడసూపుతుంది.

**2. న్యాయాన్ని, ప్రతిఫల దినాన్ని మానవ నైజం వాంఛిస్తుంది.**

సత్కార్యానికి సత్ఫలితం, దుష్కార్యానికి దుష్ఫలితం ఉండాలని ప్రతి మనిషి అనుకుంటాడు. ఈ రకమయిన ఆలోచన మానవ స్వభావంలోనే ఇమిడి ఉంది. ఇలా జరిగితీరాలన్న కోరిక (Demand) అతని నైజంలో చాలా తీవ్రంగానే ఉంటుంది. అతని ఈ సహజ కోరిక అతని కోపం, ఆవేదన ద్వారా కూడా వెల్లడవుతూ ఉంటుంది. ఈ ప్రాపంచిక జీవితంలో మంచికి బహుమానం, చెడుకు శిక్ష లభించనప్పుడు అతనిలోని క్రోధాగ్ని బయటపడుతూ ఉంటుంది.

**3. మానవ నైజం, మానవ బుద్ధి .... తీర్పుదినం నెలకొనాలని, సృష్టికర్త న్యాయశీలుడై ఉండాలని కోరుకుంటాయి.**

ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దౌర్జన్యం చేసినపుడు, దౌర్జన్యపరుణ్ణి శిక్షించాలని బుద్ధికన్నా ముందు మనిషి నైజం కోరుతుంది. అలాగే ఒక వ్యక్తి మరో వ్యక్తిని కాపాడినప్పుడు–ఇక్కడ కూడా మానవ బుద్ధికంటే ముందు–మానవ నైజం వెంటనే కోరుతుంది, ఆ వ్యక్తికి మంచి పురస్కారం లభించాలని! మానవ బుద్ధి ఒక వైపున ఆ దిశలో ఆలోచిస్తూ ఉండగానే మానవ స్వభావం తక్షణం ఆ మేరకు తన తీర్పును వినిపించేస్తుంది. ఈ విధంగా నైజం (స్వభావం)లో ఉద్భవించే డిమాండ్లు, తీర్పులు సరైనవై ఉంటాయి. ఈ జీవితం లక్ష్య రహితమనీ, ఈ జగతి ఉనికి వెనుక ఒక అర్థం పర్థం లేదని ఎవరన్నా అన్నప్పుడు మానవ నైజం, మానవబుద్ధి తక్షణం ప్రతిస్పందిస్తూ **"అలా జరగదు, జరగకూడదు"**

అని అతని బుద్ధీ వివేకాలు ఘోషిస్తాయి. అర్ధం లేని జీవితాన్ని ఫలితం లేని జీవితాన్ని మానవ బుద్ధీ వివేకాలుగానీ, మానవ స్వభావంగాని అంగీకరించవు.

మానవ నైజం, మానవ బుద్ధి ఈ రెండింటి తీర్పులను త్రోసిపుచ్చుటం మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం. అది దాని స్పందనకు పరాకాష్ఠ. మరి ఈ మనోమయ భావాలే 'బుద్ధి' చేత తప్పుడు ప్రకటనలు కూడా చేయిస్తాయి – దేవుడనే వాడు లేడు, మరణానంతరం మరో జీవితం లేదు, అక్కడ మనిషి తన చేష్టలకు జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న వాదన ఉత్తుత్తిదే అని చెప్పిస్తాయి. మనోభావాలు విశృంఖలంగా విహరించాలని, అడ్డూ ఆపూ లేని విచ్చలవిడి జీవితం గడపాలని, మనోవాంఛలు సర్వవిధాలా నెరవేరాలని కాంక్షిస్తాయి. ఈ కోర్కెల కోసం అవసరమైతే ఇతరుల హక్కులు కొల్లగొట్టడానికి, సమీపబంధువును చంపటానికి కూడా వెనుకాడరాదని పురికొల్పుతాయి. కాగా; సృష్టికర్త ఉన్నాడనే భావన, తీర్పు దినం (Day of Judgement) ఉందన్న నమ్మకం ఈ మనోవాంఛల్ని తీర్చుకునే మార్గంలో అతి పెద్ద అడ్డంకిగా, అనుక్షణం అతన్ని ఆపే కళ్ళెంగా ఉంటాయి. (పోలీసు, చట్టం కూడా ఈ మార్గంలో అవరోధాలుగానే ఉన్నప్పటికీ అవి చాలా చిన్నవి, తాత్కాలికమైనవి). అందుకే మనోభావాలు బుద్ధిపై చేసే మొదటి దాడి (Attack) ఏమిటంటే; తప్పుడు ప్రచారం ద్వారా బుద్ధిని దోషిగా నిలబెట్టాలి. బుద్ధి చెప్పేదానిని నమ్మరాదని, అది బుద్ధిలేనిదని చెప్పాలి. మరీ ముఖ్యంగా – 'సృష్టికర్త ఉన్నాడు, పరలోకం ఉంది' అనే రెండు యదార్థాలను నమ్మేవాడు మతిమాలిన వాడని, విద్యాగంధంలేని వాడని చెప్పాలి. ఆ తరువాత అది బుద్ధిచేత తప్పుడు ప్రకటనలు చేయిస్తుంది. నిరాధారమయిన వాదన చేయిస్తుంది. మనిషి తన మొండి వాదనపై పాతుకుపోయి, ఎదుటివారిని అవివేకి కింద జమకట్టేలా చేస్తాయి. 'దేవుడూ లేడు, పరలోకమూ లేదు. అంతా వట్టిదే. ఎవడు చూసివచ్చాడు, ఈ ప్రపంచమే సర్వస్వం. చచ్చినవారిలో ఇప్పటి వరకూ బ్రతికి వచ్చినదెవరు, ప్రతిదీ పెరుగుట విరుగుట కొరకే. ప్రతి దానికీ వినాశం తథ్యం' అని నిరూపించేలా పురమాయిస్తాయి. అయితే మానవనైజం ఈ రకమయిన మనోమయ భావాల దాడిని నిరంతరం ప్రతిఘటిస్తూ ఉంటుంది. ఈ సంఘర్షణ మూలంగా మనిషి మథనపడుతూ జీవితం గడుపుతాడు.

**(4) మానవ చర్య ద్వారా 'నైజం' వాంఛించే విషయాల అభివ్యక్తి**

మానవుడు ఈ ప్రపంచంలో న్యాయస్థానాలను నెలకొల్పాడు. ఎందుకు? అమాయకులకు, నిర్దోషులకు, పీడితులకు న్యాయం లభించేటందుకు! దుర్మార్గులను, దౌర్జన్యపరులను శిక్షించేటందుకు!! దీని భావమేమిటంటే స్వతహాగా మనిషికి మంచీ చెడుల గురించి తెలుసు. వాటి మధ్య గల వ్యత్యాసాన్ని అతను పసిగడతాడు. మంచిని ఇష్టపడతాడు. చెడును ఏవగించుకుంటాడు. ఇంకా ముందుకుపోయి – చెడుకు శాస్తి జరగాలని, నిరపరాధికి, నిర్దోషికి న్యాయం జరగాలని కాంక్షిస్తాడు.

**(5) రెండు పరస్పర విరుద్ధ కార్యాల ఫలితం ఒకేలా ఉండదు.**

రెండు పరస్పర విరుద్ధ వస్తువులు, విరుద్ధ ఫలితాలనిచ్చేవి, లేదా విరుద్ధ ప్రత్యేకతలున్నవి ఎన్నటికీ ఒక్కటి కావు. వాటి మధ్య తేడా ఉంటుంది. వాటి విలువలో కూడా వ్యత్యాసం దానంతటదే ఏర్పడుతుంది. దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే ఉండదు. అలాగే రెండు పరస్పర విరుద్ధమయిన పనులు చేసే వ్యక్తులు 'విలువ' దృష్ట్యా సమానులై ఉండరు. వారు చేసే పనుల ఫలితాలు కూడా ఒకేలా ఉండవు. అందుకే మంచీ – చెడు సమానం కాజాలవు. మంచి శ్లాఘించబడుతుంది. చెడును మానవ స్వభావం అసహ్యించుకుంటుంది. తత్ఫలితంగా మంచి చేసేవాణ్ణి జనులు మెచ్చుకుంటారు. అతన్ని ఆదరిస్తారు. చెడుకు ఒడిగట్టేవాణ్ణి అసహ్యించుకుంటారు. అతనికి దూరంగా ఉంటారు. లేదా దూరంగానే ఉంచుతారు – ఇదీ మంచీ చెడులకు పాల్పడేవారి పట్ల మానవ వైఖరి! మానవుడే ఈ రెండు వస్తువుల మధ్య విచక్షణ పాటించినప్పుడు, వాటి విషయంలో రెండు విరుద్ధ వ్యవహారాలు చేసినప్పుడు సృష్టికర్త అనేవాడు కచ్చితంగా మంచి చేసేవారి – చెడులకు పాల్పడే వారి యెడల విభిన్న వైఖరిని అవలంబించాల్సిందే. సందేహపడటం మన బలహీనత. యదార్థాన్ని గ్రహించలేకపోవటం మన అసమర్థత. కాని యదార్థం మాత్రం తనదైన స్థానంలో – స్థిరంగా, తిరుగులేని విధంగా – ఉంటుంది. ఈ ఫలితాల తీర్పు వినిపించేం దుకు ఒకానొక దినం నిర్ధారితమవ్వాలి.

తేలిందేమిటంటే రెండు విభిన్న వర్గాల – మంచి చెడు చేసేవారి – అంతిమ పరిణామం (End Result) ఒకే విధంగా ఉండదు. ఇరువురి తుది ఫలితం ఒకేవిధంగా ఉండబోతున్నట్లు పైకి అనిపిస్తుంది. ఎందుకంటే

మంచివారు, చెడ్డవారు కూడా చచ్చి మట్టిలో కలుస్తున్నట్లు కనిపిస్తుంది. అలాంటప్పుడు మంచీ చెడుల మధ్య వ్యత్యాసం పాటించటంలో అర్థం లేదనిపిస్తుంది. మరి ఇలా అనుకుంటే ప్రపంచంలో కూడా న్యాయస్థానాల అవసరం లేదు. ప్రాపంచిక జీవితంలోని మంచీ చెడులను ఒకేలా పరిగణించాలి మరి. అలాంటప్పుడు ఇక్కడ మంచీ – చెడుల మధ్యన విచక్షణ పాటించి న్యాయన్యాయాల తీర్పులు వినిపించి, విక్ష విధించాల్సిన, అవార్డు ఇవ్వాల్సిన అవసరం కూడా లేదు కదా! ఇదంతా అర్థరహితమే కదా! అందుచేత ఇక్కడి న్యాయస్థానాలన్నింటినీ మూసివేయాలి. ఇక్కడ మనిషి చేసే పనులన్నింటినీ ఒకే విధమైనవిగా భావించాలి. శిక్షా బహుమానాల అవసరమేముంది? శిక్ష దేనికి? బహుమానం దేనికి?

దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే మానవ మస్తిష్కం స్వయంగా 'చర్యల'లో వ్యత్యాసం పాటిస్తుంది. వివిధ రకాల పనులకు వివిధ రకాల ఫలితం ఉండాలని అతని మనసు కోరుకుంటుంది. అందుకే అతను ఖుద్దుగా ఈ ప్రాపంచిక జీవితంలో న్యాయస్థానాలు స్థాపించుకున్నాడు. వివిధ చర్యల (Action) మధ్య వ్యత్యాసం చూపి, ఆయా చర్యలనుబట్టి ఫలితం ఇచ్చేందుకే అతనీ పని చేశాడు. ఈ జీవితంలో, ఈ ప్రపంచంలో మనిషి చేసే పనులు, గైకొనే చర్యలలో చిన్నవీ ఉంటాయి, పెద్దవీ ఉంటాయి. గుప్తమైనవీ ఉంటాయి, వ్యక్తమైనవీ ఉంటాయి. వాటిలో అతను చేసే ఎన్నో పనుల ఫలితాలు అతనికి లభిస్తూ ఉన్నట్లు కనిపించదు, అనిపించదు. దీనిద్వారా వెల్లడయ్యేదేమిటంటే సృష్టికర్త నెలకొల్పిన న్యాయస్థానం ఒకటుంది. అక్కడ సాక్ష్యాధారాలతో సహా నిజం తేలుతుంది. తీర్పు జరుగుతుంది. జరగాలి కూడాను. అక్కడ మంచీ చెడుల ఫలితాలు వెలువడుతాయి. అవి బహుమానం – శిక్ష రూపంలో ఉంటాయి. అప్పుడే సత్కార్యాలకు – దుష్కార్యాలకు అర్థం ఉంటుంది. అలా జరిగితీరుతుందన్న నమ్మకమే సదాచరణ చేయడానికి, దురాచరణను విడనాడటానికి మానసికంగా మనిషిని సమాయత్తం చేస్తుంది.

## (6) విరుద్ధ ఆచరణల విరుద్ధ ఫలితాలు

సృష్టికర్తను తిరస్కరించేవారు ఈ విశ్వం కాకతాళీయంగా ఏర్పడిందని అంటుంటాయి. అంటే దీని భావం మానవ జీవితానికి ఓ లక్ష్యమనేది లేదన్నమాట! ఇది కొందరి భావన. యదార్థంతో దీనికి ఎట్టి సంబంధం లేదు.

ఎవరయినా తామున్నచోట కూర్చుని ఏదో ఊహించుకున్నంత మాత్రాన యదార్థం మారిపోదు. పరస్పర విరుద్ధ ఆచరణలు చేసినవారి పర్యవసానం ఒకేవిధంగా ఉంటుందనేది ఎలా సంభవం? దీనిని బుద్ధి అంగీకరిస్తుందా? ప్రశ్నాపత్రాలకు సరైన సమాధానాలు వ్రాసిన, తప్పు జవాబులు రాసిన విద్యార్థుల ఫలితం ఒకేవిధంగా ఉంటుందా? సృష్టికర్త మనకు మన చర్యల (Actions) లో విచక్షణ పాటించే, మంచి వస్తువులను మెచ్చుకునే (Appreciate చేసే) సుగుణాన్ని ఇచ్చి ఉన్నాడు. మరి అలాంటి సృష్టికర్తే వీటిని పట్టించుకోకుండా ఉన్నాడా? దీనినిబట్టి తేలిన ఫలితం ఏమిటంటే విభిన్న ఆచరణలకు విభిన్న ఫలితాలు వెలువడాలి. దీని ప్రకారమే శిక్ష లేక బహుమానం ఉండాలి. జయాపజయాలకు గీటురాయి ఈ ఫలితమే.

సంకేతప్రాయంగా ఉన్న విషయాలను లేక చిహ్నాలను గమనించి సరైన నిర్ధారణకు రాగలిగేవారే విజ్ఞులు, బుద్ధిజీవులు. అలాగే జగతిలో విస్తరించి ఉన్న సూచనలను, చిహ్నాలను చూసి, విశ్వంలోనూ మనుషులలోనూ ఉన్న Quizzesను చదివి సరైన సమాధానానికి చేరుకునేవారే వాస్తవానికి బుద్ధిమంతులు. సరైన సమాధానం తెలుసుకున్నందుకు వారు బహుమానానికి అర్హులు. వారికి బహుమతి లభించాలి. సుభద్రమయిన బుద్ధి, మానవ నైజం ఈ విషయాన్ని విశాల హృదయంతో స్వీకరిస్తుంది.

**(7) 'తీర్పుదినం' అనేది ఒకటి ఉండాలి. చేసిన దానికి ప్రతిఫలం ఇవ్వటానికి మళ్లీ బ్రతికించబడాలి.**

ప్రతిఫలం వొసగబడే జీవితం కేవలం కొన్ని క్షణాల జీవితం అయి ఉండకూడదు. పైగా అది సుదీర్ఘమైనదై ఉండాలి. ఎప్పటికీ తరిగిపోనిదై ఉండాలి.

తమ రేయింబవళ్ళ త్యాగాల ఆధారంగా బహుమానానికి అర్హులుగా నిలిచిన వారికి అన్ని రకాల అనుగ్రహ భాగ్యాలు ఇవ్వబడాలి. వారికి సర్వవిధాల సుఖసౌఖ్యాలు, హాయి కలగటానికి ఇదెంతో అవసరం. .... మనశ్శాంతి, శారీరక సుఖం, ప్రతి కోరిక ఉత్తమ రీతిలో తీర్చబడే ఏర్పాటు జరగాలి. వారికి తినే త్రాగే, అనే వినే సౌలభ్యాలు, విందులు వినోదాలకు సంబంధించిన సకల సౌకర్యాలు ఓ సుదీర్ఘ కాలం వరకు లభించాలి.

మరెవరయితే తమ సృష్టికర్తను తిరస్కరించి లేదా సత్యాన్ని అసత్యంతో

కలగాపులగం చేసి లేదా సృష్టికర్త ఆజ్ఞల్ని ఎదిరించిన కారణంగా తమ జీవితంలో అన్యాయాలకు అత్యాచారాలకు ఒడిగట్టారో, అలాంటి వారిని శారీరకంగానూ, మానసికంగానూ శిక్షించాలి. మరి ఈ శిక్ష కూడా స్వల్పకాలం వరకు కాకుండా సుదీర్ఘంగా ఉండాలి.

ఈ శిక్ష అయినా, బహుమానమైనా ప్రస్తుత జీవితంలోని కార్యాల ప్రాతిపదికగా, న్యాయబద్ధంగా ఉండాలి. ఈ ప్రాపంచిక జీవిత కాలం ముగిసిన తరువాత ఉండాలి. ఈ శిక్షా బహుమానాల కోసం మళ్లీ జీవితం వొసగబడాలి. ఆ జీవితం క్షణభంగురమై ఉండరాదు. అది చాలా సుదీర్ఘమైనదై ఉండాలి. దాని కోసం మరో ప్రపంచాన్ని ఉనికిలోనికి తీసుకురావాలి. శిక్షా బహుమానాల కోసం దానిని తీర్చిదిద్దాలి.

మనం చూస్తున్నాం – గతించిన వారిలో కొందరు మంచివారుంటే కొందరు చెడ్డవారు కూడా ఉన్నారు. ప్రస్తుత కాలంలో మంచివారు – చెడ్డవారున్నట్లే వారున్నూ. కాని ఈ ప్రాపంచిక జీవితంలో వారికి వారి కర్మల బహుమానం లేక శిక్ష లభించలేదు. అంటే ప్రస్తుత ప్రపంచం లేక ప్రస్తుత జీవితం శిక్షా బహుమానాల కోసం కాదన్నమాట! కాబట్టి శిక్షా బహుమానాలు తప్పకుండా ఉండే ఒక నవలోకం నెలకొనాలి. ఆ నవలోకం ఈ లోకంకన్నా భిన్నంగా ఉండాలి. అది కేవలం శిక్షాబహుమానాల కొరకే ప్రత్యేకమై ఉండాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది.

### (8) మనిషి ఒక బాధ్యతాయుతుడైన వ్యక్తి అయినందున అతను తన ఆచరణలకు జవాబుదారు అయి ఉంటాడు.

మనిషికి మంచీ చెడుల విచక్షణా జ్ఞానం ప్రసాదించబడింది. మంచికి – చెడుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరికించే సామర్థ్యం ఇవ్వబడింది. దాంతోపాటు ఎంపిక స్వేచ్ఛ, సంకల్పశక్తి కూడా వొసగటం జరిగింది. అంటే అతను ఒక బాధ్యతాయుతుడైన ఉనికి అన్నమాట! బాధ్యత ఉందంటే జవాబుదారీ కూడా ఉన్నట్లే. బాధ్యతలను సజావుగా నిర్వర్తించినందుకు బహుమానం, బాధ్యతా రహితంగా వ్యవహరించినందుకు శిక్ష ఉండి తీరాలి. ఇదే ప్రకృతి శాసనం. దీని ప్రాతిపదికపైనే మానవుడు తన దైనందిన జీవితానికి సంబంధించిన శిక్షా బహుమానాల చట్టాలు కూడా రూపొందించుకున్నాడు. ఈ ప్రకృతి శాసనం ఆధారంగానే శిక్షా బహుమానాల మహానాడు ఒకటి

సంస్థాపించబడాలి. ఆ రోజు, ఆ సమయం సృష్టికర్త తరపు నుండి నియమించ బడాలి.

**(9) తీర్పుదినం సజ్జనుల పాలిట ఉత్సవ దినమై ఉండాలి.**

తీర్పుదినం రావటం అవసరం. సృష్టికర్త కారుణ్యం కోరేది ఇదే. ఈ జగతి ఉనికి వాంఛించేది కూడా అదే. అన్యథా ఈ జీవితానికి ఒక ఆశయం, లక్ష్యం లేకుండాపోతుంది. ఇదే గనక జరగకపోతే సృష్టికర్త పనులు నిరర్థకమనీ, ఆయన దృష్టిలో న్యాయానికి విలువలేదని తేలిపోతుంది. కనుక తీర్పుదినం ఈ సృష్టికి ఒక లక్ష్యాన్ని నిర్ధారిస్తుంది. దానిని ఆ లక్ష్యం వరకు చేరుస్తుంది.

**(10) సృష్టికర్త గురించిన చవుకబారు భావనలు – అలాంటి వాటికి సృష్టికర్త అతీతుడు, పరిశుద్ధుడు**

తీర్పుదినం అనేది ఉండదు అంటే అర్థమేమిటి? మంచివారు, చెడ్డవారు – రెండు రకాల మనుషుల పునరుత్థానం ఒకేవిధంగా ఉంటుందనేగా! అంటే మంచికి విలువ లేకుండాపోయింది. చెడుపట్ల ఎలాంటి అయిష్టత, ఆగ్రహం వ్యక్తం అవలేదు!! ఇక్కడొక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. పుట్టించిన వానిలో ఆ మాత్రం సెన్స్ (Sense) కూడా లేదా? పుట్టించబడినవాడు కూడా మరీ అంత అధ్వాన్నంగా ఉండడే! అతను మంచి వస్తువులోని గుణాన్ని ఒప్పుకుని, మెచ్చుకుంటాడు (Appreciate చేస్తాడు). దానికి విలువ ఇస్తాడు. చెడ్డ వస్తువును అసహ్యించుకుంటాడు. అవునా! అలాంటప్పుడు తమ సృష్టికర్త గురించి మరీ ఇంత లేకిగా ఆలోచించటం దారుణం. ఒకవిధంగా ఇది పుట్టించినవానిపై అపనింద. సృష్టికర్త గురించి ఇలాంటి చవుకబారు ఆలోచన తట్టినప్పుడు ఆయన పట్ల అతని మనసులో గౌరవం, పవిత్రభావన బొత్తిగా ఉండదు. ఇట్టి పరిస్థితిలో అతని ద్వారా మంచిపనులు జరుగుతాయని, అతని ప్రవర్తన సత్ప్రవర్తన అయి ఉంటుందన్న ఆశ కూడా ఆవిరైపోతుంది.

**(11) న్యాయానికి నికషోపలం**

సృష్టికర్త తన దాసులకు ఒకే ప్రాతిపదికపై శిక్షా బహుమానాలు ఇవ్వాలి. అంటే ప్రతి మనిషికి, ప్రతికాలపు మనిషికి ఒకే ప్రమాణం (Standard) ఉండాలి. ఒకే గీటురాయి ఉండాలి. దానిపై పరికించి ఎవరు శిక్షార్హులో, మరెవరు పురస్కారానికి పాత్రులో నిర్ధారించాలి. ఎవడు తన సృష్టికర్తను

తెలుసుకుని, ఆయనకు విధేయత చూపి, సదాచారం చేశాడు, మరెవడు చేయలేదు అనేదే ఆ గీటురాయి.

ఒకవేళ ఎవరయినా తన సృష్టికర్తను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, ఆయన ఆజ్ఞలను శిరసావహించకుండా, ఆయన్ని విశ్వసించకుండా ఇష్టానుసారం జీవితం గడిపితే, అలాంటి వ్యక్తి ఆచరణలను సృష్టికర్త ఎందుకు స్వీకరిస్తాడు?

జన్మతః వంశం, వర్ణం, జాతి, వర్గం, భాషలకు తీర్పుదినాన ఎలాంటి ప్రాముఖ్యత ఉండకూడదు. ఒకవేళ న్యాయానికి వీటిని ప్రాతిపదికగా చేసుకుంటే పూర్తిగా అన్యాయమే అవుతుంది. కాబట్టి మనిషి స్వయంగా కల్పించుకున్న (Self Made) తప్పుడు ప్రమాణం (Standard)ను అంతమొందించాలి. దీనికి బదులు స్వచ్ఛమయిన, పారదర్శకమయిన (Transparent), సహజమయిన, న్యాయబద్ధమయిన 'ప్రమాణ నికషం' నెలకొల్పబడాలి – అంటే ఎవరు చూడకుండానే తనను పుట్టించిన వానిని తెలుసుకున్నాడో, తనను తాను బేషరతుగా ఆయన ముందు సమర్పించుకున్నాడో, ఆయనకు విధేయత కనబరిచాడో, ఉత్తమ వ్యక్తిగా రాణించి మంచి జీవితం గడిపాడో చూడాలి – అదే న్యాయానికి నికషోపలం కావాలి.

### (12) తీర్పుదినాన కేవలం న్యాయం జరగాలి. ఫలితం లభించాలి. అంతేగాని ఆచరణకు మరింత గడువు ఇవ్వరాదు

ప్రతిఫల దినాన కేవలం న్యాయం జరగాలి – శిక్ష లేదా బహుమానం రూపంలో. క్షమాపణకు, మరింత గడువుకు ఆస్కారం ఉండకూడదు. (పరీక్షా హాలులో పరీక్షా సమయం ముగిసిన తరువాత తప్పుల్ని సరిదిద్దుకోవటానికి సమయం ఇవ్వబడనట్లే అక్కడ కూడా మరింత సమయం ఇవ్వబడకూడదు).

### (13) పుట్టుకతోనే ఎవరూ సృష్టికర్తకు ప్రియతములై ఉండకూడదు

జన్మతః ఎవరూ సృష్టికర్తకు మానసపుత్రుడై ఉండకూడదు. పైగా ఆయన సన్నిధిలో మనుషులంతా సమానులై ఉండాలి. శిక్ష అయినా, బహుమాన మయినా వారి ఆచరణ ఆధారంగా ఉండాలి. లేకుంటే న్యాయం జరుగుతుందన్న ఆశ ఉండదు.

**(14) ప్రతి వ్యక్తీ తన ఆచరణకు బాధ్యుడు**

సృష్టికర్త ప్రతి బుద్ధిజీవికీ, ప్రతి ప్రాజ్ఞునికీ అతని స్వీయ ఆచరణకు జవాబుదారుగా నిలబెట్టాలి. అంతేగాని ఒకరు చేసిన దానికి వేరొకరు బాధ్యులుగా ఉండరాదు.

**(15) తిరుగులేని న్యాయం**

బరువును మోసేవాడెవడూ వేరొకరి బరువును మోయగల స్థితి రాకూడదు. మనిషికి తాను చేసుకున్నది తప్ప వేరొకటి లభించకూడదు.

**(16) ప్రతి వ్యక్తి సముపార్జన అతను ఇష్టపూర్వకంగా చేసుకున్నదై ఉండాలి. అదే న్యాయం**

ఎవరినీ బలవంతంగా ఏ మార్గాన కూడా నెట్టకూడదు (అది సన్మార్గమయినా గాని, అపమార్గమయినా గాని). మార్గాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ అతనికి ఉండాలి. తదనుగుణంగానే అతనికి ప్రతిఫలం లభించాలి. అతను చేసుకున్న దాని ప్రతిఫలం పూర్తిగా అతనికే వొసగబడాలి, వేరొకరికి కాదు. అతనికి లభించవలసిన ప్రతిఫలంలో ఎలాంటి కోత విధించరాదు.

**(17) సృష్టికర్త తరఫున గల న్యాయం వాంఛించే దాని ప్రకారం ప్రతి వ్యక్తీ తన బరువును తానే మోయాలి**

ఇది న్యాయం వాంఛించే విషయం. ప్రతి ఒక్కరూ తాము చేసుకున్న పనులకు స్వయంగా బాధ్యులు. జవాబుదారులు. దాని ఫలితాన్ని పొందవలసింది కూడా వారే.

**(18) సృష్టికర్త న్యాయశీలుడు, తిరుగులేని న్యాయాధీశుడై ఉండాలి. (అతను ప్రాపంచిక న్యాయమూర్తుల వలే ఉండకూడదు)**

తీర్పుదినం తిరుగులేనిదై ఉండాలి. ఆ రోజు ఎవరూ ఎవరికీ ఏ విధంగానూ ఆదుకోలేని పరిస్థితి ఉండాలి. ఎవరి సిఫారసూ చెల్లకూడదు. నష్టపరిహారం పుచ్చుకుని అపరాధిని విడిచిపెట్టేందుకు ఆస్కారం ఉండకూడదు. అపరాధులకు ఎటువైపు నుండి కూడా సహాయం అందకూడదు. అప్పుడే నిష్పక్షపాతంగా న్యాయం జరగగలదు (తీర్పుదినం నాటి పరిస్థితి ఇలాగే ఉండాలి).

**(19) తీర్పుదినాన కచ్చితంగా న్యాయం జరగాలి. న్యాయం జరగవలసిన రోజు అన్యాయం జరగకూడదు**

**(20) ఆ రోజు ఇవ్వబడే తీర్పు నిందారోపణలకు తావిచ్చేదిగా ఉండకూడదు**

మనిషి తన జీవితంలో చేసినదంతా రికార్డు అయి ఉండాలి. క్షణం క్షణం .... దినం దినం .... అతను చెప్పినది, చేసినది ఆ రికార్డులో ఉండాలి. అతని శబ్దం, చేష్టలు, ముద్రలు, రూపురేఖలన్నీ భద్రపరచబడాలి. కాదు కూడదు అని అతను అభ్యంతరం చెప్పేందుకు లేశమయినా ఆస్కారం మిగలకూడదు. తన ఆచరణల పత్రాన్ని మనిషి స్వయంగా చూసుకునే, వినే ఏర్పాటు జరగాలి – తదనుగుణంగానే తీర్పు జరగాలి.

**(21) సాక్ష్యాల** (Evidence) **ఆచరణ పత్రాల** (Record) **ఆధారంగా తీర్పు జరగాలి.**

కేవలం కాకి లెక్కల, అంచనాల ఆధారంగా శిక్షా బహుమానాలను నిర్ధారించటం జరగరాదు. వారి ఆచరణల రికార్డు భద్రపరచబడి ఉండాలి. అవి సాక్ష్యాధారాలుగా ఉపయోగపడాలి. మనిషి తుది ఫలితం (End Result) ఆ విధంగా పరిణమించడానికి గల కారణాలన్నీ సుస్పష్టం అవ్వాలి. ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా న్యాయం చేయడానికి, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండటానికి ఈ వ్యవస్థ అవసరం. న్యాయాధీశుడైన సృష్టికర్త సర్వం తెలిసి ఉన్నప్పటికీ, అభ్యంతరాలు చెప్పేవారి నోరు మూయించడానికి సాక్ష్యాధారాలు (Evidence), కర్మల పత్రాల (Record) సమర్పణ కూడా అవసరమవ్వాలి. ఆఖరికి ECG / EEG మాదిరిగా ఆంతర్యాలలోని ఉద్దేశ్యాలు, సంకల్పాలు కూడా Recording అయి ఉండాలి. సంకల్పాల రికార్డు ఎందుకంటే; ఒక్కోసారి మనిషి పాపకార్యానికి సంకల్పించుకుంటాడు. లేదా పాపం చేస్తూ ఉంటాడు. అంతలోనే అతనికి సృష్టికర్త శిక్షిస్తాడేమో అన్న ఆలోచన వచ్చి, భయంతో ఆ పాపకార్యం నుండి ఆగిపోతాడు. అతని వల్ల ఆ పాపకార్యం జరగలేదు గనక ఆ చేష్ట రికార్డు అవదు. దానికి సంబంధించిన శబ్దంగానీ, రూపంగానీ ప్రస్ఫుటం అవదు. కాని పాపం నుండి 'ఆగిపోవటం' అనేది స్వయంగా ఒక ఆచరణ. దానికి గల అంతఃప్రేరణ దైవభీతి. కాబట్టి ఈ

మంచి ప్రేరణ లేక సత్సంకల్పం రికార్డయిపోతుంది. పాపకార్యం నుండి ఆగిపోవటం కూడా పుణ్యకార్యమే కాబట్టి, దానికిగాను అతను మంచి ప్రతిఫలానికి అర్హుడవుతాడు.

న్యాయాధిపతి కేవలం దాని ప్రకారం కాకుండా సాక్ష్యాధారాల (Evidence) ఆధారంగా తనకు తీర్పు ఇవ్వాలి. ఆ విధంగా తీర్పు సత్యబద్ధంగా, న్యాయబద్ధంగానే జరిగిందన్న నమ్మకం ఏర్పరచాలి. ఆక్షేపణలకు ఏమాత్రం అవకాశం మిగలకూడదు.

**(22) బహుమతి కోసం అంతర్యాలలోని ఉద్దేశాలను తెలుసుకోవటం సృష్టికర్తకు అవసరం.**

సిసలైన న్యాయాధీశుడైన సృష్టికర్త తన దాసుల అంతరంగ స్థితిని, అందలి భావాలు ఆలోచనలను గురించి బాగా తెలిసినవాడై ఉండాలి. దాని ప్రకారం తీర్పు ఇవ్వడానికి ఈ జ్ఞానం అవసరం. ఎన్నో ఆచరణలు పైకి ఒకేలా కనిపిస్తాయి. కాని ఉద్దేశాలు మాత్రం వివిధములుగా ఉంటాయి. వీటి సంగతి సృష్టికర్తకు తప్ప వేరెవరికీ తెలియదు.

**(23) ఎవరయినా ఒక వ్యక్తి చేసిన చేష్టకు మరో వ్యక్తి కూడా పరోక్షం** (Indirectly) **గా బాధ్యుడైనప్పుడు, అతను కూడా శిక్షా బహుమానాలకు బాధ్యుడే అవాలి.**

ఒక వ్యక్తి తాను స్వయంగా ఏదయినా సత్కార్యంగానీ, దుష్కార్యం గానీ చేసి ఉండడు. కాని అతను ఇతరులను ప్రేరేపించి ఉంటాడు. ఈ విషయంలో కూడా సృష్టికర్త చాలా సున్నిత స్వభావి (Sensitive) అయి ఉండాలి. అతను నాటిన విత్తనం యొక్క ఫలాలు ఎక్కడెక్కడి వరకు విస్తరిస్తాయో దాని ప్రకారం పరోక్షంగా తోడ్పడిన వ్యక్తికి కూడా బహుమతి ఇవ్వాలి. దుష్కార్యం విషయంలో కూడా ఇలాగే చేయాలి.

**(24) సృష్టికర్త వద్ద నుంచి వచ్చిన సందేశం మనుషులకు అందిన దానినిబట్టే న్యాయం జరగాలి.**

తీర్పు వెలువరించక ముందు సృష్టికర్త తన దాసుల న్యాయ విచారణ జరపాలి. అంటే తన ఆదేశాలు, ఉపదేశాలు, మార్గబోధన వారి వరకు చేరాయో

లేదో అడగాలి. ఆ సందేశం పట్ల దాసులు ఎలా వ్యవహరించారో కూడా తెలుసుకోవాలి. అంటే వారు ఆ సందేశాన్ని స్వీకరించారా? లేక తృణీకరించారా? అన్నది.

సందేశాన్ని చేరవేయవలసిన బాధ్యత మోపబడిన వారిని కూడా ప్రశ్నించాలి – హెచ్చుతగ్గులు లేకుండా తన సందేశాన్ని దాసులకు అందజేశారా? లేదా? అని. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిన వారికి, ఆ సందేశానికి సకారాత్మకంగా స్పందించి, దానిని స్వీకరించిన వారికి బహుమానం ఇవ్వాలి. దానిని తిరస్కరించి ఇష్టారాజ్యం చేసిన వారిని దండించాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది.

## న్యాయం చేస్తానన్న సృష్టికర్త వాగ్దానం : మానవ జీవితంపై దాని ప్రభావం

**(1) దురాగతాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి జరగటం కూడా న్యాయమే.**

సృష్టికర్త ఆజ్ఞలను ఉల్లంఘించి భువిలో కల్లోలాన్ని రేకెత్తించిన వారిని, విధ్వంసం సృష్టించిన వారిని, ఇతరులపై అత్యాచారాలకు పాల్పడిన వారిని సృష్టికర్త కఠినంగా శిక్షించాలి. న్యాయం చేస్తానని, దుర్మార్గులను శిక్షిస్తానన్న ఈ వాగ్దానం నిశ్చయంగా మనిషిని సన్మార్గాన నడిపిస్తుంది.

**(2) సృష్టికర్త తన వరప్రసాదాల లెక్క అడగాలి.**

ఈ జీవితం గురించి, జీవిక కోసం ప్రసాదించబడిన అనుగ్రహాల గురించి తాను నిలదీయబడతానన్న భావన మనిషిని అదుపులో ఉంచుతుంది. దేవుని వరప్రసాదాలను పూర్తిగా (Maximum) సద్వినియోగం చేసుకోవాలన్న స్పృహ కలుగుతుంది.

**(3) దాసుని ప్రతి చేష్టకుగాను సృష్టికర్త లెక్క తీసుకోవాలి.**

దాసుడు తాను చేసే పని ఎంత చిన్నదయినాసరే, దాని గురించి సృష్టికర్త ఎదుట లెక్క ఇవ్వవలసి ఉందన్న ఆలోచన అతనిని కట్టి పడేస్తుంది. ప్రతి చిన్న విషయంలో కూడా అతను ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తాడు.

**ఏడవ అధ్యాయం :**

# సిఫారసు, న్యాయం .... ఒక చూపులో!

(1) సిఫారసు వాస్తవికత

(2) సాధారణ చర్చ

(3) సృష్టికర్తకీ – దాసునికీ మధ్య గల సంబంధం – సిఫారసు

(4) సృష్టికర్తకు తన దాసుని పట్ల అమితమైన ప్రేమ ఉండాలి. అందుచేత సిఫారసు అవసరం ఏర్పడకూడదు.

(5) జ్ఞానానికీ – సిఫారసుకు గల సంబంధం.

(6) సిఫారసుకై జ్ఞానం (తెలిసి ఉండటం) అవసరం.

(7) తెలియనివాని సిఫారసు ...

(8) సిఫారసు గురించిన తప్పుడు భావన : మానవ జీవితంపై దాని దుష్ప్రభావం, సృష్టికర్తపై నింద.

(9) సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావన, దాని చెడు ప్రభావం.

(10) సృష్టికర్త దృష్టిలో సిఫారసు వాస్తవికత, దాని స్థాయి ఏమై ఉంటుంది?

(11) ఆనతి లేకుండా సిఫారసు ఉండకూడదు.

(12) అనుమతి లేకుండా సిఫారసు ఎందుకు చేయలేరు?

(13) సిఫారసు కొరకు సమ ఉజ్జీ లేక అదే కోవకు చెందినవారు ...

(14) సిఫారసు గురించిన తప్పుడు భావనల మూలంగా సృష్టికర్తను అవమానపరిచే, పలాయనం చిత్తగించే మార్గాలు తెరచుకుంటాయి.

(15) సిఫారసు వల్ల ముఖ్యమైన విషయాలపై పడే వ్యతిరేక ప్రభావం.

(16) సిఫారసు వాస్తవికత, దాని నిజభావన ఇలా అర్థమవుతోంది ....

# సిఫారసు - న్యాయం

మరణానంతరం మనుషులు తిరిగి లేపబడతారని, వారు ప్రాపంచిక జీవితంలో చేసుకున్న కర్మల ప్రకారం బహుమానం లేక శిక్షకు పాత్రులవుతారన్న నమ్మకాన్ని, ఏ మతాలు కలిగించినా, అది ఆ మతావలంబీకుల జీవితంపై గట్టి ప్రభావం – సకారాత్మక ప్రభావం – చూపుతుంది. అది మానవుణ్ణి మానవీయ ఉత్థానానికి చేరుస్తుంది. కాగా; సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావన అత్యంత ముఖ్యమయిన ఈ విశ్వాసాన్ని, దాని సత్ప్రభావాన్ని నీరు గారుస్తుంది. అది సృష్టికర్త సన్మార్గబోధను వీపు వెనుక పడవేస్తుంది. ఈ అంశంపై వివరంగా చర్చిద్దాం –

### (1) సిఫారసు వాస్తవికత

ప్రతి వస్తువు గురించి, దాని వివిధ కోణాలను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు మాత్రమే సిఫారసు చేయాలి. .... అయితే ఎవరిని సిఫారసుకై అభ్యర్థించుకోవటం జరుగుతుందో ఆయన సర్వాధికారి, నిర్ణయాధికారి అయి ఉండాలి. తాను ఎవరి కొరకు సిఫారసును ఆమోదిస్తున్నాడో ఆ వ్యక్తి బాధితుడు, పీడితుడు, నిర్దోషి అనీ, అతను దౌర్జన్యపరుడు, తలబిరుసు కాడు అన్న విషయం ఆ నిర్ణయాధికారికి బాగా తెలిసి ఉండాలి. మరి సృష్టికర్తే సిసలైన న్యాయాధీశు డైనపుడు, ఆయనే సర్వజ్ఞాని, సూక్ష్మద్రష్ట అయి ఉన్నప్పుడు, ఆయన దృష్టిలో ప్రతి వస్తువూ స్పష్టమై ఉన్నప్పుడు సిఫారసు యొక్క ఈ వాస్తవికత ఆయనపై ఫిట్ (Fit)అవుతుందా?

నిజంగా సిఫారసు ఆవశ్యకత ఏర్పడిందని అనుకుంటే దాని మతలబు ఏమిటి? న్యాయాధీశుని వద్ద న్యాయనిర్ణయానికి కావలసిన పరిజ్ఞానం పూర్తిగా లేదనే కదా! దినమైతే తీర్పుదినమే. అందరికీ న్యాయం లభించాల్సిన దినం. కాని అన్యాయం జరుగుతుందన్న ఆశంక ఉంది. హక్కు కాజేయబడు

తుందేమోనన్న భయం ఉంది. ఎందుకంటే ప్రధాన న్యాయమూర్తికి పరిస్థితుల పట్ల పూర్తిగా పరిజ్ఞానం, అవగాహన (Well Oriented) లేదు. కాబట్టి అన్యాయం జరగరాదన్న సంశయంతో న్యాయమూర్తికి – సిఫారసు ద్వారా – పరిజ్ఞానం సమకూర్చబడుతుందన్న మాట! ఎంతటి అసంబద్ధమైన, అసమంజసమైన విషయమిది!!

సిఫారసుకు సంబంధించిన ఈ తప్పుడు విశ్వాసం ఆధారంగా నిజ స్వామిపై పెద్ద ఆరోపణ చేసినట్లయింది. సృష్టికర్తకు గల జ్ఞానం మిడిమిడి జ్ఞానమేనని పరోక్షంగా అపవాదు మోపినట్లయింది. మరి చూడబోతే సృష్టికర్తకు తెలియనిదంటూ ఏదీ లేదు. ప్రతి చిన్న పెద్ద విషయం ఆయన జ్ఞాన పరిధిలో ఉంది. జీవితపు పూర్తి రికార్డు ఆయన వద్ద ఉంది. ఆయన ప్రతిదీ క్షుణ్ణంగా తెలిసిన జ్ఞాన సంపన్నుడై ఉన్నప్పుడు ఒకరి చేత సిఫారసు చేయాల్సిన ఆవశ్యకత ఏముంది? 'తీర్పు' పట్ల భయం ఉన్నవారే సిఫారసు ఆసరా కోసం తాపత్రయపడతారు. న్యాయానికి సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించిన మీదట న్యాయబద్ధంగా తీర్పు ఇవ్వబడితే తమకు శిక్ష పడటం తథ్యమన్న భయం ఉన్నవారే సిఫారసు అవసరం ఉందని భావిస్తారు. శిక్ష నుండి తప్పించు కోవడానికి వారు మరో ద్వారాన్ని అన్వేషిస్తారు. అదే సిఫారసు ద్వారం. అందుకే సిఫారసుకు సంబంధించిన ఈ తప్పుడు నమ్మకం ప్రమాదకరమైనది. అది న్యాయాన్ని అన్యాయంగా మార్చేస్తుంది. ఈ తప్పుడు విశ్వాసం కారణంగా న్యాయాన్ని, తీర్పుదినాన్ని నమ్ముతూ కూడా మనిషి జీవితం అవినీతికి, పాశవికతకి, పైశాచిక ప్రవృత్తికి ఆలవాలమవుతుంది. తీర్పుదినాన్ని, శిక్షా బహుమానాలను తిరస్కరించే వ్యక్తికి పట్టే దుర్గతే ఇతనికీ పడుతుంది. సిఫారసు గురించిన ఈ తప్పుడు విశ్వాసం మనిషి జీవితానికి తప్పుడు దిశను ఇస్తుంది. జీవితంపై దుష్ప్రభావం చూపుతుంది. (దీని మూలంగా అతని భావాలు, సిద్ధాంతాలు, ఆలోచనలు, ఉద్దేశాలు, ఆచరణలు, వ్యవహారాలు, సంబంధాలు చాలా తీవ్రంగా ప్రభావితం అవుతాయి). కనుక తేలిందేమిటంటే ఈ రకమయిన సిఫారసు భావన తప్పు.

పూర్తి జ్ఞానం కలిగి ఉండి, న్యాయం యొక్క అన్ని కోణాలను పరిగణనలోకి తీసుకునేవాడే అసలు సిసలు న్యాయాధీశుడు. దీంతోపాటు న్యాయబద్ధమయిన

తన తీర్పును అమలుపరచే అధికారం కూడా అతను కలిగి ఉండాలి. అందువల్ల సమస్త సుగుణాలు, అధికారాలు ఒకే శక్తిమంతుని అధీనంలో ఉండాలి. విభజితమయిన అధికారాలతో క్రియాత్మకంగా 'న్యాయం' వాంఛించేవన్నీ నెరవేరవు. అందుచేత న్యాయం చేసేవానికి పూర్తి విషయ పరిజ్ఞానంతో పాటు, తీర్పును అమలుపరచగల శక్తి అధికారం కూడా ఉండాలి.

సిఫారసు ఎవరిచేత చేయించాలి, ఎవరి కొరకు చేయించాలి అనేది ప్రతిదీ తెలిసిన సృష్టికర్తకే బాగా ఎరుక. సిఫారసు కొరకు ఎవరికి అనుమతి ఇవ్వాలి, ఎవరి కోసం ఇవ్వాలి అనేది కూడా ఆయనే నిర్ణయించాలి. ఏ మనిషి అయినాసరే – అతడు సృష్టికర్తకు ఎంత సన్నిహితుడైనప్పటికీ – తనంతటతానుగా సిఫారసు చేసే హక్కు, అధికారం అతనికి ఉండకూడదు. సృష్టికర్త అనుజ్ఞ లేకుండా అతను నోరు విప్పకూడదు, తనకు ఇష్టం ఉన్న వారి కొరకు సిఫారసు చేయనూరాదు. పైగా అతను సృష్టికర్త ఆనతితోనే సిఫారసు చేయగలగాలి, క్షమాశీలుడు, దయాకరుడైన ఆ సర్వజ్ఞాని ఎవరి కొరకు ఆనతి ఇస్తాడో వారికొరకే సిఫారసు చేయగలగాలి.

రానున్న పంక్తుల్లో ఈ విషయపై పలు కోణాల నుండి యోచన చేద్దాం–

## (2) సాధారణ చర్చ

న్యాయనిర్ణయం జరిగే రోజున కూడా సృష్టికర్త నాకు నా హక్కు ఇప్పించడు. నాకు అన్యాయమే జరిగింది. ఈ ప్రపంచంలో 'న్యాయం' ద్వారా ఆయన నాకు దక్కవలసిన ప్రతిఫలం ఇప్పించడు. దౌర్జన్యపరుణ్ణి శిక్షించడాయె. పైగా ఆయన జనుల సిఫారసును విని జులుం చేసేవారికి, హక్కులను కొల్లగొట్టేవారికి ఉదారంగా క్షమాభిక్ష పెట్టేస్తున్నాడు. మరోమాటలో చెప్పాలంటే న్యాయదినాన కూడా నాకు న్యాయం జరగదు. పైగా నాకు అన్యాయమే జరిగితే, అలాంటి న్యాయాధీశుణ్ణి, తీర్పుదినాన్ని నేను విశ్వసించి ప్రయోజనమేమిటి? అలాంటి సృష్టికర్తను నమ్ముకుని, ఆయన సన్నిధిలో మోకరిల్లి, న్యాయం చేయలేని న్యాయాధిపతి ముందు సాగిలపడి లాభం ఏమిటి? సిఫారసు చేసే వారి విన్నపాలు విని, వారి మాటలకు ప్రభావితుడై, తీర్పుదినాన కూడా బాధితునికి న్యాయం చేయలేని వాని సమక్షంలో పరాభవంపాలు కావాలా!? అలాంటి సృష్టికర్తను నమ్మి, ఆయన్ని సేవించి, ఆయన్ని మొరపెట్టుకుని, ఆయనపై ఆశలు

పెట్టుకుని చివరకు నేను ఎందుకు పరాభవాన్ని మూటకట్టుకోవాలి? అలాంటి సృష్టికర్త, ఆరాధ్యుడు, యజమాని పట్ల నాకెలాంటి శ్రద్ధాసక్తులు లేవు. ఆయన విధేయత పట్ల నాకెట్టి ఆసక్తి లేదు.

తీర్పుదినాన కచ్చితంగా నాకు న్యాయం చేసే సృష్టికర్త యందే నాకు శ్రద్ధాభక్తులున్నాయి. అలాంటి న్యాయాధిపతి ముందే నేను సాష్టాంగప్రణామం చేస్తాను, అటువంటి వానినే నేను వేడుకుంటాను. ఆయన ఇచ్చే తీర్పు చాలా స్వచ్ఛంగా, నిర్మలం (Transparent) గా ఉండాలి. ఆయన న్యాయంతో పాటు హక్కును కూడా ఇప్పించాలి. నాకు న్యాయం చేయడంతో పాటు అపరాధిని శిక్షించాలి కూడా. ప్రతి వ్యక్తికీ అతను చేసిన దాని ఫలమే లభించాలి. ఏ విధంగానూ, ఎవరికీ అన్యాయం జరగకూడదు. ఒకవేళ సిఫారసుకు అవకాశం ఉన్నా దానివల్ల పీడితునికి ఎలాంటి అన్యాయం జరగకూడదు. న్యాయాధిపతి న్యాయశీలానికి ఎలాంటి మచ్చ రాకూడదు. ఏ కోణం నుంచి కూడా న్యాయస్ఫూర్తికి విఘాతం కలగకూడదు. అలాంటి పవిత్రుడు, దోషరహితుడైన వాడు మాత్రమే నా సృష్టికర్త, స్వామి, పాలకుడు, ఆరాధ్యుడు కాగలడు. అలాంటి న్యాయాధిపతి ఎదుటే నేను సాష్టాంగప్రణామం చేయగోర్తాను. చేతులెత్తి ప్రార్థిస్తాను.

రండి, ఈ అంశంపై చర్చను మరింత ముందుకు తీసుకుపోదాం –

## (3) సృష్టికర్తకి – దాసునికి మధ్యగల సంబంధం మరియు సిఫారసు

సృష్టికర్తకి – దాసునికి మధ్య గల దృఢమయిన సంబంధంలో మరొకరి ప్రమేయానికి ఆస్కారం ఉందా?

తండ్రీ కొడుకుల మధ్య గల సంబంధం పుట్టుక రీత్యా ఒక నిర్ధారిత, తిరుగులేని సంబంధం. దీని మూలంగా అదొక సహజ సంబంధంగా, సమీప సంబంధంగా, శాశ్వత సంబంధంగా భావించబడుతుంది. అది ఎన్నటికీ వీడని బంధం, విడదీయరాని సంబంధం. ఈ సంబంధం కారణంగా పరస్పర హక్కులు – బాధ్యతలు వాటంతటవే నిర్ధారితమవుతాయి. పరస్పర సహకారం, సమన్వయం, అభిప్రాయాల మార్పిడి, భావాల వ్యక్తీకరణ వంటివి వారిద్దరి మధ్య ఎలాంటి సంకోచం లేకుండా జరుగుతుంటాయి. ఈ సంబంధంలో

వేరొకరి ప్రమేయానికి, జోక్యానికి ఆస్కారముండదు. ఎవరయినా ముందుకు వచ్చి, నేను వారిద్దరి మధ్య మీడియేటర్‌గా ఉంటాను, కొడుకు భావాలు భావనలను గురించి తండ్రికి తెలియపరుస్తాను అని అంటే, అతను తండ్రీ కొడుకుల సహజ సంబంధంలో జోక్యం చేసుకుంటున్నాడన్న మాట! ఏ విధంగానూ ఇది సమ్మతం కాబోదు.

అలాగే సృష్టికర్త – మనిషికి మధ్య ఉన్న సంబంధం యజమానికీ – సేవకునికి మధ్య గల సంబంధం వంటిది. పుట్టించినందున అదొక తిరుగులేని, స్థిర సంబంధం. ఈ సంబంధం వారిద్దరి మధ్య గల పరస్పర హక్కులు – బాధ్యతలను స్వయంగానే నిర్ధారిస్తుంది. వేరొకరు వచ్చి వాటిని నిర్ధారించాల్సిన అవసరం లేదు. ఒక దాసుని (మనిషి) భావాలు భావనలను, అవసరాలను గురించి సృష్టికర్తకు నివేదించటానికి వేరొక దాసుని వాస్తా అక్కరలేదు. అనవసరంగా తలదూర్చటమంటే సృష్టికర్తకి – మనిషికి మధ్య గల సహజ సంబంధాన్ని అసహజంగా మార్చటమే. ఇది ఎన్నటికీ స్వీకారయోగ్యం కాదు. కనుక సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావన ఈ సహజ సంబంధానికి అడ్డంకిగా ఉంటుంది. దానిని కృత్రిమంగా, ఆమోదయోగ్యం కానిదిగా మార్చేస్తుంది.

సృష్టికర్తకి – దాసునికి మధ్యన గల సహజ సంబంధం కారణంగా సృష్టికర్త తన దాసుని మొరను తప్పక వింటాడు. వినక తప్పదు కూడా. మరలాంటప్పుడు సిఫారసు చేయాల్సిన అవసరమేముంది?

సృష్టికర్తకు తాను సృష్టించిన వస్తువుపై సహజంగానే ప్రేమ ఉంటుంది. ఆయన దానిపట్ల ప్రేమతోనూ, దాక్షిణ్యంతోనూ వ్యవహరిస్తాడు. దాని మొరలు ఆలకిస్తాడు. దాని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. కాబట్టి దాసుడు నిష్కల్మషమైన మనస్సుతో పశ్చాత్తాపపడి, మన్నింపు పొందాలి. రాబోవు జీవితకాలంలో సత్కార్యాలు చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి.

సృష్టికర్త తన దాసునితో గల పటిష్టమైన అనుబంధం, సామీప్యం కారణంగా ఆయన పాపాత్ముడైన తన దాసుని విజ్ఞప్తిని వింటాడు. తప్పక వినాలి, తన కారుణ్యంలో తీసుకోవాలి కూడాను. సంబంధం, ప్రేమ, సామీప్యం ప్రతి దాసునితో ఉన్నప్పుడు – అతను మంచివాడైనా, చెడ్డవాడైనా – మధ్యవర్తిత్వం (వాస్తా) అవసరమేముంటుంది?

**(4) సృష్టికర్త అపార ప్రేమ ప్రతి ఒక్క దాసునిపై ఉండాలి. అందువల్ల సిఫారసు అగత్యం ఏర్పడకూడదు.**

సృష్టికర్తకు ప్రతి ఒక్క దాసుని యెడల అపారమైన ప్రేమ ఉండాలి. ఆయన ప్రతి దాసుని మొరను వినగలగాలి. ఎందుకంటే ఆయన అతనిని పుట్టించినవాడు కాబట్టి. మధ్యలో వేరొకరి 'వాస్తా' ఉండకూడదు. వాస్తా అవసరం ఎప్పుడు ఏర్పడుతుంది? ఆయనకు కొందరిపై ప్రేమ లేనప్పుడే. లేదా వారి స్థితిగతుల గురించి, అవసరాల గురించి ఆయనకు తెలియనప్పుడే కదా! లేదా ఆయన ఆశ్రిత పక్షపాతం వల్ల కొందరి విజ్ఞప్తిని స్వీకరించి, మరికొందరి విజ్ఞాపనలను లక్ష్యపెట్టనప్పుడే కదా! సృష్టికర్త గురించి అసలు ఈ విధంగా ఊహించటం కూడా తప్పే. ఒకవిధంగా అది ఆయనపై అభాండం మోపటం వంటిదే. చనిపోయిన వారిని మధ్యవర్తులుగా ఆశ్రయించటం మరింత ఘోర అపచారం. జీవితాన్ని కోల్పోయిన ఒక మృతుడు సృష్టికర్తకన్నా, బ్రతికి ఉన్న మనిషికన్నా ఎక్కువగా మొరలాలకించి, సిఫారసు చేస్తాడని అనుకోవటం సృష్టికర్తపై జులుం వంటిదే.

**(5) జ్ఞానానికీ – సిఫారసుకు గల సంబంధం**

ఏమిటి, అగోచర విషయాల జ్ఞాని అయిన దైవానికి సిఫారసు అవసరం ఉందా?

సృష్టికర్త జ్ఞానం పరిపూర్ణమైనది. కాగా; మనుషుల జ్ఞానం చాలా పరిమితమైనది. పరిమిత జ్ఞానం పరిపూర్ణ జ్ఞానంలో చేసే పెంపుదల ఏముంటుంది? పైగా దాసుడైన మనిషికి ఏ కాస్త లభించినా అది పరిపూర్ణ జ్ఞాని ప్రసాదితమే. సృష్టికర్త తన దాసునికి జీవికను ప్రసాదించటం వంటిదే యిదీను.

- ♦ సృష్టికర్త జ్ఞానం, అది ఆయన స్వంతం. దాసుని జ్ఞానం సృష్టికర్తచే ప్రసాదించబడినది.
- ♦ పరిపూర్ణ జ్ఞాని దగ్గర సిఫారసు చేయించే యోగ్యత పరిమిత జ్ఞానికి ఉందా? ఇది ఒక పరిహాసం తప్ప మరొకటి కాదు.
- ♦ పరిమిత జ్ఞాని చేత సిఫారసు చేయించటం అంటే పరిపూర్ణ జ్ఞానం కలిగివున్న వాని న్యాయగుణాన్ని శంకించటమే. ఒకవిధంగా ఇది ఆయనపై జులుం వంటిదే.

- న్యాయం జరగవలసిన తీర్పుదినాన కూడా సిఫారసు ద్వారా కొందరికి అన్యాయం జరగటాన్ని బుద్ధి అంగీకరిస్తుందా?
- ప్రతి విషయాన్ని ఎరిగినవాడు, ప్రతి క్షణం ప్రతి దానినీ కనిపెట్టుకుని ఉన్నవాడు మాత్రమే 'న్యాయం' వాంఛించే వాటిని నెరవేర్చ గలుగుతాడు.
- గుప్తంగా ఉన్న దానినీ, వ్యక్తమై ఉన్న దానిని కూడా ఎరిగినవాడే (న్యాయం చెయ్యగలడు).
- ఆయన వద్ద ఆచరణల ముద్రలు (Prints) ఉండాలి.
- ఆయన వద్ద ప్రతి దానికి సంబంధించిన రికార్డులు ఉండాలి ..... ఆడియో, వీడియో, వ్రాతపూర్వకంగా (Audio, Video and Written)
- సిఫారసు న్యాయాన్ని నిర్వీర్యం (Nullify) చేస్తుంది. పైగా అది తీర్పును 'అన్యాయం' వైపునకు తీసుకుపోయే ప్రమాదం ఉంటుంది.
- ఏమిటి, న్యాయం చేసేవాడికి, ప్రతి సంఘటన గురించి, ప్రతి మనిషి చేసే చేష్టల గురించి తెలిసినవాడికి సిఫారసు అవసరం ఏర్పడుతుందా?
- న్యాయం చేసేవాడికి ప్రతి చేష్ట గురించి, ప్రతి సంఘటన గురించి, దాని పర్యవసానాల గురించి తెలిసి ఉండటం అవసరం .... మరి న్యాయాధిపతి అయిన ఆ విశ్వ సార్వభౌమునికి ఈ విషయాలన్నీ తెలియవా?

అగోచరాల జ్ఞాని ప్రసాదించిన జ్ఞాన భిక్షతో మనుగడ సాగిస్తున్నవారు ఆ సర్వజ్ఞాని జ్ఞానాభ్యుదయానికి తోడ్పడగలరా?

### (6) సిఫారసుకై జ్ఞానం చాలా అవసరం

ఏమిటి, సృష్టికర్తకు సిఫారసు అవసరం ఉన్నదా?

జ్ఞానానికీ – సిఫారసుకీ అవినాభావ సంబంధం ఉంది.

దేని గురించి కూడా ఏమీ తెలియని వారికి మాత్రమే సిఫారసు సహారా ఏర్పడుతుంది.

సిఫారసు చేయటమంటే సృష్టికర్త పరిజ్ఞానాన్ని లోపభూయిష్టంగా భావించటమే. కాగా; ఆయన జ్ఞానం ప్రతిదానిపై ఆవరించి ఉన్నది.

దాసుడైనందున మనిషి దీనాతి దీనంగా వేడుకోగలడు, మొరపెట్టుకో

గలడు. కాగా; సిఫారసు అనేది సమవుజ్జీలైన వారితోనే చేయబడుతుంది. లేదా ఒక అధికారి ద్వారా, అతని ఆజ్ఞ ద్వారా!

## (7) తెలియనివాడు తెలిసినవానితో సిఫారసు చేయించడం

సృష్టికర్త స్వభావం, సృష్టితాల స్వభావం వేర్వేరు. సృష్టికర్త అనేవాడు సృష్టితాల స్వభావంపై అంచనా వేయనవసరం లేదు. స్వయంగా సృష్టితాల స్వభావంలో కూడా పరస్పరం భూమ్యాకాశాలంత వ్యత్యాసం ఉంది. సృష్టితాలు బలహీనమైనవి. వాటి జ్ఞానం పరిమితం, లోపభూయిష్టం. అలాంటివారు సృష్టికర్త ముందు సిఫారసు చేయడానికి ఏపాటి? అదీగాక, సిఫారసు ఆవశ్యకత ఎప్పుడు ఏర్పడుతుంది? .... ఒకరికి అన్యాయం జరుగుతున్నప్పుడు! వారి హక్కు కాజేయబడుతున్నప్పుడు!! అట్టి పరిస్థితిలో సర్వాధికారి సమక్షంలో సిఫారసు సముచితమే. పైగా అది ప్రోత్సహించదగినది (Encouraging) కూడా. కాని ఎవరి జ్ఞానం సమస్త విశ్వాన్ని పరివేష్ఠించి ఉందో, ఎవడు సూక్ష్మద్రష్టగా వర్ధిల్లుతున్నాడో, ఎవరి నిర్ణయాలు విజ్ఞత, కారుణ్యం, ప్రేమ, న్యాయంతో నిండి ఉన్నాయో అలాంటి వాని సమక్షంలో సిఫారసు అవసరం ఉంటుందా?

ఒకవిధంగా ఇది అగోచరాల జ్ఞానిపై తీవ్రమయిన నిందారోపణే. ఆయన అబద్ధపు మాటలు విని, దాని ఆధారంగా న్యాయనిర్ణయం గైకొనటం ఎలా సంభవం? ఆయన తీర్పు కారణంగా ఒకరి హక్కు కొల్లగొట్టబడటంగానీ, ఒకరికి అన్యాయం జరగటం గానీ ఎలా సాధ్యం? .... ఏమిటి, సృష్టికర్త ద్వారా ఇలా జరుగుతుందని ఆశించవచ్చా?

## (8) సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావన, మానవ జీవితంపై దాని ప్రభావం

దైవదూతలను, సత్పురుషులను మొరపెట్టుకుని, వాళ్ళకు దైవత్వంలో భాగస్వామ్యం కల్పించడానికి అసలు కారణం సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావనే. సృష్టికర్త తప్పకుండా ఆ మహనీయుల సిఫారసును ఆమోదిస్తాడని, నిరాకరించడని తలపోయటమే.

సిఫారసు యొక్క ఈ భావన ప్రాథమికంగా సరైనది కాదు. ఎందుకంటే ఈ రకమయిన భావన సృష్టికర్త యెడల ఉండవలసిన నమ్మకాన్ని, ఆశావహ దృక్పథాన్ని సాటి మనుషుల వైపునకు తీసుకుపోతుంది. ఈ విధంగా సృష్టికర్తను అవమానపర్చే ద్వారం తెరుచుకుంటుంది.

ప్రజల మనోమస్తిష్కాలపై ముసురుకుని ఉన్న ఈ 'షఫాఅత్' (సిఫారసు) తప్పుడు భావన యొక్క ఫలితాలు చాలా ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉంది.

హేతుబద్ధంగా చూసినా,
న్యాయదృక్కోణం నుంచి తూచినా,
మానవ నైజం వాంఛించే దానిపై దృష్టిని సారించినా,
సిసలైన న్యాయాధీశుని తిరుగులేని న్యాయగుణాన్ని నిశ్చిత నేత్రంతో తరచి చూసినా ఈ భయంకర పరిణామాలను పసిగట్టడం కష్టం కాదు.

సృష్టికర్తను, తీర్పుదినాన్ని విశ్వసించడం వల్ల మానవ జీవితంపై పడే సకారాత్మకమైన ప్రభావం, సత్ప్రభావం 'సిఫారసు' యొక్క తప్పుడు భావన వల్ల నిరర్థకం (Nullify) అయిపోతుంది. ఉదాహరణకు :– సృష్టికర్తపై దృఢ విశ్వాసం కల మనిషి తనను తాను ఒక బాధ్యతాయుతుడైన వ్యక్తిగా భావిస్తాడు. ప్రళయదిన అధినేత సమక్షంలో జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న భావన రాగానే భీతిల్లుతాడు. కాని సిఫారసుపై తప్పుడు ఊహాగానాలు చేసే వ్యక్తి సృష్టికర్తకు విధేయుడుగా ఉండడు. లెక్కల దినానికి భయపడడు. తత్కారణంగా అతను ఒక మంచి పౌరునిగా రాణించలేడు.

ప్రస్తుత ఒనరులపై, సాంకేతిక ప్రగతిపై దృష్టిని సారించినపుడు అవగతమయ్యేదేమిటంటే; సృష్టికర్త ఈ విశ్వంలో సకల ఏర్పాట్లు చేసిపెట్టాడు. అవి సమస్త ఆధారాలతో, సాక్ష్యాల (Evidences) తో వెలుగొందుతున్నాయి. ఆడియో, వీడియో, హృదయంపై నుంచి ఉద్భవించే తరంగాల (ECG, Video, Audio) పై యోచన చేసినప్పుడు అర్థమయ్యేదేమిటంటే; విశ్వంలో ఉన్న ఏ వస్తువులపై మన శబ్దం, మన చేష్టలు రికార్డు అవుతున్నాయో మనకే తెలియదు. ఇన్ని ఏర్పాట్లు చేసిన ఆ మహాజ్ఞానికి సిఫారసు వినాల్సిన అవసరం ఏముంటుంది? ఆయన ఆనతి లేకుండా ఎవరయినా ఎలా సిఫారసు చేయగలరు?

ఎవరయినా ఆ న్యాయాధీశుని సమక్షంలో సిఫారసు చేస్తున్నాడంటే ఆయన కంటే ఎక్కువగా తనకు తెలుసు అని పరోక్షంగా చాటి చెబుతున్నాడన్నమాట! సృష్టికర్త పాలిట ఇంతకన్నా అవమానకరమైన విషయం ఇంకేముంటుంది?

దీనివల్ల ముందుకు వచ్చే మరో నెగటివ్ కోణం ఏమిటంటే సృష్టికర్తకు దాసునితో గల సంబంధం సమీప సంబంధం కాదు, మధ్యలో అడ్డుతెరలు

ఉన్నాయి. అందుకే గతించిన కొంతమంది పుణ్య పురుషుల లేక దైవదూతల మధ్యవర్తిత్వ ఆవశ్యకత ఏర్పడుతుంది. వాస్తవానికి మనిషి – అతను సద్వర్తనుడైనా, దుర్వర్తనుడైనా – తన ప్రభువుతో ప్రత్యక్ష సంబంధం ఏర్పరచు కోగలడు. ఈ ప్రపంచంలో ఉండగానే ఆయన మన్నింపును, తోడ్పాటును, కారుణ్యాన్ని పొందే కృషి చేయగలడు.

సిఫారసు ఒకవిధంగా సృష్టికర్త న్యాయశీలంపై దాడి వంటిదే. అంటే ఒక వ్యక్తి కఠోర అభ్యాసంతో ఒక వస్తువును సృష్టికర్త నుండి పొందగా, మరో వ్యక్తి ఏమాత్రం కష్టపడకుండానే – కేవలం సిఫారసు ద్వారా – దానిని పొందగలడన్నమాట!

దీనివల్ల మానవ జీవిత లక్ష్యానికి కూడా అర్థం లేకుండా పోతుంది. అంటే సాధన చేసే వారి ఫలితం, చేయనివారి పర్యవసానం ఒకేలా ఉంటుంది (ఇది న్యాయమేనా?)

ఈ సిఫారసు భావన వల్ల మానవ జీవితంపై పడే మరో చెడు ప్రభావం (Impact) ఏమిటంటే, సృష్టికర్త ప్రసన్నత బడయటంకన్నా సిఫారసు చేసేవారి మెప్పు పొందాలన్న ఆరాటం ఎక్కువగా ఉంటుంది. దానిని సాధించడానికి కానుకలు, నైవేద్యాలు మొదలుకుని నరబలులు ఇవ్వటం వరకు మనిషి తెగిస్తాడు. ఫలితం సుస్పష్టమే. అలాంటి వ్యక్తికి సృష్టికర్త అభీష్టం ప్రకారం నడుచుకోవాలన్న ఆలోచన బొత్తిగా ఉండదు. పుట్టించిన వానినే మరచి పొగరుబోతుగా విహరించసాగుతాడు.

### (9) సిఫారసుకు సంబంధించిన తప్పుడు భావన, దాని చెడు ప్రభావం

ఆయన విశ్వ సార్వభౌమత్వంలో ఎవరూ ఎలాంటి జోక్యం చేసుకోవటానికి వీలుండకూడదు. అన్యథా రాజ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతుంది. ఎందుకంటే ఆ జోక్యం జ్ఞానంతో, యుక్తితో నిమిత్తం లేనిది. ఇలాంటి జోక్యం ఒకానొక వైపు మొగ్గిపోయి ఉంటుంది. జ్ఞాన లేమివల్ల ఏ విధంగా పరిపాలన సజావుగా సాగదో సిఫారసుకు సంబంధించిన విచ్చలవిడితనం వల్ల న్యాయం, దయాదాక్షిణ్యాలు కోరే అంశాలు కూడా ఎలా నెరవేర్చబడతాయి?

### (10) సృష్టికర్త దృష్టిలో సిఫారసుకు గల స్థాయి, వాస్తవికత ఏమై ఉంటుంది?

సిఫారసుకు అనుమతి ఉండాల్సిందే కాని దాని స్వరూపం మనవాళ్లు

అనుకున్నట్లుగా మాత్రం ఉండకూడదు. ఒక పుణ్య పురుషుడు తన సద్వర్తన ఆధారంగా – సృష్టికర్త ఆనతి లేకుండానే – ఎవరి కోసమయినా సిఫారసు చేసేందుకు సృష్టికర్తను ఆశ్రయించి తన పంతం నెగ్గించుకోవటం అనేది జరగకూడదు. ఈ రకమయిన సిఫారసు ఆమోదయోగ్యం అయ్యేమాటైతే 'న్యాయదినం' కాస్తా 'అన్యాయదినం'గా పరిణమిస్తుంది. ఈ రకమయిన సిఫారసు వల్ల సృష్టికర్త స్వాభిమానానికి, పవిత్రతకు విఘాతం కలుగుతుంది. అంటే ఆయన సిఫారసు ఒత్తిడికి తల ఒగ్గి న్యాయమే చెయ్యడన్నమాట! అందుకే సృష్టికర్త ఆనతి లేకుండా సిఫారసు జరగకూడదు.

సృష్టికర్త అనుమతి పొందినవారే సిఫారసు చేయాలి (కొంతమంది ప్రత్యేక వ్యక్తుల కోసం).

సృష్టికర్త ఎవరి కొరకు సంజ్ఞ చేస్తాడో వారి కొరకు మాత్రమే సిఫారసు చేయగలగాలి.

అంటే సిఫారసు ప్రత్యేకమైన వారి కోసం, షరతుల (Conditional) తో కూడినదై ఉండాలి. అనుమతిపైనే ఆధారపడి ఉండాలి.

అంటే సిఫారసు ఎవరు చేయాలి? ఎవరి కోసం చేయాలి? ఇది సృష్టికర్తే నిర్ణయించాలి.

## (11) ఆనతి లేకుండా సిఫారసు చేయలేకపోవడానికి కారణం?

దాసుల మధ్య పోలికల (Compare) గురించి ఆలోచించినప్పుడు ఒక వ్యక్తి మరో వ్యక్తిపై ప్రాధాన్యత కలిగి ఉన్నాడని అర్థమవుతుంది. (ఉదాహరణకు: సజ్జనులు, మహనీయులు, దైవదూతలు మొదలగువారు) అయితే ఒక దాసుడు ఈ ప్రాధాన్యత కలిగి ఉన్నప్పటికీ సృష్టికర్త సమక్షంలో అతడు దాసుడుగానే ఉంటాడు. దాస్యపు హద్దులను దాటలేడు. అతనెంత గొప్పవాడైనా దాసుడుగానే ఉండాలి. .... తల వంచుకుని జీవించాలి. అతని దృష్టి క్రిందికే ఉండాలి. నోరుతెరిచే సాహసం చేయకూడదు. .... ఇదే దాస్యం అంటే. ఈ హద్దును ఎవరూ దాటటానికి వీలుండకూడదు. ఎందుకంటే దాసుడు దాసుడే. సృష్టికర్త మాత్రం సార్వభౌమాధికారి. సార్వభౌముని ఆనతి లేకుండా దాసుడు ఎలా నోరు తెరువగలుగుతాడు? సిఫారసు సంగతి అలా ఉంచండి, అసలు ఎలా ధైర్యం చేయగలుగుతాడు?

**(12) సిఫారసు కోసం సమ ఉజ్జీ అయి ఉండాలి....**

సృష్టికర్త, స్వామి, సర్వాధికారి అయిన దైవానికి సంతానం గాని ఉందా, సిఫారసు కోసం ఆయన పంచన చేరడానికి? ఎందుకంటే సిఫారసు చేయించాలంటే ఆ కోవకు చెందినవారే అయి ఉండాలి, ఆ శ్రేణికి చెందినవారే అయి ఉండాలి. అదీగాక సృష్టికర్త ఎవరి కొరకయినా సిఫారసు వినడానికి సుముఖంగా ఉండాలి. సిఫారసు చేయడానికి ఆయన ఇష్టపూర్వకంగా ఏ దాసునికయినా అనుమతి ఇవ్వాలి. (దాసుడైన మనిషి ఆయన ముందు ఏ పాటి? ఆనతి లేకుండా అతను ఆయన ఎదుట ఎలా నోరెత్తగలడు?)

**(13) సిఫారసు యొక్క తప్పుడు భావన వల్ల సృష్టికర్తకు అవమానం (Insult) జరుగుతుంది. ఆచరణ నుండి పరారయ్యే మార్గాలు తెరచుకుం టాయి.**

సిఫారసు ఆలోచన మనిషికి ఎప్పుడు రావాలి? దాసులందరికీ సృష్టికర్త సామీప్యం పొందే సమానావకాశం (Equal Chance) లభించినప్పుడు! కాని ప్రతి మనిషికీ సమానావకాశాలు ఇవ్వబడ్డాయి. అయితే ఎవరయినా ఒకడు ఈ మంచి అవకాశాలను (Opportunities) ను సద్వినియోగం చేసుకునే బదులు తనను తాను మోసపుచ్చుకుంటాడు. ఆచరణ నుండి తప్పించుకునేందుకు సిఫారసుకు సంబంధించిన బూటకపు విశ్వాసాన్ని కల్పించుకుంటాడు.

సృష్టికర్తకు ప్రతి దాసునిపై ప్రేమ లేదా? ఆయన ప్రతి ఒక్కరికీ చేరువలో లేడా? ఆయన అందరి మొరలు ఆలకించడా? ఆయన ప్రతి ఒక్కరిపై తన కారుణ్యాన్ని కురిపించడా? ఆయన ప్రతి ఒక్కరి పశ్చాత్తాపాన్ని స్వీకరించడా? ప్రతి ఒక్క దాసుని యెడల ఆయన ఇవన్నీ చేస్తాడు. మరలాంటప్పుడు సిఫారసు అవసరం ఏమిటంట!? ఒకవేళ సృష్టికర్త ఇవన్నీ చేయలేకపోతే ఎప్పటికీ ఆయన దర్బారులో న్యాయం లభిస్తుందని ఆశించలేము. అలాంటి సృష్టికర్తతో మనకెట్టి సంబంధం ఉండనక్కర లేదు. న్యాయాన్ని ఇష్టపడే ఏ మనిషీ అట్టి స్వామితో సంబంధం ఏర్పరచుకోడు – సృష్టికర్త గురించి మనిషి తన మస్తిష్కంలో తప్పుడు భావనను ఏర్పరచుకుంటే, అది అతని తప్పు. దాని చేదు ఫలితాలను అతను స్వయంగా చవిచూస్తాడు. సృష్టికర్త కారుణ్యానికి, ప్రేమకు, సామీప్యానికి నోచుకోకుండా పోతాడు. ఇదంతా మనిషి స్వయంకృతం కాదా?

**(14) సిఫారసు దెబ్బ ఎటువంటి ముఖ్యమైన వస్తువులపై పడుతుంది?**

సిఫారసు గురించి దావా చేసేవారు, సిఫారసుపై ఆశలు పెంచుకున్నవారు ఎటువంటి శక్తిమంతుని గురించి ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. వారి ఈ ఆలోచన వెనుక ఏమన్నా సామంజస్యత ఉందా?

ఈ రకమయిన సిఫారసు దైవ కారుణ్యానికి, న్యాయానికి అడ్డు వస్తుంది. అందుకే అది స్వీకారయోగ్యం అవదు. సృష్టికర్త, స్వామి, పాలకుడు, పోషకుడు అయినవానికి ప్రతి దానిని గురించి క్షుణ్ణంగా తెలిసినప్పుడు సిఫారసు అవసరమే ఏముంటుంది? సిఫారసుకు ఆనతి అనేది పురస్కారంగా మాత్రమే ఉండాలి. తీర్పుదినాన ఎవరూ నోరు విప్పడానికి సాహసించనప్పుడు, ఎవరూ కన్నెత్తి కూడా ఆయన్ని చూడలేని పరిస్థితిలో సృష్టికర్త తనకు ఎంతో ప్రియతముడైన వ్యక్తికి తన ప్రత్యేక కటాక్షంగా సిఫారసు అనుమతి ఇవ్వాలి. ఈ అనుమతి సృష్టికర్త ప్రసన్నతకు ఒక నిదర్శనం. మానవాళి సమక్షంలో ఆ వ్యక్తికి లభించే విశిష్ఠ పురస్కారమది!

**(15) సిఫారసు వాస్తవికత, దాని సరైన దృక్పథం** (Concept) **అర్థమయ్యేది ఇలా ....**

తమ ఆరాధనల, అభ్యాసాల ఆధారంగా సృష్టికర్త సామీప్యం పొందిన ఉత్తమ శ్రేణి (Grade) దాసులకే సిఫారసు చేసే అనుమతి లభించాలి. ఆనాటి ప్రచండ స్థితిలో సిఫారసు చేసే అనుమతి ఎవరికయినా లభించిందంటే, వారికి విశిష్ఠ పురస్కారం లభించిందన్నమాటే. ఇది ఒకవిధంగా తన విశిష్ఠ దాసులపై సృష్టికర్త కటాక్షం. సమస్త మానవాళి సమక్షంలో, అందరూ భీతితో బిక్కు బిక్కుమంటూ, తల ఎత్తే ధైర్యం కూడా చేయలేని పరిస్థితిలో ఈ అనుమతి ఎవరికయినా లభించటం ఎంత గొప్ప పురస్కారమో ఊహించవచ్చు. వారి సదాచరణ కారణంగా బహుమానం (Reward) అయితే వారికి ఎలాగూ లభించింది. ఇప్పుడు వారికి లభించిన ఈ సిఫారసు ఆనతి ఒక పురస్కారం (Award) స్థాయి కలిగినది.

అయితే ఈ పురస్కారం కొంతమంది విశిష్ఠ వ్యక్తులకు, ఎంపిక చేసుకోబడిన దాసులకే వర్తించాలి, చాలామందికి కాదు. అదీగాకుండా సృష్టికర్త ఎవరెవరి కోసం అనుమతి ఇచ్చాడో వారి కొరకు మాత్రమే సిఫారసు చేయగలగాలి. అంటే; చిత్తశుద్ధితో సాధన చేసినప్పటికీ ఏదో వెలితి కారణంగా

(Marginally) వెనుకబడిపోయి, స్వర్గాన్ని చేరుకోలేకపోయిన వారి కోసం! అలాంటి వారి సాధనకు విలువ ఇస్తూ వారికి క్షమాభిక్ష ప్రసాదించబడాలి.

వారిపట్ల న్యాయ వ్యవహారం జరిగింది. కాని ఏదో లోపం వల్ల వారు వైఫల్యం చెందారు. పిదప సృష్టికర్త కారుణ్యం, మన్నింపు కదలివచ్చింది – వారికి క్షమాభిక్ష పెట్టాలని! క్షమాభిక్షకు మరో పద్ధతి కూడా ఉండొచ్చు; వారికోసం సిఫారసు చేసే అవకాశం తన సజ్జన దాసులలో కొందరికి కల్పించి, వారిని సత్కరించవచ్చు. ఆ విధంగా క్షమాభిక్షకు నోచుకున్న వారిని స్వర్గానికి చేర్చవచ్చు.

కొంతకాలం వరకు నరకయాతన అనుభవించిన మీదట స్వర్గంలో ప్రవేశింపజెయ్యదలచిన వారికి కూడా క్షమ, సిఫారసు వర్తించవచ్చు.

సృష్టికర్త న్యాయం వాంఛించే దాని ప్రకారం వారు నరక యాతనకు గురయ్యారు. కాని ఇప్పుడు వారు నరకం నుండి వెలికి తీయబడటం కూడా సృష్టికర్త దయాదాక్షిణ్యాల, క్షమ మన్నింపుల వాంఛ ప్రకారమే జరగాలి.

సిఫారసు ఎవరు చేయాలి, ఎవరి కొరకు చేయాలి అనేది తీర్పుదినపు యజమానికే తెలుసు. ఆయన గైకొనే చర్య ఆమోదయోగ్యమైనది, ఆదరణీయమైనది కూడా. ఇలాంటి సిఫారసుకు ఒక అర్థం ఉంది. తగు కారణముంది. ఇక్కడ న్యాయంపై నెగటివ్ ప్రభావం పడటం లేదు. ఇక్కడ న్యాయాధీశునిపై ఎలాంటి ఒత్తిడి కూడా లేదు. ఆయన న్యాయం నుంచి వైదొలగే ఆస్కారం కూడా లేదు. సిఫారసుకు సంబంధించిన ఈ భావన సముచితం అనిపిస్తోంది. ఇందులో న్యాయాధీశుని వ్యక్తిత్వానికి విఘాతం కూడా కలగటం లేదు. ఈ భావన వల్ల మనసులో అలజడి, వ్యాకులత కూడా ఏర్పడదు.

**ఎనిమిదవ అధ్యాయం :**

# సృష్టికర్త భావనకు సంబంధించిన మరింత విశదీకరణ .... ఒక చూపులో!

ఎ. సృష్టికర్త భావనకు సంబంధించిన ఒక సాధారణ రేఖా చిత్రం

**(1)** సృష్టికర్త బలహీనుడా? లేక మన ఆలోచన బలహీనమైనదా?

**(2)** సృష్టికర్త బలహీనుడా? లేక మన ఆలోచన బలహీనమైనదా? .... రెండవ కోణం.

**(3)** నిద్ర, కునుకు, విశ్రాంతి

**(4)** ఆకలిదప్పులు

బి. దేవుని ఏకత్వం

**(1)** క్షణకాలం పాటు సృష్టికర్త శక్తిపై చింతన

**(2)** ఒకే ఒక్క నిర్వహణ కర్త

**(3)** ఎలాంటి కారకాలు లేకుండానే తన పని చేయగలిగినవాడే సృష్టికర్త

**(4)** సానుకూలత, సమన్వయం

**(5)** లక్ష్యంతో కూడుకుని ఉండటం

**(6)** జగతి నిర్వహణ ఇస్తున్న సాక్ష్యం

**(7)** పనుల సంక్లిష్టత, విస్తృతి

**(8)** దైవిక సహాయం

**(9) సృష్టికర్త కుటుంబం**

**(అ) మొదటి దృక్పథం .... ఏకత్వంతో కూడినది**

**(ఆ) రెండవ దృక్పథం .... బహుత్వంతో కూడుకున్నది**

**(ఇ) మూడవ దృక్పథం .... సృష్టికర్తకు సంతానముంది అనేది**

**(ఈ) మరొక కోణం .... సృష్టికర్త కుటుంబం, సృష్టికర్తకు భార్య ఉందనేది**

**(క) కుటుంబ భావనపై యోచన చేద్దాం**

## (సి) సృష్టికర్త ఉనికి భావన

**(1) వాలకం, రూపురేఖల గురించి చర్చ**

**(2) మానవ భావనలు**

**(3) సృష్టికర్త ఉపమానం**

## (డి) సృష్టికర్త ఉనికికి సంబంధించిన జ్ఞానం

**(1) మానవ జీవితంపై సృష్టికర్త ఉనికి, గుణగణాలకు సంబంధించిన జ్ఞాన ప్రభావం**

# సృష్టికర్త భావన .... దీనికి సంబంధించిన మరింత విశదీకరణ

## ఎ. సాధారణ రేఖా చిత్రం

మానవునికి గల అవసరాలు, దౌర్బల్యాలు, బలహీనతలు సృష్టికర్తకు కూడా ఉంటాయని ఊహించటం తగదు. మనిషికి అన్నపానీయాల అవసరం ఉంది. ఇవి లేకుండా అతను బ్రతకలేడు.

మనిషికి అలసట, బడలిక అవుతాయి. నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పొందటానికి అతను విశ్రాంతి తీసుకోవటం, నిద్రించడం అవసరం.

మనిషికి లైంగిక (Sex) వాంఛలు తీర్చుకోవాలని అనిపిస్తుంది. ఒకటి: అది అతనిలోని మనోమయ భావన. రెండవది : సంతానోత్పత్తి కాంక్ష. ఇదే గనక లేకుంటే అతని మనుగడకే ముప్పు ఏర్పడుతుంది.

మనిషికి జబ్బు చేస్తుంది. అతనికి మందులు మాకుల అవసరం ఏర్పడుతుంది. సేవకుల అవసరం కూడా ఉంటుంది. ఎందుకంటే అతను నీరసించిపోతాడు. తన పనులు తాను చేసుకోలేని నిస్సహాయ స్థితికి లోనవుతాడు.

రేయింబవళ్ళలో మనిషికి ఎన్నో అవసరాలు ఏర్పడుతుంటాయి. ఎన్నో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అతను ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ విధంగా మనిషి ఒండొకరిపై ఆధారపడేవాడు (Interdependent) గా చేయబడ్డాడు.

ఆధారపడటం (Dependency), పరస్పర ఆధారం (Interdependency) మానవ బలహీనతను సూచించడమేగాక, దానికి ప్రబల తార్కాణంగా ఉంది.

ఒకవేళ ఈ అవసరాలన్నీ (తినటం, త్రాగటం, విశ్రాంతి తీసుకోవటం, లైంగిక వాంఛలు తీర్చుకోవటం వంటివి) గనక సృష్టికర్తకు కూడా ఉంటే, ఆయన కూడా బలహీనుడే, ఒకరిపై ఆధారపడినవాడే (Dependent) అవుతాడు. ఎందరో మహానుభావుల, వస్తువుల వలె ఎందరో సృష్టికర్తలు లేక సృష్టిలో భాగస్వాములని అంగీకరించినట్లయితే, పరస్పర ఆధారాల (Interdependency) ప్రస్తావన కూడా వచ్చేస్తుంది. అంటే వారంతా ఏకమై తమ లోటును పరస్పరం భర్తీ (Compensate) చేసుకుంటారని భావించవలసి ఉంటుంది.

ఈ అవసరాలు, అగత్యాలన్నీ సృష్టికర్త బలహీనతను సూచిస్తున్నాయి. బలహీనుడు, అగత్యపరుడైనవాడు సృష్టికర్త కాలేడు. పరస్పర ఆధారం (Interdependency) తో జరిగే ఏ పనీ సౌమ్యంగా, సజావు (Smooth) గా సాగదు. అది మంచి ప్రావీణ్యం (Perfectly) తో కూడా జరగదు. సృష్టికర్త చేసే అత్యున్నత స్థాయి పనులలో సృష్టితాలు గనక పాల్గొనేటట్లయితే, సృష్టితాలు తమ బలహీనతల, నిస్సహాయతల, పరిమితుల (Limitations) దృష్ట్యా ఏ విధంగా సృష్టికర్తకు సహాయపడగలవు?

దేముళ్ళ మధ్యన గనక పరస్పర ఆధారం (Interdependency) గురించి ఊహించినట్లయితే, మరి దేముళ్ళంతా ఒకే వ్యక్తిత్వానికి, ఒకే స్థాయి (Equal Status) కి చెందినవారై ఉండాలి.

ఒకానొక శక్తిపై ఆధారపడటం (Dependency) అయినా లేక పరస్పరం ఆధారమైనా – మొత్తానికి ఇది 'బలహీనత'నే సూచిస్తోంది.

ఒకవైపున ఈ బలహీనత, అగత్యం ఉండగా రెండవ వైపున సువిశాలమైన ఈ జగతి ఉన్నది. అసంఖ్యాకమైన జీవరాశులున్నాయి. మరి ఇవన్నీ ఉనికిలోనికి రావటం, నెలకొని ఉండటం, నిర్వహించబడటం – ఇదంతా ఎలా సంభవం?

సువిశాలమైన ఈ జగతినే చూడండి, ఇది బిలియన్ కాంతి సంవత్సరాల (Billion Light Years) పై విస్తరించి ఉంది. దీని సృష్టికి ఎటువంటి జ్ఞానం, ఎటువంటి శక్తి, ఎటువంటి యుక్తి అవసరమో ఆలోచించండి! ఎంత గొప్పగా దీన్నంతటినీ ఒక శాసనానికి బద్ధమై ఉండేలా చేయటం జరిగింది! ఎంతటి నియంత్రణ!! ఏ వస్తువు కూడా ఆజ్ఞ కానంత వరకూ తన కక్ష్య నుండి

కదలజాలదు. ప్రతి వస్తువుపైన ఆయన ఆజ్ఞ ఆవరించి ఉంది. ప్రతి వస్తువు, ప్రతి క్షణం ఆయన జ్ఞానపరిధిలో ఉంది. జగతి నలుమూలలా ప్రతి మిల్లీ మీటరుపై, మిల్లీ మీటర్‌లోని ప్రతి భాగం (Fraction of Millimeter) పైన ఆయన జ్ఞానం పరివేష్ఠించి ఉంది. కనుకనే ప్రతి వస్తువు ఆయన అదుపాజ్ఞల్లో ఉంది. ఆయన ఆజ్ఞలకు లోబడి (Under Command)ఉండగలదు. బలహీనతలకు, దౌర్బల్యాలకు అతీతమైన, పవిత్రమైన శక్తి మాత్రమే ఇదంతా చేయగలదు. రెండు పరస్పర వ్యతిరేకమైన లేక పరస్పరం పొత్తికలేని (Unmatched) వస్తువులను లేక గుణాలను కలపటం అవివేకం. ఇది స్వీకార యోగ్యం కాని విషయం. అంటే బలహీనత, అగత్యం, నిస్సహాయతతో కూడిన దానిని, పరిపూర్ణమైన అత్యుత్తమ నిర్వహణ (Perfect Performance) తో జతపరచటం ఎలా సమంజసం అవుతుంది?

మరి బిలియన్ (Billion) రకాల జీవరాశులను సృష్టికర్త బిలియన్, ట్రిలియన్ల (Trillion) సంఖ్యలో సృష్టించాడు. మరి వాటిలో ఒక్కొక్క ప్రాణిని కనిపెట్టుకుని ఉండటం (వాటిలో మన కంటికి కానరానంత చిన్న జీవులు కూడా ఉన్నాయి), వాటి జీవన్మరణాల గురించి తెలిసి ఉండటం, ప్రతి ప్రాణికి కావలసిన జీవితావసరాలను సకాలంలో తీర్చటం, తరంతరం .... నిరంతరం ఈ పని చేస్తూనే ఉండటం .... ఈ జగతి అంతటిలో వ్యాపించివున్న ప్రాణులన్నింటి అవసరాలు తీరుస్తూ ఉండటం, వాటి కోసం సూర్యుడు, చంద్రుడు, గాలి, నీరు, నదీనదాలు ఏర్పాటు చేయటం – ఇదంతా దేన్ని సూచిస్తోంది. వీటిలో ప్రతి ఒక్కటీ ప్రాణమున్న దాని జీవన ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది. ఈ శాసనాలను, నియమాలను ఆయన అత్యంత సూక్ష్మస్థాయి (Micro Level)లో లోకంలో పొందుపరిచాడు.

పరిశోధనల ద్వారా వెలుగులోకి వచ్చిన విషయాలను చూసి మానవుడు అబ్బురపడుతుంటాడు – అతని శారీరక వ్యవస్థ (Body System) అయినా, అతని ఆరోగ్యం, ఆహారం, జీర్ణప్రక్రియ (Nourishment) గురించి అయినా లేదా పునరుత్పత్తి (Reproduction) గురించి అయినాసరే! ప్రతి సిస్టమ్‌లోనూ నియమనిబంధనలు పొందుపరచబడ్డాయి.

ఇది ఎటువంటి జ్ఞానం, ఎటువంటి యుక్తి, ఎటువంటి శక్తి! ఇటువంటి ఆశ్చర్యకరమైన వ్యవస్థను, శాసనాన్ని చేసి, దానిని ప్రవేశపెట్టిన ఆ శక్తి ఎంత గొప్పది!? ఆ శాసనం నుండి ఏ కాస్త వైదొలగినా అది వినాశకరం (Disastrous)

గా పరిణమిస్తుంది. ఈ ఘనకార్యాలన్నీ బలహీనులు, వేరొకరిపై ఆధారపడిన వారు (Dependent), పరస్పరం ఆధారపడినవారు (Interdependent) చేసినవా లేక జ్ఞాన సంపన్నుడు, వివేకసంపన్నుడు చేసినవా? ఆయన బలహీనతలన్నింటికీ, అగత్యస్థితి (Dependency) కి అతీతుడు కాదా?

ఈ సువిశాల జగతి, దీని అపురూపమైన వ్యవస్థ, ఇందలి ప్రాణుల సంఖ్య, వాటి జీవికకు కావలసిన ఏర్పాట్లు – ఇవన్నీ ఒక గొప్ప సృష్టికర్త భావనకు దర్పణంగా ఉన్నాయి. ఆయన విజ్ఞానంలో, వివేకంలో పరిపూర్ణుడు. వీటితో పాటు ఆయన అపారశక్తిమంతుడు, అన్నింటిపై నియంత్రణ కలిగి ఉన్నవాడు, అన్నింటినీ పరివేష్టించి ఉన్నవాడు. ఆయనే అత్యంత పకడ్బందీగా, ప్రణాళికాబద్ధం (Planning) గా తాననుకున్నది ప్రవేశపెడతాడు. ఆయన్ని అడ్డుకోగల వాడెవ్వడూ లేడు. ఈ చర్చ ద్వారా విదితమయ్యేదేమిటంటే, అందరినీ సృష్టించినవాడు ఒక్కడే. దీనిని మనం గమనించడమే కాదు, అనుభూతి చెందుతున్నాము, దాని ద్వారా లబ్ది పొందుతున్నాము, దానిలో అంతర్భాగం అయివున్నాము.

పైన ప్రస్తావించబడిన సుగుణాలనుబట్టి మానవుడు సృష్టికర్త ఔన్నత్యాన్ని ఊహించగలడు. ఘనాఘనునిలోనే ఈ యుక్తి, ఈ జ్ఞానం, వజ్ర సంకల్పం ఉంటుంది. ఘనకార్యాన్ని చేయగలవాడు ఘనుడే అయి ఉండాలి. ఆయన అస్తిత్వాన్ని బలహీనులైన మనుషులతో పోల్చడానికి ఆస్కారం లేశమైనా ఉండకూడదు. ఇటువంటి గొప్ప గుణాలవాడు గొప్పవాడే అయి ఉంటాడని మనం భావించవలసి ఉంటుంది.

### (1) సృష్టికర్త బలహీనుడా? లేక మన ఆలోచనలో బలహీనత ఉందా?

మన ఆలోచనలో బలహీనత ఉందా? లేక నిజంగానే మనం అనుకుంటున్నట్లుగా సృష్టికర్త బలహీనుడుగా ఉన్నాడా?

మనం అనుకుంటున్నట్లుగానే సృష్టికర్త బలహీనుడై ఉన్నట్లయితే, మరి అటువంటి సృష్టికర్తను నమ్ముకుని ఏం లాభం? ఒకవేళ ఆలోచనలో బలహీనత ఉంటే, దాన్ని మార్చుకోవాలి. దాన్ని సంస్కరించుకోవాలి. సృష్టికర్తను ఆయన పవిత్ర స్థానంలోనే ఉంచాలి. ప్రతి లోపాన్ని, బలహీనతను సరిదిద్దుకుని ఆలోచనల్లో, అంతరంగాలలో ఆయనకు చోటు ఇవ్వాలి. క్రింద ఇవ్వబడిన ఉపమానం ద్వారా విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం –

ఒక వ్యక్తిలో ఉన్న శారీరక, మానసిక లోపాన్ని లేదా నైతిక బలహీనతను ఎత్తి చూపినప్పుడు అతనికి ఎంతో కోపం వస్తుంది. ఎత్తి చూపే దానిలో వాస్తవం ఉన్నాసరే అతను అసహనానికి లోనవుతాడు. ఒకవేళ అతనిలో ఆ లోపం లేనప్పటికీ, 'ఉంది' అని చెప్పారనుకోండి, అతని పరిస్థితి ఎలా ఉంటుంది? అతను ఆగ్రహోదగ్రుడైపోతాడు.

ఉన్న లోపాన్నే ఎత్తిచూపటం వల్ల కోపం వస్తే, ఇక లేని లోపాన్ని ఉందని ఆరోపించినప్పుడు కోపం రాకుండా ఎలా ఉంటుంది?

ఇలాంటి బలహీనతలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు అయిన సృష్టికర్తను మనం లోపాలపుట్టగా మార్చేస్తే, దానికితోడు మరిన్ని కట్టుకథలు కూడా అల్లి ఆయనకు ఆపాదిస్తే, ఆయనకు సహాయపడటానికి మరికొంతమంది కూడా ఉన్నారని అపనింద మోపితే పరిస్థితి ఎంత దారుణంగా, వికృతంగా ఉంటుందో ఊహించండి .... ఈ వికృత చేష్టను దృష్టిలో పెట్టుకుని ఊహించాలి. ఊహించిన మీదట ఇలాంటి వెకిలి చేష్టను మానుకోవాల్సిన అవసరం ఉంది. అన్యధా సృష్టికర్త పట్టు నుండి ఎవరయినా కాపాడగలరా?

ఈ చేష్టపై మరో కోణం నుంచి కూడా ఆలోచిస్తే తెలుస్తుంది – ఈ వికృత చేష్టకు ఒడిగట్టినవాడు ఎంత నీచబుద్ధి కలవాడో. ఎందుకంటే అతను పరమ పునీతుడగు అస్తిత్వంలో దోషం ఉందన్న నింద మోపాడు. అతని ఈ చేష్ట నైతికంగా కడు హేయమైనదిగా భావించబడుతుంది. ఒక్కోసారి అపనిందతో కూడిన ఇలాంటి చేష్ట వల్ల దైవశాసనం కూడా తన చర్యకు ఉపక్రమిస్తుంది.

ఇక్కడ అమాయకత్వాన్ని, తెలియక చేసిన దానిని ఎవరూ పట్టించుకోరు. ఎంత వికృతమైన చేష్టకు ఒడిగట్టడం జరిగిందో, దానినే చూడటం జరుగుతుంది. ఒకవేళ అమాయకత్వం వల్ల చేయబడితే, దానిని సరిదిద్దుకుంటే, ఆ తప్పు తెలియక చేశారని అనుకోవచ్చు.

ఇక్కడ మనిషి దృష్టియందుంచుకోవలసిన మరో విషయమేమిటంటే; సృష్టికర్త తన జ్ఞానం, యుక్తి ప్రకారం మనుషుల పుట్టుకతో ఎన్నెన్నో అవసరాలను, గత్యంతరం లేని పరిస్థితులను కూడా పెనవేసి ముడివేశాడు. మరి ఆ ఇబ్బందులను తొలగించేవాడు, అవసరాలను తీర్చేవాడు కూడా ఆయనే. వారి జీవికకై కావలసిన ఏర్పాట్లను చేసేదీ ఆయనే.

మరైతే ఆ అవసరాలు, అగత్యాలు సృష్టికర్తలో కూడా ఉంటాయని

ఊహించటమే తప్పు. ఆయనైతే సృష్టికర్త. ప్రతిదానికి స్వామి, యజమాని. ఇలాంటి దౌర్బల్యాలకు ఆయన అతీతుడు, పవిత్రుడు. (మనుషుల మధ్య ఎన్నో లోపాలు, బలహీనతలను సృష్టికర్త ఉంచడంలో కూడా చాలా ముఖ్యమైన పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. వాటిని గురించి మేము తరువాత చర్చించనున్నాము).

**(2) సృష్టికర్త బలహీనుడా? లేక మన ఊహలోనే లోపం ఉందా? మరో కోణం నుంచి చూద్దాం .....**

సృష్టికర్తను లోపమున్న (Defective) వాడుగా చేసి, ఆయన్ని నమ్మి నడుచుకోవటం మూర్ఖత్వం. ఇదొక హాస్యాస్పదమైన (Absurd) పని. పనికిమాలిన పని. ఇలా చేయటం వల్ల సృష్టికర్తను కొలిచే ఉద్దేశ్యమే (Purpose) నెరవేరటం లేదు. ..... దీనివల్ల సన్మార్గమూ ప్రాప్తించటం లేదు, సహాయం కూడా అందటం లేదు. భక్తి శ్రద్ధలతో ఆయన ఎదుట వంగటానికి కూడా మనసొప్పదు. తీవ్రమైన వ్యాకులతకు లోనైన సందర్భంలో మనిషి కాస్సేపు సృష్టికర్తపై నమ్మకముంచితే ఉంచుతాడేమో, అంతే. కొందరు ప్రాపంచిక ఉద్దేశాలతో ఆయన్ని నమ్ముతారు. అంతేగాని అంతరంగంలో ఆయన పట్ల ఉండాల్సిన భక్తి శ్రద్ధలు ఉండవు. కారణం తెలిసిందే, ఆయన కూడా మనలాంటి బలహీనుడేనని తలపోయటం!

**(3) నిద్ర, కునుకు, విశ్రాంతి**

నిద్ర, కునుకు నిస్సహాయతకు తార్కాణం. కాబట్టి సృష్టికర్త అనేవాడు నిద్ర, కునుకు, అలసట వంటి బలహీనతలకు అతీతుడై ఉండటం చాలా అవసరం. ఎందుకంటే ఈ జగతి నిర్వహణకు ఈ బలహీనతలు ఉండకూడదు. ఈ బలహీనతలున్న వాడికి క్షణం క్షణం దాసుల స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుపడదు. ఎవరికయినా అలసట కలిగినప్పుడే నిద్ర అవసరంగానీ, విశ్రాంతి అవసరంగానీ ఏర్పడుతుంది. అలసట ఒక బలహీనత. సృష్టికర్త ఈ బలహీనత నుండి పరిశుద్ధుడై ఉండాలి.

కాగా; మన శారీరక వ్యవస్థ కొరకు 'అలసట' ఒక సహజ విషయం. బడలిక తీర్చుకుని హాయినొందడానికి విశ్రాంతి అవసరం. విశ్రాంతి లేకపోతే మనం నీరసించిపోతాం. నిద్రమత్తులోకి జారుకుంటాం. ఇది మన దౌర్బల్యం. మనల్ని చేసినవాడు ఇలాంటి దౌర్బల్యాలకు అతీతుడై ఉండాలి. ఎల్లవేళలా

ఆయన మనల్ని కనిపెట్టుకుని ఉండేందుకు ఈ అప్రమత్తత, జాగరణ చాలా అవసరం.

అనుక్షణం మారుతూ ఉండే పరిస్థితుల (Changing Phase) లో సమస్త జగతికి సంబంధించిన తరుణోపాయాలు, ఏర్పాట్లు చేయటం సాధారణ విషయం కాదు. దీనికోసం సృష్టికర్త ఎల్లవేళలా మేల్కొని ఉండాలి. అప్రమత్తంగా ఉండాలి. రెప్పపాటు సమయం కూడా అతను నిద్రించకూడదు, కునుకు తీయకూడదు. ఇంతటి బ్రహ్మాండమైన జగతి నిర్వాహకుడు (Administrator) ఇలాంటి దౌర్బల్యాలకు అతీతుడై ఉండటం అనివార్యం. అప్పుడే ఈ విశ్వవ్యవస్థ పరిపాలన (Administration) ఉత్తమ రీతిలో సాగుతుందని ఆశించవచ్చు.

నిద్ర, కునుకు ఎటువంటి బలహీనతలంటే రేయింబవళ్ళ జగతి నిర్వహణకు అవి సరిపడవు. అవి మనిషిని అలసత్వానికి గురిచేస్తాయి. నిద్ర ముంచుకు వచ్చినవాడు తాను స్వయంగా నిలబడి ఉండలేనప్పుడు ఇంత పెద్ద విశ్వాన్ని ఎలా నిలిపి ఉంచగలడు? ఇలాంటి బలహీనతలున్నవాడు సృష్టికర్త కాలేడు.

మనుషులమైన మనకు మిలియన్ లేక బిలియన్ సంవత్సరం ఒక సుదీర్ఘకాలం అనిపించవచ్చు. కాని సృష్టికర్తకు ఇదో పెద్ద వ్యవధి కానేకాదు. బిలియన్, ట్రిలియన్ సంవత్సరాల సమయం, దాని దూరం (Time Stretch) ఆయన దృష్టిలో ఎల్లవేళలా ఉంటుంది.

తన జీవన వ్యవస్థ (System) గురించి ఆయనకు తెలిసి ఉండాలి. మనిషికి స్వయంగా తన శారీరక వ్యవస్థ గురించి, అందలి సూక్ష్మ విషయాల గురించి, దాని పరమార్థాల గురించే తెలీదు. అలాంటప్పుడు సృష్టికర్త స్వభావం గురించి అతనికేం తెలుస్తుంది? అతనికి ఏ వస్తువుల అవసరం ఉంటుందో ఎలా చెప్పగలుగుతాడు?

నిర్వహణ, పాలనావ్యవస్థ సామాన్య విషయం కాదు, అనుక్షణం ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ ఉండాలి. ప్రతిదీ వినాలి, ఇది ఎడతెగకుండా సాగే శాశ్వతమైన వ్యాపకం.

**(4) ఆకలిదప్పులు**

మనిషికి అన్నపానీయాలు అవసరం. అవి లేకుంటే ఉండలేడు. పని

చేయలేడు. బ్రతకలేడు. అయితే సృష్టికర్త అనేవాడు ఈ బలహీనతలకు అతీతంగా ఉండాలి.

**బి. ఏకత్వం .... ఇది సృష్టికర్తలోని జ్యోతిర్మయమైన, పవిత్రమైన గుణం**

పరిపూర్ణుడైనవాడు, సమస్త దౌర్బల్యాలకు అతీతుడు, పవిత్రుడైనవాడే నిరపేక్షాపరుడు కాగలడు. అతనికి ఎవరి అవసరమూ ఉండకూడదు. ఎవరి అక్కరా లేకపోయినా అతను మిగిలి ఉండాలి. దీనినిబట్టి బోధపడిన విషయం ఏమిటంటే అక్కరలేనివాడు మాత్రమే ఒక్కడుగా, ఒంటరిగా ఉండగలుగుతాడు.

అన్ని లోపాలకు, దౌర్బల్యాలకు అతీతుడైనవాడే ఒకరి అండదండలు, సహాయ సహకారాలు లేకుండా మనగలుగుతాడు.

కాబట్టి సృష్టికర్త అయినవాడు సకల లోపాలకు, బలహీనతలకు అతీతుడూ, పవిత్రుడై ఉండాలి. సమస్త సద్గుణాల సమాహారమై ఉండాలి.

సృష్టికర్తకు వేరొకరు సహాయం చేయాల్సిన అగత్యం ఏర్పడకూడదు.

సహాయం అవసరమయిందంటే అర్థమేమిటి, సృష్టికర్త బలహీనుడనే కదా!

బలహీనుడు, దీనుడు అయినవాడు సృష్టికి కర్త కాలేడు.

బలహీనుడైనవాణ్ణి సృష్టికర్తగా నమ్మటమంటే బుద్ధీ వివేకాలను కించపరచటమే.

ఈ జగతి, అందలి జీవన వ్యవస్థ నిర్మించబడిన తీరు, అది నెలకొని ఉన్న వైనం చాటి చెప్పేదేమిటంటే సృష్టికర్తకు ఎటువంటి సహాయమూ అవసరం లేదు.

ఆయన అక్కర లేనివాడు గనక సకల సుగుణాలకు, అద్భుతాలకు, శక్తులకు ఆయన అధిపతి, స్వామి.

ఆయన అక్కరలేనివాడు గనక ఆయన ఒక్కడు, ఒంటరివాడు. పుట్టించడంలోగానీ, స్థాపించి ఉంచటంలోగానీ, పాలించటంలో పోషించటంలో గానీ ఆయనకు సహవర్తులు, సహాయకులు ఎవరూ లేరు. పుట్టించబడినవాడు సృష్టికర్త పనులలో సహాయపడటమేమిటి? ఎంత ధైర్యం ఈ మాట చెప్పటానికి!? ఒక సాధారణ పాలితుడు ఒక చక్రవర్తి గైకొనే నిర్ణయాలలో జోక్యం చేసుకుంటాడా?

## (1) సృష్టికర్త శక్తియుక్తుల గురించి క్షణకాలం యోచన చేస్తే .....

మిలియన్, బిలియన్‌ల కాంతి సంవత్సరాల (Light Years) దూరం (Distance), ఈ జగతి విస్తరణ (Magnitude), సుదూర కాలం (Time Stretch) పై సృష్టికర్త రాజ్యాధికారం విస్తరించి ఉండటం, ఆయన ప్రభుత ఉండటం, ప్రతి క్షణం ఉండటం –

ఇంత భారీస్థాయిలో ఏర్పాట్లు జరగటం, అదీ వేనవేల సంవత్సరాలుగా ఈ ఏర్పాట్లు నిరాటంకంగా సాగటం, అయినప్పటికీ ఎలాంటి అలసట, అనాసక్తత ఉండకపోవటం – ఇదంతా ఆయన ఘనత్వానికి, దైవత్వానికి సాక్షీభూతంగా ఉన్నాయి.

అంచనాలకు అందని ఈ అసాధారణ కార్యాలపై మానవుడు తన పరిమిత (Limited) జ్ఞానంతో, ఆలోచనలతో, అనుభవాలతో యోచన చేసినప్పుడు ఆశ్చర్యంలో మునిగిపోతాడు. ఈ ఆశ్చర్యానికి కారణం అతను తన పరిమిత జ్ఞానంతో ఆలోచించటమే. అతను తన పరిమితులు సృష్టికర్తకు కూడా వర్తిస్తాయని అనుకుంటాడు. తనలాగే సృష్టికర్తకు కూడా ఆ లోటుపాట్లను భర్తీ చేయడానికి సహాయకుల అవసరం ఉంటుందని భావిస్తాడు.

పుట్టించినవానికీ – పుట్టించబడిన వానికీ మధ్య భూమ్యాకాశాలంత వ్యత్యాసం ఉంటుంది. పుట్టించబడిన ప్రాణి బలహీనమై ఉంటుంది. అది ఒకరికి లోబడి ఉంటుంది. మరి అదే పుట్టించినవాడు, ఆయన అపార శక్తిమంతుడు, వివేచనా దురంధరుడు, అనన్య సామాన్యమయిన ప్రజ్ఞాశాలి అయి ఉంటాడు. అన్ని రకాల దోషాలకు లోపాలకు అతీతుడై ఉంటాడు. ఆయన స్వయం ప్రతిపత్తి కలవాడై ఉండటమేగాక, నిరపేక్షాపరుడై ఉంటాడు. ఆయన నిర్ణయాలు స్వయం నిర్ణయాలు (Self-Decisive) అయి ఉంటాయి. అవి స్వయం మార్గదర్శనం (Self-Guided) కలిగి ఉంటాయి. ఆయనకు ఏ విధంగా కూడా వేరొకరి సహాయం అవసరముండదు.

ఆశ్చర్యానికయినా, నిరాకరణకయినా కారణం ఒక్కటే – మానవుడు 'సృష్టికర్త'ను 'సృష్టితాల' స్థానంలో ఉంచి ఆలోచిస్తాడు. ఆయన బ్రహ్మాండమయిన శక్తిసామర్థ్యాలను, జ్ఞానాన్ని, యుక్తిని గురించి తన పరిమిత జ్ఞానపరిధిలోనే

ఊహిస్తాడు. తత్కారణంగా అతను సృష్టికర్తను బలహీనునిగా చేసి సృష్టితాల స్థాయి (Level) లోకి తెచ్చి నిలబెడతాడు. కేవలం ఒక్కగానొక్క వ్యక్తిత్వం ఇంత బ్రహ్మాండమయిన పనిని ఎలా నిర్వర్తించగలదు!? అని అనుకుంటాడు.

ప్రతి ఒక్క బాధ్యతను పోల్చి (Comparision) చూస్తున్నప్పుడు, లేదా పని యొక్క సంభావిత అంశాన్ని (Possibility) గురించి ఆలోచిస్తున్నప్పుడు వాటిని నిర్వర్తించేవారి స్థాయిని కూడా చూడాలి. ఉదాహరణకు : పెద్ద మనిషి తన శక్తికి తగినట్లుగా పనిభారం మోస్తాడు. అలాగే ఒక చిన్న పిల్లవాడు తన శక్తికి తగిన విధంగా బరువు ఎత్తుకుంటాడు. చిన్నపిల్లాడు పెద్ద మనిషి మోస్తున్న బరువును చూసి ఆశ్చర్యచకితుడు కావచ్చు. ఆ పెద్దాయన బరువును మోయడానికి, అతనికి సహాయపడటానికి మరి కొంతమంది పిల్లల అవసర ముందని తలపోస్తాడు.

మానవుడు సృష్టికర్త విషయమై ఆలోచించినప్పుడు, ఊహించినప్పుడు అతని దృష్టిలో ఈ జగతిలోని సృష్టితాలు ఉంటాయి. అతను స్వయంగా సృష్టితాలలోనివాడే. అతని చుట్టు ప్రక్కల కూడా ఎన్నో జీవరాశులుంటాయి. కాబట్టి అతని ఊహ (Imagination) సృష్టితాల వరకే పరిమితమై ఉంటుంది. కనుక తన గురించి సృష్టికర్తే పరిచయం బాగా చేసుకుంటాడు. వేరొకరు ఆయన గురించి సరిగ్గా పరిచయం చేయలేరు. కాబట్టి సృష్టికర్త తన పరిచయం తానే చేసుకోవాలి. ఎందుకంటే సృష్టికర్త యొక్క సరైన, సమగ్రమయిన పరిచయం మానవుని ప్రాథమిక అవసరం. దానిని నెరవేర్చటం సృష్టికర్త ప్రథమ కర్తవ్యం.

జ్ఞాన సంపన్నుడే పరిపాలించగలుగుతాడు. ఆయన దైవత్వమే ఈ విశ్వంపై నడవగలదు.

పుట్టించినవాడే పరిజ్ఞాని కూడా అయి ఉంటాడు. అందుచేత ఆయనకే పాలనా దక్షత ఉంటుంది.

సృష్టిప్రక్రియ గురించి తెలియనివాడు, దాని నియమ నిబంధనల పరిజ్ఞానం లేనివాడు విశ్వసార్వభౌమత్వానికి అధిపతి ఎలా కాగలడు? ఆయన ఏవిధంగా సృష్టికర్తకు తోడ్పడగలడు?

అదలావుంచితే, నిజంగా సృష్టికర్తకు సహాయం అవసరమా? ఆయన పుట్టించగలడుగాని, పాలనా పోషణా బాధ్యతలను నిర్వర్తించలేనంత అశక్తుడా – వేరొకరి సహాయం తీసుకోవడానికి?

సృష్టికర్త ప్రతి ప్రాణినీ కొన్ని విధాలుగా బలహీనంగానే ఉంచాడు. మరికొన్ని విధాలుగా బలవంతంగా ఉంచాడు. వాటిలో లోపాలతోపాటు ప్రత్యేకతలు కూడా పొందుపరిచాడు. అది ఆయన యుక్తిలో అంతర్భాగం. కాబట్టి ఏ ప్రాణి లేక ఏ మనిషి కూడా స్వయం నిర్ణయాధికారి లేక నిరపేక్షాపరుడు కాజాలడు. కేవలం ఒక్క సృష్టికర్త మాత్రమే స్వయం నిర్ణయాధికారి, నిరపేక్షాపరుడు. కాబట్టి సృష్టితాలు సృష్టికర్త వంటివి కాజాలవు. అశక్తులైన వారికి, ఒండొకరిపై ఆధారపడే వారికి సహాయం అవసరమవుతుంది. వారు సతతం వేరొకరి దయాదాక్షిణ్యాలపై, తోడ్పాటుపై ఆధారపడి జీవిస్తూ ఉంటారు. అయితే పరిపూర్ణుడు, ఏ దోషమూ లేనివారికి వేరొకరిపై డిపెండ్ కావలసిన అగత్యం ఎక్కడుంటుంది? ఇది కేవలం మన ఊహల్లో ఉన్న వెలితి మాత్రమే. మనం ఎంతసేపటికీ సృష్టికర్తను కూడా సృష్టితాల వంటి వాడుగానే ఊహించుకుని, పప్పులో కాలేస్తూ ఉంటాము. ఆయనకు ఇతరుల సహాయం అవసరమని అనుకుంటూ ఉంటాము.

### (2) ఒకే నిర్వహణకర్త

ఏదేని ఒక సంస్థ లేక దేశ పరిపాలనా వ్యవస్థ సజావుగా సాగాలంటే దానికి కేవలం ఒకే పరిపాలకుడు (Administrator) ఉండాలి. ఇది అందరూ అంగీకరించే వాస్తవం. నిత్య జీవితంలో ఈ విషయాన్ని అందరూ గమనిస్తూనే ఉంటారు.

సృష్టికర్త సృష్టి ప్రక్రియను, దానిని మిగిల్చి ఉంచే ఏర్పాట్లను తాను ఒక్కడే చేయాలి. ఎందుకంటే ఆయన చేసిన రూపకల్పనలో, ఏర్పాట్లలో వేరితరులు గనక జోక్యం చేసుకుంటే, దాని ఉద్దేశ్యమే నిర్వీర్యమైపోతుంది.

సృష్టికర్త కూడా సృష్టితాల వంటివాడేనని ఊహించటం, పిదప సృష్టితాల లోని లోపాలన్నింటినీ సృష్టికర్త మీద వేయటం తప్పు.

విశ్వ వ్యవస్థను వివిధ విభాగాలుగా విభజించి, ప్రతి దానికోసం ఒక ప్రతినిధి (Assign) ని ప్రతిపాదించటం, దీనికి ప్రపంచ పరిపాలనా విభాగాల ఉపమానం ఇవ్వటం – ఇదంతా ఏమిటి? ఇది ఒకవిధంగా సృష్టికర్తలో సృష్టితాల లోపాలను జొప్పించటమే. ఆయన ఈ జగతి నిర్మాణమైతే చేశాడుగాని ఒంటరిగా దానిని నడపటం ఆయనకు చేతకాదని, ఆయనకు సహాయకుల అవసరం ఉందని పరోక్షంగా నిరూపించేందుకు యత్నించడమే! మానవుడు బలహీనుడు.

కాబట్టి అతను ఒక్కడే పరిపాలనా వ్యవహారాలు చూడలేడు. కాబట్టి అతనికి సహాయకుల, మంత్రుల అవసరం ఏర్పడుతుంది. ఇలాంటి అవసరాన్నే సృష్టికర్తకు కూడా ఊహించటం అంటే దేవుడు కూడా బలహీనుడని ఒప్పుకున్నట్లేగా!

కేవలం ఒక్కణ్ణే సేవించాలని, ఒక్కనికే విధేయత చూపాలని మానవ నైజం వాంఛిస్తుంది. ఎందుకంటే మానవ వ్యక్తిత్వం ఒక యూనిట్ (Unit) వంటిది. అతని శరీర మండలంలోని అవయవాలన్నీ ఒండొకదానిపై ఆధారపడి (Interdependent) ఉన్నాయి. అందువల్ల అవి ఒక్కని ఆజ్ఞలే శిరసావహించగలవు. శిరసావహిస్తున్నాయి కూడా. ఒకే ఆజ్ఞపై కదులు తున్నాయి. పూర్తి సమన్వయంతో, సహకారం (Co-ordination, Co-operation) తో పనిచేస్తున్నాయి. అందువల్ల అవి ఒక్కడినే సేవిస్తున్నాయి. ఒక్కని విధేయతకే కట్టుబడి ఉన్నాయి. అంటే, మొత్తం శరీరం ఒక్కడినే ఆరాధించగలదు, ఒక్కనికే విధేయత చూపగలదు. ఇక పూర్తి శరీరం, శరీరంలోని విభాగాలు మరియు జీవితపు పూర్తి వ్యవధి ఒక Unit స్థాయిని కలిగి ఉన్నాయి. అందువల్ల పూర్తి జీవితంలో ఒక్కని ఆరాధనే సంభవం.

ఆయన శక్తి ఎంత గొప్పదంటే ఆయన చేసిన ప్రతిదీ పరిపూర్ణంగా, ఉదాహరణప్రాయంగా ఉంది. ఇది కూడా ఆయనలోని పరిపూర్ణతకు ప్రబల తార్కాణమే.

నేడు సైన్సు ద్వారా వెలుగులోకి వస్తున్న వాస్తవాలను చూసి బుద్ధి కూడా హైరానా చెందుతోంది. జీవిత చట్టాలు (Laws) మానవుల్లో, జంతువుల్లో, వృక్షాలలో .... జగతిలోని ప్రతి వ్యవస్థలో ..... గాలి, నీరు, సూర్యుడు, జీవితపు క్రమ వికాస నియమాలు (Laws of Growth) గురించి సైన్సు చేస్తున్న ఆవిష్కరణలు, వాటి పరిణతి (Perfection) ని, వాటి మధ్య గల సంఘీభావాన్ని (Integration) చూసినప్పుడు ఆశ్చర్యం కలగకుండా ఉండదు. ఈ పరిపూర్ణ స్థితి ఒకే ఒక్కని పరిపూర్ణత (Oneness with Perfection) కు సాక్షీభూతంగా ఉన్నాయి. ప్రతి జీవితం, ప్రతి వ్యవస్థ యొక్క సృష్టికర్త, పాలకుడు వేర్వేరుగా ఉండరు. దీనికి ఒకే ప్రణాళిక ఉండాలి. ఒకే ఒక్కని సంకల్పం ఉండాలి. కాబట్టి ఈ విశ్వమండలమంతా ఒకే ఏకాంకం (Unit).

**(3) కారకాలతో నిమిత్తం లేకుండా కార్యనిర్వహణ చేసేవాడే సృష్టికర్త**

ఎటూ కదలకుండా ఉన్నచోటి నుండే పనులన్నీ చేసేవాడే సామ్రాట్టు.

సృష్టికర్త ఈ విశ్వాన్ని నిర్మించినప్పుడు నిర్మాణ సామగ్రి (Material) గానీ, ఉత్పత్తి కారకాలుగానీ ఉన్నాయా? వీటన్నింటినీ చేయడానికి ఆయన కఠోరంగా శ్రమించవలసి వచ్చిందా? కారకాల అక్కరలేనివాడే సృష్టికర్త. ఆయన దేనికోసమైనా ఒకసారి సంకల్పించుకుని ఆజ్ఞాపిస్తే చాలు, అది ఉనికిలోకి వచ్చి తీరాల్సిందే. ఒక్క ఆజ్ఞతో ఆయన శూన్యం నుండి అస్తిత్వాన్ని తేగలగాలి.

**(4) సర్వత్రా సమన్వయం, సంఘీభావం**

జగతిలోని శాసనాలు, పరిసరాలలోని పర్యావరణ నియమాలు గనక మానవ శరీర మండలంలోని శాసనాలతో కచ్చితంగా ఇమడక (Exactly Fitting)పోతే, మానవ మనుగడే సాధ్యం కాదు. దీనినిబట్టి విదితమయ్యేదే మిటంటే; రెండింటినీ చేసిన మీదట, ఆ రెండింటి మధ్య పరస్పర అవినాభావ సంబంధాన్ని ఏర్పరచే శాసనాలను నిర్మించినవాడు కూడా ఒక్కడే అయి ఉండాలి.

**(5) లక్ష్య నిబద్ధత ఉండటం**

ఏదైనా వస్తువును నిర్మించటంలో గల ఒక సహజమైన, అంగీకృతమైన యదార్థం (Accepted Fact) ఏమిటంటే, ఒకే వ్యక్తి యొక్క పథకం (Planning), సంకల్పం ఆ వస్తువుకు నిర్మాణంలోని లక్ష్యాన్ని నెరవేర్చటంలో దోహదకారి కాగలుగుతుంది.

**(6) జగతి పాలనా వ్యవస్థ ఇస్తున్న సాక్ష్యం**

విశ్వంలో ఉన్న ప్రతి వస్తువు, ప్రతి జీవితాన్ని ప్రతి క్షణం కనిపెట్టుకుని ఉండటం, వాటికి కావలసిన వాటిని సమకూర్చటం – ఇదంతా నిత్య సజీవుడు, సకల చరాచర సృష్టికి మూలాధారం అయినవాడే చేయగలడు.

**(7) పనుల చిక్కు – విస్తృతి**

అంతర్గత చిక్కులతో పాటు విస్తృతి, అంతర్గత సంపర్కం, అంతర్గతంగా ఒండొకదానిని ప్రభావితం చేసే సంఘటనలు (Inter Mingled, Inter-dependent, Inter - Influence Happenings), పనులు, ఎంతో చక్కగా, సాఫీగా (Smoothly) నిర్వర్తించబడుతున్నాయి. దీనికోసం జ్ఞానం, వివేచన, సృష్టితాల పట్ల ప్రేమ,

జాలి, అధికారం, విధేయత నిరంతరాయంగా సక్రియం (In action) గా ఉండవలసిన ఆవశ్యకత ఉంది. అదీ ఎలా? ప్రతిదీ తమ తమ కక్ష్యలో ఉంటూ, ఎలాంటి జోక్యం చేసుకోకుండా సజావుగా పని చేసినప్పుడే ఈ వ్యవస్థ సాఫీగా సాగుతుంది. ఈ పనులన్నింటి వెనుక ఒకానొక బ్రహ్మాండమయిన శక్తి లేకుండా ఇది సాధ్యపడదు.

పుట్టించిన వానికే తాను సృజించిన వస్తువులను నిర్దేశించే, శాసించే హక్కు ఉంటుంది. వేరితరులకు వాటిపై ఎలాంటి హక్కు, అధికారం ఉండదు, ఉండకూడదు.

ఈ విశ్వాన్ని నిర్మించినవాడు ఒక్కడేనని, ఆయన తప్ప వేరెవరూ లేరని ప్రాథమిక చర్చలో మనం తెలుసుకున్నాం.

నిర్మాతే లేనపుడు, మరి ఇంత పెద్ద వ్యవస్థను నడిపే ప్రతిభ, శక్తి, దక్షత ఇతరుల్లో ఎలా ఉంటుంది? దాని నిర్మాతలోనే ఈ ప్రతిభ ఉంటుంది. మరలాంటప్పుడు అన్యులు ఈ పరిపాలనా వ్యవస్థలో సృష్టికర్తకు ఎలా తోడ్పడగలుగుతారు?

సృష్టించినవాడే దానికి స్వామి, యజమాని కాగలడు. అతనికే దానిపై యాజమాన్య హక్కు, అధికారం ఉంటుంది. దానిని ఆయన తాను కోరినవిధంగా ఉపయోగించుకోగలడు. సృష్టించింది ఆయనే గనక, ఆయనే దానిని నిలిపి ఉంచగలడు. నిలిపి ఉంచడంలో వేరొకరి సహాయం ఆయనకు అవసరం ఉండదు. జీవితం ప్రసాదించినపుడు జీవనాన్ని నిలిపి ఉంచటంలో వేరొకరి అండదండల అవసరమేముంటుంది?

మన జీవితం సృష్టికర్త సజీవుడని సూచిస్తున్నట్లే, ఈ మిశ్రమ (Complex), సంక్లిష్ట (Complicated) పరస్పరం ఒండొకదానిపై ఆధారభూతం (Inter - Dependent and Dependent) అయి ఉన్న జీవన వ్యవస్థ, విశ్వ వ్యవస్థ కూడా ఆ మహోన్నతుని జ్ఞానానికి, యుక్తికి, అధికారానికి సంకేతంగా ఉన్నాయి.

ఉనికిలో ఉన్న ప్రతిదానినీ, ప్రతి ప్రాణినీ ప్రతి క్షణం కనిపెట్టుకుని ఉండటం, వాటికి కావలసివన్నీ సమకూర్చటం సామాన్య విషయం కాదు. అసాధారణమయిన శక్తియుక్తులు కలవాడే ఇదంతా చేయగలడు.

సృష్టికర్త – సృష్టితాల స్వభావం ఒండొకదానికి భిన్నంగా ఉండాలి. సృష్టితాల (ప్రాణుల, మనుషుల) స్వభావంలోనే మనకెంతో భిన్నత్వం కనిపిస్తూ

ఉంటుంది. ఒకవేళ సృష్టికర్తకు కూడా భార్య ఉంటుందని మనం ఊహించే మాటైతే సృష్టికర్త స్వభావం కూడా మనిషి స్వభావంకన్నా భిన్నమైంది కాదని, మనిషి మాదిరిగానే సృష్టికర్తలో కూడా బలహీనతలు ఉంటాయని భావించి నట్లేకదా!

ఈ భావన వెర్రితలలు వేస్తుంది. దేవునికి సంతానాన్ని, కుటుంబాన్ని కల్పిస్తుంది. వంశపరంపరకు తావు కల్పిస్తుంది. అంటే సృష్టికర్తకు మరణం ఉంది, ఆయనకు తన వంశాన్ని కాపాడుకోవలసి ఉందన్న ఆలోచనకు తావునిస్తుంది. ఇంతకూ అంతమయ్యేదానికి సృష్టికర్త అయ్యే అర్హత లేదు. ఆయన సృష్టికర్తే అయినట్లయితే ఆయనకు అంతం ఉండదు. అంతం లేనివానికి సంతానం అవసరముండదు. సంతానం మనిషికి అవసరం. ఎందుకంటే అతనికి చావు ఉంది గనక. అలాగే లైంగిక అవసరం మానవ సహజ అవసరం, అది అతని బలహీనత. కాగా; సృష్టికర్త ఈ అవసరానికి, బలహీనతకి అతీతుడు, పవిత్రుడు.

## (8) దేవుని సహాయకుడు!?

మనిషికి సహాయకుల అవసరం ఉన్నట్లే (ఎందుకంటే అతను పలు విధాలుగా, పలు కోణాల నుండి బలహీనుడు) సృష్టికర్తకు కూడా ఉంటుందని ఊహాగానాలు చేయటం, ఆయన 'ఒక్కడే' కాబట్టి సహాయకుల అవసరం ఉంటుందని కాకిలెక్కలు వేయటం ఒకవిధంగా సృష్టికర్తలో బలహీనతలను జొప్పించటమే. సృష్టికర్తను బలహీనపరచటమంటే అది కించపరిచే విషయమే.

అదీగాక పుట్టించబడిన వారు సృష్టికర్త వంటివారు గానీ, ఆయనకు సమ ఉజ్జీలుగానీ కాలేరు. అలాంటప్పుడు వారు ఆయనకు ఏ విధంగా సహాయపడగలుగుతారు?

సృష్టికర్త ఎవరయినా ఒక వ్యక్తిత్వంపై ఆధారపడటం లేదా పరస్పరం ఒకరింకొకరిపై ఆధారపడటం (Dependent / Inter - Dependent) అంటే అర్థం, ఆయనలో ఏదో లోపం ఉందన్నమాట! ఇది దైవిక గుణంతో పొసగదు. దైవిక గుణం ఏమిటంటే; సృష్టికర్త అనేవాడు సర్వవిధాలా స్వతంత్రుడు, నిరపేక్షాపరుడై ఉండాలి. అంటే ఆయన సర్వశక్తుడు, సమస్త సుగుణాల నిధి అయి ఉండాలి. ఏ విధంగానూ వేరొకరిపై డిపెండ్ అవవలసిన పరిస్థితి ఉండకూడదు. ఆయన గైకొనే నిర్ణయాలకు అడ్డూ ఆపూ ఉండకూడదు. ఆయనకు ఎవరికీ జవాబు

చెప్పుకోవలసిన అగత్యం కూడా ఉండకూడదు. ఆయన నిర్ణయాలను సవాలు చేసేందుకుగానీ, మార్చేందుకుగానీ ఎవరూ సాహసించకూడదు.

## (9) సృష్టికర్త కుటుంబం

(Exploring the possibilities of the Family concept)

ఇంతకీ ఏ కుటుంబ భావన మనో మస్తిష్కాలకు సంతృప్తినిస్తుందో పరిశీలిద్దాం. సృష్టికర్తకు అన్నదమ్ములుగానీ, ఆలుబిడ్డలుగానీ, తల్లిదండ్రులుగానీ ఉండరాదని బుద్ధి ఘోషిస్తుంది. ఎందుకంటే ఈ రకమయిన ఆలోచన కుటుంబ భావన (Concept) కు జన్మనిస్తుంది. – అంటే సృష్టికర్త కూడా పుట్టినవాడే, ఆయనకూ తల్లీ తండ్రీ ఉన్నారు! పుట్టడం ఒక దౌర్బల్యం. సృష్టికర్త కూడా ఒకప్పుడు ఏమీ లేడు. శూన్యం నుండి వచ్చినవాడే. ఆయన జీవితం కూడా ఆయన స్వయానిది (Self) కాదు. ఆయన పుట్టుకకు తల్లిదండ్రులు కారకులయ్యారు. పుట్టాడంటే ఇక చావు కూడా ఉందన్నమాటే! వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది – అంటే సృష్టికర్త వంటి మహోన్నతుడైన, పరమ పవిత్రుడయిన అస్తిత్వాన్ని లోపాలపుట్టగా భావించినట్లయింది. ఈ విషయాన్ని మరికొన్ని కోణాల నుండి కూడా చూద్దాం –

### (అ) మొదటి దృక్పథం – 'ఏకత్వం'

సృష్టికర్తలోని అత్యంత ఘనమయిన, ప్రస్ఫుటమయిన, విశిష్ఠమయిన గుణం 'ఏకత్వం'. ఆయన ఒక్కడు, అద్వితీయుడు. ఈ గుణం ప్రాథమిక చర్చలో కూడా ప్రస్ఫుటం అయ్యింది. ఈ జగతికి ఒక కర్త ఉన్నాడు. నిర్మాత లేకుండా ఇది దానంతటదే ఉనికిలోకి రాలేదు. ఈ జగతి ఉండేది కాదు. మానవుడు కూడా లేడు. ఇతర జీవరాశులు కూడా లేవు. అయితే సృష్టికర్త మాత్రం ఉన్నాడు. ఆయన ఈ బ్రహ్మాండమయిన విశ్వకర్మాగారాన్ని నిర్మించాడు. భూమ్యాకాశాలను నిర్మించాడు. సూర్యచంద్ర నక్షత్రాదులను చేశాడు. భూమండలంపై మానవునితో సహా ఎన్నెన్నో ప్రాణులను పుట్టించాడు. సమస్త జగతిని నిలిపి ఉంచాడు. విశ్వంలోని జీవులన్నింటికీ కావలసిన వాటిని సమకూర్చి ఉన్నాడు.

సృష్టికర్త జీవితం అనంతమైనది. అది మన ఆలోచనలకు అందనిది. ఆయన జీవిత పొడవు వెడల్పుల గురించి మనం ఊహించనయినాలేము. అది మన మేధకు అందని విషయం. ఆయనకు మరణం లేదు. మరణం లేక

వినాశం కూడా ఒక పెద్ద లోపమే. అది కూడా అశక్తతకు నిదర్శనమే. సృష్టికర్త అనేవాడు దీనికి అతీతంగా ఉండాలి. కాబట్టి ఏమీ లేనప్పుడు కూడా ఆయన ఉన్నాడు. ఏమీ మిగలనప్పుడు కూడా ఆయన ఉంటాడు. అందువల్ల ఇప్పటి వరకూ వచ్చిపోయినవారు, వచ్చిపోబోతున్నవాళ్లు – అందరూ సృష్టితాలే. వారి జీవితం సృష్టికర్త ప్రసాదితమే. అవి నిర్ణీత వ్యవధి వరకే ఉంటాయి. పరిమితమయిన ప్రతిభతో కూడుకుని ఉంటాయి. అవి అశక్తతతో కూడుకున్నవి. సతతం వేరొకరిపై ఆధారపడినవి. అవి తమంతట తాముగా ఉనికిలోకి రాలేదు. తమంతట తాముగా అంతం కూడా కావు. ఉనికి ప్రసాదించకపూర్వం వాటి పేరూ ఊరూ ఏదీ లేదు. ఉనికి ప్రసాదించాకే వారు గుర్తింపు పొందారు. ఉనికి అంతమయ్యాక వారి పేరు ప్రతిష్ఠలు కూడా క్రమక్రమంగా విస్మరణకు గురవుతాయి.

## (ఆ) రెండవ దృక్పథం – ఎందరో సృష్టికర్తలు

ఏమిటి, ఎందరో సృష్టికర్తలు కలసి ఈ జగతిని నిర్మించారా? అంటే జగతి ఏర్పడకముందే ఎందరో సృష్టికర్తలు ఉన్నారు. వారంతా కలసి వ్యూహరచన చేశారు. మనిషిని, మరెన్నో జీవరాశులను కూడా వాళ్ళే సృష్టించారు.

దీని అర్థమేమిటంటే అందరూ ఒకే స్థాయి (Level) కి చెందినవారు, ఒకే జాతికి చెందినవారు, ఒకే శక్తి కలవారు. మరలాంటప్పుడు వారి పరస్పర సంబంధం ఎట్టిది? వారు అన్నదమ్ములా? సృష్టికర్తతో అనుబంధం ఉన్న ఒకే తల్లిదండ్రుల సంతానమా? ఇలాంటి సంతానం ఎంతమంది? సృష్టికర్తకు సంతానం ఉందని అంటే, ఆయనకు బలహీనతను ఆపాదించటమే. అంటే మొదట్లో వారికంటూ ఒక ఉనికి లేదు. పిదప వారు పుట్టారు. పెరిగి పెద్దవారయ్యారు. బలవంతులయ్యారు. తరువాత బలహీనులై అంతమైపోతారు.

ఎందరో దేవుళ్ళు వారంతటవారే ఉనికిలోకి వచ్చారని అనుకుంటే లేదా వారి ఉనికి సుదీర్ఘకాలంగా ఉందని, వారంతా కలసి జగతిని నిర్మించే పథకం రచించారని, జగతిని నిర్మించారని, పిదప మనిషిని కూడా చేశారని భావిస్తే ..... దీని భావం వారంతా ఒకే కోవకు చెందినవారన్నమాట! వారందరికీ ఒకరింకొకరి అవసరం ఉందన్నమాట!! అంటే అందరూ బలహీనులేనన్నమాట! వారంతా పరస్పరం ఆధారపడి ఉన్నారన్నమాట! వారిలో ఎవరూ స్వతంత్రుడు (Independent) కాదు, స్వతంత్ర నిర్ణయాలు గైకొనలేదు. ఇప్పుడు మనిషికి

ఉత్పన్నమయ్యే ప్రశ్న ఏమిటంటే, వారందరినీ పూజించాలా? అందరినీ మెప్పించాలా? అందరి అభీష్టం ప్రకారం నడుచుకోవాలా? అందరి అభీష్టం ఏమిటో తెలుసుకుంటూ ఉండాలా? సహాయం కొరకు అందరినీ అర్థించాలా? మరోవైపు మనిషి పెట్టుకునే మొరలపై సృష్టికర్తలంతా సమావేశమై, నిర్ణయం గైకొనవలసి ఉంటుంది. ఎందుకంటే వారంతా స్వతంత్రులు కారు. నిర్ణయాలకై పరస్పరం ఆధారపడి (Inter - Dependent) ఉన్నారు. కనుక వారంతా నిస్సహాయులు, అశక్తులు. వారిలో ఎవరన్నా ఒకరు మొరను ఆలకించి ఆమోదిస్తే రెండవవాని నిర్ణయం, ప్రణాళిక (Planning) ప్రభావితం అవుతుంది.

ఎందరో దేవుళ్ళను అంగీకరించినట్లయితే మరి వారంతా ఒకే జాతికి, ఒకే వంశానికి చెందినవారై ఉండాలి. ఈ భావన మస్తిష్కాన్ని ఒకానొక వంశపరంపర వైపునకు తీసుకుపోతుంది. వంశ పరంపర ముందుకు సాగిందంటే అది జనన మరణాల బలహీనతల వైపునకు కూడా మనసును గొనిపోతుంది. ఈ బలహీనతలు పెట్టుకుని దైవత్వం సాధ్యం కాదు. లోపాలు బలహీనతలతో పాటు దైవత్వాన్ని అంగీకరించడానికి బుద్ధి ఒప్పుకోదు!

ఒకవేళ బహుదైవాలు ఉండేటట్లయితే ఆ ఒక్క వంశం లేక ఆ ఒక్క జాతికి చెందినవారే అయి ఉండాలి. జిన్ను వంశీయుడుగానీ, దైవదూత కోవకు చెందినవాడుగానీ, మానవ జాతికి చెందినవాడు గానీ దైవం కాలేడు. ..... మానవ ప్రభుత్వాలలో ఉండే ఎందరో మంత్రులు (Ministers) లేదా పరిపాలనాధికారులు (Administrators) మనుజ జాతి నుండి వచ్చిన వారే అయి ఉంటారు.

### (ఇ) మూడవ దృక్పథం కుటుంబానిది : సృష్టికర్త సంతానం

సృష్టికర్తకు కొడుకు ఉండేమాటైతే అతను కూడా అచ్చం సృష్టికర్త మాదిరిగానే ఉండాలి. ఆయన జాతికే చెందినవాడై ఉండాలి. సృష్టికర్త గుణగణాలే అతనికీ ఉండాలి. లోపాలకు అతీతుడై ఉండాలి. సృష్టికర్త లాగానే ఎవరికీ కనబడనివాడై ఉండాలి. ఒకవేళ ఆ కొడుకు సృష్టికర్తలా లేకుంటే అతను మనలాంటి ప్రాణియే. సృష్టికర్త జాతికి చెందినవాడు, ఆయనకు పుట్టినవాడూ కాడు. మానవులుగానీ, దైవదూతలు గానీ సృష్టికర్త జాతికి చెందినవారు కాదు కదా! అందుచేత వారు ఆయన కొడుకులు, కూతుళ్ళు కాలేరు, కేవలం సృష్టితాలు మాత్రమే.

**(ఈ) కుటుంబానికి సంబంధించిన ఇంకొక కోణం : భార్య ఉంటే ....**

సృష్టికర్తకు భార్య ఉందనే భావన కూడా మనిషి మెదడును తొలచివేసి, సృష్టికర్త అత్తవారింటి సంబంధాల గురించి పరి పరి విధాలుగా ఆలోచింప జేస్తుంది. లేదా సృష్టికర్త జాతి మాదిరిగానే మరికొన్ని జాతుల కుటుంబాలు కూడా ఉండి ఉంటాయి. వాటిలో నుంచి సృష్టికర్త తనకు నచ్చిన ఆమెను భార్యగా ఎంపిక చేసుకుంటాడు. అంటే సృష్టికర్త జాతికి చెందిన ఆవిడ మాత్రమే నిజభావంలో ఆయన దాంపత్య జీవితానికి అర్హురాలు కాగలదు. ఈ విధంగా ఆలోచిస్తూపోతే సృష్టికర్త జాతి వలెనే మరికొన్ని కుటుంబాలు కూడా ఉన్నాయి. అంటే అత్తవారి కుటుంబం మాదిరిగా! ఇంతకీ అదేది? ఎలా ఉంటుంది? ఏం చేస్తుంది? దైవత్వంలో దానికేదైనా భాగస్వామ్యం ఉందా? ఈ కుటుంబం ఎంత పెద్దది? అది ఎప్పటి నుంచి ఉంది? లాంటి ప్రశ్నలు జనిస్తాయి.

అనంతమయిన ఈ కాల గమనంలో సృష్టికర్తకు ఎంతమంది పిల్లలు పుట్టారు? పిల్లలు పుట్టారనగానే మళ్లీ అదే బలహీనత! అంటే ఒకప్పుడు వారు లేరు. తరువాత పుట్టారు. పుట్టిన విధానాన్ని బట్టి ఒక అస్తిత్వం బదిలీ (Transfer) అయిందని తెలిసిపోతుంది. ఈ పుట్టుక పద్ధతి ఒక బలహీన పద్ధతి. అశక్తతకు ప్రతిబింబంగా ఉన్న పద్ధతి. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే పిల్లలెలా పుట్టారో వారి సృష్టికర్త కూడా అలాగే పుట్టాడు! దీనినిబట్టి పిల్లల్లో ఉన్న బలహీనతలే సృష్టికర్తలో కూడా ఉన్నాయని విదితమవుతోంది – అది అదే జాతి గనక!

ఒకవేళ సృష్టికర్త తన సృష్టితాల (మనుషుల) లో నుండే ఒక స్త్రీని తన భార్యగా చేసుకున్నాడని అనుకుంటే ఇది పొసగే విషయం కాదు. ఎందుకంటే ఇది అసహజమైన సంబంధం అవుతుంది. ఎందుకంటే ఒక కోవకు చెందిన ప్రాణులు మరో కోవకు చెందిన ప్రాణులతో లైంగిక (Sexual) వాంఛ తీర్చుకోవు. మరలాంటప్పుడు సృష్టికర్తకి – సృష్టితాలకి మధ్య ఎలా ఈ దాంపత్య సంబంధం ఏర్పడుతుంది? సృష్టికర్త విశిష్ఠత ఏమిటంటే, ఆయన తనచే సృష్టించబడిన వాటిని ఉన్నత స్థాయి నుంచి చూస్తాడు. వాటిని తనచే సృష్టించబడిన వస్తువుగానే చూస్తాడు. .... అనుక్షణం వాటిని దయాదృష్టితో చూస్తాడు. వాటికి సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటాడు. వాటికి కావలసిన జీవితావసరాలను సమకూర్చి, వాటిని మిగిల్చి ఉంచే ధ్యాసలో ఉంటాడు. వాటికి మార్గదర్శనం చేయాల్సిన ఆవశ్యకత ఉందనే దృష్టికోణంతో చూస్తాడు.

ఈ తార్కిక చర్చ వల్ల తేలిందేమంటే; ఆయనకు భార్య ఉందనే భావన కూడా తప్పే. ఆ అస్తిత్వం ఒక్కటే అనే భావనే (Concept) సరయినది. ఏ కోణం నుంచి చూసినా, యోచన చేసినా ఆయన తన వ్యక్తిత్వంలో ఒక్కడు, ఒంటరివాడు (Single Personality Concept)

సృష్టికర్తకు భార్యాబిడ్డలున్నారనే దృక్పథం సృష్టికర్తకు లోపాలు అంటగడుతుంది. .... లైంగిక (Sexual) వాంఛగానీ, సంతాన ఆవశ్యకత గానీ ఎప్పుడు ఉంటుంది? తండ్రి జీవితం పరిమితమైంది అనుకున్నప్పుడే కదా! అంటే సృష్టికర్త జీవిత వ్యవధి పరిమితమైనది (Limited). మళ్ళీ అదే లోపాన్ని సృష్టికర్తకు కూడా ఆపాదిస్తే ఎలా? అలాంటి లోపాలు గల సృష్టికర్తను నమ్మి నడుచుకోవటం వల్ల ఒరిగేదేమిటి?

తేలిందేమిటంటే బ్రహ్మాండమయిన ఈ విశ్వ కర్మాగారాన్ని సృష్టించి, దానిని అద్భుతంగా నడిపే సృష్టికర్త స్వభావానికి పెళ్ళి పెటాకులు, సంతానోత్పత్తి ఎంతమాత్రం సరిపడవు, శోభించవు.

ఈ చర్చవల్ల తేలిందేమిటంటే ఆయన ఒక్కడే అయి ఉండాలి. సర్వవిధాలా ఉన్నతుడు, సకల దోషాలకు అతీతుడు, పవిత్రుడు అయి ఉండాలి. ఆయనకు ఎప్పుడూ, ఏ పనికోసమయినా, ఏ విధంగా కూడా వేరొకరి తోడ్పాటు అవసరం ఉండకూడదు – సృష్టిక్రియలోగానీ, పాలనలో పోషణలోగాని!

ఆయన వంటివాడు గానీ, ఆయన్ని పోలిన కుటుంబంగానీ ఉండరాదు. ఆయనకు తల్లిదండ్రులుగానీ, భార్యాబిడ్డలుగానీ ఉండకూడదు. ఆయన తన స్థాయిలో ఒకే ఒక్కడై ఉండాలి. ఆది మధ్యాంతరహితుడై ఉండాలి. నిత్య సజీవుడై ఉండాలి. ఈ విశ్వవ్యవస్థ అంతమయ్యాక కూడా ఆయన మిగిలి ఉండాలి.

**(క) కుటుంబ భావన** (Family Concept) **గురించి మరింతగా యోచన చేద్దాం**

సృష్టికర్తే 'తొలివాడు' అని గనక చర్చను మొదలెట్టినట్లయితే, మరి ఆయన వంటివాడు అవడానికి ఆయనకు సంతానం అవసరం కదా! సంతానం మాత్రమే తండ్రిలాగా ఉంటుంది.

లేదా ఆయన ఉండటానికి ఆయనకు సోదరుడు అయినా ఉండి ఉండాలి. దీని భావమేమిటంటే సృష్టికర్త తొలివాడు కాడు, ఆయన తండ్రి తొలివాడు. ఆయన (సృష్టికర్త) ఖుద్దుగా రెండవ తరాని(Second Generation)కి

చెందినవాడయ్యాడు. కదా! మరలాంటప్పుడు ఆయన తండ్రి ఏం చేస్తున్నాడు? ఆయన దైవత్వాన్ని వెలగబెట్టడం లేదా? ఇంతకీ ఆయన ఎక్కడున్నాడు? ముసలివాడైపోయాడా? లేక బాల్చీ తన్నేశాడా? ఏమిటి, ఆయన అంతమైపోయే వానితో సంబంధం కలిగి ఉండేవాడా? ఒకవేళ అదే అయితే సృష్టికర్త కూడా అంతమయ్యేవాడే. ఎందుకంటే ఆయన కూడా అంతమయ్యేవాని సంతానం గనక! ముసలివాడయ్యేవాడు, చనిపోయేవాడు. ఎంతో బలహీనుడయి ఉంటాడు. అశక్తుడు, (ఒకరిపై) ఆధారపడినవాడై ఉంటాడు. బలహీనత ఉన్నవాడు దైవం కాలేడు. దైవత్వాన్ని చెలాయించలేడు. కనుక ఈ భావన (Concept) తప్పని స్వయంగా అదే నిరూపిస్తోంది.

సృష్టికర్తకు జాతిగానీ, వంశం గానీ ఉండకూడదు. అప్పుడే సృష్టికర్త భావన పవిత్రంగా, స్వచ్ఛంగా ఉండగలదు. స్వచ్ఛ స్థితి (Pure Form)లో ముందుకు రాగలదు.

ఆయన స్వతంత్రుడై ఉండాలి. ఎవరిపైనా ఆధారపడని నిరపేక్షాపరుడై ఉండాలి. ఎవరికీ జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి ఎదురవనివాడై ఉండాలి. తన నిర్ణయాలలో తిరుగులేనివాడై ఉండాలి. ఆయన ప్రవేశపెట్టే శాసనాలకు అడ్డు ఉండకూడదు.

వీటన్నింటితో పాటు ఆయన గైకొనే చర్యలు ఒక్క మానవజాతికే కాకుండా జీవరాశులన్నింటికీ లాభదాయకమైనవై ఉండాలి. వాటిలో జాలి, ప్రేమ, యుక్తి ఉట్టిపడుతుండాలి. వాటిలో ఆశయం, లక్ష్యం తొణికిసలాడుతూ ఉండాలి. .... అదలా ఉంచితే సృష్టికర్తలో స్వయంగా ఎలాంటి లోపం ఉండకూడదు. లోపాలు – దైవత్వం ఒకదానిలో ఇమడలేవు. సృష్టికర్తలో లోపాలుండవు. లోపాలున్నవాడు సృష్టికర్త కాజాలడు.

సృష్టికర్త అగత్యపరుడు, నిర్ధనుడు అయి ఉండడు. పైగా ఆయన సర్వ స్వతంత్రుడు, అక్కరలేనివాడు అయి ఉంటాడు. ఆయన ఏం చేయాలనుకున్నా స్వయంగానే వ్యూహరచన చేస్తాడు. స్వతంత్రంగా నిర్ణయం గైకొంటాడు. వాటిని ఎదురులేకుండా ప్రవేశపెడతాడు.

సృష్టికర్తకు అసలు ఏవైనా అవసరాలుంటాయా? లేదా? అనేది కూడా ఆయనకే తెలిసి ఉండాలి. సృష్టితాలమైన మనకేం తెలుసు? కాబట్టి మనం మన అవసరాల వంటివే ఆయనకూ ఉంటాయని ఊహించటం తప్పు.

అవసరాలు, కోర్కెల వల్ల అగత్య స్థితి వెల్లడవుతుంది. అగత్య స్థితి అంటేనే బలహీనత. సృష్టికర్త అనేవాడు బలహీనతకు అతీతంగా ఉండాలి.

సృష్టికర్తను కూడా సృష్టితాలతో పోల్చడం తప్పు. దానికి తోడు సృష్టితాలలో ఉన్న లోపాలు, దోషాలన్నింటినీ సృష్టికర్తతో ముడిపెట్టడం మరీ తప్పు. సృష్టికర్త స్థాయిని బలహీనపరిచే, దెబ్బతీసే లోపాలన్నింటికీ ఆయన అతీతంగా ఉండాలి.

ఒకవేళ సృష్టికర్తకే గనక ఆలుబిడ్డలుంటే ఆయన సమయం, శ్రద్ధాసక్తులు చాలావరకు వారికే సరిపోతాయి (అంటే ఆయన తన వ్యక్తిగత పనుల కోసం ఎక్కువ సమయం కేటాయిస్తాడు). అందువల్ల ఆయన తన ప్రాథమిక బాధ్యత (Prime Responsibility) అయిన జగతి నిర్వహణ, వస్తువులను సమకూర్చటం పట్ల అలసత్వం ప్రదర్శిస్తాడు. కాగా; ఈ జగతి నిర్వహణకు ఎంతటి అప్రమత్తత అవసరమంటే, ఒక్క క్షణం (Fraction of Second) ఏమరుపాటుకు, ప్రమత్తతకు లోనయినా, ఈ జగతిని నిలిపి ఉంచటం (Sustain) అనేది సంభవం కాదు. పైగా ఈ అలసత్వం వినాశకరంగా పరిణమిస్తుంది.

ఈ యదార్థాన్ని గ్రహించడానికి కొన్ని విషయాలు స్థూలంగానయినాసరే బుర్రకెక్కించటం అవసరం.....

ఈ మిలియన్, బిలియన్ కాంతిసంవత్సరాల (Light Years) సువిశాల జగతి యొక్క ప్రతి మిల్లీ మీటర్ (Every Fraction of Millimeter) సయితం ఆయన కనుసన్నలలో ఉండాలి. ఎల్లవేళలా ఉండాలి. అది ఒక్క క్షణం (Fraction of Second) కూడా కనుమరుగై ఉండరాదు. జగతిని నిలిపి ఉంచడానికయినా, సృష్టితాలను కనిపెట్టుకుని ఉండటానికయినా ఇది చాలా అవసరం. ఒక్క క్షణం పరధ్యానం కూడా ప్రమాదకరమే.

సృష్టికర్త రకరకాల ప్రాణులను పుట్టించాడు. బిలియన్ రకాల వైరస్ (Virus) మొదలుకుని ఏనుగు వరకు అన్ని రకాల బిలియన్, ట్రిలియన్ (Trillion) రకాల జీవరాశులున్నాయి. వాటన్నింటిపై ఏకకాలంలో నిఘావేసి ఉంచాలి. ఏమరుపాటు తగదు. ఎందుకంటే వాటికి కావలసిన వాటిని సమకూర్చటం, వాటి జీవన్మరణాలను నిర్ణయించటం, వాటి ఆరోగ్య అనారోగ్య విషయాలను నిర్ధారించటం, మానవుని సత్కార్యాలు దుష్కార్యాలపై, అతని ఆంతర్యంలో జనించే ప్రేరణలపై నిఘావేసి ఉంచటం, వాటి మూలంగా జనులపై పడే

సత్ప్రభావాన్ని దుష్ప్రభావాన్ని గమనించటం, వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ శిక్షాబహుమానాలను వొసగటం, ఆదరించటం, పరాభవానికి లోనుచేయటం, ప్రతి ఒక్కరి ప్రార్థనలను ఆలకించి, ఆపైన తన విస్తృత పరిజ్ఞానం, కారుణ్యం ఆధారంగా వివేకవంతమైన నిర్ణయాలు గైకొనటం – స్థూలంగా ఈ అవలోకన చేసినట్లయితే సృష్టికర్త అనేవాడు ఈ కార్యనిర్వహణ నిమిత్తం ఎంత అప్రమత్తంగా, మరెంత సూక్ష్మదృష్టి (Mericulus) తో వ్యవహరించాలో, ఇంకా ఎంతగా కార్యాచరణ (Action) దీక్షతో మసలుకోవలసి ఉంటుందో అవగతమవుతుంది. ఇంత కీలకమయిన బాధ్యతల్ని ఎవరయినా వ్యక్తిగత (Personal) కోర్కెలను, అవసరాలను తీర్చుకుంటూ నిర్వర్తించగలడా?

జగతిలో ఉన్నవన్నీ సృష్టించబడినవే. సృష్టితాలైనందున వాటిలో ఏదీ సృష్టికర్తను పోలినది కాజాలదు. అందుచేత సృష్టికర్తను సృష్టితాలతో పోల్చడం (Compare) నిర్హేతుకం (Illogical). సృష్టికర్త వ్యక్తిత్వ భావనను సృష్టితాలు మన ముందు సమర్పించలేవు. కేవలం సృష్టికర్త మాత్రమే తన వ్యక్తిత్వం గురించి వివరించగలుగుతాడు. అయితే సృష్టికర్త తనను మనకు గోచరించకుండా చేసుకున్నాడు. ఆయన మనకు ప్రసాదించిన దృష్టితో ఆయన్ని చూడలేము. ఆయన మనకు కనబడకుండా – అగోచరంగా – ఉండటంలో కూడా ఏదో మర్మం తప్పకుండా ఉంటుంది. ఆయన మన ఆలోచనా విధానాన్ని పరీక్షించగోర్తున్నాడు. ఈ పరీక్షలో నెగ్గినవారికి బహుమానం ఇవ్వదలుస్తున్నాడు. విఫలం (Failure) అయిన వారిని శిక్షించగోర్తున్నాడు. అదలా ఉంచితే సృష్టికర్తను కళ్ళారా చూడటం మనిషి జీవనావసరాలలోనిది కాదు. అయితే ఆయన గుణగణాలను తెలుసుకోవటం జీవిత లక్ష్యం దృష్ట్యా ఎంతో అవసరం (అవి ఇంతకు ముందే వివరించబడ్డాయి).

**(సి) సృష్టికర్త అస్థిత్వ భావన**

**(1) వాలకం, రూపురేఖల గురించిన భావన**

కొన్ని మౌలిక వాస్తవాలపై యోచన చేద్దాం –

మానవుడు దైవభావనతో జీవితం గడపటానికి సృష్టికర్త రూపురేఖల గురించి తెలుసుకోవటం అవసరమా?

సృష్టికర్తను అసలు ఎవరయినా చూశారా? లేదంటే, మరి ఆయన రూపురేఖల గురించి ఎవరయినా ఎలా అభివర్ణన (Description) చేయగలుగుతారు?

సృష్టికర్త రూపురేఖలను ఎవరయినా ఎలా విడమరచి చెప్పగలరు – ఆయన స్వయంగా తన రూపురేఖలను గురించి వివరించనప్పుడు?

సృష్టికర్త వ్యక్తిత్వం (Personality) గురించి కచ్చితమయిన స్వరూపం ప్రాప్తించనప్పుడు, ఆయన స్వరూపం గురించి ఏ రూపకల్పన చేసుకున్నా, అది కేవలం ఊహాజనితం, అనిశ్చితం (Imaginary, Uncertain) కావా?

**(2) మానవ మనస్తత్వం** (Human Psychology)

మానవ మనస్తత్వం సతతం సరళ మార్గాన్ని కాంక్షిస్తుంది.

సృష్టికర్త అస్థిత్వాన్ని, ఆయన స్వరూపాన్ని పొందేందుకు మానవుడు ఊహాజనితమయిన భావాల రూపచిత్రాలను, లేదా విగ్రహాల నమూనాలను (Models) తన ముందు ఉంచుకుంటాడు – ఆ విధంగా పూజాపునస్కారాల సందర్భంగా తన ధ్యాస సృష్టికర్త వైపు లగ్నం చేసి ఉంచాలనుకుంటాడు.

ఇదొక మానవ ఆలోచన. మానవ మనస్తత్వం (Human Psychology); అది ఎన్నోసార్లు సులభ పద్ధతుల (Easy Going Methods) వైపునకు మళ్ళుతుంది. ఈ పద్ధతే లాభదాయకమని అనుకుంటుంది. ఈ ఆలోచనా సరళి ఎంత వరకు సరైనదో యోచన చేద్దాం –

ఏమిటి, సృష్టికర్త అస్థిత్వం నిజంగా మనం ఊహించినట్లే ఉందా? ఏ కన్ను అయినా సృష్టికర్తను కానగలిగిందా? ఒకవేళ 'లేదు' అన్నప్పుడు 'ఊహాజనిత సృష్టికర్త' ద్వారా సిసలయిన సృష్టికర్త లబ్ది (Benefit) ఎలా పొందగలం? సరైన ఆరాధనా రీతులను తెలుసుకుని ఎలా సంతృప్తిని, శాంతిని పొందగలం?

అసంపూర్ణమైన భావన ద్వారా సంపూర్ణ భావన యొక్క లబ్ది పొందటం సాధ్యపడదు. ఊహాజనిత (Imaginary) వస్తువు ద్వారా సిసలయిన వస్తువు యొక్క ప్రయోజనం పొందజాలము. యదార్థమేదో తెలియనప్పుడు ఊహల ద్వారా యదార్థాన్ని పొందటం సంభవం కాదు. యదార్థంలోని మధురిమను పొందలేనప్పుడు, ఊహాజనిత రూపచిత్రాల ద్వారా ప్రయోజనం ఏముంటుంది?

ఒకవేళ నిజ స్వరూపం (Exact Picture) గల రూపచిత్రం లభ్యమైతే అందులో ఎంతో కొంత అర్థం ఉంటుంది. ఆరాధించబడేవాని రూపం (Picture) ముందర ఉన్నదిలే అని అనుకోవచ్చు.

కాని, సృష్టికర్తను చూడనప్పుడు (విషయం అక్కడికక్కడే సమాప్తమై

పోతుంది); రూపకల్పన చేయబడిన శారీరక చిత్రంగానీ, మరేదయినా చిత్రంగానీ వాస్తవం కాజాలదు. ఒకవేళ ఊహ మరియు రూపచిత్రం రెండూను వాస్తవానికి దగ్గిర ఉన్నప్పటికిన్నీ అవి దోషరహితం కాజాలవు. సృష్టికర్తను లోపాలతో చిత్రీకరణ చేయటం సృష్టికర్తకు ఎంతో అవమానకర (Insult) విషయం. ఉదాహరణకు : మోడల్ (Model) లేక విగ్రహం (Statue) చేస్తారు. అది మనలాగా ఉండదనుకోండి, కాని అది మనమే అని అన్నప్పుడు, మనకెంత కోపం వస్తుంది. అది మనకు అవమానకరం అని తలపోస్తాము. వారు సృష్టికర్తను కూడా ఆ విధంగా అవమానించి, ఆయన్ని నిజభావంలో ఎవరయినా సేవించగలరా? ఇలాంటి కాల్పనిక పోకడల వల్ల ఆరాధన లేక దాస్యానికి సార్థకత చేకూరుతుందా? అలాంటి ఆరాధన స్వీకారయోగ్యమవుతుందా? వివేకవంతుడైన వ్యక్తి మనస్సాక్షి స్వయంగా ఇలాంటి ప్రశ్నలు వేసుకుని అంతర్మథనం చెందుతుంది.

ఈ విషయాన్ని మరో కోణం (Angle) నుంచి ఆలోచిద్దాం. అసలు సృష్టికర్త అస్థిత్వాన్ని లేక రూపాన్ని చిత్రించటం సంభవమా? ఆయన అద్వితీయుడు అని భావిస్తే అది వేరే విషయం – ఉదాహరణకు : ఒక మనిషిలోని గుణగణాలు వివరించినప్పుడు, వాటి ఆధారంగా ఆ మనిషి రూపాన్ని నఖశిఖ పర్యంతం చిత్రించటం సాధ్యమేనా?

ఉదాహరణకు : ఒక వ్యక్తి బలశాలి. తెలివితేటలు గలవాడు. యుక్తిపరుడు. ఎంతో ప్రేమమయుడు, దయార్ద్ర హృదయుడు, అతనికి కోపమన్నదే రాదు. పరమ ఉదాత్తుడు. దాత. మృదుమనస్కుడు. క్షమాశీలి. దయాకరుడు. తప్పుల పట్ల చూపోపు వహించేవాడు. కాని ఇన్ని సుగుణాలున్న ఆ వ్యక్తిని ఎవరూ చూడలేదు. అతని ఈ సుగుణాలు ఎవరో మనకు వివరించి చెప్పారనుకుందాం. మరయితే ఈ సుగుణాల పరిజ్ఞానంతో ఆ వ్యక్తి శారీరక స్వరూపాన్ని ఖచ్చితంగా ఊహించి, ఒక నమూనా చిత్రాన్ని వేయటం సాధ్యమేనా? ఇది సాధ్యం కానప్పుడు సృష్టికర్త రూపచిత్రం వేయటం ఎలా సాధ్యమవుతుంది? అసలింతవరకు ఆయన్ని ఏ కన్నూ కానలేదుకదా! ఆయనకు సంబంధించిన ఒక తేలికపాటి ముద్ర (Impression) మనిషి మస్తిష్కంపై ఉన్నప్పటికీ, ఈ పని చేయటం సాధ్యం కాదు. కేవలం ఆయన గుణగణాల భావన మాత్రమే మనకు లభ్యమవుతుంది. ఆయన నిర్మించిన జగతిని, ఆయనచే సృష్టించబడిన వస్తువులను చూసినప్పుడు ఆయన ఇలా ఉండవచ్చు అని కేవలం

ఊహించగలుగుతామంతే. ఈ జగతిలో అనునిత్యం సంభవించే సంఘటనలను, జగతిలోని అద్భుతమయిన ఏర్పాట్లను చూసి ..... సృష్టికర్త పరిజ్ఞానాన్ని, ఆయన శక్తిని, ఆయన అధికారాన్ని, ఆయన ప్రేమభావాన్ని, ఆయనలోని విజ్ఞతను, కారుణ్యాన్ని దైనందిన జీవితంలో మనం గమనిస్తూ ఉంటాము .... ఇన్ని సుగుణాలను గురించి తెలుసుకుని కూడా సృష్టికర్త రూపురేఖలను ఖచ్చితంగా చిత్రించగలుగుతామా? అసంభవం. మరలాంటప్పుడు మన ఈ చేష్ట సృష్టికర్తకు అవమానకరమైన (Insulting) చేష్ట కాదా? ఆయన పట్ల ప్రేమతో, భక్తిశ్రద్ధలతో ఈ పని చేసినంత మాత్రాన అది సరైనదవుతుందా? తెలిసి చేసినా తెలియక చేసినా అవమానం అవమానమే. దానిని పరిత్యజించటం సంస్కారం, మర్యాద. సృష్టికర్త యెడల గల స్వచ్ఛమయిన ప్రేమ వాంఛించేది కూడా ఇదే.

మరి ఈ రూపచిత్రం ద్వారా సాధించదలచుకున్నది లోపం కారణంగా ప్రాప్తమవకపోతే ఎలా ఉంటుంది? ఒక పాత్రను కొనుగోలుచేసి తీసుకువస్తాము, అందులో మన కంటికి కానరానంత సూక్ష్మమయిన రంధ్రం ఉందనుకోండి, నీరు కారటం ఖాయం. ఆ పాత్రను కొనితెచ్చిన లక్ష్యం నెరవేరదు. పాత్రలో ఏ లోపం కూడా లేనప్పుడే దాని కొనుగోలులోని లక్ష్యం సిద్ధిస్తుంది. లేకుంటే మనం మోసపోతాం.

ఇప్పుడు కచ్చితమయిన రూపచిత్రం మన ముందు లేదు కాబట్టి సృష్టికర్త గురించిన గుణవిశేషాల పరిజ్ఞానం ఆధారంగా ఆయన గురించి ఊహించగలుగుతాము. మరి నిజభావంలో నిజమైన ఆరాధన ఎప్పుడు జరుగుతుందంటే; సృష్టికర్తను నిజభావంలో తెలుసుకున్నప్పుడే! ఆయన అపారమయిన శక్తియుక్తులతో, దయ, జాలి, కరుణ, ప్రేమ, జ్ఞానంతో ప్రతిదీ వింటాడు, ప్రతిదీ చూస్తాడు, ఆయన – జ్ఞానపరంగా – మనిషికి అత్యంత చేరువలో ఉన్నాడు, మనసులో చెప్పుకున్న మాటలను సయితం ఆయన తెలుసుకుంటాడని దృఢంగా నమ్మినప్పుడే!! సృష్టికర్తలోని ఈ గుణ విశేషాలను ఎల్లప్పుడూ మననం చేసుకుంటూ ఆయన్ని సేవించినప్పుడే ఆరాధనా లక్ష్యం నెరవేరుతుంది. తద్వారా మనసుకు అనిర్వచనీయమయిన శాంతి, సౌఖ్యం కలుగుతుంది.

(పైన ప్రస్తావించబడిన) ఈ గుణవిశేషాల ద్వారానే మానవ హృదయాలలో ఆయన యెడల ఉన్నత భావన జనిస్తుంది. భక్తి శ్రద్ధలతో ఆయన సమక్షంలో తల వంగిపోతుంది. ప్రతిచోటా, ప్రతి క్షణం ఆయన యెడల విధేయత

కనబరచబడుతుంది. ఏ విధంగానయితే మంచి గుణాల కారణంగా ఒక మనిషి మరో మనిషిని ఆదరిస్తాడో, అతన్ని ప్రేమిస్తూ, అతని మాట వింటాడో అదేవిధంగా మనిషి తన సృష్టికర్త ఆజ్ఞలను హృదయపూర్వకంగా శిరసావహిస్తూ, ఆయన ఘనత్వాన్ని, పవిత్రతను కొనియాడుతూ జీవిస్తాడు. గొప్ప మనిషి అంటే అతనేదో అసాధారణమయిన శక్తులున్న ప్రతిమ (Giant) కాడు. అతని వ్యక్తిత్వంలోని సుగుణాల మూలంగా అతనికి లభించిన గొప్పతనమది.

గుణగణాలలోని క్రియాత్మక యోగ్యత (Functional Ability) ని, శక్తి (Power)ని క్రింది ఉపమానాల ద్వారా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం .....

క్రమశిక్షణ (Discipline)కి సంబంధించి కళాశాల ప్రిన్సిపాల్ అవలంబించే కఠిన వైఖరికి భయపడి లెక్చరర్లు, విద్యార్థులు తమ వంతు బాధ్యతలను సజావుగా, సకాలంలో నిర్వర్తించడానికి కృషిచేస్తారు. క్రమశిక్షణకు సంబంధించి నంతవరకు ప్రిన్సిపాల్‌లోని ఈ గుణమే సంబంధిత స్టాఫ్‌ను, స్టూడెంట్స్‌ని, పేరెంట్స్‌ని సయితం క్రమశిక్షణకు అలవడేలా చేస్తుంది. అంతేగాని అది ప్రిన్సిపాల్ ఆకారం వల్లనో, అతని గురించిన భావనవల్లనో వచ్చిన పరివర్తన కాదు.

అలాగే సృష్టికర్త గుణగణాల పరిజ్ఞానం మనిషిని సన్మార్గాన నడిపిస్తుంది. అంతేగాని ఆయన ఆకారం లేక ప్రతిమ వల్ల వచ్చిన నడవడి కాదది. ఆయన అంతా వినేవాడు, అందరి మొరలను ఆమోదించేవాడు, ఆయన పరమ ఉదాత్తుడు, దయాకరుడు, క్షమాగుణం కలవాడు, అపార శక్తిసంపన్నుడు అన్న భావనే మనిషి క్రియాత్మక జీవితంలో ఓ విశిష్ఠ నడవడికకు ప్రాతిపదిక అవుతుంది.

పైన ప్రస్తావించబడిన అంశాల తర్వాత ఇప్పుడు పరిశీలించి చూడండి – సరైన జీవితం గడపడానికి, జీవిత లక్ష్యం సాధించటానికి సృష్టికర్త యొక్క గుణగణాల పూర్తి పరిజ్ఞానం చాలదా? ఆయన అస్థిత్వం గురించి ఆలోచించి నప్పుడు, సంతృప్తపరిచే (Convincing) విధంగా ఒక విషయం ముందుకు వస్తుంది – ఆయన 'ఒక్కడే' అని. ఇక ఆయన గుణ విశేషాలు, ఘనకార్యాల విషయానికివస్తే; మనం మన జీవితాలలోనూ, ఈ జగతిలోనూ ఊహించ గలము, ఇవన్నీ ఆ 'ఒక్క అస్థిత్వం'లోనే ఉన్నాయన్న అనుభూతికి లోనవగలం.

అంటే ఆయన గుణగణాల, ఘనకార్యాల ఆధారంగా మన ఆంతర్యాలలో ఆయన యెడల భక్తీ ప్రపత్తుల భావన ఏర్పడుతుంది. అంతకుమించి ఆయన అస్థిత్వం గురించి మనకు కచ్చితంగా తెలియదు.

ఈ పరిశీలన, ఈ చింతన ఒక మహోన్నత అస్థిత్వ అనుభూతినిస్తుంది. అదెంత గొప్ప అస్థిత్వమంటే, మన మదిలో దాని గురించిన ఖచ్చితమయిన భావనకు స్థానం ఇవ్వలేము. కేవలం ఆయన గుణవిశేషాల ఆధారంగా అది ఎంతో గొప్ప శక్తి అయి ఉంటుందని మాత్రమే ఊహించగలం.

సృష్టికర్త గురించి మనిషి తన మస్తిష్కంలో ఏ భావనకు చోటిచ్చినా, అది పరిసరాలలో విస్తరించి ఉన్న ప్రాణులను, వస్తువులను చూసి ఏర్పరచుకునే భావనే.

**(3) సృష్టికర్త ఉపమానం**

జగతిలో సృష్టికర్త వంటి ఉపమానం ఇవ్వడానికి ఆయన్ని పోలిన వస్తువు ఏదీ లేదు. ఉండజాలదు కూడా. ఎందుకంటే అన్నీ సృష్టితాలే. సృష్టితాలు సృష్టికర్త కాజాలవు. మరలాంటప్పుడు సృష్టికర్తకై సృష్టితాల ఉపమానం ఇవ్వటం ఎలా సమంజసం?

కనుక సృష్టికర్త అస్థిత్వం గురించి కచ్చితంగా ఊహించటం అసంభవం. అయితే ఆయన ఔన్నత్యం, గొప్పతనం, పెద్దరికం గురించి ఊహించటం సంభవమే.

ఎందుకంటే సృష్టికర్తను ఎవరూ చూడలేదు. కాబట్టి ఆయన ఆకృతి గురించి ఇదమిత్థంగా ఒక నిర్ధారణకు రాలేరు. ఆయన ఈ విధంగా ఉంటాడని దేనితోనూ పోల్చలేరు. మొత్తానికి ఈ సుగుణాలు, అద్భుతాలన్నీ ఒక అస్థిత్వంలో మాత్రమే ఉంటాయి. అద్భుతాల సమాహారం, సౌందర్యాల రాశి ఒక మహోన్నత అస్థిత్వంలో మాత్రమే ఉండగలవు.

సృష్టికర్తకు తన దాసులతో గల సంబంధంపై మనం యోచన చేసినప్పుడు ఈ అద్భుతాల కలయిక, సౌందర్యాల రాశి ఆలోచన బలపడసాగుతుంది (దీనికి సంబంధించిన చర్చ వెనుకటి పుటల్లో వచ్చింది).

**డి. సృష్టికర్త అస్థిత్వానికి సంబంధించిన జ్ఞానం**

సృష్టికర్త అస్థిత్వ **భావన** తరువాత ఇప్పుడు సృష్టికర్త అస్థిత్వ **జ్ఞానం** గురించి చర్చిద్దాం –

సృష్టికర్త రూపురేఖలు, బాహ్యారూపం (Form) ఎలా ఉంటుంది?

ఈ అంశాన్ని మరో కోణం (Angle) నుంచి పరిశీలిద్దాం –

ఈ జగతిని, మనిషినీ చేసిన మీదట సృష్టికర్త ఉద్దేశ్యపూర్వకంగానే, ఏదో పరమార్ధం దృష్ట్యా (Purposely and Purposefully) తనను తాను మనిషి కళ్లకు కనిపించకుండా మరుగుపరచుకున్నాడేమో అనిపిస్తుంది. అలాంటప్పుడు ఊహల గుర్రాలు పరుగెత్తించి ప్రయోజనం ఏమిటి? ఊహాజనితమయిన ఆకారాల (Figures) ను నిర్మించుకుని లాభమేమిటి? జీవితానికయినా, జీవిత లక్ష్యానికయినా ఆయన అస్థిత్వ వర్ణన (Description) సేకరించవలసిన ఆవశ్యకత ఏమీ లేదు కదా! ఒకవేళ ఉండి ఉంటే ఆయన ఇలా కనుమరుగై ఉండేవాడే కాదు. కాకపోతే సృష్టికర్త ఉన్నాడనే దృఢనమ్మకం మాత్రం అవసరం. ఆయన ఏ గుణగణాలు, లక్షణాలు కలవాడో తెలుసుకోవటం అవసరం. జీవితం కొరకు, జీవిత లక్ష్యం కొరకు క్షణం క్షణం దాని ఆవశ్యకత ఉంటుంది.

అందుకే ఈ రెండింటి (సృష్టికర్త ఉనికి, ఆయన గుణగణాల పట్ల దృఢనమ్మకం) ప్రాప్తికై కావలసిన ఏర్పాట్లన్నీ సృష్టికర్త చేసేశాడు. ఈ జగతిలో భూమ్యాకాశాలలోనూ, సముద్రంలోనూ, సృష్టితాలలోనూ, స్వయంగా మానవ ఉనికిలోనూ, చరిత్రలోనూ, కాలచక్రంలో సంభవించే ముఖ్య ఘటనలలోనూ, దైనందిన జీవితంలోనూ అవి ఉన్నాయి. ప్రతి మనిషీ కొద్దిపాటి కృషితో సృష్టికర్తనూ, సృష్టికర్త గుణగణాలను తెలుసుకోగలుగుతాడు.

### (1) మానవ జీవితంలో సృష్టికర్త అస్థిత్వ పరిజ్ఞానం, ఆయన గుణగణాల పరిజ్ఞానం చూపే ప్రభావం

సృష్టికర్త ఎలా ఉంటాడు? ఆయన రూపురేఖలు, బాహ్య స్వరూపం (Form) ఎలా ఉంటాయి? అనేది ఏ మనిషికీ తెలీదు. ఎందుకంటే ఏ మనిషి కన్నూ ఆయన్ని కానలేదు. కాననప్పుడు ఏ మనిషి అయినా ఆయన ఎలా ఉంటాడో ఎలా చెప్పగలడు? ఒకవేళ ఎవడయినా చెప్పినా అది ఊహాజనితమే అయి ఉంటుంది తప్ప వాస్తవమై ఉండదు. దీని గురించి ఎంతోమంది విశదపరిచారనుకోండి, ఎన్నెన్నో ఊహాజనిత ఆకృతులు ముందుకు వస్తాయి; యదార్థాలతో వాటికెట్టి సంబంధం ఉండదు. వాస్తవమనేదే లేనప్పుడు నోటితో ఎన్ని చెప్పినా అది ఆత్మవంచనే అవుతుంది. ఆత్మవంచన అనేది విద్యావంతులకు, బుద్ధిజీవులకు శోభిస్తుందా? ఇక వారు ఏ ఏ వర్ణనలతో వివరించినా అవన్నీ

మనిషి మదిలో నాటుకున్న సృష్టితాల రూపంలోనే ఉంటాయి. లేదా వాటి కాంబినేషన్ (Combination) లోనే ఉంటాయి. కాకపోతే వాటికి తోడు మరిన్ని సరికొత్త ఐడియాలు (Ideas) జోడించబడతాయి.

చెప్పవచ్చిందేమిటంటే ఆయన వంటివాడు లేడు. ఆయనకు ప్రత్యామ్నాయం కూడా ఏదీ లేదు. సృష్టికర్త ఎలా ఉంటాడో పోల్చిచెప్పేందుకు ఆయనను పోలిన వస్తువుగానీ, ప్రాణి గానీ ఏదీ లేదు. కనుక ఇక్కడ ఉన్న వస్తువులన్నీ సృష్టితాలే. వాటిని సృష్టికర్తతో పోల్చటం సరికాదు. సృష్టితాలు ఎన్నటికీ సృష్టికర్త కాలేవు.

సృష్టితాలు తమ బలహీనతలన్నింటితో సహా ముందుకు వస్తాయి. అవే బలహీనతలు సృష్టికర్త భావనలో కూడా ప్రతిబింబిస్తూ (Reflect) ఉంటాయి. సృష్టికర్తను ఏదేని సృష్టితాలతో పోల్చదలచినప్పుడు జరిగేది ఇదే.

ఆయన వంటివాడు ఎవడయినా ఉన్నాడని ఊహించినా, అతను కూడా ఆయన వంశీయుడే అయి ఉండాలి. అంటే ఆయన కుమారుడో లేక సోదరుడో అయి ఉండాలి. లేదా ఆయనకు ప్రత్యామ్నాయం కాగలగాలంటే కనీసం ఆయన జాతికే చెందినవాడై ఉండాలి. అన్యథా ప్రత్యామ్నాయం కాజాలడు. వెనుకటి అధ్యాయంలో, ఆయన ఒక్కడనీ, ఆయన వంటివాడు కూడా స్వయంగా ఆయనేనని, ఆయనను పోలినవాడు ఎవ్వడూ లేడని, ఆయన అగోచరంగా ఉన్నాడని చెప్పుకున్నాం. మరలాంటప్పుడు ఆయన గురించి ఊహాజనిత స్వరూపాన్ని ఎలా చిత్రించగలుగుతారు? ఒకవేళ చిత్రించినా అందులో యదార్థం ఏదీ ఉండదు.

మానవుడే గనక దోషరహితుడైన సృష్టికర్తను నమ్మి ఆయన ఎదుట మోకరిల్లితే, ఆయనకు విధేయత చూపితే అతను మానవత్వపు ఉన్నత శిఖరాలకు చేరుకుంటాడు. .... అతని మనోమస్తిష్కాలు, అతని ఆలోచనలు, అతని స్వభావం, అతని వ్యవహార సరళి, అతని దయార్ద్రత, అతని ప్రేమాదరణలు ఇతరుల కొరకు ఆదర్శప్రాయం అవుతాయి.

ఇకపోతే; దైనందిన జీవితం కోసం లేదా ఆరాధనా రీతుల శారీరక ఉనికి వివరాలు అవసరం లేదు. కేవలం సృష్టికర్త ఉన్నాడన్న భావన చాలు. ఏ వస్తువు ఆరాధన నిమిత్తం మనిషికి అవసరమై ఉంటుందో, అది అతని పూర్తి జీవితం కొరకు – ప్రతి క్షణం – అవసరమై ఉంటుంది. అదే సృష్టికర్త గుణగణాలకు సంబంధించిన సమతూకపు (Balance) జ్ఞానం, దానిపై గట్టి నమ్మకం. అది మనిషి భావాలు భావనలకు, సిద్ధాంతాలు దృక్పథాలకు,

సంకల్పాలు ఆచరణలకు సమతౌల్యంతో కూడిన మార్గదర్శకత్వం వహిస్తుంది. అతని వ్యవహారాలకు, సంబంధాలకు సరైన దిశానిర్దేశన చేస్తుంది. వాటిని చక్కదిద్దుతుంది. వాటికి రక్షణ కల్పిస్తుంది. అంతేకాదు, సృష్టికర్త యొక్క సమగ్ర గుణగణాల ధ్యాస మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తుంది. పిదప మనిషి తన దైనందిన కార్యకలాపాలలో నిమగ్నుడై ఉండి కూడా అనుక్షణం తనను పుట్టించిన వాని సహాయం అర్థిస్తూ ఉంటాడు. ఆయన్ని ప్రార్థిస్తూ ఉంటాడు. ఆయన మార్గదర్శకత్వాన్ని కాంక్షిస్తూ ఉంటాడు. ఆయన ప్రతి చోటా ఉన్నాడనీ, తనకు అత్యంత సమీపంలోనే ఉన్నాడని, తనను చూస్తున్నాడనీ, తన విన్నపాలను వింటున్నాడనీ, తనకు తోడ్పాటు నందించటంలో తిరుగులేనివాడనీ, ప్రతి వస్తువు ఆయన అధీనంలో ఉందనీ, ప్రతిదీ ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ, ఆయనకు విధేయత కనబరుస్తూ ఉందనీ, సమస్త విశ్వంలో ఆయన ఆజ్ఞ చెల్లుతుందని నమ్మి నడుచుకుంటాడు. రేయింబవళ్ళలో తన వల్ల జరిగే తప్పులు తెలిసివచ్చి నప్పుడు, ఆయన వైపునకు మరలి క్షమాపణ కోరుకుంటాడు. తనను సంస్కరించు కుంటాడు. ఇకమీదట ఆ తప్పులకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. తాను చేసే ప్రతి చిన్న పెద్ద చేష్టను సృష్టికర్త గమనిస్తూ ఉన్నాడన్న ఆలోచన అతనిని – పాపాల నుండి – కట్టిపడేస్తుంది. పశ్చాత్తాపభావంతో ఆయన వైపునకు మరలిన వారిని ఆయన అమితంగా ఇష్టపడతాడన్న తలంపు అతనిని సత్కార్యాల వైపునకు సమాయత్తం చేస్తుంది. పాపాలకు దూరంగా ఉంచుతుంది. సన్మార్గాన నడిపిస్తుంది. అది అతని నడవడికను, వ్యవహారాలను, సంబంధాలను చక్కదిద్దుతుంది. అతన్ని ఒక మంచి మనిషిగా, సత్పౌరునిగా మలుస్తుంది. ఇంకా, అతన్ని మానవత్వపు అత్యున్నత స్థానానికి చేర్చుతుంది.

సృష్టికర్త గుణగణాల ప్రభావం మానవ జీవితంపై చూపే గొప్ప ప్రభావాని (Impact) కి సంబంధించిన కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇవి. అయితే సృష్టికర్తలోని ఒక్కొక్క గుణాన్ని తీసుకుని, దానిపై లోతుగా పరిశీలన చేస్తే ఈ దైవిక గుణాలు మానవ జీవితంలో ఎంతటి కీలక పాత్ర (Play) పోషిస్తున్నాయో, మానవ జీవితపు ఎన్నెన్ని విభాగాలపైన ఎన్ని సూక్ష్మాతి సూక్ష్మ విషయాలపైన దాని ప్రభావం (Impact) పడుతుందో, అది ఏ విధంగా కంట్రోల్ చేస్తుందో, ఎలా మార్గదర్శకత్వం వహిస్తుందో, అదెలా మనిషిని కాంతిశిఖరాల ఉన్నతికి చేర్చుతుందో, అతని ఆధ్యాత్మిక నైతిక రంగాలను ఎలా సంస్కరిస్తుందో ..... ఆ వ్యక్తి ఏ విధంగా తన సమయంలోని ఒక్కొక్క నిముషాన్ని, ఒక్కొక్క పైసాను

సద్వినియోగం చేసుకుంటాడో, తన ఉనికిని తన పాలిట, తన కుటుంబీకుల పాలిట, సమాజం పాలిట, దేశం పాలిట ఎలా ఉపయోగకరంగా మలచుకుంటాడో తెలిసివస్తుంది.

సృష్టికర్త చూస్తున్నాడు, వింటున్నాడు, చూపుల చౌర్యాన్ని సయితం ఆయన ఎరిగినవాడు. గుండెల్లోని గుట్టును సయితం తెలుసుకోగలవాడు – ఈ ఎరుక, ఈ ధ్యాస ఉంటే అతని జీవితమే మారిపోతుంది. ఆరాధనల్లో ఆయన యందు మనసు లగ్నమవుతుంది. అతను ఏకాగ్రచిత్తంతో ఆయనపై దృష్టిని (Concentrate) కేంద్రీకరిస్తాడు. అతని వేడుకోళ్ళలో దృఢనమ్మకం ఉంటుంది. ప్రార్థించిన మీదట అతని మనసు నెమ్మదిస్తుంది. ఆ సృష్టికర్త తన మొరలను ఆలకించి ఆమోదిస్తాడని, ఆమోదించే శక్తి ఆయనకు మాత్రమే ఉందని, ప్రతి వస్తువు ఆయన నియంత్రణ (Under Control) లో ఉందని, ప్రతిదీ ఆయన ఆజ్ఞకు లోబడి (Under Command) ఉందని భావించినపుడు అతనికి ఎలాంటి వ్యాకులత ఉండదు. అప్పుడు అతని మనసు కుదుటపడుతుంది. హాయి (Relaxation) నొందుతుంది. సమధికోత్సాహంతో, నూతనోత్తేజంతో మళ్లీ పని చేయడానికి ఉపక్రమిస్తాడు. ఇదంతా సృష్టికర్త గుణగణాల మహిమ. ఈ ప్రభావం (Impact) అనుక్షణం అతని జీవితంలో ప్రధాన భూమికను నిర్వహిస్తుంది. సృష్టికర్త భౌతిక రూపురేఖల (Physics) గురించి తెలుసుకునే ఆరాటంలో కాలయాపన చేయటం వల్ల ఇంతటి శాంతి, సంతృప్తి ప్రాప్తించదు. అందుకే అనుదినం అనుక్షణం సృష్టికర్త గుణగణాలను తెలుసుకునేందుకు తహ తహలాడటం మనిషి జీవితానికి అవసరంగాని, ఆయన భౌతిక ఆకారం (Physics) గురించి తెలుసుకునేందుకు తాపత్రయపడటం అవసరం కాదు. అయితే ఆయన ఉనికి పట్ల నమ్మకం ఉండాలి. ఇది మానవ జీవితానికి ప్రాథమిక అవసరం. పైగా ఇదే అసలు భూమిక (Basis). అక్కణ్ణుంచే జీవితం మొదలవుతుంది, నిర్మాణమవుతుంది కూడా. ఇదంతా ఆ ఉనికి యొక్క గుణగణాల మహిమే. నిశ్చయంగా ఏదేని ఉనికిలోనే గుణాలుంటాయి. ఆ ఉనికే సృష్టికర్తది.

**తొమ్మిదవ అధ్యాయం :**

# నిజ ఆరాధ్యదైవం వాస్తవిక దృక్పథం ... ఒక చూపులో!

**(1)** నిజ ఆరాధ్య దైవం ఆవశ్యకత – దానికి సంబంధించిన ఒక భావన

**(2)** నిజ ఆరాధ్యదైవమంటే భావం

**(3)** నిజ ఆరాధ్యుడు ఎవడై ఉండాలి? సాధారణ చర్చ

**(4)** నిజ ఆరాధ్యదైవం ఎవడై ఉండాలి? బౌద్ధిక నిదర్శనం వెలుగులో

**(5)** నా సృష్టికర్తే నా ఆరాధ్య దైవం

**(6)** నిజ ఆరాధ్య దైవాన్ని పరికించే గీటురాయి (Criteria)

**(7)** నిజ ఆరాధ్య దేవుని అన్వేషణ

# నిజ ఆరాధ్య దైవం వాస్తవిక దృక్పథం

## (1) నిజ ఆరాధ్య దైవం ఆవశ్యకత

మానవుడు తన జీవితంలో ఒక వస్తువు లేమిని ఫీల్ చేస్తూ ఉంటాడు. నిత్య జీవితంలో ఉండుండి ఆ లేమి అతని మెదడును తొలచివేస్తూ ఉంటుంది. ఒక్కోసారి ఆ కొరత అతన్ని తీవ్ర వ్యాకులతకు గురిచేస్తూ ఉంటుంది. ఒక్కోసారి అతను కలత చెంది మానసిక సంతులనాన్ని కోల్పోయే (Nervous Breakdown) పరిస్థితి కూడా దాపురిస్తుంది. అతను ఆత్మహత్యకు సయితం పూనుకుంటూ ఉంటాడు. అందుకే అతను ఒక 'తోడు'ను కోరుకుంటాడు. ప్రతిచోటా, ప్రతి క్షణం ఆ తోడూ నీడా ఉండాలని కాంక్షిస్తాడు. తాను పిలిచినప్పుడల్లా అతను ఆదుకోవాలనీ, తనకు మార్గం చూపాలనీ, తనకు ఆపద సమయంలో ఆశ్రయం కల్పించాలనీ, తన అక్కరలను తీర్చాలనీ, సాధ్యంకాని పనులు సయితం చేసిపెట్టాలనీ, తనకు ప్రాణరక్షణ కల్పించాలనీ, తన ఈతి బాధలను వ్యాధి బాధలను దూరం చేయాలని, తన మనసుకు శాంతినీ సౌఖ్యాన్ని వొసగాలని కోరుకుంటాడు.

మనిషి ఈ లేమితో తీవ్రంగా సతమతమయ్యేవాడు. నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడేవాడు. అయితే ఈ మంచి 'నేస్తం' మూలంగా అతని జీవితానికి 'జీవితం' లభించింది. అతని జీవితంలో ఒక స్థిరత్వం, నిలకడ (Stability) వచ్చింది. సుఖసౌఖ్యాలు ప్రాప్తమయ్యాయి. ఫలితంగా మనిషి హృదయానికి ఆ మంచి స్నేహితుని పట్ల ప్రేమాదరణలు జనించాయి. నమ్మకం ఏర్పడింది. ఆయన సమక్షంలో సాష్టాంగ ప్రణామం చేసి కృతజ్ఞత తెలుపుకోవాలని మనసు ఉబలాటపడుతుంది. ఆయన్ని కీర్తించాలనుకుంటుంది. అంటే ఆయన్ని

సేవించాలని తపిస్తుంది. ఈ మనోమయ భావాల సారమే నిజదేవుని ఆరాధన, దాస్యం. అంటే ఎల్లకాలం మనిషిని అంటిపెట్టుకుని ఉండే నేస్తమే అతని నిజ ఆరాధ్యదైవం. ఇంతకాలంగా మనిషి లేమితో బాధపడినది ఈ ఆరాధ్య దైవం గురించే. ఆ ఆరాధ్య దైవం లభించగానే, ఆయన్ని విశ్వసించగానే అతని లోటు తీరిపోయింది. అతని జీవితానికి సుఖంతో పాటు మార్గదర్శకత్వం కూడా ప్రాప్తమయింది. నిజ ఆరాధ్య దైవం మానవ జీవితపు ప్రాథమిక అవసరమని తెలిసింది, నమ్మకం కుదిరింది. ఆయన లేకుండా జీవితంలో జీవం ఉండదు. జీవితం సరైన దిశలో ముందుకు సాగదు. పైగా అది ఆటుపోట్లకు గురవుతుంది. అంటే ఎవరినయినా ఆరాధ్య దైవంగా చేసుకోవటమనేది మనిషి అంతరాత్మ ప్రబోధం! అది అతని నైజం వాంఛించే (Demand చేసే) అంశం!! అది అతని దైనందిన జీవితావసరం!!!

## (2) ఆరాధ్య దైవం అంటే ......

అత్యంత ప్రభావవంతమైన తీరులో పనులను చేసి పెట్టేవాడు, అత్యుత్తమ రీతిలో సహాయపడేవాడు, కార్యసాధకుడు, అసాధ్యమైన పనులను సయితం తన శక్తియుక్తులతో చేసేవాడే ఆరాధనలకు తగినవాడు. ఆయన శక్తి అనంతమైనది, ఆయన అధికారం ప్రతిదానినీ పరివేష్ఠించినదై ఉండాలి. ఆయన గొప్ప శుభాలకు మూల సరోవరం అయి ఉండాలి. తన దాసుల పట్ల అమిత ప్రేమమయుడు, పరమ దయాళువు అయి ఉండాలి. వారికి ఆశ్రయం కల్పించేవాడై ఉండాలి. వారిని గండం నుంచి గట్టెక్కించేవాడై ఉండాలి. అన్నిరకాల కష్టాలు కడగండ్ల నుండి వారిని కాపాడేవాడై ఉండాలి. అంతా వినేవాడు, పిలిచేవాని పిలుపును విని, సమాధానం ఇచ్చేవాడై ఉండాలి. దిక్కుతోచని గడ్డు పరిస్థితుల్లో కూడా మార్గదర్శకత్వం వహించేవాడై ఉండాలి. తత్ఫలితంగా దాసుడు ఆయన పట్ల ఆకర్షితుడై, ఆయనకు శ్రద్ధాభక్తుల నివాళిని ఘటిస్తూ ఆయనవాడై పోవాలి.

నిజ ఆరాధ్య దైవం సర్వోన్నత శక్తుడై ఉండాలి. ఆయన అగోచరంగానే ఉండాలిగాని దాసుడు ఆయన సన్నిధిలో హాజరై ....

- ♦ ఆయనకు సాష్టాంగ ప్రణామం చేయాలి.
- ♦ ఆయన ఎదుట వినమ్రుడై నిలబడాలి.

- ఆయన సమక్షంలో చూపులు క్రిందికి ఉంచి, మర్యాదపూర్వకంగా మాట్లాడాలి.
- ఆయన మొరపెట్టుకోదగినవాడై ఉండాలి.
- ఆయన ఆశ పెట్టుకోదగినవాడు, భారం మోపదగినవాడై ఉండాలి.
- సహాయం కొరకు, మార్గదర్శకత్వం కొరకు నివేదించుకోదగినవాడై ఉండాలి.
- కష్టాలలో, ఆపద సమయాలలో సహాయమర్థించదగినవాడై ఉండాలి.
- భయానక పరిస్థితుల్లో శరణు కోరదగినవాడై ఉండాలి.

## (3) ఎవడు ఆరాధ్యుడు? ..... సాధారణ చర్చ

నా మొరలను ఆలకించేవాడు, సమాధానం ఇచ్చేవాడు నా ఆరాధ్య దేవుడు. నన్ను ప్రేమించేవాడు, నాపై దయచూపేవాడు, నా కష్టాన్ని దూరం చేసేవాడు, నాకు జబ్బు చేసినప్పుడు నయం చేసి ఆరోగ్యం ప్రసాదించేవాడు, జీవితపు సరైన బాటలో నడిపించేవాడు, నా వల్ల తప్పు జరిగినప్పుడు మన్నించేవాడు నా నిజ ఆరాధ్యుడు. నా వల్ల ఘోరమయిన అపచారాలు జరిగిపోయినప్పుడు – నేను పశ్చాత్తాపపడితే – నాకు క్షమాభిక్ష పెట్టేవాడు, నేను శరణు కోరినప్పుడు సకల దుష్టశక్తుల బారి నుండి నాకు రక్షణ కల్పించేవాడు నా నిజ ఆరాధ్యదైవం కాగలడు.

అంతేకాదు –

ఆయన నా వ్యవహారాలలో శ్రద్ధవహించేవాడు, నా ప్రాథమిక జీవితావసరాలను ఉత్తమ రీతిలో తీర్చేవాడు అయి ఉండాలి. నాతో ప్రత్యక్షంగా సంభాషించడానికి, విన్నపాలు చేసుకోవడానికి, నా అవసరాలను గురించి చెప్పుకున్నప్పుడు వాటిని నెరవేర్చేవాడే నా ఆరాధ్య దేవుడు కాగలడు.

నాకు మంచి జీవితం గడిపే శిక్షణ ఇచ్చేవాడు, తనను స్మరించి సంతుష్టపరిచే పద్ధతిని తెలియపరిచేవాడే నా ఆరాధ్య దైవం కాగలడు.

నా సదాచారాలకు విలువ ఇచ్చేవాడు, నన్ను ఇష్టపడేవాడు, నా యెడల ప్రసన్నుడయ్యేవాడు, నాకు బహుమానం వొసగేవాడే నా నిజ ఆరాధ్య దైవం కాగలడు. నన్ను పుట్టించి, నా జీవికకు కావలసిన వాటన్నింటినీ సమకూర్చగలవాడే నా నిజ ఆరాధ్య దైవం.

తన దాసులందరినీ ఒకనాడు సమావేశపరచి తీర్పు ఇచ్చేవాడు, బాధితునికి అతని హక్కు ఇప్పించేవాడు, దౌర్జన్యపరుణ్ణి శిక్షించేవాడే నా ఆరాధ్య దైవం కాగలడు. మంచిని ఇష్టపడి, చెడును అసహ్యించుకునేవాడే నా ఆరాధ్య దైవం కాగలడు.

జీవన్మరణాలు ఎవరి చేతిలో ఉన్నాయో ఆయన్నే నేను ఆరాధించాలి. ఎవరి అధీనంలో నా తలరాత ఉందో ఆయన్నే నేను సేవించాలి. దాసుల మధ్య ఎలాంటి విచక్షణ చూపకుండా మంచీ చెడుల ఆధారంగా వ్యవహారం చేసేవాడే నా విధేయతకు అర్హుడు. ఎవడు సదాచరణ చేస్తున్నాడో, మరెవడు ధిక్కార వైఖరిని అవలంబిస్తున్నాడో చూసి తదనుగుణంగా న్యాయనిర్ణయం గైకొనేవాడే నా ఉపాసనలకు తగినవాడు. న్యాయ నిర్ణయం గైకొనే సమయంలో మొగమాటానికి, ఆశ్రిత పక్షపాతానికి తావివ్వకుండా తీర్పు ఇచ్చేవాడే నాకు పూజనీయుడు.

నేను చేసుకున్న దానికి తగిన ప్రతిఫలం ఇచ్చేవాడు, ఏ రకంగా కూడా నాకు కొరత చేయనివాడు, నాకు చేసిన వాగ్దానాన్ని భంగపరచనివాడే నా నిజదైవం కాగలడు.

ఎవరి చేతిలో సమస్త విశ్వసార్వభౌమత్వం ఉందో ఆ శక్తిమంతుణ్ణి నేను ఆరాధిస్తాను. ఆయన విధేయతకే కట్టుబడి ఉంటాను. అంతం లేనివాడు, అజరుడు, సకల దోషాలకు అతీతుడు, పవిత్రుడైన వానినే నేను సేవిస్తాను.

ఈ పనులన్నీ చేసేవాడు, దగ్గరి నుండి నన్ను కనిపెట్టుకుని ఉండేవాడు, నా అవసరాలు, మనోభావాలను గుర్తించేవాడు మాత్రమే నా ఆరాధ్య దైవం కాగలడు. ఆయనే ఆరాధనలకు, ఉపాసనలకు తగినవాడు. ఆయనకు హృదయపూర్వకంగా సజ్దాచేసి, కృతజ్ఞతాంజలి సమర్పించగోర్తాను. ఆయనకు ప్రణమిల్లి, ప్రసన్నుణ్ణి చేయాలని తహతహ లాడుతూ ఉంటాను. ఆయన ఆదేశాలను శిరసావహించి, ఆయనకు విధేయత కనబరచి ఆయన్ని సంతోషపెట్టాలని అభిలషిస్తాడు.

వీటన్నింటినీ నెరవేర్చేవాడు నన్ను పుట్టించినవాడు మాత్రమే కాబట్టి ఆ సృష్టికర్తే ఆరాధ్యుడు కావాలి. సృష్టికర్త మాత్రమే పూజ్యుడు. ఆయనే సాష్టాంగప్రణామానికి అర్హుడు. ఆయన మాత్రమే విధేయత చూపదగినవాడు.

కనుక నా సృష్టికర్తే ఆరాధనకు తగినవాడు. ఆయన నా సిసలయిన

ఆరాధ్య దైవం. ఆయన సంతోషమే నా సంతోషం. నా జీవితపు లెక్క (Account) ఇవ్వడానికి నేను ఒకానొకనాడు ఆయన వద్దకు వెళ్ళవలసి ఉన్నది.

**(4) ఇంతకీ నిజ ఆరాధ్యదైవం ఎవడు? ... హేతువు వెలుగులో**

సృష్టికర్త మాత్రమే తాను పుట్టించిన వస్తువుకు యజమాని కాగలడు. అందుకే ఆయన మాలిక్ (యజమాని)గా కూడా వ్యవహరించబడతాడు. వాటి ఆలనాపాలనా చేస్తాడు. వాటికి మార్గదర్శనం కూడా చేస్తాడు. అందుకే ఆయన పాలకుడు, పోషకుడు కూడా అనబడతాడు (అంటే మన సృష్టికర్త మన ప్రభువు, పోషకుడు కూడా అన్నమాట!).

నిశ్చయంగా యజమాని ఆదేశమే అతని యాజమాన్యంలో ఉన్న వాటిపై చెల్లుతుంది. ఆయన తన ఏలుబడిలో ఉన్న వాటి వ్యవస్థ కోసం నియమ నిబంధనలను (Rules and Regulations) నిర్మిస్తాడు. వాటి రక్షణ, మనుగడ కోసం ఇవి చాలా అవసరం. అందుచేత ఆయన పాలనాధికారిగా కూడా వ్యవహరించబడతాడు.

ఈ చర్చవల్ల ముందుకు వచ్చిన యదార్థాలివి –

సృష్టికర్త మనల్ని పుట్టించాడు. శూన్యం నుండి ఉనికిని ప్రసాదించాడు. అందుచేత సృష్టికర్త మన మహోపకారి. ఆయన ఉపకారానికిగాను మన మనసు వంగిపోయి, కృతజ్ఞతలు చెల్లించాలని ఉబలాటపడుతుంది. కృతజ్ఞతా భావానికి అత్యుత్తమ విధానం సాష్టాంగప్రణామం (సజ్దా). అంటే సృష్టికర్తకు సజ్దా చేయాలి. ఆ విధంగా సృష్టికర్తే ఆరాధ్యుడయ్యాడు.

సృష్టికర్త యొక్క మరో స్థాయి 'యజమాని'ది. అంటే మానవుడు అతని యాజమాన్యంలో ఉన్న సేవకుడు అయ్యాడు. అందుచేత అతను తన యజమాని సమక్షంలో ఒక నౌకరుగానే ఉండాలి. వినమ్రుడై, తలవంచుకుని జీవించాలి. చెప్పిన పనులను మర్యాదగా చేయాలి. ఆయన ఎదుట మోకరిల్లాలి. ఆయన్ని స్తుతించాలి. ఆయన ఘనత్వాన్ని కొనియాడాలి. ఆయన ఉపకారాలకుగాను కృతజ్ఞతాపూర్వకమైన మాటలు చెబుతూ ఉండాలి. ఈ విధంగా స్వామి, యజమాని అయినవాడు ఆరాధనలకు తగినవాడయ్యాడు. ఆరాధ్యదైవం అయ్యాడు.

సృష్టికర్త యొక్క మూడవ స్థాయి ప్రభువు, పోషకునిది. అంటే మనం ఆయన పాలనలో పోషణలో ఉండటం వల్ల ఆయన మన ఆలనా పాలన

చేస్తుంటాడు. మనల్ని కాపాడుతూ ఉంటాడు. మనకు వృద్ధి నొసగుతాడు. మార్గదర్శకత్వం వహిస్తాడు, మనకు కావలసినవి సమకూరుస్తూ ఉంటాడు. మన మొరలను ఆలకిస్తాడు, అక్కరలు తీరుస్తాడు. మనల్ని అమితంగా ప్రేమిస్తాడు. మనపై దయచూపుతాడు. అందుచేత మన ప్రభువు (రబ్) మన ఆరాధ్య దైవం అయ్యాడు. ఆరాధనలకు అర్హుడయ్యాడు.

కాబట్టి మనం ఆయన ఎదుటే చేయి చాపాలి. ఆయన్నే వేడుకోవాలి. ఆయన సమక్షంలోనే మన అవసరాలు, అక్కరల గురించి విన్నవించుకోవాలి. ఆయనపైనే ఆశలు పెట్టుకోవాలి. ఆయనపైనే కార్యభారం మోపాలి. ఆయన్నే ప్రేమించాలి. ఆయన కారుణ్యాన్ని అర్థించాలి. జీవితంలో ఆయన మార్గదర్శకత్వాన్నే పొందాలి. ఈ ఉపకారాలే ఆయనకు 'ఆరాధ్యదైవం' స్థాయిని కల్పిస్తాయి.

సృష్టికర్త యొక్క నాల్గవ స్థాయి పాలనాధికారిది. అంటే ఆయన ఈ జగతిని, మానవుణ్ణి, ఇతర ప్రాణులను సృష్టించాడు. అందువల్లనే ఆయన చేసిన జీవరాశులపై ఆయన ఆజ్ఞే చెల్లుబాటు అవుతోంది. ఆయన ఈ జగతిలోనూ, ప్రాణులలోనూ ఏ వ్యవస్థనయితే నెలకొల్పాడో, ఏ నియమ నిబంధనలైతే పొందుపరిచాడో వాటి ప్రకారమే అవి నడుస్తున్నాయి. వాటి ప్రకారమే సజీవమై సక్రియమై ఉన్నాయి. నా దేహంపై కూడా నా ఆజ్ఞ చెల్లదు. .... నేను నా కళ్లతో వినేందుకు లేదా చెప్పేందుకు ప్రయత్నిస్తాను. కాని అలా చేయలేను. అవి నా శరీరంలోని భాగాలే అయినప్పటికీ వాటిపై నా హుకుం నడవటం లేదు. పాలనాధికారి అయిన సృష్టికర్త ఆజ్ఞ నడుస్తుంది. ఆయన వాటికి చూసే ఆజ్ఞ ఇచ్చాడు. అవి చూస్తున్నాయి.

నా సృష్టికర్త నా పాలకుడు గనక నేను ఎల్లవేళలా, ఎల్లెడలా, ప్రతి పనిలో, పూర్తి జీవితంలో ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలి. ఆయన సృష్టించాడు, ఆయన ఆజ్ఞాపాలన ఆయన హక్కు. ఆయన ఏ ఆజ్ఞ చేసినా, అది జ్ఞానం, యుక్తి, ప్రేమతో నిండి ఉంటుంది. అందులో దయ, జాలి, భద్రత ఇమిడి ఉంటుంది. ఎందుకంటే ఆయన, తాను సృష్టించిన ప్రాణులను అమితంగా ప్రేమిస్తాడు, మరీ ముఖ్యంగా మానవుణ్ణి. కనుక ఆయన ఏ ఆదేశాన్ని జారీచేసినా అందులో నా మేలు ఉంటుంది. కనుక నేనాయన్ని నా ఆరాధ్య దైవంగా అంగీకరించాలి. ఎందుకంటే ఆరాధ్య దైవం అయ్యే హక్కు ఆయనకే ఉంది.

పైన పేర్కొనబడిన నాలుగు దృక్కోణాల (Aspects) ద్వారా కూడా సృష్టికర్త నిజ ఆరాధ్యదైవం అయ్యే స్థాయి ఏమిటో తెలిసివస్తోంది. ఏ విధంగా చూసినా సృష్టికర్తే ఆరాధ్య దైవం. ..... స్వామి, యజమాని, ప్రభువు, సార్వభౌముడు – కనుక మన సృష్టికర్తే మన ఆరాధ్య దైవం.

**(5) నా సృష్టికర్తే నా ఆరాధ్య దైవం**

మన సృష్టికర్తే మన నిజ ఆరాధ్యదైవం అన్న విషయం వెనుకటి పంక్తులలో చాలా స్పష్టంగా సుబోధకం అయ్యింది. మానవ బుద్ధికి అందే సృష్టికర్త సుగుణాలు, మానవ నైజం వాంఛించే (Demand చేసే) విషయాలు అన్నీ పరిశీలనలోకి వచ్చాయి. ఇప్పుడు వీటన్నింటినీ సమీకరించి సృష్టికర్త మరియు నిజ ఆరాధ్య దైవం ప్రత్యేకతలేమై ఉంటాయో చూద్దాం. ముమ్మందు అవి నిజ ఆరాధ్య దేవుని అన్వేషణలో సహాయకారిగా ఉంటాయి.

**(6) నిజ ఆరాధ్య దైవాన్ని పరికించే కొన్ని గీటురాళ్ళు** (Criteria)

- ❖ మనకు జీవితాన్ని వొసగినవాడే ఆరాధ్య దైవం కావాలి – మనం లేము, కాని ఆయన మనకు ఉనికిని ప్రసాదించాడు. కాబట్టి మన సాష్టాంగ ప్రణామానికి హక్కుదారుడు ఆ మహోపకారి మాత్రమే కాగలడు.
- ❖ సిసలయిన, తొలి జీవితం, నిజ జీవితం సృష్టికర్తదే. కనుక సృష్టికర్తే ఆరాధ్యుడు. కాబట్టి జీవన్మరణాలు ఆ నిజ ఆరాధ్య దైవం హస్తగతమై ఉన్నాయి. అందుకే ఆయనే ఆరాధనకు, దాస్యానికి అర్హుడు.
- ❖ ఒకరు ఇచ్చిన జీవన దానంపై జీవించి ఉన్నవాడు ఆరాధ్య దైవం ఎలా అవుతాడు? స్వయంగా – తనంతట తానుగా – జీవించి ఉన్నవాడే ఆరాధ్య దైవం కాగలడు. అంటే ఆయన జీవితం అనంతం (Infinite) అయి ఉండాలి. అంటే ఏమీ లేనపుడు కూడా ఆయన ఉన్నాడు. ఏమీ లేకుండా పోయినప్పుడు కూడా ఆయన ఉంటాడు.
- ❖ ఆరాధ్య దేవుని అతి ముఖ్యమైన గుణం ఏమిటంటే ఆయనకు మరణమన్నదే ఉండకూడదు. ఆయన నిత్య సజీవుడై ఉండాలి.
- ❖ ఆయన సదా వెలుగొందుతూ ఉండాలి. తన తేజోవిలాసాలతో వర్ధిల్లుతూ ఉండాలి. అప్పుడే మానవ జీవితాలు పూర్తి విశ్వాసంతో, ధీమాతో జీవన ప్రదాత వైపునకు మరలుతాయి.

- సదా శాశ్వతంగా, సురక్షితంగా ఉండేవాడే ఆరాధ్య దైవం అవుతాడు. అంటే ఎప్పుడూ ఆయన అస్వస్థతకు లోను కాకూడదు. కష్టాలు కడగండ్లపాలై అశక్తతకు గురికాకూడదు. ఆయన పరిపూర్ణత ఎన్నటికీ అరిగిపోరాదు, కరిగిపోరాదు.
- తాను స్వయంగా కష్టాల పాలయ్యేవాడు ఇతరులను కష్టాల నుండి ఎలా ఆదుకోగలుగుతాడు?
- అలసటను, అలసత్వాన్ని, ప్రమత్తతను, పరధ్యానాన్ని దరి చేరనివ్వనివాడే ఆరాధ్య దైవం కాగలడు. అంటే ఆయనకు నిద్రగానీ, కునుకుగానీ పట్టకూడదు. విశ్రాంతి తీసుకోవలసిన అగత్యం ఆయనకు ఏర్పడకూడదు.
- ప్రతి దాన్నీ ఎరిగినవాడు, ప్రతి కాలం గురించి, ప్రతి ప్రదేశం గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు, సమస్తాన్నీ తన జ్ఞానపరిధిలో చేర్చుకున్నవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.
- భూమ్యాకాశాలన్నింటిపై అదుపు అజమాయిషీ పూర్తిగా కలిగి ఉన్నవాడే ఆరాధ్య దైవం అవుతాడు. జగతిలోని ఏ ఒక్క అంగుళం కూడా ఆయన సార్వభౌమత్వ పరిధికి ఆవల ఉండకూడదు.
- సువిశాలమైన ఈ విశ్వ వ్యవస్థలో సమస్త ఏర్పాట్లు చేయటం, వేనవేల ఏండ్లుగా ఎలాంటి అవరోధం లేకుండా ప్రాణులకు కావలసినవన్నీ సమకూర్చటం, ఒక్క క్షణం కూడా సృష్టితాలు ఆయన అదుపాజ్ఞల నుండి బయటికి పోకుండా నియంత్రించటం – ఇన్ని ఘనకార్యాలు చేసేవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- బలహీనతలు, లోపాలు, దోషాలకు అతీతుడైనవాడు, సకల సుగుణాలు నిండుగా ఉన్నవాడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు.
- పరమ పవిత్రుడు, పరిశుద్ధుడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు. ఏ విషయంలోనయినా చెడుకు ఊహామాత్రంగా కూడా ఆస్కారం లేనివాడు ......
- ఆరాధ్య దైవం సదా నిరపేక్షాపరుడై ఉంటాడు.
- ఆరాధ్య దైవం అనేవాడు ప్రతిదానిపై తిరుగులేని అధికారం కలిగి ఉండాలి. ఆయన ఎవరికయినా ఏదయినా ఇవ్వదలిస్తే ఎలాంటి అడ్డు ఉండకూడదు.

- జీవితాన్ని, జీవనావసరాలను శూన్యం నుండి వెలికితీయగలవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- జీవన్మరణాలు హస్తగతమై ఉన్నవాడే ఆరాధ్య దైవం.
- జగతిలోనూ – జగతిలోని వస్తువులలోనూ సానుకూలతను, సారూప్యాన్ని పొందుపరచి, వాటి మనుగడకు అపురూపమయిన ఏర్పాటు చేయగలవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.
- ఆరాధ్య దైవం ఎవడంటే, ఆయన ఇచ్చిన తీర్పును సవాలుచేసే ధైర్యం ఎవరికీ ఉండకూడదు. ఆయన నిర్ణయాన్ని అమలుకాకుండా అడ్డుకునే సాహసం కూడా ఎవరూ చేయకూడదు. తాను గైకొన్న చర్యలకు గాను ఆయనకు ఎవరికీ జవాబు ఇచ్చుకోవలసిన పరిస్థితి రాకూడదు. ఆయన అందరికన్నా ఉన్నతుడు, సర్వాధికారి అయి ఉండాలి.
- తన జీవన వ్యవధికి, జీవన శక్తికి ఎలాంటి పరిమితి లేనివాడే ఆరాధ్య దైవం కాగలడు.
- ఆరాధ్య దైవం అనేవాడు కనుమరుగై ఉండాలి. అగోచరుడై ఉండాలి. మనం ప్రతిచోటా, ప్రతి క్షణం ఆయన గుణగణాల ఆధారంగా ఆయన్ని ఊహించుకుని, మనకు అత్యంత చేరువలో ఉన్నాడని తలపోయాలి. ప్రతిచోటా, ప్రతి సమయం ఆయన మనల్ని చూస్తున్నాడు, మనం చెప్పేది వింటున్నాడు. ఆయన ఎక్కడయినాసరే, ఏదయినాసరే చేయగల సమర్థుడు. కనుక మనం కూడా ఆయన్ని అత్యంత సమీపంలో ఉన్నవానిగా, ప్రేమించేవానిగా, దయజూపేవానిగా, క్షమాభిక్ష పెట్టేవానిగా ఎందుకు ఊహించకూడదు? ఈ సుగుణాలన్నీ ఆ లక్షణాలలో నిక్షిప్తమై ఉన్నాయి.
- సృష్టికర్తే ఆరాధ్యుడు కాగలడు. సృష్టికర్త ఒకే ఒక్కడు, అద్వితీయుడు. కాబట్టి ఆరాధ్య దైవం కూడా ఒక్కడే అయి ఉండాలి.
- ఆరాధ్య దైవం అనేవానికి కుటుంబం, కుటుంబ బాదరబందీలు ఉండ కూడదు. కుటుంబం ఉంది అంటే ఆయనకూ అవసరాలు ఉంటాయి. సమస్యలుంటాయి. కోర్కెలుంటాయి. ఇవి అతని బలహీనతలుగా పరిణమిస్తాయి. బలహీనుడైన వానిని ఆరాధ్య దైవంగా చేసుకోకూడదు.
- నిజ ఆరాధ్య దైవం ఎవడంటే ఒకరు ఆయన్ని నమ్మినా నమ్మకపోయినా, విధేయత చూపినా, చూపకపోయినా, ఆయన సమక్షంలో మోకరిల్లినా

మొకరిల్లకపోయినా ఆయన ఔన్నత్యంలో ఎలాంటి తేడా రాదు, రాకూడదు.

- ❖ ఆరాధ్య దైవం అనేవాడు ఒకరి ద్వారా చేయబడినవాడు, పుట్టించ బడినవాడు అయి ఉండకూడదు. ఆయన్ని పోలినవాడు ఎవడూ ఉండకూడదు. ఆయనకు సమఉజ్జీ కూడా ఉండకూడదు. అన్ని బలహీనతలకు, లోపాలకు, పరిమితుల (Limitations) కు అతీతుడు, పవిత్రుడైనవాడే నిజ ఆరాధ్య దేవుడు.

  పుట్టడం / పుట్టించబడటం ఒక బలహీనత.

  మరణం అశక్తతకు, నిస్సహాయ స్థితికి తార్కాణం.

- ❖ ఎవరిముందూ సంజాయిషీ ఇచ్చుకోవలసిన స్థితి రాకుండా ఉండనివాడే ఆరాధ్య దైవం అవుతాడు. ఏదో ఒక బలహీనత ఉన్నవానికే సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. బలహీనత ఉన్నవాడే తప్పు చేస్తాడు, తన వద్ద ఉన్న శక్తిని, అధికారాలను దుర్వినియోగం చేస్తాడు. జులుం చేస్తాడు, ఒకరి హక్కును హరిస్తాడు. ఒకరికి అన్యాయం చేస్తాడు. కాగా; నిజ ఆరాధ్య దైవం ఇలాంటి దోషాలన్నింటికీ అతీతుడై, సర్వోన్నత సార్వభౌముడై ఉండాలి.

- ❖ నిజ ఆరాధ్య దైవానికి పరిపాలనా దక్షత కూడా ఉండాలి. ఆదేశించే గుణం ఉండాలి. జగతిలోని ప్రతిదీ ఆయన ఆదేశాలకు లోబడి ఉండాలి.

- ❖ ఆరాధ్య దైవానికి ఉండవలసిన మరో విశిష్ఠ లక్షణం ఏమిటంటే ఆయన శరణుపొందిన వ్యక్తికి పూర్తిగా అభయం లభించాలి. ఆ వ్యక్తి నిశ్చింతగా, ప్రశాంతంగా ఉండగలిగే స్థితి ఏర్పడాలి. ఇది ప్రతి మనిషిలోని సహజ వాంఛ.

- ❖ తన దాసుని మొరను ఆలకించి, సమాధానం ఇచ్చేవాడే, అతనికి సహాయపడేవాడే, అతనికి మార్గదర్శనం చేసేవాడే, అతన్ని గండం నుంచి గట్టెక్కించేవాడే నిజ ఆరాధ్య దైవం. ఇలాంటి అస్థిత్వమే ఆరాధనలకు, కృతజ్ఞతలకు, స్తోత్రాలకు, సాష్టాంగ ప్రణామాలకు యోగ్యమైనది.

- ❖ ఆరాధ్య దైవం అనేవానికి మానవ వ్యవహారాల పట్ల శ్రద్ధాసక్తులు ఉండాలి. మానవుని దైనందిన జీవిత సమస్యల పట్ల ఆయన నిర్లక్ష్యం

వహించకూడదు. ఆయన అతని సమస్యల పట్ల శ్రద్ధ వహించినప్పుడే అతని మనసు ఆరాధనకు సుముఖంగా ఉంటుంది. ఆరాధ్య దైవమే చొరవచూపకుండా నిర్లిప్తంగా ఉండిపోతే ఇంక మనిషికి మాత్రం దైవదాస్యం పట్ల శ్రద్ధ ఎక్కడుంటుంది?

- ❖ మానవుని దైనందిన జీవితావసరాలన్నింటినీ ఉత్తమ రీతిలో ఏర్పాటు చేసేవాడే నిజ ఆరాధ్య దైవం కాగలుగుతాడు. ఒకవేళ అతను ఇవేమీ చేయలేని పక్షంలో దాసుల పూజాపునస్కారాలను అందుకునే అర్హత ఆయనలో లేదన్నమాటే. ఇలాంటి వానిని ఆరాధ్యదైవంగా నమ్మటం వల్ల ప్రయోజనమేమీ ఉండదు.
- ❖ దైనందిన జీవితంలో మనిషితో ఆరాధ్య దైవానికి గల సంబంధం అత్యంత దగ్గరి సంబంధం అయి ఉండాలి. ఆయన నిత్యం తనతో ఉంటాడన్న అనుభూతి మనిషికి కలగాలి. ఈ సామీప్య భావన మానవ జీవితంపై మంచి ప్రభావం చూపుతుంది. అతని జీవితపు అన్ని విభాగాలలో గొప్ప నైతిక విప్లవం వస్తుంది. జీవన వ్యవహారాలలో మనిషిలో ఒక నిలకడ, నెమ్మది ప్రాప్తిస్తుంది. అతని జీవితం సదా సరైన రీతిలో, పూర్తిస్థాయి గమనం (Dynamic) తో ముందుకు దూసుకుపోతుంది.
- ❖ తన దాసుని పశ్చాత్తాపాన్ని దయతో స్వీకరించి, అతన్ని క్షమించి, ఔదార్యం ప్రదర్శించేవాడే ఆరాధ్య దైవం కాగలడు. ఎందుకంటే, ఈ ఔదార్యం వల్ల నిన్నటి వరకూ అవిధేయుడుగా ఉండి బ్రతుకును దుర్భరం చేసుకున్న వానికి ఊరట లభిస్తుంది. అతను భవిష్యత్తులో చిత్తశుద్ధితో తన ఆరాధ్య దైవం వైపునకు మరలే అవకాశముంటుంది.
- ❖ మానవులందరినీ సమభావంతో చూసేవాడు, అందరినీ ప్రేమించేవాడు, వారి మధ్యన ఎలాంటి విచక్షణ చూపనివాడే నిజ ఆరాధ్య దైవం అనదగినవాడు. జన్మతః ఆయన ఎవరినీ ప్రియతమునిగా పరిగణించ కూడదు. ఆరాధన విషయంలో ఆయన ఒకరి మధ్యవర్తిత్వాన్ని (వాస్తాను) ఇష్టపడకూడదు. అందరికీ ప్రత్యక్షంగా తనతో ఊసులాడే అవకాశం కల్పించాలి. ఆ పద్ధతి ఏదో విశదపరచాలి.
- ❖ తీర్పుదినాన – సదాచరణల ఆధారంగా – ఒకరి సిఫారసు అవసరం కూడా ఏర్పడకుండా – న్యాయం చేయగలవాడే నిజ ఆరాధ్య దైవం.

- న్యాయాన్ని రక్షించి, దానిని స్థాపించి శిక్షాబహుమానాలను వొసగేవాడే నిజ ఆరాధ్యదైవం కాగలడు.
- ప్రతి ప్రాణినీ పుట్టించిన మీదట, దాని ఉనికి పరమార్థాన్ని నెరవేర్చుకునేందుకు మార్గనిర్దేశన చేసేవాడే నిజ ఆరాధ్య దైవం కాగలగాలి. అంటే దాని జీవిత లక్ష్యం ఏమిటో దాని స్వభావంలోనే పొందుపరచాలి. ఆ లక్ష్యాన్ని ఎలా ఛేదించాలో దానికి ఎరుకపరచాలి. ఈ విధంగా ఆయన మానవునికి కూడా మార్గబోధన చేయాలి.
- జీవిత గమనం కోసం నిర్దేశిక నియమాలను ప్రసాదించి, అత్యుత్తమ ప్రబోధనల ద్వారా మానవాళికి సుఖశాంతుల జీవనం ఇవ్వగలవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు. ఆ ప్రబోధనలను మానవులందరి వరకు చేర్చే ఏర్పాటు కూడా ఆయన చేయాలి.
- సజీవిగా లేనివాడు, జీవితానికి మూల సరోవరం కానివాడు ఆరాధ్య దైవం కాజాలడు.
- చచ్చేవాడు, చంపబడేవాడు, తన జీవితానికి రక్షణ కల్పించుకోలేని వాడు ఆరాధ్య దైవం కాలేడు.
- అందరికన్నా గొప్పవాడు, అందరిపైనా ఔన్నత్యం (Supreme) కలవాడే నిజ ఆరాధ్య దైవం.
- దోషాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడైనవాడే నిజ ఆరాధ్య దైవం.
- సమస్త స్తుతి స్తోత్రాలకు, ప్రశంసలకు అర్హుడైనవాడే ఆరాధ్యుడు.
- నిరర్థకమయిన, అర్థరహితమయిన పని ఏదీ చేయనివాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.
- ప్రతి దానిని గురించి పూర్తిగా ఎరిగి ఉన్నవాడే నిజ ఆరాధ్యదైవం కాగలడు. సమాచారం లేనివాడు ఆరాధ్య దైవం ఎట్లా అవుతాడు?
- జీవితపు సకల బలహీనతలు, అక్కరలు, అశక్తతలకు అతీతుడైనవాడే నిజ ఆరాధ్య దైవం.
- జగతిలోని సమస్త ప్రాణికోటికి కావలసిన వాటిని సమకూర్చడంలో ఎలాంటి ప్రతిబంధకాన్ని ఎదుర్కోకుండా – తిరుగులేని విధంగా – పాలన చేసేవాడే నిజ ఆరాధ్య దైవం.

- ❖ నిజ ఆరాధ్య దైవం అయినవాని అధికారం ఎంత అప్రతిహతంగా ఉండాలంటే, ఆయన జారీ చేసిన ఒక్కగానొక్క ఆజ్ఞ కార్యనిర్వహణకు సరిపోవాలి. అంటే ఏదేని ఒక పని చేయడానికి ఆయన ప్రయాసపడ వలసిన అగత్యం ఉండకూడదు. దేనిగురించి అయినా సంకల్పించుకుని 'అయిపో' అనంటే చాలు, అది అయిపోవాలంతే.
- ❖ ఆరాధ్య దైవం అయినవాడు ఎల్లప్పుడూ, ప్రతి పనిలో, సర్వవిధాలా సర్వస్వతంత్రుడై ఉండాలి. అలాగాకుండా ఒకరిపై ఆధారపడటం కూడా ఒక బలహీనతే. బలహీనుడైనవాడు ఆరాధ్యదైవం కాజాలడు. బలహీనత లున్నవాణ్ణి ఆరాధించటమంటే మనల్ని మనం కించపరచుకోవటమే.
- ❖ ఆరాధ్య దైవం సకల లోపాలకు అతీతుడు, సకల సుగుణాలకు నిలయమైనవాడై ఉండాలి. సృష్టించేవాడు అత్యంత శక్తిమంతుడు, వివేకవంతుడు, జ్ఞాన సంపన్నుడు, సర్వ స్వతంత్రుడు, స్వయం నిర్ణయాధికారి, స్వయం మార్గదర్శకుడు (Self Guided) అయి ఉంటాడు. సృష్టించేవాడే ఆరాధ్య దైవం అవుతాడు.
- ❖ భూమ్యాకాశాల ఆరాధ్య దైవమే మన ఆరాధ్య దైవం కూడా.
- ❖ నిజ ఆరాధ్య దైవం ఎదుట అందరూ అశక్తులే. ఆయనే సర్వోన్నతుడు (Dominant)
- ❖ భూమ్యాకాశాలలో ఉన్న వాటన్నింటిపై పూర్తి అదుపు అజమాయిషీ కలవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- ❖ ఏ అధికారమూ లేనివానికి ఆరాధ్య దైవం అయ్యే అర్హత లేదు.
- ❖ జగతి మరియు జగతిలోని సమస్త జీవరాశుల మనుగడకు కావలసిన వాటన్నింటినీ సమకూర్చేవాడే ఆరాధ్య దైవం అవుతాడు.

**ఆరాధ్యుడు, స్తవనీయుడు ఎవడంటే .....**

- ❖ సృష్టించేవాడు, సృష్టించబడనివాడు.
- ❖ అన్ని లోపాలకు, దోషాలకు అతీతుడు, పవిత్రుడు.
- ❖ అత్యంత బలశాలి; బలహీనత లేనివాడు.
- ❖ ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా స్వయంగా నిలదొక్కు కున్నవాడు.

- అనశ్వరుడు, శాశ్వతంగా ఉండేవాడు.
- అక్కరలు తీర్చేవాడు. ఏ అక్కరా లేనివాడు.
- సూక్ష్మద్రష్ట. ప్రతిదీ చూసేవాడు, ప్రతిదీ వినేవాడు.
- పరమ పవిత్రుడు.

ఇలాంటివాడు మాత్రమే పూజనీయుడు. ఇటువంటి గొప్ప శక్తిమంతుని ఎదుట మోకరిల్లటమే సరైనది. ఇందులోనే మానవ గౌరవం ఇమిడి ఉంది. లోపమున్నవాడు పవిత్రుడు కాజాలడు. అలాంటి వానికి సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేసి మనిషి తనను తాను కించపరచుకుంటాడు.

### (7) నిజ ఆరాధ్య దేవుని అన్వేషణ

నిజ ఆరాధ్య దైవానికి సంబంధించి ముందుకు వచ్చిన 'భావన' మనసుకు నచ్చుతుందా? అది మనిషి మనోమయ భావాలకు ప్రేరేపణగా ఉంటుందా? అన్నది ప్రశ్న. 'ఆరాధ్య దైవం ఇలాగే ఉండాలి' అని అంతరాత్మ సాక్ష్యమిచ్చి నట్లయితే, అటువంటి సద్గుణ సాగరుడయిన స్వామిని అన్వేషించాలి. మన జీవితానికి ఎంతో అవసరమైన ఈ 'దైవం' ఎక్కడ, ఏ సిద్ధాంతం (Ideology), ఏ పుస్తకం, ఏ మతంలో లభిస్తుందో చూడాలి. మొత్తానికి కృషి జరగాలి. నిజ ఆరాధ్య దైవం అన్వేషణ మనిషిని ఆ మూల సరోవరానికి తప్పక చేరుస్తుంది. అక్కడికి చేరుకున్నప్పుడు అతని మనసుకు శాంతి, నెమ్మది లభిస్తుంది. పరిశోధన, మార్గదర్శకత్వం నిమిత్తం నేను రాసిన మరో పుస్తకం "**ఆయియే మఆబూదె హఖీఖీ సే ములాఖాత్ కీజియే**" (ఉర్దూ) అధ్యయనం చేయవచ్చు.

నిజ ఆరాధ్య దైవం అన్వేషణలో అవరోధంగా మారే కారకాల (Factors) పట్ల కడు అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే మనిషి ఈ అన్వేషణా మార్గంలో వెనుకబడిపోతాడు. లేదా అన్వేషించినప్పటికీ స్వీకార భాగ్యానికి నోచుకోకుండా పోతాడు. రానున్న అధ్యాయంలో ప్రతిబంధకాలుగా పరిణమించే ఆ విషయాలే ప్రస్తావించబడ్డాయి. అందుకే ఈ అధ్యాయానికి "తస్మాత్ జాగ్రత్త!" అని నామకరణం చేయటం జరిగింది.

**పదవ అధ్యాయం :**

# తస్మాత్ జాగ్రత్త!

సాధారణ చర్చ

సత్యాన్వేషణ : ప్రతిబంధకాలు

**(1)** బుద్ధిని ఉపయోగించటం

**(2)** తప్పుడు ప్రమాణం – సాఫల్యయత్నంపై దాని ప్రభావం

**(3)** తెలియకపోవటం – వాతావరణ ప్రభావం

**(4)** సాకుల వలయం : సన్మార్గం పొందటంలో వైఫల్యానికి ఒక కారణం

**(5)** మనోవాంఛల దాస్యం, ప్రాపంచిక వ్యామోహం

**(6)** సంకుచిత స్వభావం, దురభిమానం

**(7)** తనకు తెలిసిందే సర్వస్వమని తలపోయటం

**(8)** గర్వం, అహంకారం

**(9)** పెద్దల పూజ

**(10)** ఊహాగానాలు

**(11)** బుద్ధిని సరిగ్గా ఉపయోగించుకోకపోవటం

**(12)** పెడదారి పట్టించేవారు

**(13)** కష్టకాలాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి

**(14)** దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ని) నమ్మనివారు, బహుదైవవాదన (షిర్క్)ని అవలంబించేవారు సన్మార్గం పొందలేరు

**(15)** పరలోకాన్ని తిరస్కరించేవారు సన్మార్గం పొందలేరు

# తస్మాత్ జాగ్రత్త!

శాశ్వతంగా నష్టం కలిగించే, సత్యానికి దూరం చేసే, అపమార్గం వైపునకు తీసుకుపోయే వస్తువు పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**సాధారణ చర్చ**

సృష్టికర్త, ఆరాధ్య దైవం అయినవాడు స్వయంగా తనను పరిచయం చేసుకోవాలని, ఆయన తప్ప వేరెవరూ ఆయన గురించిన పూర్తి పరిచయం చేయించలేరని హేతువు (Logic) అంటుంది. ఇంకా హేతువు అనేదేమిటంటే, ఆయన ఒక్కో వ్యక్తికి వేర్వేరుగా పరిచయం చేయకుండా విస్తృత ప్రాతిపదికపై తన ప్రబోధనలను ప్రమాణబద్ధమైన విధానం (Authentic Source) ద్వారా ఎరుకపరుస్తాడు. ప్రతి మనిషి (స్త్రీ, పురుషుడు) దీనిద్వారా తన సృష్టికర్తకు సంబంధించిన పరిజ్ఞానాన్ని ఆర్జించగలడు – అంటే ఆయనకు ఇష్టమైనదేదో, ఇష్టం లేనిదేదో, తన జీవిత లక్ష్యమేదో తెలుసుకోగలుగుతాడు. మనుషుల మధ్య పరస్పర సంబంధాల గురించి, మనిషికి లాభనష్టాలు ఎందులో ఉన్నాయో, ఏ విధానం వల్ల మనిషి సుఖవంతమైన జీవితం గడుపుతాడో, మరణానంతరం ఏమవుతుందో తెలుసుకుంటాడు.

శాశ్వతమైన (Permanent) ఈ సన్మార్గ సాధనాన్ని అన్వేషించి తద్వారా లబ్ధి పొందటమనేది మనిషి కృషిపై ఆధారపడి ఉంది. అందుకుగాను అవసరమైన వస్తువులు, సౌకర్యాలు (Pre-Requisites) కూడా అతనికి సమకూర్చబడ్డాయి. విజ్ఞాన సరోవరం (Source) వ్యక్తికి తెలియపరచబడింది. వ్యక్తికి ఆ మూల సరోవరం వరకు చేరుకునే మార్గం కూడా సూచించబడింది. ఆ సన్మార్గ సరోవరం దైవగ్రంథం అయి ఉండాలి. అది పఠనీయమైనదై ఉండాలి. ఆ గ్రంథం ఎవరిద్వారా అందజేయబడిందో అతను పురుషోత్తముడై

ఉండాలి. నైతికత రీత్యా అతను అత్యున్నత శిఖరాన ఉండాలి. అతను సత్యసంధుడై ఉండాలి. తనకు అప్పగించబడిన దానిని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా – యధాతథంగా – మానవాళికి అందజేసే నిజాయితీపరుడై ఉండాలి. తాను స్వయంగా ఆ గ్రంథం ప్రకారం ఆచరించి అందరికీ అనుసరణీయంగా నిలవాలి. తన క్రియాత్మక జీవితం ద్వారా సృష్టికర్త అభిమతాన్ని, ఉపదేశాలను స్పష్టంగా చాటిచెప్పాలి. అతని క్రియాత్మక నడవడి ఆ గ్రంథ ప్రబోధనలకు ప్రతిబింబంగా ఉండాలి.

ఈ ప్రాథమిక, హేతుబద్ధమైన అవగాహన (Logical Understanding) తరువాత నిజ ఆరాధ్య దైవం అన్వేషణ సులభతరమై పోతుంది. ఇంతకీ ఆ ఆకాశ గ్రంథమేదో, దానిని తన భుజస్కంధాలపై మోసుకువచ్చిన ఆ శుభాత్మ ఏదో తెలుస్తుంది. ఈ గ్రంథం లభించిన తరువాత, నిజ ఆరాధ్య దైవానికి ఉండవలసిన ప్రమాణం (Criteria) ఆ గ్రంథంలో వివరించబడిందో లేదో పరిశీలించాలి. అవునని సమాధానం వస్తే, అది నిజంగా దైవగ్రంథమేనని నిర్ధారించుకోవాలి. అయితే ఈ అన్వేషణలో ఉన్న వ్యక్తికి ఇంటా బయటా ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. సామ దాన భేద దండోపాయాలు అతనిపై ప్రయోగించబడతాయి. 'సన్మార్గమే' లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తి ఈ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి. సంయమనంతో వ్యవహరించాలి. ఆ అవరోధాలు ఏమిటో ఇప్పుడు వస్తాయి.

### సత్యాన్వేషణ – అవరోధాలు

సన్మార్గ దర్శనంలో ఎదురయ్యే ప్రతిబంధకాలు, అపమార్గం వైపునకు లాక్కుపోయే కారకాలు (Factors) కొన్ని ఇక్కడ ప్రస్తావించబడుతున్నాయి –

వాస్తవాన్ని తెలుసుకున్న మీదట, దానిని స్వీకరించడంలో అడ్డంకిగా తయారయ్యే వస్తువులేవో దృష్టిలో పెట్టుకోవాలి – మనిషి ఎంత ప్రయత్నించినా సత్యాన్ని ఆస్వాదించలేక పోవటానికి ప్రధాన కారణం అవే కాబట్టి, వాటిపట్ల జాగ్రత్తపడతాడు.

### (1) బుద్ధిని ఉపయోగించటం

ఈ సందర్భంగా మనిషి దైవ ప్రసాదితమయిన అత్యంత ముఖ్యమైన

వస్తువును – అంటే ‘బుద్ధి’ని – సద్వినియోగం చేసుకోవాలి. అంతర్గతమైన ఈ విలువైన మూలధనాన్ని (Great Asset) గనక సరిగ్గా ఉపయోగించుకోకపోతే తప్పేదో – ఒప్పేదో, సత్యమేదో – అసత్యమేదో పరికించి సత్యాన్ని గ్రహించటం మనిషికి కష్టమైపోతుంది. మూర్ఖుల మాదిరిగా అతను ప్రపంచంలో అందంగా, ఆకర్షణీయంగా కనిపించిన ప్రతి దాని వెనుకపడి సత్యానికి దూరమైపోతాడు. పరిసరాలు, రీతీ రివాజులు మారితే తాను కూడా వాటికనుగుణంగా మారిపోతుంటాడు. అతని ఆచరణా విధానం కూడా మారిపోతూ ఉంటుంది. కాగా; సత్యం సదా ఒక్కటే అయి ఉంటుంది. అది మారదు. కాలం మారినా అది మాత్రం అలాగే ఉంటుంది. లోకమంతా తిరస్కరించినాసరే సత్యం మాత్రం వెలుగొందుతూ, వైభవోపేతంగా నిలబడి ఉంటుంది. తనను నమ్మనివారి విషాదాంతంపై విచారాన్ని వ్యక్తపరుస్తూ ఉంటుంది.

### (2) సాఫల్యానికి తప్పుడు ప్రమాణాలు

మనసులో తప్పుడు ప్రమాణాలను ఏర్పరచుకోవటం వల్ల, లేదా సమాజంలో ప్రబలి ఉన్న మూఢ విశ్వాసాలను అవలంబించటం వల్ల మనిషి సత్యాన్ని పరికించే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడు. తత్ఫలితంగా అతను సత్యాన్ని కానలేకపోతాడు, సత్యాన్ని గ్రహించలేకపోతాడు. జనులు సన్మార్గగమనానికి, సృష్టికర్త సామీప్యం పొందటానికి తమ ఆస్తీ అంతస్తులను, సిరిసంపదలను ప్రమాణంగా భావిస్తారు. ఈ తప్పుడు భావన మనిషిని మంచి మాటపై చింతన చేసి, సాఫల్యం పొందగలిగే మార్గానికి దూరం చేసేస్తుంది. మరణానంతరం మనిషి తిరిగి లేపబడినప్పుడు అతని శిక్షా బహుమానాలకు ఈ ప్రాపంచిక జీవితంలో ‘ఆచరణలే’ ప్రాతిపదిక కావాలని బుద్ధి అంటుంది; అంతేగాని సిరిసంపదలు, అంతస్తులు సాఫల్యానికి ప్రాతిపదిక కావు. సృష్టికర్త సన్నిధిలో మనిషి కల్పించుకున్న ఈ కాల్పనిక భావాలు స్వీకారయోగ్యం కాజాలవు. తస్మాత్ జాగ్రత్త!

### (3) అజ్ఞానం, పరిసరాల ప్రభావం

సాధారణంగా మనిషి తాను చూసిన వాటిని, తాను తెలుసుకున్నవాటినే స్వీకరించి అవలంబిస్తాడు. అవే సరైనవని భావిస్తాడు. ఎందుకంటే సత్యం

అతని ముందుకు రానేలేదు. సత్యం వరకు అతను చేరుకోలేకపోవటానికి ఒక ప్రధాన కారణం తెలియకపోవటమే. దాంతోపాటు మనిషి తాను నివసించే పరిసర ప్రాంతానికి సహజంగానే ప్రభావితుడవుతాడు. అందుకే అతను సత్యం విషయంలో దేవుడిచ్చిన తెలివితేటల్నే ఉపయోగించి, చింతన చేయాలి. సత్యాన్ని అన్వేషించాలి. సజ్జనుల ద్వారా సత్యజ్ఞానం ఆర్జించాలి. సద్వర్తనుల సహచర్యం పొందాలి. అప్పుడే అతనిలోని మనోమయ భావాలు, ఆలోచనలు సరైనదిశలో ప్రవర్ధమానమవుతాయి. జీవితపు రాచబాట ఏదో మనిషికి అర్థమవుతుంది. అలాగే అతను ధార్మిక గ్రంథాలను అధ్యయనం చేస్తూ ఉండాలి. ఈ అధ్యయనం వల్ల మంచీ చెడుల మధ్య విచక్షణను పాటించే జ్ఞానం పెంపొందుతుంది. గ్రాహ్యశక్తి పదునెక్కుతుంది. తద్భిన్నంగా చెడు వాతావరణంలో, చెడు సహచర్యంలో ఉంటే మనిషి మార్గవిహీనతలో బహుదూరం వరకు వెళ్ళిపోతాడు. అందుకే చిత్తశుద్ధితో దివ్య గ్రంథ పఠనం చేయాలి. శుభాత్మల అన్వేషణలో ఉండాలి. సజ్జనుల సాంగత్యం కొరకు పరితపిస్తూ ఉండాలి. అందుకే జాగ్రత్త, అప్రమత్తత చాలా అవసరం.

**(4) కుంటిసాకులు : సన్మార్గావలంబనలో ప్రధాన అడ్డంకి**

అద్భుతాల, మహిమల దృష్టికోణంతో విషయాన్ని చూడటం, అది అద్భుతమైనదై ఉంటే స్వీకరించటం, లేదంటే తృణీకరించటం ఒక పద్ధతి. ప్రాపంచిక జీవితపు తళుకుబెళుకుల్లో, భోగవిలాసాలలో మునిగి ఉండగోరేవారు, సృష్టికర్త తరఫున ప్రభవింపజేయబడిన పురుషోత్తముని ప్రవచనాలను వినరు. ఆ ప్రవచనాలలో మార్గబోధన, జ్యోతి ఉన్నప్పటికీ వాటిని స్వీకరించరు. ఎందుకంటే దైవభావన, అది కోరే అంశాలు వారి ప్రాపంచిక ప్రయోజనాలకు అడ్డొస్తాయి. వారి మనోవాంఛలకు అవి విఘాతంగా పరిణమిస్తాయి. అందువల్ల సత్యాన్ని స్వీకరించమని అనగానే క్షణాల్లో వారి మదిలో కుంటిసాకుల జాబితా తయారైపోతుంది. నిజానికి వాటికి ఏ ఆధారమూ ఉండదు. అయినప్పటికీ మానవుడు ఆ సాకుల వలయంలో తేలిగ్గా చిక్కుకుపోతాడు. అలాంటి కుంటిసాకులలో కొన్ని ఇక్కడ పేర్కొనబడుతున్నాయి. సత్యకాముకులు వాటిపట్ల కడు జాగ్రత్తగా ఉండాలి.

ఉపదేశం, సత్యవాక్కు స్వీకరించకపోవటానికి గల కారణాలలో ఒకటేమంటే, జనులు ఉపదేశం చేసే వాడెవడో చూస్తారు. అంతగొప్ప సందేశాన్ని

తమలాంటి ఒక సాధారణ మనిషి అందజేయటం వారికి రుచించదు. ముఖ్యంగా సమాజంలోని ధనికులు, మర్యాదస్తులు – ప్రాపంచిక దృష్టితో – ఒక సామాన్య వ్యక్తి ఇచ్చే సందేశాన్ని అంగీకరించటానికి వెనుకాడతారు. అంగీకరిస్తే అది తమకు నామోషీ అనుకుంటారు. మరి చూడబోతే ఆ సందేశాన్ని అందజేస్తున్న వ్యక్తి నైతికంగానూ, మానవత రీత్యాను అత్యున్నత స్థానంలో ఉంటాడు. కాని ఆ సందేశాన్ని నిరాకరించేవారు ఏమంటారంటే, నైతికంగా అతనెంత దిగజారిన వాడైనా ఫరవాలేదు. కాని మా జాతికి నాయకుడై ఉండాలి. కాని మానవాళికి మానవతా సందేశాన్ని అందజేసే వ్యక్తి నైతికంగా అత్యుత్తముడై ఉండాలి.

మనసు వెతికే సాకులు విచిత్రంగా ఉంటాయి. ఎదుటి వారిని అయోమయంలో పడవేయటం దాని ఉద్దేశమై ఉంటుంది. అంటే అవతలి వ్యక్తులను కన్ఫ్యూస్ (Confuse) చేసివేయాలి. ఆ సందేశహరుడు సృష్టికర్త తరఫున వచ్చిన వ్యక్తి కాడు, ఎవరివద్దనో కొన్ని విషయాలు నేర్చుకుని వచ్చి, మీకు ఏకరువు పెడుతున్నాడు అని నమ్మబలుకుతారు. కాని వాస్తవానికి ఆ వ్యక్తి ఇప్పటి వరకూ ఆ జనుల మధ్యన పుట్టి పెరిగినవాడే. అక్కడి ప్రజలకు, ఆ తెగవారికి అతని గురించి బాగా తెలుసు, అతను నిజాయితీపరుడని. కాని సత్య విషయం అణగారి ఉండదు. కాల్పనిక ఆరోపణలు పేలవం (Vague) గా ఉంటాయి.

మతం విషయంలో అద్భుతాలను కోరుకునే మానవ బలహీనత కూడా సత్య స్వీకారానికి దూరంగా ఉంచుతుంది. తస్మాత్ జాగ్రత్త!

సృష్టికర్త తరఫున సందేశం అందజేసేవాడు దైవదూత అయి ఉండాలి, మానవమాత్రుడు కాడు అని మరికొందరు అభిప్రాయపడుతుంటారు. అద్భుతాలతో, అసహజమయిన ఆలోచనలతో సత్యస్వీకారాన్ని ముడిపెట్టి కేవలం వినటం వరకే తమ పని అనీ, ఆచరణ తమ బాధ్యత కాదని తలపోస్తుంటారు. ఆచరణ గురించి చెబితే, ఆ సందేశ వాహకుడు మానవమాత్రుడు కాడు కదా, మరి మేమెలా ఆచరించేది? అనంటారు. కనుక సందేశాన్ని తెచ్చేవాడు అవశ్యంగా మానవుడై ఉండాలి. మానవ జీవితం మాత్రమే మరో మనిషికి ఆదర్శప్రాయం కాగలుగుతుంది. దైవదూత జీవితంగానీ, మరే ఇతర జీవితంగానీ మనిషికి ఆదర్శప్రాయం కాజాలదు.

## (5) మనోవాంఛల దాస్యం, ప్రాపంచిక వ్యామోహం

ఏ సత్యాన్ని స్వీకరించటం వల్ల మనిషి కోర్కెలపై, స్వలాభాలపై దెబ్బపడేలా ఉంటుందో, దాని వ్యవహారంలో మనిషి కుంటి సాకులు వెదకి తిరస్కరిస్తాడు. ఈ తిరస్కార వైఖరిలో తర్కం (Logic) ఉండదు, కేవలం హఠం, మంకుతనం ఉంటుంది. తమ మనోవాంఛలకు బానిసలై ప్రపంచం వెనుక పరుగెత్తే వారికి సృష్టికర్త గురించిగానీ, తీర్పుదినం నాటి 'న్యాయం' గురించిగానీ చెబితే వారిలో కలవరం మొదలవుతుంది. గింజుకుంటారు. అందరి చేష్టలను గమనిస్తున్న సృష్టికర్త ఎదుట అందరూ ఒకనాడు తమ జీవితపు లెక్క ఇవ్వవలసి ఉంటుందని, నిలదీసి మరీ లెక్క తీసుకోవటం జరుగుతుందని, సాక్ష్యాధారాలు సయితం సమర్పించబడతాయని, ఆ తరువాతనే బహుమానం వొసగటమో శిక్షించటమో జరుగుతుందని తౌహీద్ (దేవుని ఏకత్వపు) విశ్వాసం అంటోంది. అందుకే వారు సృష్టికర్తతో పాటు మరికొందరు దేవుళ్లను కూడా భాగస్వాములుగా చేర్చుకుంటారు. ఆ భాగస్వాములు తమను సృష్టికర్త విధించే శిక్ష నుండి కాపాడుకుంటారన్న ఆశతోనే వారలా చేస్తారు. ఈ అసత్యాల (షిర్క్, కుఫ్ర్) ఆసరాలో తమను తాము మోసపుచ్చుకుంటూ ఇతరుల హక్కులను స్వాహా చేయాలనుకుంటారు. ఇతరులపై జులుం చేయదలుస్తారు. ఈ అసత్యం వారిని సత్యానికి దూరం చేస్తుంది. మనోవాంఛల దాస్యం వాళ్లను దైవదాస్యానికి దూరం చేస్తుంది. అది వాళ్లను రుజుమార్గాన పోకుండా ఆపుతుంది. అపమార్గం వైపునకు తీసుకుపోతుంది. తస్మాత్ జాగ్రత్త! మనోవాంఛల వెనుకపోయేవాడు సన్మార్గం పొందలేడు. ఒకవేళ అతను సన్మార్గంపై ఉంటే మనోవాంఛల అనుసరణ అతన్ని మార్గభ్రష్టుణ్ణి చేస్తుంది.

మనోవాంఛల దాస్యం ఎంత ప్రమాదకరమైనదంటే, జ్ఞాని అయిన మనిషి సయితం వాటి మాయలోపడి మార్గం తప్పుతాడు. సృష్టికర్త అనేవాడున్నాడని, తీర్పుదినాన్ని ఎదుర్కోవలసి ఉందని జ్ఞానం అంటుంది. కాని మనోవాంఛల దాస్యం అతనికి అభయం ఇస్తూ ఉంటుంది – తీర్పుదినం సంగతి తరువాత ఆలోచించవచ్చు. ఇక్కడి భోగవిలాసాలను జుర్రుకునే అవకాశాన్ని జారవిడవకు అని మనోవాంఛలు మభ్యపెడతాయి.

## (6) సంకుచిత స్వభావం, దురభిమానం

ఇవి మనిషి బలహీనతలు. సంకుచిత స్వభావానికి గుర్తై, దురభిమానంతో

వ్యవహారం చేసే మనిషి ఎన్నో ముఖ్యమయిన వాటిని స్వీకరించలేకపోతాడు. కడకు అతను తన జీవితంలో ఎంతో కీలకమయిన నిజ ఆరాధ్య దైవాన్ని, సృష్టికర్తను కూడా ఒప్పుకునేందుకు నిరాకరిస్తాడు. ఎందుకయ్యా అంటే ఆరాధ్య దైవం ప్రస్తావన తాను అనుసరించే గ్రంథాలలో లేదని, ఆ ప్రవక్త తన జాతి వారిలో ప్రభవించలేదని అంటాడు. దురభిమానాలలో మత దురభిమానం, వర్గ దురభిమానం, భాషా దురభిమానం, జాతి దురభిమానం మరింత ప్రమాదకరమైనవి. సత్య స్వీకారంలో ఇవి ప్రధాన అవరోధాలుగా ఉంటాయి. ఇది సత్యమని దృఢనమ్మకం కలిగిన మీదట కూడా మనిషి దానిని గ్రహించడానికి ముందుకు రాడు. ఆ విధంగా అతను ఎంతో అమూల్యమైన వస్తువుకు దూరమై శిక్షార్హుడవుతాడు.

గంభీరంగా, విశాల హృదయంతో ఆలోచించినప్పుడు అవగతమయ్యే విషయం ఏమిటంటే, సత్యం ఎక్కడ లభించినా సత్యమే. అది ఎప్పటికీ మనకు వ్యక్తిగతంగా మేలు చేస్తుంది. లాభదాయకమైన వస్తువు ఎక్కడ లభించినా అది ఒకప్పుడు మనం పోగొట్టుకున్న వస్తువే అని భావించాలి. ఇదే విజ్ఞత. ఇతర జాతులు, ఇతర దేశాలు ఆవిష్కరించిన వస్తువులను స్వీకరించి, వాటి ద్వారా లబ్ధి పొందటం వంటిదే యిదీను. మనం ఆ వస్తువులను త్రోసిపుచ్చటం లేదు. ఒకవేళ ఆ వస్తువులను దురభిమానపు కళ్ళద్దాలతో చూస్తే వాటి లాభాలకు దూరమయ్యేది కూడా మనమే. కనుక ఇలాంటి మానసిక బలహీనతల నుండి తప్పించుకుంటూ ఉండాలి. ఏ వ్యవహారంలోనయినా దురభిమానాన్ని దరికి రానివ్వరాదు. అన్యధా ఆనక నష్టపోయేది మనమే. మన అమాయకత్వం, సాధు స్వభావం మనకు ఏ విధంగానూ లాభం చేకూర్చదు. తస్మాత్ జాగ్రత్త!

**(7) తమకు తెలిసిందే సర్వస్వమని తలపోయటం ..... అన్యులు చెప్పేదానిని పరిహసించటం అభాగ్యానికి ఆనవాలు. తస్మాత్ జాగ్రత్త!**

సత్యాన్ని శోధించి, పరికించేబదులు తనకు తెలిసిందే వేదమని తలపోసి మనిషి కూపస్థమండూకంలా వ్యవహరిస్తాడు. ఈ వైఖరి అతన్ని సత్యానికి నోచుకోకుండా చేస్తుంది. అతను గిరిగీసుకున్న పరిధిలోపలే ఉంటాడు. ఎవరు సత్యాన్ని విశదపరచినా ఎగతాళి చేస్తాడు. ఆ విధంగా అతను తన జీవితంలోని అత్యంత విలువైన వస్తువును పోగొట్టుకుంటాడు.

మనిషి తన తత్వమేదో తనదేనని, సైన్సు, ప్రపంచ విద్యలే సర్వస్వమని, తన పేష్వాలు కల్పించిన కట్టుకథలే సిసలైనవని భావించి, సృష్టికర్త వద్ద నుండి వచ్చిన జ్ఞానాన్ని కొట్టివేశాడు. అలాంటి వ్యక్తికి మార్గబోధన ఎలా లభిస్తుంది? జీవిత సాఫల్యానికి చేర్చే రాచబాట ఎలా కానవస్తుంది?

## (8) గర్వాహంకారం

గర్విష్టులు, అహంభావం కలవారు సన్మార్గం పొందలేరు. సత్యం తమ అభీష్టానికి అనుగుణంగా ఉందా? లేదా? అని వాళ్ళు చూస్తారు. ఆ సత్యాన్ని సమర్పించే వ్యక్తి ప్రాపంచికంగా ఏ శ్రేణికి చెందినవాడు? సామాజికంగా ఏ వర్ణంతో సంబంధం ఉన్నవాడు? అని ఆరాతీస్తారు. చిత్తశుద్ధితో, మంచి సంకల్పంతో మాట వినేవారికి తొందరగానే విషయం అర్ధమైపోతుంది. దానిని స్వీకరించడానికి వారు అడుగు ముందుకు వేస్తారు. గర్వాహంకారంతో విషయం వినకూడదని, స్వీకరించకూడదని ముందునుంచే అనుకున్నవారు విన్నా వినకపోయినా ఒక్కటే. ఎందుకంటే సత్యం తమ ముందుకు వచ్చేసినప్పటికీ వారి అహంభావం వారిని తల వంచనివ్వదు. అందుకే వారు అవతలి వారిని ఖాతరు చేయరు. అదే సత్యస్వీకారం విషయంలో ప్రధాన అడ్డంకిగా నిలుస్తుంది. వారు అసత్యవాదులు. సచ్ఛీలత వారికి గిట్టదు. వారు దుర్వర్తనులై ఉంటారు. అందువల్ల నీతీ నియమాలను వారు సుతరామూ ఇష్టపడరు. ఇలాంటివారు తమను తాము సర్వోత్తములుగా ఊహించుకుంటూ ఉంటారు. ఒకరి ముందు వంగటానికి, విధేయత కనబరచటానికి వారికి మనసొప్పదు. సృష్టికర్త వద్ద నుండి వచ్చిన సందేశాన్ని అంగీకరించి, విధేయత చూపటం తమ స్థాయికి శోభాయమానం కాదని, తమ స్థాయి 'దాస్యం స్థాయి'కన్నా ఉన్నతమైనదని వారు తలపోస్తారు.

తెల్సిందేమిటంటే గర్వం మనిషిని సత్యం స్వీకరించకుండా ఆపుతుంది. నేను ఉన్నత శ్రేణికి చెందినవాణ్ణి, అలాంటప్పుడు ఒక సాధారణ మనిషి అందజేసే సందేశాన్ని అంగీకరించటం నా పెద్దరికానికి తగదు. ప్రపంచంలో ఏ హోదా కూడా లేని వ్యక్తి చెప్పేది నేను వినటమేమిటి? అని అతను ఊహిస్తాడు. వాస్తవానికి సత్య సందేశాన్ని అందజేసే వ్యక్తి నైతికంగానూ, మానవత రీత్యాను అందరికన్నా ఉన్నత స్థాయికి చెందినవాడై ఉంటాడు. సత్య

తిరస్కారులు భావిస్తున్నట్లు అతను భౌతికంగా సామాన్య మనిషే అయి ఉండొచ్చు. కాని దేవుని దృష్టిలో అతని స్థాయి, స్థానం చాలా గొప్పదై ఉంటుంది. గర్వం మనిషిని సత్యంపై యోచన చేయకుండా నిలువరిస్తుంది. సత్యం స్వీకరించకుండా ఆపుతుంది. ఫలితంగా అతను సత్యానికి దూరమవుతాడు. మార్గవిహీనతకు లోనవుతాడు. తస్మాత్ జాగ్రత్త! గర్వాన్ని దరికి రానీయకండి.

**(9) పెద్దలపూజ**

సత్య తిరస్కారానికి మరో ముఖ్య కారణం పూర్వీకుల అంధానుకరణ. మా తాతలు తండ్రులు ఏం చేసేవారో మేమూ అదే చేస్తాం. అది తప్పయినాసరే. ఏది తప్పు, ఏది ఒప్పు అని ఆలోచించాల్సిన బాధ్యత మాపై లేదు, తాతల కాలం నుండి నడుస్తూ వస్తోంది గనక అది సరైనదే అయి ఉంటుంది. వాళ్ళేమయినా మూర్ఖులా? కారుకదా! ఈ విధంగా పూర్వీకుల్ని గుడ్డిగా అనుసరించటం, బుద్ధిని ఉపయోగించకపోవటం అంటే సత్యం నుండి తమను తాము వంచించుకోవటమే.

మనిషికి తన తాతముత్తాతల ఆచారాల పట్ల సహజంగానే ప్రేమాభిమానా లుంటాయి. అయితే ఆ ఆచారం (Tradition) లేక మతం సరైనదేనా? కాదా? అనేది గమనార్హ అంశం. అవి మానవ నైజానికి అనుగుణంగా ఉన్నాయా? లేదా? బౌద్ధికంగా అవి మింగుడుపడుతున్నాయా? లేదా? అనేది కూడా చూడాలి. కేవలం తాతముత్తాతల ఆచార సంప్రదాయాలైనంత మాత్రాన అవి నిజమైనవన్న దానికి ధ్రువీకరణ కాదు. అవి తప్పయినప్పుడు వాటి పరిణామాలు కూడా దుష్పరిణామాల రూపంలో వెలువడుతాయి. అవి పూర్వీకులతో పాటు వర్తమానంలో ఉన్నవారినీ, భావితరాల వారిని కూడా నిలువునా ముంచివేస్తాయి.

“మా పూర్వీకులు ఈ పనిని చేస్తుండగా మేము కళ్లారా చూశాము, కాబట్టి మేము కూడా దానిని చేస్తాము” అని జనులు ఇచ్చే సమాధానం సహేతుకం కాదు. మా తాతముత్తాతలు ఎడ్లబండిపై ప్రయాణం చేసేవారు గనక మేమూ అలాగే ప్రయాణిస్తాం అని ఈ సందర్భంగా వారనరు. పైగా వారు వేగంగా వెళ్ళే కార్లలో, విమానాలలో ప్రయాణిస్తారు. మరలాంటప్పుడు సృష్టికర్త విషయంలో ఎందుకింత చాదస్తం, ఎందుకింత సంకుచిత బుద్ధి?

తాతముత్తాతలు ఏదేని విషయమై పరిశోధన చేసి, సన్మార్గం పొంది

ఉంటే, మన పరిశోధనలో కూడా అది నిజమని తేలితే మనం చెప్పే ఆ మాటలో అర్థముంటుంది. అన్యథా ఉండదు. అందుకే పూర్వీకుల అంధానుసరణ పట్ల కడు జాగ్రత్తగా ఉండాలి.

## (10) ఊహలు, అంచనాలు

అనేకమంది మార్గవిహీనతకు గల ముఖ్య కారణాలలో ఇదొకటి. వారు జ్ఞానంపై ఆధారపడకుండా ఊహాస్త్రాలు సంధిస్తూ ఉంటారు. కేవలం ఊహలు, అంచనాల ఆధారంగా మనిషి యదార్థాన్ని చేరుకోలేడు. వాస్తవిక జ్ఞానం మాత్రమే యదార్థం వైపునకు మార్గం చూపుతుంది. కేవలం కాకి లెక్కలపై, గాలిమేడలపై ఆధారపడేవారు అపమార్గంలో బహుదూరం వెళ్ళిపోతారు. వారు జీవితపు రాచబాటను పొందలేరు. వివిధ తత్వాలు, సిద్ధాంతాలు, సంవిధానాలు (Phylosophies, Theories, Constitutions) ఇలాంటి ఊహల వల్ల జనించినవే. మానవుని నైతిక పురోగతిలో వాటి పాత్ర అంతంత మాత్రమే. పైగా అవి మానవత పాలిట వినాశకరమైనవి.

జ్ఞాన సంపన్నుడు మాత్రమే సన్మార్గం చూపించగలుగుతాడు. ఆ సన్మార్గ దర్శకుడు ఎవరో కాదు, మనల్ని సృష్టించినవాడు మాత్రమే. అపోహ వల్లనో, భ్రమల వల్లనో లేక మనోవాంఛల మూలంగానో మనిషి ఎన్నో విషయాలలో ఊహలపై నిలిచి ఉంటాడు. జ్ఞానంతో గానీ, బుద్ధితో గానీ వాటికెలాంటి సంబంధం ఉండదు. యదార్థం బట్టబయలైన రోజున అవి వట్టి భ్రమలన్న సంగతి విదితమైపోతుంది. జాగ్రత్త! ఊహల వెనుక పరుగెత్తకూడదు. దివ్య జ్ఞానం మాత్రమే కాంతిమంతమైనది. అదే సన్మార్గం వైపునకు దర్శకత్వం వహిస్తుంది.

## (11) బుద్ధిని సరిగ్గా ఉపయోగించుకోకపోవటం

బుద్ధిని సద్వినియోగం చేసుకోనివారు లేక దుర్వినియోగపరిచేవారు సన్మార్గం పొందలేరు. ప్రజలు సరైన నిర్ణయానికి రాలేకపోవటానికి గల ఒక కారణం బుద్ధిని ఉపయోగించుకోక పోవటమే. మనిషి నిర్మలమైన మనస్సుతో, ఆలోచించేబదులు భావాలు, భావనలు, దురభిమానాలు, రాగద్వేషాలు, ఆచార సంప్రదాయాలు, మనోవాంఛలు, ప్రాపంచిక ప్రయోజనాలు, సుదీర్ఘ ఆయుష్షు పొందాలన్న కోరిక – మొదలైన వాటికి ప్రభావితుడై సత్యాన్ని అవలోకనం

చేస్తాడు. స్థూల దృష్టితో దానిని త్రోసిపుచ్చుతాడు. పైన పేర్కొనబడినవన్నీ సత్యానికి అడ్డంకిగా నిలుస్తాయి. చింతన చేస్తున్న సమయంలో బుద్ధికి బదులు అతను ముందుగా ఏర్పరచుకున్న భావాలు అతన్ని శాసిస్తూ ఉంటాయి. అందువల్ల నిర్ణయం బుద్ధి గైకొనేదై ఉండదు, భావాలు, కోర్కెలే తీర్పు వినిపిస్తాయి.

మంచీ చెడులను, ఉచితానుచితాలను పరికించడానికి బుద్ధిని ఉపయోగించని మనిషి పశువులతో సమానం. పైగా అతను పశువులకన్నా హీనం. ఎందుకంటే పశువులకు బుద్ధిని ఉపయోగించే అవకాశం (Choice) ఉండదు. ఏ వ్యక్తయితే సత్యాన్వేషణలో నిరాటంకంగా తన బుద్ధిని సద్వినియోగపరచుకుంటాడో, మరెవడు ఈ వ్యవహారంలో దురభిమానాలకు, రాగద్వేషాలకు అతీతంగా మసలుకుంటాడో అతనికి వాస్తవిక జ్ఞానం ప్రాప్తమవుతుంది.

## (12) పెడదారి పట్టించేవారు

పెడదారి పట్టించేవారు సాధారణంగా ప్రాపంచిక నాయకమన్యులై ఉంటారు. కొందరు ధార్మిక నాయకులు కూడా ఉంటారనుకోండి!

మనిషి యదార్థాన్ని త్రోసిపుచ్చడానికి గల కారణాలలో ఒకటేమంటే, అతను తన కాలపు సజ్జనులకు, సంస్కర్తలకు, సత్య సందేశ ప్రదాతలకు ప్రాధాన్యత ఇవ్వడానికి, వారి నాయకత్వాన్ని శిరసావహించడానికి మానసికంగా సిద్ధంగా ఉండడు. వారి పలుకులను త్రోసిపుచ్చేందుకు తగిన ఆధారాలను, రుజువులను సమర్పించేబదులు దుర్విమర్శకు దిగుతాడు. వారిని మాంత్రికులనీ, అబద్ధీకులని, ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించేవారని నీలాపనిందలు మోపుతాడు. అతని ఈ అనుచిత ధోరణి సత్యస్వీకారంలో అతనికి అవరోధంగా మారుతుంది.

ఇలాంటి వెకిలి చేష్టలకు ఒడిగట్టేవారిలో ప్రాపంచిక నాయకులు ముందు వరుసలో ఉంటారు. సత్యాన్ని ఒప్పుకోకపోవటానికి సాకులు, వంకలు చూపాలి. ఎదుటివారిపై నిందలుమోపి ప్రజాబాహుళ్యంలో అనుమానాల బీజాలు నాటాలి. ఆ విధంగా వారు కూడా సత్యానికి దూరమవ్వాలి. తమ లీడర్‌షిప్ మాత్రం నడుస్తూ ఉండాలి. సందేశ ప్రదాతపై అబద్ధపు ఆరోపణలు చేసి అతని వ్యక్తిత్వానికి కళంకం అంటగట్టే ప్రయత్నం చేస్తారు. అలాచేస్తే అతని మాటకు విలువ ఉండదని అనుకుంటారు. సత్యం పలికేవారి మాటలపై ఆశ్చర్యాన్ని

వెలిబుచ్చి ప్రజల్ని సందిగ్ధంలో పడవేస్తుంటారు. ఇలా చేయటం వల్ల ప్రజలు సత్యానికి దూరంగా ఉంటారని ఆశిస్తారు.

మరో వాస్తవం కూడా గమనార్హమే –

సత్యాన్ని, సృష్టికర్తను తిరస్కరించేవారు పెడదారిపట్టిన కారణంగా ఏదైనా ఆపదలో చిక్కుకున్నప్పుడు తమను పెడదారి పట్టించిన వారిని తూలనాడుతారు. కాని లాభమేమీ ఉండదు. ఎందుకంటే మార్గం తప్పినవారికి కూడా బుద్ధి, తెలివితేటలు, ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడ్డాయి. కాని వారు వాటిని ఉపయోగించుకోరు సరికదా వాటిని దుర్వినియోగపరచుకున్నారు. తమ మనోవాంఛలు తమ నాయకుల వద్దనే నెరవేరుతాయని వారు భావించారు. అందుకే గుడ్డిగా వారి వైపునకు పోయారు. ఇప్పుడేమో తమ నాయకుల్నే ఆడిపోసుకుంటున్నారు. ప్రయోజనమేమిటి? శిక్షను అనుభవించక తప్పదు. ప్రతి వ్యక్తీ తాను చేసుకున్న దానికి స్వయంగా బాధ్యుడు.

మరోవైపు వారి లీడర్లను కూడా చూడండి. తమ అనుయాయులను దారి తప్పించడానికి వారు తమ బుద్ధిని ఉపయోగించారు. కాని సరైన దిశలో మాత్రం ఉపయోగించలేదు. తాము మార్గం తప్పినది కాకుండా తమను నమ్ముకున్న వారిని కూడా మార్గభ్రష్టుల్ని చేశారు. ఎందుకంటే వారు తమ పదవుల్ని కాపాడుకోవడానికి అలా చేశారు. మనోవాంఛల దాస్యం, ప్రాపంచిక వ్యామోహం వాళ్ళను బుద్ధి గడ్డితినేలా చేసింది. దీనికి బదులు వారు బుద్ధిని సద్వినియోగం చేసుకుని ఉంటే వారు స్వయంగా సన్మార్గాన ఉండటమేగాక, తమ అనుయాయులకు కూడా దారి చూపించగలిగేవారు. అందుకే స్వార్థపరులైన నాయకుల కుయుక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

## (13) కష్టకాలాన్ని గుర్తుంచుకోవాలి

కష్టకాలాన్ని జ్ఞాపకం ఉంచుకోండి, సరైన జీవన మార్గం పొందుతారు, నిజ ఆరాధ్య దైవాన్ని చేరుకుంటారు. ఆపదల్లో చిక్కుకున్నప్పుడు కలత చెందిన మనసుతో మనిషి – అప్రయత్నంగా – దేని వైపునకు మరలి మొరపెట్టుకుంటాడో, అదే సత్యం. ఆపద తొలగిపోగానే మూర్ఖత్వం ఆవహిస్తుంది. అజ్ఞానం ప్రాబల్యం వహిస్తుంది. మళ్లీ పూర్వీకుల పట్ల గల అంధానుసరణ ఆరంగేట్రం చేస్తుంది. అంతే, మనిషి మళ్లీ షిర్క్ వైపునకు వెళ్ళిపోతాడు.

అతను నమ్ముకున్న వ్యక్తులు, శక్తులు అందరూ కష్టకాలంలో నిస్సహాయులుగా కానవస్తారు. ఆ సమయంలో మనిషి తన ధర్మాన్ని సృష్టికర్తకే ప్రత్యేకించుకుని దీనాతిదీనంగా వేడుకుంటాడు. అతను గనక ఆ క్లిష్ట సమయాన్ని గుర్తుంచుకునే టట్లయితే సన్మార్గం నుండి వైదొలగడు. అతనికి చాలా స్పష్టంగా తాను పయనించవలసిన రాచబాట కానవస్తూ ఉంటుంది. అయితే కష్టకాలాన్ని విస్మరించిన కారణంగా అతను రహదారిని కానలేకపోతాడు. అంటే – గడ్డుకాలం గడచిపోగానే వేరితరులను దైవత్వంలో భాగస్వాముల్ని చేస్తాడు, వారి సిఫారసుతో, వాళ్ళ సత్కార్యాల వాస్తాతో (ప్రళయదినాన) విముక్తి పొందవచ్చని ఆశిస్తాడు. ఈ ధీమాతోనే మనోవాంఛల దాసుడుగా తయారై జీవితం గడుపుతాడు.

## (14) దేవుని ఏకత్వాన్ని నమ్మకుండా, బహుదైవవాదాన్ని అవలంబించిన వారు సన్మార్గం పొందలేరు

మనిషికి అబద్ధాలు, చెడుచేష్టలు, వ్యర్థ ప్రేలాపనల వల్ల ఎంతో ఆనందానుభూతి కలుగుతుంది. అందుకే ఈ విషయాలలో ఎలాంటి అడ్డు ఉండకూడదని అతను కోరుకుంటాడు. అయితే దేవుని ఏకత్వపు (తౌహీద్) విశ్వాసం ఈ మార్గంలో అతి పెద్ద అవరోధంగా ఉంటుంది. సృష్టికర్త ఒక్కడే, ఆయనే స్వామి, యజమాని, ఆయనే పాలకుడు పోషకుడు, కనుక ఆయనే నిజంగా ఆరాధ్యదేవుడు అని 'తౌహీద్' అంటుంది. కనుక ఆ ఏకైక దైవం ఎదుట వంగాలని, ఆయన ఒక్కడికే విధేయత చూపాలని, ఆయన ఒక్కడి సమక్షంలోనే తమ జీవితకాలపు కర్మలకు జవాబు ఇచ్చుకోవలసి ఉందని తౌహీద్ (దేవుని ఏకత్వపు) విశ్వాసం అంటోంది.

ఒక్కడైన ఆ సృష్టికర్తకు విధేయత చూపదలచనివారు, తమ అవిధేయతా వైఖరి కారణంగా జవాబుదారీ భావనకు భయపడేవారు దొడ్డిదోవలు వెతుకుతారు. సృష్టికర్తకు సహవర్తుల్ని కల్పించి వారి సహారా (Coverage) పొందగోర్తారు. ప్రాపంచిక జీవితంలో తమ వల్ల జరిగిన దురాగతాల మూలంగా తీర్పుదినాన విధించబడే శిక్ష నుండి ఈ కాల్పనిక దైవాలు కాపాడతాయని, తమకోసం సృష్టికర్తకు సిఫారసు చేస్తాయని నమ్ముతారు. అందుకే వారు సృష్టికర్తకన్నా అధికంగా తమ కాల్పనిక భాగస్వాముల పట్ల శ్రద్ధాభక్తులను చూపుతారు. మొక్కుబడుల ద్వారా వారిని సంతుష్టపరిచే ప్రయత్నాలు

చేస్తుంటారు. అందుకే వారి ఊసు రాగానే ఆనందంతో వారి మొహాలు విచ్చుకుంటాయి. కాని ఒక్కడైన సృష్టికర్త ప్రస్తావన వచ్చినప్పుడు, ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరని చెప్పినప్పుడు వారి ముఖ కవళికలు మారి పోతాయి. అసహనం వ్యక్తమవుతుంది.

ఒకవైపు సృష్టి యొక్క స్పష్టమయిన, సహజమయిన, సమత్వంతో కూడిన ఉపదేశాలు, మరోవైపు ఆయన తిరుగులేని శీలత పట్ల నమ్మకం – ఇవి రెండూ కలసి మనిషిని సన్మార్గంపై నడిపిస్తాయి; అతని జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. కాబట్టి దేవుని ఏకత్వపు విశ్వాసం ద్వారానే మనిషికి మార్గబోధన లభిస్తుంది. అందులో ఏ రకంగా, ఏ మోతాదులో కల్తీ చేసినా అది మార్గభ్రష్టతకు దారితీస్తుంది, జాగ్రత్త!

## (15) పరలోకాన్ని తిరస్కరించేవారు సన్మార్గం పొందలేరు

సృష్టికర్త, ఆరాధ్య దేవుని ఒక విశిష్ఠ గుణం ఏమిటంటే, ఆయన తన దాసుల మధ్యన న్యాయం చేస్తాడు. న్యాయం కోసం ఒక రోజు, ఒకచోటు నిర్ధారితమై ఉండాలి. అక్కడ తిరుగులేని న్యాయనిర్ణయం జరగాలి. మానవ నైజం తీవ్రంగా కాంక్షించే అంశం న్యాయం. అది జరిగితీరాలి. అది ఈ ప్రాపంచిక జీవితంలో నెరవేరేటట్లు కనిపించదు. న్యాయం లభించకుండానే ఎన్నో జీవితాలు అంతమైపోతుంటాయి. అందుకే మరో జీవితం ఉండాలి. మరో ప్రపంచం ఉండాలి. దాని గురించి వెనుకటి పుటలలో వివరంగా వచ్చింది.

అందుకే దుర్మార్గాలకు ఒడిగట్టేవారు మరో ప్రపంచాన్ని, తీర్పుదినాన్ని వాంఛించరు. ఎందుకంటే పరలోకంలో జవాబుదారీ భావన, నరకాగ్ని యాతన భయం వారి రసాస్వాదనను నీరుగారుస్తుంది. కాగా; పరలోకాన్ని విశ్వసించ గోరని వానికి మార్గబోధన ప్రాప్తమవదు. అతను మార్గభ్రష్టతలో బహుదూరం వెళ్ళిపోతాడు. అతను త్రోసిపుచ్చినంత మాత్రాన అది తొలగిపోదు.

మరణానంతర జీవితం, జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న నమ్మకం (న్యాయం) మనిషిని సన్మార్గాన నడిపిస్తుంది. సన్మార్గాన నడవాలన్న అంతర్ప్రేరణ మనసులో కలుగుతున్నట్లు మనిషి అనుభూతి చెందుతాడు. తత్ఫలితంగా సన్మార్గాన్ని అవలంబిస్తాడు; దానిని పొందుతాడు. మార్గవిహీనత నుండి తనను కాపాడుకుంటాడు. మరోవైపున చెడులకు ఒడిగట్టేవారు, ఇతరుల హక్కులను

కాజేసేవారు పరలోకం అనగానే జడుసుకుంటారు. తమను నిలదీసి అడిగే రోజు రాకూడదు, శిక్ష పడకూడదన్నది వారి అభిలాష అయి ఉంటుంది.

దీని భావమేమిటంటే, తీర్పుదినమనేదే లేకుంటే సదాచరణలకు బహుమానం కూడా ఉండదు. అంటే మంచి పనులు చేసేవారి, చెడు పనులు చేసేవారి పర్యవసానం ఒకేవిధంగా ఉండబోతోంది, ఎవరికీ ఏమీ లభించలేదు. సదాచారులకు బహుమానమూ లభించలేదు, దుర్వర్తనులకు శిక్ష కూడా విధించబడదు. ఇదెలా సంభవం? ఇది న్యాయమేనా? మానవ స్వభావం దీనికి అంగీకరిస్తుందా? తీర్పుదినాన్ని త్రోసిపుచ్చడమంటే మనిషి తనను తాను మోసపుచ్చుకోవటమే! ఇది చెడుల ఊబిలో కూరుకుని సత్కార్యాలకు, సన్మార్గానికి దూరమవటమే. ఈ ఆలోచనా కోణం శుద్ధ తప్పు. ఇది ఒకవిధంగా సృష్టికర్తపై నిందమోపటం వంటిదే! ఆయన మంచికీ చెడుకీ ఒకే ఫలితం ఇస్తాడని భావించటమే!

ఈ దృష్టికోణం పట్ల జాగ్రత్తగా ఉండండి. ఇది మానవుణ్ణి సన్మార్గానికి దూరం చేయడమేగాక ఇహపరాలలో అతని వినాశానికి కారణభూతం అవుతుంది.

**పదకొండవ అధ్యాయం :**

# బహుపరాక్

## దూరదృష్టితో మసలుకోండి

సమయాన్ని వృధా చేయకండి. తాత్సారం చేయకండి. తొందరగా సత్యాన్ని అన్వేషించి, దానిని అవలంబించండి. ఎందుకంటే మరణం రావటం తథ్యం. కాని అది ఎప్పుడొస్తుందో తెలీదు. అనిశ్చితమైన దానిపై నిశ్చింతగా ఉండకండి. అన్యథా మరణ సమయంలో మీ అవివేకంపై బాధపడాల్సి వస్తుంది. ప్రపంచానికి వీడ్కోలు పలకటం తథ్యం. అయితే ఎప్పుడు వీడ్కోలు పలకాలన్నది అనిశ్చితం. 'తస్మాత్ జాగ్రత్త!' (Beware of) అనే అధ్యాయంలో సత్యాన్ని చేరుకునే, సన్మార్గాన్ని అవలంబించే, మార్గభ్రష్టత నుండి తప్పించుకోవటంలో ఎదురయ్యే అవరోధాల గురించి తెలుసుకోవటం జరిగింది. ఆ కారకాల (Factors) విషయంలో అప్రమత్తంగా ఉండాలని కూడా చెప్పటం జరిగింది.

## జాగ్రత్తపడండి

ఈ అధ్యాయంలో సావధానపరిచే, హెచ్చరించే అంశాలున్నాయి. ఈ సత్యాన్ని తెలుసుకోవటంలో, పరికించటంలో ఆలస్యం చేయరాదని చెప్పటం మా ఉద్దేశ్యం. ఎందుకంటే ఈ జీవితం చాలా చిన్నది. విద్యుత్ వేగంతో అది తరుగుతోంది. అకస్మాత్తుగా ఏ క్షణంలోనయినా అది అంతమైపోవచ్చు. విశ్వసించే, తమ తప్పులపై పశ్చాత్తాపపడే, సదాచరణ చేసే అవకాశం ఇప్పటికీ మిగిలి ఉంది. జీవితం అంతమవగానే అవకాశం కూడా అంతమైపోతుంది.

గుండెలోని ప్రాణం గొంతు దాటిపోతున్న క్షణంలో సన్మార్గం వైపునకు మరలి రావటం (పశ్చాత్తాపం చెందటం), వాస్తవాన్ని ఒప్పుకోవటం (విశ్వసించటం) స్వీకారయోగమవదు. ఎందుకంటే ఆ క్షణాల్లో మరణానంతర లోకం కళ్ల ముందు కదలాడుతూ ఉంటుంది. ఆ సమయంలో 'అగోచరం' అనేది ఉండదు. దాగి ఉన్నదేదీ ఆ సమయంలో దాగి ఉండదు. చూడకుండానే

విశ్వసించవలసిన యదార్థం ముందుకు వచ్చేసి ఉంటుంది. ఆ దృశ్యాన్ని చూసిన తిరస్కారి సయితం అప్పుడు అంగీకరిస్తాడు. అతని తల దానంతటదే వంగి పోతుంది. 'తలవంచు' అని చెప్పాల్సిన అవసరం కూడా ఉండదు. తల వంచాలనుకుంటే ఇప్పుడే, సృష్టికర్తను చూడకుండానే వంచాలి. ఇప్పుడు జరుగుతున్న పరీక్ష అదే. ఎవడు తన తెలివితేటల్ని, బుద్ధిని ఉపయోగించి సత్యాన్ని చేరుకుంటాడు, ఎవడు సాఫల్యాన్ని పొందుతాడు? అన్నదే ఆ పరీక్ష.

మనిషి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మరణానంతరం తిరిగి లేపబడట మనేది తథ్యం. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఒకవేళ పునరుత్థానం జరిగిందంటే మళ్లీ జీవితం ప్రసాదించబడిందన్నమాటే. ఎందుకు ప్రసాదించబడు తుంది అంటే ఈ ప్రాపంచిక జీవితపు లెక్క తీసుకోవటానికి. ఈ ప్రాపంచిక జీవితాన్ని లక్ష్యబద్ధమైన జీవితంగా మలచటానికి మరో జీవితాన్ని ఇవ్వవలసిన ఆవశ్యకత ఏర్పడింది. పరీక్షతో కూడిన ఈ జీవితం తరువాత ఫలితం తేల్చడానికి, మరో జీవితం ఉండాల్సిన అవసరం ఉంది. ఈ యదార్థాన్ని ఎరుకపరచడానికే సృష్టికర్త తన సందేశాన్ని ఇచ్చి సందేశహరుణ్ణి పంపించాడు. ఈ సందేశాన్ని, సందేశహరుల్లో గంభీరంగా అన్వేషించాలి. ఈ మార్గంలో ప్రతిబంధకాలుగా ఉండే దురభిమానాలు, సంకుచిత స్వభావం నుండి తప్పించుకుంటూ నిష్పక్షపాతంగా అన్వేషణ సాగించాలి. ఒకవేళ ఎవరయినా తనను తాను సృష్టికర్త యొక్క సందేశహరుణ్ణి అని ప్రకటించుకుంటే, వాస్తవానికి అతను దైవ సందేశహరుడు కాకపోయినప్పటికీ తాను చెప్పేవన్నీ సృష్టికర్త వాక్కులని అంటే అతను మహాపరాధానికి ఒడిగట్టినట్లే. ఒకవేళ అతను నిజంగా దైవ సందేశహరుడే అయివుంటే, గ్రంథం రూపంలో సృష్టికర్త వద్ద నుంచి సందేశం తీసుకునివస్తే, అట్టి సత్య సందేశహరుణ్ణి త్రోసిపుచ్చేవారు మహాపరాధానికి పాల్పడినట్లే. అందుకే 'స్వీకృతి' లేక 'తిరస్కృతి' వ్యవహారం చాలా సున్నితమైనది, జటిలమైనదీను. కాబట్టి స్వీకారానికయినా లేదా తిరస్కారానికయినా కూలంకషంగా అధ్యయనం చేయటం అవసరం. ప్రతి వ్యక్తీ తన నిర్ణయానికి, ఎంపిక స్వేచ్ఛకు స్వయంగా బాధ్యుడు. తప్పేదో – ఒప్పేదో పరికించే తెలివిడిని సృష్టికర్త ప్రతి మనిషికీ ఇచ్చి ఉన్నాడు. కాబట్టి ఎంపిక విషయంలో స్వయంగా మనిషే బాధ్యుడు. సృష్టికర్తగానీ, దైవ సందేశహరుడుగానీ దీనికి బాధ్యులు కారు. దైవ సందేశహరుడు శాయశక్తులా శ్రమించి సృష్టికర్త సందేశాన్ని దైవదాసులకు చేరవేశాడు. అది ప్రపంచంలో విస్తరించింది కూడా. కాబట్టి ఇప్పుడు జాప్యం చేసినా, నిర్లక్ష్యం వహించినా

దాని పరిణామం చేదుగా ఉంటుంది. మరణానంతరం మరో ప్రపంచంలో రెండే రెండు ప్రదేశాలున్నాయి. ఒకటి : స్వర్గం, రెండవది : నరకం. ఎవరెక్కడ ఉండదలుస్తున్నారో తొందరగా నిర్ణయించుకోవాలి. దానికి కావలసిన తయారీ చేసుకోవాలి. మంచిస్థానం మంచివారి కొరకే. చెడ్డస్థానం చెడ్డవారి కోసమే. హేతువు (Logic) వల్ల తెలిసేది కూడా ఇదే. మనస్సాక్షి చెప్పేది కూడా ఇదే. సదాచారాలు చేసిన మనిషి సజ్జనుడు అవుతాడు. దురాగతాలకు పాల్పడిన వాడు దుర్వర్తనుడవుతాడు. మనిషిని చేసిన సృష్టికర్త మనిషికి మంచి విషయాలు తెలుపుతాడు. అతని మంచిని అభిలషిస్తాడు. కాబట్టి ఆయన్ని తన స్వామిగా, సంరక్షకుడుగా అంగీకరించి, ఆయనకు విధేయత చూపటం వల్ల అతను మంచివాడవుతాడు. మంచి స్థానానికి చేరుకుంటాడు. ఒకవేళ సృష్టికర్తను తిరస్కరిస్తే, ఆయన ఆదేశాలను ఉపదేశాలను ఎదిరిస్తే అతను చెడ్డవాడవుతాడు, చెడ్డ స్థలానికి చేరుకుంటాడు. అందుకే ఆలస్యం చేయకుండా పరిశీలించి, పరిశోధించి తమ సృష్టికర్తను, స్వామిని తెలుసుకోవాలి. ఆయన ఆదేశాలను, ఉపదేశాలను సంగ్రహించాలి.

పరిశోధించి సత్యాన్ని తెలుసుకోమని, సంగ్రహించమని చెప్పేదంతా మన లాభం కోసమే. ఎవరు విధేయత చూపినా, చూపకపోయినా ఆయన వైభవంలో ఏ లోటూ రాదు. ఆయన ఎవరి అవసరమూ లేనివాడు.

మరణానంతరం తిరిగి లేపబడే విషయం చెప్పబడటంలోని ఉద్దేశం న్యాయ సంస్థాపనమే. జీవితపు లెక్క తీసుకుని శిక్షా బహుమానాలను వొసగే ప్రస్తావనలోని ప్రధాన ఉద్దేశం సావధానపరచటమే. మనిషి ఈ వార్తను ఏదో కాకతాళీయమని భావించి, దానిని స్వీకరించినా తృణీకరించినా మానవ జీవితంపై పడే ప్రభావం ఏమీ ఉండదని అనుకోరాదు. నిజం ఏమిటంటే దీని ప్రభావం జీవితపు ఆలోచనలపై ఆచరణలపై గట్టిగా పడుతుంది. దీని ప్రభావం వల్ల మనిషి తన జీవితంలో ఆచి తూచి అడుగువేస్తాడు. దురాచరణల నుండి తప్పించుకుంటూ, సదాచరణలను అవలంబిస్తూ ముందడుగు వేస్తాడు. తాను చేసే ప్రతి పనికిగాను జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న భావన అతనిని నియంత్రణలో ఉంచుతుంది. సత్కార్యాలు చేసిన వారికి సత్ఫలితం ప్రాప్తించటం సహజం. తద్భిన్నంగా – ఇదంతా కాకతాళీయమే అనుకుని విచ్చలవిడిగా జీవితం గడిపినవాడు, అడ్డూ ఆపూ లేకుండా దురాగతాలకు పాల్పడుతూ పోయినవాడు దుష్ఫలితాన్ని చవిచూడక తప్పదు.

**–ః సమాప్తం ః–**